

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!



సంపుటి: 56 • సంచిక: 132 • మంగళవారం 22 ఆగస్టు 2017 • హైదరాబాద్ ✻ పేజీలు: 12+4 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad | Khammam



తెలంగాణ చారిత్రిక విద్యావికాస కేంద్రం

రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాలు



మానవత్వం మూర్తీభవించిన అధికారి, పరోపకారి, ప్రజావికాస ఉద్యమాల సహకారి,
గోలకొండ పత్రిక వ్యవస్థాపకుడు, స్త్రీ జనోద్ధారకుడు, మతసామరస్యానికి మారుపేరు, శాంతిభద్రతల సంరక్షకుడు, సంఘసంస్కర్త

శ్రీ రాజ బహద్దూర్ కొత్వాల్ వేంకటరామారెడ్డి

149వ జయంతి వేడుకలు

22.08.2017 మంగళవారం సాయంత్రం 4 గంటలకు

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో రాజ బహద్దూర్ వేంకట రామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీకి ప్రభుత్వం పది ఎకరాల స్థలాన్ని కేటాయించి, పది కోట్ల రూపాయలను మంజూరు చేసింది. ఈ స్థలంలో నిర్మించే రెడ్డి హాస్టల్ కాంప్లెక్స్‌కు

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన

రెడ్డి హాస్టల్ కాంప్లెక్స్ విశేషాలు

- బాలుర వసతిగృహం
- బాలికల వసతి గృహం
- కెరీర్ కోచింగ్ సెంటర్
- కన్వెన్షన్ హాల్స్
- ఇండోర్ స్పోర్ట్స్‌కాంప్లెక్స్
- వ్యవసాయ క్షేత్రం

100 REDDY HOSTEL 1917-2017

నిజాం కాలంలో తెలంగాణ పునర్వికాసానికి కృషి చేసిన చరిత్రాత్మక కేంద్రం రెడ్డి హాస్టల్. రాజ బహద్దూర్ వేంకట రామారెడ్డి గారి పూనికతో 1917లో ఏర్పాటైన ఈ హాస్టల్ గ్రంథాలయోద్యమానికి, పత్రికా వికాసానికి, విద్యాభివృద్ధికి కేంద్రమైంది. ప్రముఖ సాహితీవేత్త, పరిశోధకుడు, గోల్కొండ పత్రిక సంపాదకుడు సురవరం ప్రతాప రెడ్డి ఈ హాస్టల్ తొలి వార్డెన్. హైదరాబాద్‌లో చదువుకోవడానికి వచ్చిన రెడ్డి విద్యార్థులతో పాటు, ఇతర కులాల విద్యార్థులను కన్న తల్లిలాగా ఆదరించింది, అక్కున చేర్చుకుంది. అనేక ఉద్యమాలకు ఊపిరులూదింది. 1969 తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువైంది. రావి నారాయణ రెడ్డి, పి.వి.నరసింహారావు మొదలుకొని అనేకమంది ప్రముఖులు ఈ హాస్టల్ నీడలోనే చదువుకుని ఎదిగారు. రెడ్డి హాస్టల్ చారిత్రిక స్ఫూర్తిని గౌరవిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు రెడ్డి హాస్టల్ విస్తరణ కోసం బుద్వేల్‌లో పది ఎకరాల స్థలం కేటాయించి, భవన సముదాయ నిర్మాణానికి పది కోట్ల రూపాయలు మంజూరు చేశారు.

జారీచేసినవారు: కమిషనర్ సమాచార, పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం.

వెంకయ్య నాయుడు
తెలుగు జాతి ఆణిముత్యం

- వెంకయ్య వాగ్దాటికి ముగ్ధుడినయ్యాను
- ఉప రాష్ట్రపతిగా తెలుగువారికి మరో ఘనత
- వెంకయ్య సన్మాన సభలో సీఎం కేసీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుజాతి, భాష ఒకటి ఉందని దివంగత ఎన్టీ రామారావు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని, మళ్ళీ ఇప్పుడు మన తెలుగువాడు వెంకయ్య నాయుడు ఉప రాష్ట్రపతిగా ఎన్నికై తెలుగువారి ఔన్నత్యాన్ని మరింత ఇనుమడింపజేశారని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అన్నారు. నిన్నటి వరకు మన మధ్యలోనే ఉన్న వ్యక్తి ఎదుగుతూ.. ఒదుగుతూ అత్యున్నత స్థాయికి చేరుకున్నారని, ఉప రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడును దేశంలోనే ముందుగా సన్మానించే అవకాశం తనకు దక్కడం గర్వకారణమన్నారు. ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన వెంకయ్యనాయుడును సోమవారం రాజ్‌భవన్‌లో ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి సన్మానించారు. యాదాద్రి దేవస్థాన అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, పట్టు వస్త్రాలతో వెంకయ్యను ఘనంగా కేసీఆర్ సన్మానించారు. రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఈ పౌర సన్మాన కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు, కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, తెలంగాణ శాసనమండలి చైర్మన్ కె.స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి, ఉప ముఖ్యమంత్రులు మహమూద్ అలీ, కడియం శ్రీహరి వేదికను అలంకరించారు. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పురప్రముఖులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, సామాజికవేత్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా తాను ఎందరో గొప్ప వక్తలను చూశానని, కానీ మన తెలుగుబిడ్డ వెంకయ్య నాయుడులా ధారాళంగా మాట్లాడే వారిని చూడలేదన్నారు. ఆయన భాష, భావం, ప్రసంగ ధోరణితో ప్రజలను ఆకట్టుకుంటారని, ఆయన తెలుగుజాతికి లభించిన ఆణిముత్యంగా భావిస్తున్నానని కొనియాడారు. ఉప రాష్ట్రపతి పదవితో తెలుగుజాతి కీర్తిని మరింత ఇనుమడింపజేస్తారని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు. వెంకయ్య నాయుడు అద్భుతమైన వక్తగా అందరికీ సుపరిచితుడేనని, అయితే ఆ లక్షణాలు అందరూ అంత తేలిగ్గా అలవర్చుకోలేరన్నారు. వక్తగా ఎదగాలంటే దీని వెనక ఎంతో కృషి ఉండాలని, ప్రసంగానికి భాష, భావం, ఆర్తి ఆకట్టుకునే నేర్పు ఉండాలన్నారు. ఇంగ్లీష్, హిందీలో అనర్గళంగా మాట్లాడుతారని, వక్తగా ఉపన్యాసం పండించడం అంత తేలిక కాదన్నారు. అద్భుతమైన పదాల కూర్పుతో మాట్లాడడంలో అరుదైన వ్యక్తిగా వెంకయ్య నిలిచారని కేసీఆర్ కొనియాడారు. వ్యంగ్యం, హాస్యం, రౌద్రం అన్ని కలిపిస్తే పరిపూర్ణమైన ఉపన్యాసం ఉంటుందని, ఇవన్నీ వెంకయ్య ప్రసంగంలో కనిపిస్తాయని అన్నారు. రసజ్ఞత లేకుంటే ఎంతటి పండితుడైనా ప్రశంసలు పొందలేడని, వాక్చాతుర్యం, సమయ స్ఫూర్తి ఉంటేనే ప్రసంగం రక్తి కడుతుందని ఆయన నిరూపించారని కేసీఆర్ అన్నారు.

1980లో జైలు నుంచి విడుదలైన వెంకయ్యనాయుడుని చూశానని, సుబ్రహ్మణ్యస్వామితో కలిసి బహిరంగ సభలో ప్రసంగించినప్పుడే ఆయన వాగ్ధాటి, భాష విన్నానని చెప్పారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా వ్యంగ్యంగా విమర్శలు సంధించారని, ఆ ప్రసంగం ఆలోచింపజేసే విధంగా ఉందని కేసీఆర్ అన్నారు. రాజకీయంగా పదవులు వచ్చినప్పటికీ వాటిని సమర్థంగా నిర్వహించి వన్నె తేవడమే వెంకయ్య గొప్పతనమని కొనియాడారు. భావజాలం కలిగిన రాజకీయ పార్టీలో పనిచేసి క్రమశిక్షణతో అంచెలంచెలుగా ఎదిగారని కేసీఆర్ అన్నారు. ఒక జాతీయ పార్టీకి తెలుగువాడు అధ్యక్షుడిగా పనిచేసి తెలుగువారికి గుర్తింపు తెచ్చారని, మళ్ళీ ఇప్పుడు ఉపరాష్ట్రపతిగా మనకు గౌరవం దక్కించారని ఆయన అన్నారు. ఉప రాష్ట్రపతి హోదాలో ఉన్నప్పటికీ మనలో ఒకడిగా మనల్ని పలకరించడం ఎంతో సంతోషకరమని కేసీఆర్ అన్నారు. ఈ పదవిలో కూడా వెంకయ్య రాణించి జాతీయ స్థాయిలో తెలుగు వారికి ఎనలేని గౌరవం తెస్తారని చంద్రశేఖరరావు ఆశాభావం వ్యక్తంచేశారు.



ఘనస్వాగతం

రెండు రోజుల రాష్ట్ర పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు విచ్చేసిన భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకు బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఘనస్వాగతం పలికారు. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్రానికి తొలిసారిగా వచ్చిన వెంకయ్య నాయుడుకు రాష్ట్ర పోలీసు బృందాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఉపరాష్ట్రపతి రాష్ట్ర ప్రభు



త్వం రాజ్‌భవన్‌లో నిర్వహించిన పౌర సన్మానం కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సన్మాన కార్యక్రమంలో కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, తెలంగాణ శాసనమండలి చైర్మన్ కె.స్వామి గౌడ్, శాసనసభ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి, డిప్యూటి స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రులు మహమూద్ అలీ, కడియం శ్రీహరి, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, ఈటెల రాజేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కేటీ రామారావు, లక్ష్మారెడ్డి, హరీష్‌రావు, మహేందర్‌రెడ్డి, పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస యాదవ్, జోగు రామన్న, జూపల్లి కృష్ణారావు, పార్లమెంట్ సభ్యులు జితేందర్‌రెడ్డి, కె.కేశవరావు, డిప్యూటి మేయర్ ఫసియుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పి సింగ్, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కలిసి నడవండి.. సహకరిస్తా

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా హైదరాబాద్ వచ్చిన వెంకయ్య నాయుడును రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఘనంగా సన్మానించింది. రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఈ పౌర సన్మాన కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు, కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, తెలంగాణ శాసనమండలి చైర్మన్ కె.స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి, ఉప ముఖ్యమంత్రులు మహమూద్ అలీ, కడియం శ్రీహరి వేదికను అలంకరించారు. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పురప్రముఖులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, సామాజికవేత్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, తెలుగు వారంతా ఒకటిగా ఉండాలని, ఇద్దరు ముఖ్యమంత్రులు కూడా పరస్పరం సహకరించుకోవాలని సూచించారు. తాను రాజకీయాల్లో లేనని, తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని కోరారు. అభిప్రాయభేదాలు ఉండడం సహజమేనని, ఒక కుటుంబంలోనే తండ్రీకొడుకుల మధ్య విభేదాలు ఉంటాయని, వీటిని అధిగమించి ముందుకు సాగితేనే అభివృద్ధి సాధ్యమన్నారు. కేసీఆర్ రాజకీయ అనుభవం, చంద్రబాబు పాలనా సామర్థ్యంతో తెలుగు ప్రజలకు దేశంలోనే ప్రత్యేక గౌరవం దక్కాలని ఆకాంక్షించారు.

తెలుగు భాషను పరిరక్షించుకుందాం

తెలుగు వారికి జాతీయ స్థాయిలో గుర్తింపు, గౌరవం ఉందని, దీన్ని నిలుపుకునేందుకు తెలుగు భాషను పరిరక్షించాలి. భాష, భావం, సాంప్రదాయం, సంస్కృతిని కాపాడుకోవాలన్నా ఇంగ్లీష్ భాషపై వ్యామోహం అంటువ్యాధిలా ప్రబలుతోంది. తెలుగు మాధ్యమంగా ఉండాలని అనలేను కానీ, విధిగా చదవాలని, తెలుగు వస్తేనే ఉద్యోగం ఇవ్వాలి. ప్రజలకు అర్థమయ్యే భాషలో పాలన సాగాలి. శ్రీకృష్ణదేవరాయలు



తెలుగు భాషను ప్రోత్సహించి పరిపాలన చేశారంటూ వెంకయ్య నాయుడు గుర్తుచేశారు. తెలంగాణలో తెలుగు భాషలో సినారె రారాజని, తెలుగువారి పంచకట్టు, అభిరుచి, ఆహారపు అలవాట్లను కవిత్వం ద్వారా చాటిచెప్పారని కొనియాడారు. అలాగే పాల్కురికి సోమనాథుడు, సురవరం ప్రతాపరెడ్డి తదితరులు తెలుగు భాష పరిరక్షణకు ఎనలేని కృషి చేశారని ఆయన చెప్పారు. మన భాష, యాస, కట్టు, బొట్టును కాపాడాలని, అందరికీ అర్థమయ్యేలా తెలుగులో సరళంగా మాట్లాడుకోవాలని వెంకయ్య అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలుగులో ఎంతో ప్రావీణ్యం పొందారని, ఆయన భాష, ప్రసంగం షడ్రుచులతో కూడిన భోజనం లాంటిదని చమత్కరించారు. కేసీఆర్ సామాన్య ప్రజలకు కూడా అర్థమయ్యే రీతిలో తన భాషతో ఆకట్టుకుంటారని, ఆయన వ్యంగ్యం, చమత్కారం, విషయ పరిజ్ఞానం అద్భుతంగా ఉంటాయని కొనియాడారు.

రాజకీయంగా తాను ఎదిగిన ప్రాంతం నుంచే ఉపరాష్ట్రపతిగా మొదటి అధికార పర్యటన ప్రారంభించానని, తన పదవి పెద్దదని, అయినా ఆప్తులతో కలిసిపోయేందుకు తాను ప్రాధాన్యత ఇస్తానన్నారు. ప్రజలతో కలిసి మెలిసిన తనకు ఈ పదవిలో ఇమిడిపోయేందుకు కొంత సమయం పడుతుందని, గతంలో మాదిరిగా తరచూ ఇక్కడికి రాలేనని అన్నారు. ఉప రాష్ట్రపతి పదవి ఎంతో పెద్దదని, పరిమితు లు కూడా ఉంటాయని, దీన్ని అధిగమించి ప్రజల మధ్య ఎలా ఉంటానో చూడాలని అన్నారు.

తాను నెల్లూరులో పుట్టి, వైజాగ్‌లో విద్యాభ్యాసం చేసి, హైదరాబాద్ నుంచి రాజకీయంగా ఢిల్లీదాకా ఎదిగానని ఆయన గుర్తుచేసుకున్నారు. 1978లో మొదటిసారిగా శాసనసభకు ఎన్నికైన నాటినుంచి తనకు హైదరాబాద్‌తో అనుబంధం పెనవేసుకుందన్నారు. తెలంగాణలో విశిష్టమైన పండుగలు, రుచులు భిన్నమైనవన్నారు. తాను భాషా, భోజన ప్రియుడనని, వాటిని రుచి చూడడంలో తనకు ఆసక్తి ఉందన్నారు. హైదరాబాద్ బిర్యానీ, నెల్లూరు చేపల పులుసు లకు ప్రత్యేక గుర్తింపు ఉందని, తెలుగు నేలలో రుచులు, భాష, యాస భిన్నమైనవని, అయినా తెలుగు జాతి అంతా ఒక్కటేనని వెంకయ్య నాయుడు అన్నారు. అనేక రంగాల్లో అభివృద్ధి సాధించి హైదరాబాద్ ప్రపంచ పటంలో నిలిచిందని, దీనికి ఎందరో కృషి చేశారని ఆయన అన్నారు.

అభివృద్ధిలో అందరికీ భాగస్వామ్యం కల్పించాలని, అందరం భాగస్వామ్యం కావాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయ నాయకులు ఆత్మావలోకనం చేసుకోవాలని, తెలుగు ప్రజల ఆశయాలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు బాధ్యతలను గుర్తెరిగి వ్యవహరించాలన్నారు. బడుగు, బలహీన, పేదవర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇవ్వాలని, అంతిమ పంక్తిలో కూర్చున్న వ్యక్తికి చేయూత ఇవ్వాలని ఉద్బోధించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కటై టీమిండియాగా పనిచేయాలన్నది ప్రధాని నరేంద్రమోడీ ఆకాంక్ష అని చెప్పారు. అవినీతి, తీవ్రవాదం లేని, శక్తివంతమైన భారత్‌ను తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు.

చట్ట సభల్లో ప్రజా ప్రతినిధులు అర్థవంతమైన చర్చలు జరిపి వేగవంతంగా అభివృద్ధి సాధించేందుకు అంకితభావం మసలుకోవాలి. ప్రస్తుత పరిస్థితిలో చట్టసభల్లో జరుగుతున్న తీరు బాధాకరం. ప్రజల ఆశలు, ఆశయాలకు శాసనసభలు వేదికలుగా నిలవాలి. ఉపరాష్ట్రపతిగా తాను తెలుగు ప్రజల మధ్యలోనే ఉంటానని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఏం చేస్తే బాగుంటుందో ప్రధాని నరేంద్రమోడీతో మాట్లాడి సహకరిస్తానని వెంకయ్య నాయుడు హామీ ఇచ్చారు.

డబుల్ బెడ్‌రూం పథకానికి రూ. 558 కోట్లు విడుదల

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర వ్యాప్తంగా వేగం పుంజుకున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ళ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.558.50 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు.

సింగరేణిలో మోగిన ఎన్నికల నగారా

(మొదటి పేజీ తరువాయి)

అన్ని కార్మికసంఘాలతో సోమవారం సమావేశం నిర్వహించిన డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్), ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ కెకెహెచ్ఎం శ్యాం సుందర్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. అక్టోబర్ 5న ఈ ఎన్నిక జరుగనుంది. వచ్చే ఏడాది ఆఖర్లోనే.. సాధారణ ఎన్నికలు జరుగుతాయన్న చర్చలు జరుగుతున్న నేపథ్యంలో, ఏడాది ముందు జరిగే సింగరేణి ఎన్నికలు.. ఆరు జిల్లాల్లోని 20మంది ఎమ్మెల్యేలు, ఎంపీల భవిష్యత్తుకు కూడా సంకేతాలివ్వనున్నాయి. సింగరేణి ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే.. తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రతిబింబించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం సింగరేణి కాలరీస్‌లో టిఆర్ఎస్ అనుబంధ కార్మికసంఘం తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘం గుర్తింపుసంఘంగా ఉండగా, గత సాధారణ ఎన్నికలకు ముందు.. బలమైన ఎఐటియుసి, ఐఎన్‌టియుసిలను ఓడించి టిబిజికెఎస్ తొలిసారి సింగరేణిపై గులాబీజెండా ఎగరేసింది. ఆ తర్వాత వచ్చిన అసెంబ్లీ ఎన్నికల్లో టిఆర్ఎస్ సంచలన విజయం సాధించి.. అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఆది నుండి సింగరేణిపై పట్టుండగా, వ్యూహాత్మకంగా కార్మికసంఘాన్ని సంస్థలోకి విస్తరించారు. టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్ళలో.. కార్మికులకు ప్రభుత్వం పలువరాలు ప్రకటించగా, కీలకమైన వారసత్వ ఉద్యోగాల విషయంలో కేసులను అధిగమించి ముందుకు పోలేకపోయింది. ఇటీవల టిఆర్ఎస్ ఎంపీలు ఢిల్లీలో దీనిపై కొంత ప్రయత్నం చేశారు. సింగరేణి కాలరీస్ తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, భూపాలపల్లి, మంచిర్యాల, పెద్దపల్లి, ఆసిఫాబాద్ జిల్లాల్లో విస్తరించి ఉంది. ఈ జిల్లాల్లోని 20మంది ఎమ్మెల్యేలకు ఈ ఎన్నికలు పరీక్షగా నిలవనున్నాయి. కార్మిక కుటుంబాల నాడి.. తర్వాత ఆ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రతిబింబిస్తుండడంతో ఈఎన్నికను రాజకీయపార్టీలు సవాల్‌గా తీసుకోనున్నాయి. ముఖ్యమంత్రి కెసిఆర్ తనయ కల్వకుంట్ల కవిత ప్రస్తుత గుర్తింపుసంఘమైన తెలంగాణ బొగ్గుగని కార్మికసంఘానికి గౌరవ అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. కార్మికుల్లో సిఎం కెసిఆర్‌పై, కవితపై ప్రత్యేక అభిమానం ఉండగా.. టిబిజికెఎస్ నేతల మధ్య విభేదాలు, పలు ఏరియాలలో కార్మికులతో సఖ్యత లేకపోవడం, ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం, అందుబాటులోకి లేకపోవడం వంటి ఆరోపణలున్నాయి. కాగా సింగరేణిలోనూ విజయం తమదేనని టిఆర్ఎస్ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

ఇదీ ఎన్నికల షెడ్యూల్...

అక్టోబర్ 5వ తేదీ ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తామని, ఈ నెల 30వ తేదీలోగా సింగరేణి యాజమాన్యం కార్మికసంఘాలకు ఓటర్ల జాబితాను అందజేస్తుందని ప్రకటించారు. ఓటర్లజాబితాలో ఉన్న అభ్యంతరాలపై సెప్టెంబర్ ఆరవ తేదీలోగా కార్మికసంఘాలు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదుచేస్తే 9వ తేదీన వీటిపై రిటర్నింగ్ అధికారి స్పందిస్తారు. సెప్టెంబర్ 13న తుది ఓటర్లజాబితాను ప్రదర్శించనుండగా, 14వ తేదీ నుండి 16వ తేదీవరకు నామినేషన్ల దాఖలుకు గడువు విధించారు. సెప్టెంబర్ 19న ఉపసంహరణ, 20న నామినేషన్ల స్క్రూటినీ, గుర్తుల కేటాయింపు జరుగుతాయి. అక్టోబర్ 5న ఎన్నిక నిర్వహిస్తారు. ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగనుంది. సాయంత్రం 7గంటల నుండి కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఆగస్టు 1వరకు ఆన్‌రోల్‌లో ఉన్న ఉద్యోగులను తాత్కాలిక ఓటర్లుగా పరిగణించనుండగా, అక్టోబర్ 5న ఆన్‌రోల్‌లో ఉన్న ఉద్యోగులు మాత్రమే ఓటువేసేందుకు అర్హులని రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

రైతుల కమిషన్ ఏర్పాటు!?



(మొదటి పేజీ తరువాయి)

లేక, తమ బాధలు చెప్పుకునేందుకు ఉన్నతస్థాయిలో చట్టబద్ధమైన వ్యవస్థ లేక ఆందోళన చెందుతున్న రైతులకు శాశ్వత పరిష్కారం లభించబోతోంది.

విశ్వసనీయ సమాచారం మేరకు గరిష్టంగా ఆరు నెలల్లోగా తెలంగాణ ఫార్మర్స్ కమిషన్‌ను నెలకొల్పాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఈ కమిషన్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాక రైతు సంక్షేమ పథకాల అమలులోనూ పారదర్శకత పెరుగనుంది. అర్హులైన వారందరికీ లబ్ధి చేకూర్చడంలో, అభివృద్ధి ఫలాలను వారికి అందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపైనా చట్టపరమైన నిఘా వ్యవస్థ అందుబాటులోకి వస్తున్నందున కర్షక లోకానికి కొండంత అండ లభించనుంది. రాష్ట్ర జనాభాలో 80 శాతానికి పైగా ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నందున ఈ తరహా కమిషన్ ఏర్పాటు ప్రభుత్వానికి ఆవశ్యకమైంది. పెద్దఎత్తున ప్రయోజనాలను చేకూర్చే ఈ అంశంపై ప్రభుత్వ పరమైన చర్యల్లో కొంత ఆలస్యం కనిపించడంతో బీజేపీకి చెందిన సీనియర్ నేత ఇంద్రసేనారెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తగిన మార్గదర్శకాలు జారీ చేసింది.

గరిష్టంగా మూడు నెలల కాల వ్యవధిలో కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఏడాది క్రితమే హైకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి నిర్దిష్టమైన సూచనలు చేసింది. ఇప్పటికే ఆలస్యమైన విషయాన్ని గుర్తించిన సీఎం కేసీఆర్ ఇటీవల రెవెన్యూ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కసరత్తు వేగవంతమైంది. పదవీ విరమణ పొందిన న్యాయమూర్తి అధ్యక్షతన ఐదుగురు సభ్యులతో కూడిన తెలంగాణ ఫార్మర్స్ కమిషన్ త్వరలోనే ఏర్పాటు కాబోతోంది. వచ్చే ఏడాది నుంచి కమిషన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. దీంతో బడుగు రైతు కుటుంబాల్లో ఆత్మస్థైర్యం, భవిష్యత్తుపై భరోసా పెరుగనుంది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో అక్రమాలు 90శాతం నియంత్రించబడతాయి. తమకు అన్యాయం జరిగితే కమిషన్‌ను ఆశ్రయిస్తామన్న ధీమా రైతుల్లో వస్తే గనుక బలపడితే వ్యవసాయ రంగం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లడం ఖాయమని వ్యవసాయ రంగ నిపుణులు, సామాజికవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ఇప్పుడున్న మహిళా, మానవ హక్కుల కమిషన్ మాదిరిగానే తెలంగాణ ఫార్మర్స్ కమిషన్‌కు కూడా ప్రభుత్వాన్ని ఆదేశించే అధికారాలు ఉంటాయి. ప్రస్తుతం దేశంలో జాతీయ స్థాయిలో కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైజెస్ (సీఏసీపీ), నేషనల్ కమిషన్ ఫర్ ఫార్మర్స్ ఉన్నాయి. ఈ తరహాలో రాష్ట్రస్థాయిలో ఫార్మర్స్ కమిషన్ ఏర్పాటు కావడం తెలంగాణలోనే ప్రప్రథమం.

రెవెన్యూ శాఖలో కసరత్తు : పార్థసారథి

తెలంగాణలో వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఆశించిన పురోగతి, రైతు సంక్షేమ కార్యక్రమాల్లో మరింత పారదర్శకత, క్షేత్రస్థాయిలో జరుగుతున్న వివిధ రకాల దోపిడీని నియంత్రించాలంటే తెలంగాణ ఫార్మర్స్ కమిషన్ అవసరమని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి పార్థసారథి అభిప్రాయపడ్డారు. ఇందుకు సంబంధించిన కసరత్తు రెవెన్యూశాఖ ఉన్నతాధికారుల నేతృత్వంలో జరుగుతోందని తెలిపారు. ఈ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ముందుగా రాష్ట్ర ప్రభుత్వమే సంకల్పించిందని, ఆ మేరకు రూపొందించిన ప్రతిపాదనను ఆమోదించిందని చెప్పారు. కమిషన్ ఏర్పాటులో ఆలస్యం జరుగుతుందని మాత్రమే కొందరు కోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. కోర్టు మార్గదర్శకాల మేరకు ప్రస్తుతం ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందన్నారు. కారణం ఏదైనా వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతు కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని పార్థసారథి అన్నారు.

సీబీఐ తీరుపై సుప్రీం మండిపాటు

న్యూఢిల్లీ: బొగ్గు కుంభకోణం కేసు దర్యాప్తు కుంటినడకలు నడుస్తోందని, వేగవంతం చేయాలని, సీబీఐకి సోమవారం సుప్రీంకోర్టు అక్షింతలు వేసింది. దర్యాప్తు విషయంలో సీబీఐ తాత్సారం చేయడాన్ని కోర్టు ఆక్షేపించింది. సకాలంలో దర్యాప్తు పూర్తిచేయాలని ఆదేశించింది. బొగ్గు కుంభకోణం కేసు దర్యాప్తును సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని ఎప్పటికప్పుడు సీబీఐని కోరినా అలసత్వం వహించడంపై కోర్టు మండిపడింది. బొగ్గు కుంభకోణానికి సంబందించిన అన్ని కేసులపై దర్యాప్తు ఏజెన్సీ చార్జిషీట్‌ను ఫిబ్రవరి చివరికల్లా అందజేయాలని, అంతేకాకుండా, మిగిలిన అన్ని బొగ్గు కేసులపై పూర్తి దర్యాప్తును చేపట్టాలని తెలిపింది. ఈ కుంభకోణానికి సంబంధించి బొగ్గు మంత్రిత్వ శాఖకు ఇచ్చిన షోకాజ్ నోటీసులపై ఎలా స్పందించాలనే విషయాన్ని న్యాయస్థానానికి తెలియజేయాలని అటార్నీ జనరల్ ముకుల్ రోహిత్గీని ఆదేశించింది.


గోదారి పరవళ్లు

- ఎస్సారెస్పీకి 1.95లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఉత్తర తెలంగాణ జిల్లాల రైతాంగానికి భరోసా
- గోదావరి పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు
- ఎత్తిపోతలకు సరిపడ నీరు
- ఖరీఫ్ గండం గట్టెక్కినట్లే

ఉత్తర తెలంగాణ,ఆంధ్రప్రభ : శ్రీరాం సాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) జలకళను సంతరించుకుంది. దీంతో ఉత్తర తెలంగాణ రైతాంగానికి ఊరట లభించింది. ఎస్సారెస్పీలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. నదీ పరివాహక ప్రాంతంతో పాటు ఆది లాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో కురిసిన వర్షానికి గోదావరి వరద పోటెత్తింది. ఖరీఫ్ ఆరంభం నుంచి వర్షాలు లేక పోవడంతో ఈ సారి సీజన్‌లో ఇప్పటివరకూ ఒక చుక్క వరదనీరు ప్రాజెక్టులోకి రాలేదు. దీంతో తెలంగాణలో అవిభక్త ఐదు జిల్లాల్లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రైతాంగం తీవ్ర ఆందోళనకు గురైంది. సగం మేర రైతులు భూము లను దుక్కి దున్ని సిద్ధం చేసినప్పటికీ ప్రాజెక్టులో నీరు లేక నాట్లు వేయకుండా వర్షాల కోసం ఎదురుచూశారు. కొందరు విత్తనాలు వేసి సిద్ధంగా ఉంచారు. ఈ దశలో భారీ వర్షాలతో శ్రీరాంసాగర్ లోకి వరదనీరు వచ్చి చేరుతుండడం రైతాంగం ఆశలకు జీవం పోసింది.

లక్ష 95వేల ఇన్‌ఫ్లో..


శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు సోమవారం ఉదయం 1,80,000క్యూసెక్కుల నీరు రాగా, సాయంత్రానికి 1,16,765 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎస్సారెస్పీ సామర్థ్యం 90.16టిఎంసిలు కాగా, సోమవారం సాయంత్రానికి నీటిమట్టం 18.43టిఎంసిలకు పెరిగింది. కడెం ప్రాజెక్టు సామర్థ్యం 7.60టిఎంసిలు కాగా, సోమవారం సాయంత్రానికే 7.039టిఎంసిల నీరు ప్రాజెక్టులోకి చేరింది.



ప్రాజెక్టులోకి 4,103క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. పోచారం, కౌలాస్‌నాలా, ఘనపూర్ అనికట్ తదితర ప్రాజెక్టులలోనూ నీటిమట్టం క్రమేపి పెరుగుతోంది.

పెరుగుతున్న నీటిమట్టాలు..

రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులలో ఇన్‌ఫ్లోలు, నీటినిల్వ లు ఇలా ఉన్నాయి. జూరాల ప్రాజెక్టుకు 2,500క్యూసె క్కులు, సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లోలు నిలిచిపోగా, నిజాంసాగర్‌లోకి 2,389క్యూసెక్కులు, ఎల్లంపల్లి ప్రాజె క్టుకు 6,110క్యూసెక్కులు, తాలిపేరు ప్రాజెక్టు ఇప్పటికే పూర్తిగా నిండగా, 21వేల క్యూసెక్కులను దిగువకు వదులు తున్నారు. కిన్నెరసాని ప్రాజెక్టులోనూ ఇదే పరిస్థితి. ఆదిలాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులలోనూ స్వల్పంగా నీటినిల్వలు పెరుగుతున్నాయి.



ఖరీఫ్ గండం గటెక్కినట్లే...

ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండడంతో ఉత్తర తెలంగాణ అవిభక్త జిల్లాలైన నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో సుమారు ఆరు లక్షల ఎకరాలకు కాకతీయ, సరస్వతి, లక్ష్మీ కాలువల ద్వారా సాగునీరు అందుతుంది. ప్రాజెక్టుపై ఆధారపడి నిర్మించిన నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలోని మరో 32 ఎత్తిపోతల ద్వారా రెండు లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందనుంది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఖరీఫ్ గండం గటెక్కే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇలాగే 15 రోజుల పాటు వరద కొనసాగితే రబీకి కూడా నీటికి ఢోకా లేకుండా పోతుంది. మహరాష్ట్రలో భారీ వర్షాలు కురియడంతో గోదావరిపై నిర్మించిన ప్రాజెక్టులు దాదాపు అన్ని పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయి. ఒకటి, రెండు రోజుల్లో వాటి నుంచి దిగువకు నీరు విడుదల చేయనున్నారు. దీంతో ఎస్సారెస్పీకి భారీ వరద ఖాయమని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు.

Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com
Journalism first!

సంపుటి: 56 • సంచిక: 132 • మంగళవారం 22 ఆగస్టు 2017 • హైదరాబాద్ ✻ పేజీలు: 12+4 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad | Khammam

ముహూర్తం | శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, తిథి: శుద్ధ పాడ్యమి రా. 10.55 వరకు అనంతరం విదియ; నక్షత్రం: మఖసా. 4.14 వరకు అనంతరం పుబ్బ; అమృతకాలం: మ. 1.00 నుండి 2.30 వరకు; వర్జ్యం: ఉ. శే 6.08 నుండి రా.12.07 నుండి 1.42 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.17 నుండి 9.08 వరకు, రా. 11.00 నుండి 11.45 వరకు; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు


ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు మెమెంటో బహూకరిస్తున్న సీఎం కేసీఆర్

కలిసి నడవండి సహకరిస్తా!

ఇరురాష్ట్రాల సీఎంలకు ఉప రాష్ట్రపతి వెంకయ్య పిలుపు

- రాష్ట్రవిభజన ఎవరికీ వ్యతిరేకం కాదు
- విడిపోయి కలిసి ఉందాం
- తెలుగు భాషను పరిరక్షిద్దాం
- ఉన్నత పదవిలో ఉన్నా తెలుగు ప్రజల మధ్యలోనే
- ఉభయ రాష్ట్రాలకు అండగా ఉంటా
- వెంకయ్యకు ఘనంగా పౌరసన్మానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర విభజన ఎవరికీ వ్యతిరేకంగా జరిగింది కాదని, ఎవరి ప్రాంతాన్ని వారే పాలించుకోవాలని , ఎవరి నిధులు వారే ఖర్చు చేసుకుని అభివృద్ధి సాధించుకోవాలన్న దిశలో చోటుచేసుకున్న పరిణామమని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పేర్కొ న్నారు. తమ ప్రాంత హక్కుల కోసం తెలంగాణ ప్రజలు ఏర్పా టు ఉద్యమంలో పాల్గొన్నారని ఆయన గుర్తుచేశారు. కలిసి ఉండి కలహించుకునే కన్నా.. విడిపోయి కలిసి ఉందామని ఆయన పిలుపునిచ్చారు. ఉపరాష్ట్రపతిగా ➪ 2వ పేజీలో...



వెంకయ్యనాయుడు తెలుగు ఆణిముత్యం

2

రైతుల కమిషన్ ఏర్పాటు!?

- దేశంలోనే తెలంగాణాలో ప్రప్రథమం
- అన్నదాత హక్కులకు రక్షణ వ్యవస్థ
- ఇక మోసాలు, దగాలకు చెల్లుచీటి
- అధికారుల నిర్లక్ష్యంపై చట్టపరమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక కేవలం మూడేళ్ళ వ్యవధిలోనే అనేక రంగాల్లో కొత్త విధానాలకు నాంది పలికి రికార్డు సొంతం చేసుకున్న తెలంగాణ ప్రభుత్వం, రైతు సంక్షేమ రంగంలోనూ తనదైన శైలిలో కొత్త పుంతలు తొక్కేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. దేశంలోనే ఇప్పటివరకు ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ రైతుల కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న కొత్త ఆలోచనను కార్యరూపంలోకి తీసుకు రాబోతోంది. అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ఈ తరహాలో కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు కేసీఆర్ ప్రభుత్వం ఆమోదం తెలిపినప్పటికీ, తాజాగా హైకోర్టు ఆదేశాలతో కసరత్తు ప్రారంభమైంది. ఇందుకు సంబంధించిన విధివిధానాల రూపకల్పనలో రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి బీఆర్ మీనానేతృత్వంలోఉన్నతాధికారులు డ్రాఫ్ట్‌ను తయారు చేస్తున్నారు. దీంతో రాష్ట్రంలో అన్నదాతల హక్కులకు రక్షణ వ్యవస్థ అందు బాటులోకి రానుంది. ప్రస్తుతం నిత్యం జరుగుతున్న మోసాలు, దగాలకు విరుగుడు ➪ 2వ పేజీలో...


బాలానగర్ ఫ్లైఓవర్ శంకుస్థాపన సభలో ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్

నాణ్యమైన జీవనప్రమాణాల్లో హైదరాబాద్ 1

- బాలానగర్ ఫ్లైఓవర్ శంకుస్థాపన సభలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ రాష్ట్రంలో తెరాసకే ప్రజలు పట్టం కడుతారన్న విషయం కాంగ్రెస్ అగ్రనేతలకు బాగా తెలుసునని అయినా ఆ పార్టీ మేకపోతు గాంభీర్యాలు ప్రదర్శిస్తోందని పురపాలక, ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాలానగర్‌లో రూ.387 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వంతెనకు మంత్రి కేటీఆర్ సోమవారం సాయంత్రం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బాలానగర్ చౌరస్తాలో దశాబ్దాలుగా ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఆ కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ఈ వంతెనను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. గత పదేళ్ళలో రాష్ట్రంలో ఎక్కడా ➪ 10వ పేజీలో...



'అంటు' కుదిరింది

ఏకమైన పళనిస్వామి, పన్నీర్ సెల్వం

- ఉపముఖ్యమంత్రిగా సెల్వం ప్రమాణం
- పార్టీ నిర్వాహక కమిటీ కన్వీనర్‌గా పన్నీర్ ఎంపిక
- అమ్మ ఆశయాలను నెరవేరుస్తామని ప్రతిజ్ఞ
- చిన్నమ్మకు ఉద్వాసనపై కొనసాగుతున్న సస్పెన్స్

11

శశికళ బైటికెళ్లి వచ్చారు!

- కర్నాటక ఏసీబీ ఎదుట మాజీ డీఐజీ రూప సాక్ష్యం

11


బెంగళూరు: బయటకెళ్లి జైలులోకి వస్తున్న శశికళ (వీడియోలో నిక్షిప్తమైన దృశ్యం)

సింగరేణిలో మోగిన ఎన్నికల నగారా

- అక్టోబర్ 5న ఎన్నికలు
- షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న సింగరేణికాలరీస్‌లో ఎన్నికల నగారా మోగింది. ఆరు జిల్లాల్లో విస్తరించి ప్రత్యక్షంగా 60వేల మంది కార్మికులు, పరోక్షంగా అంతకు రెట్టింపు సంఖ్యలో కుటుంబాలు ఆధారపడి పనిచేసే సంస్థలో కీలకఘట్టానికి కేంద్ర కార్మికశాఖ పచ్చజెండా ఊపింది. హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లోని ➪ 2వ పేజీలో...



జీఎస్టీతో కార్పోరేట్ లాభాలకు గండి

8 లో

ఈ వారంలోనే మోడీ కేబినెట్‌లో మార్పులు... చేర్పులు

- ప్రభుత్వంతోపాటు పార్టీలోనూ..
- దక్షిణాది రాష్ట్రాలకు సింహభాగం
- కేంద్ర మంత్రివర్గంలో జేడీయూకు ఒకటి, ఏఐఏడీఎంకేలకు రెండు బెర్తులు
- ఎన్నికల సైన్యానికి తుదిమెరుగులు
- బీజేపీ సీఎంలతో మోడీ, షా సమావేశం

11



న్యూఢిల్లీ: ప్రధాని మోడీ అధ్యక్షతన బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం, చిత్రంలో అమిత్‌షా, రాజ్‌నాథ్, సుష్మా

జౌరా..!





గోదారి పరవళ్ళు

- ఎస్సారెస్పీలోకి లక్షా 95వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- శ్రీరాంసాగర్‌లో పెరుగుతున్న నీటిమట్టం 2
- ఉత్తర తెలంగాణ జిల్లాల రైతాంగానికి భరోసా
- గోదావరి పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు
- ఎత్తిపోతలకు సరిపడ నీరు..గండం గట్టెక్కినట్లే

ఎస్‌బీఐ కస్టమర్లకు గుడ్‌న్యూస్



8 లో

రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు 100% తగ్గింపు

- గృహరుణాలపై ఇప్పటికే అమలు
- కార్ల రుణాలపై వందశాతం డిసెంబర్ 31 వరకు సదుపాయం
- అక్టోబర్ 31వరకు గోల్డ్ లోన్స్‌పై
- సెప్టెంబర్ 30 వరకు వ్యక్తిగత రుణాలపై 50% తగ్గింపు అమలు

నేడు బ్యాంకుల బంద్

8 లో

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

మంగళవారం 22 ఆగస్టు 2017

విలీనం వెనుక విరిసిన కమలం!

వ్యక్తులపై ఆధారపడి పని చేసే పార్టీలు ఆయా వ్యక్తుల తదనంతరం చీలికలు,పీలికలు కావడం, మళ్ళీ విలీనం కావడం దేశ రాజకీయాల్లో కొత్త కాదు. గత డిసెంబర్‌లో కన్నుమూసిన అన్నా డిఎంకె అధినేత్రి జయలలిత నేతృత్వంలోని పార్టీలో గడిచిన ఎనిమిది మాసాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలు రాజకీయాలంటేనే వెగటుపుట్టించే స్థాయికి చేరాయి. నిలువునా చీలిపోయిన ఆ పార్టీలో ప్రస్తుతం స్వయం ప్రకాశ శక్తిగలిగిన వారెవరూ లేరు.ఏ వర్గమైనా జయలలిత పేరు చెప్పుకుని ప్రజల ముందుకు వెళ్ళాల్సిందే. అయితే, ఆమె వారసత్వంపై హక్కు ఎవరిదనే దానిపై గడిచిన కొంత కాలంగా సాగుతున్న వివాదం ప్రస్తుతానికి పరిష్కారమైనట్టు కనిపించినా, బెంగళూరులోని పరప్పణ జైలులో రాజభోగాలను అనుభవిస్తున్న జయలలిత ఇష్టసఖి శశికళ తెరవెనుక నుంచి వేస్తున్న ఎత్తులకు ఇప్పుడు విలీనమైన వర్గాలు తట్టుకోగలవా అనేది కొద్ది రోజుల్లో తేలనుంది. శశికళ వర్గీయుడైన పళనిస్వామి, ఆమె ప్రత్యర్థి అయిన పన్నీర్ సెల్వం వర్గాలు విలీనం కావడం రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన పరిణామమే అయినా, వీటి మధ్య కుదిరిన ఒప్పందం అమలుకు శశికళ జైలు నుంచే అడుగడుగునా అడ్డంకులు సృష్టించే అవకాశం ఉంది.జైలులో ఆమె రాజభోగాలగురించి డిఐజి తాజాగా ఒకనివేదికసమర్పించారు. శశికళ జైలు నుంచి తరచూ బయటికి వెళ్ళి వస్తుంటారని కూడ వార్తలు వచ్చాయి. మొత్తం మీద వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దిట్ట అని ఆమె గతంలోనే నిరూపించుకున్నారు. ఆమె వ్యూహానికి ప్రతి వ్యూహాన్ని అమలు చేస్తున్న ఇరువర్గాలకూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపీ అండదండలు ఉన్నాయన్న వార్తలు నిరాధారం కాకపోవచ్చు. పళనిస్వామి,పన్నీర్ సెల్వంలు విడివిడిగా ప్రధానమంత్రి నరేంద్రమోడీని పలు సందర్భాల్లో కలుసుకున్నారు. ఈ రెండు వర్గాల విలీనంతో ఆ పార్టీ లోక్‌సభ సభ్యులు 37 మంది ఎన్డీయే కూటమిలో చేరనున్నారు.వారిలో కొందరికి కేంద్ర మంత్రిపదవులు ఇచ్చేందుకు అంగీకారం కుదిరినట్టు తాజా సమాచారం. ఈ రెండువర్గాల విలీనం పట్ల ప్రధాని మోడీ స్వాగతించారన్న వార్త దీనికి బలాన్ని చేకూరుస్తోంది. అన్నాడి ఎంకె వర్గాలను బీజేపీ నాయకత్వం తన వైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తోందంటూ శశికళ మద్దతుదారులు ఇంతవరకూ చేస్తున్నఆరోపణలు నిరాధారం కాదని ఈ పరిణామాలు రుజువుచేస్తున్నాయి. పళని, పన్నీర్ వర్గాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి శశికళను తప్పించడం.ఇది ఒక్క కలం పోటుతో సాధ్యమా అన్న సందేహాలు వ్యక్తం కావడం సహజమే. జయలలిత గత సెప్టెంబర్‌లో ఆస్పత్రిలో చేరిన నాటి నుంచి ఆమె కన్నుమూసేవరకూ పార్టీ వ్యవహారాలను ఒంటి చేత్తో నడిపించిన శశికళ జైలుకి వెళ్ళగానే కార్యకర్తలంతా ఆమెకు దూరమయ్యారా అన్న సందేహం కలగడం కూడా సహజం. వ్యక్తుల మీద ఆధారపడి పని చేసే పార్టీల్లో సానుభూతి కూడా అనివార్యంగా ఉంటుంది.ఆ సానుభూతిని ప్రజాదరణగా మార్చుకోగల నేర్పు,ఒడుపు తెలుసున్న వారికే చివరికి వారసత్వం లభిస్తుంది.ఆ లక్షణాలు శశికళకు పుష్కలంగా ఉన్నాయి.అయితే, ఆమెను ఏకాకిగా చేయాలనుకుంటున్న వర్గాలకు కేంద్రంలో అధికారంలో ఉన్న పెద్దల మద్దతు ఉండటం వల్ల వారిదే విజయంగా కనిపించవచ్చు. ప్రజల వద్దకు వెళ్ళినప్పుడే జయలలిత అసలు వారసులెవరో తేలుతుంది. జయలలిత వారసత్వం కోసం ఆమె మేనకోడలు దీపాజయకుమార్ మొదట ప్రయత్నించారు.ఇప్పుడు చెన్నైలోని జయ నివాసమైన వేదనిలయంపై హక్కును కోరుతున్నారు. సాధారణంగా అధికారంలో ఎవరుంటే వారివైపు నాయకులూ, కార్యకర్తలు చేరుతుంటారు.పదవీకాలమున్నంత వరకూ వారికి ఆదరణ లభించవచ్చు. ఎన్నికల సమయంలో సమీకరణాలు మారవచ్చు. అన్నాడిఎంకె వర్గాల మధ్య వైరాన్ని ఆసరాగా తీసుకుని తమిళనాడులో బలం పెంచుకోవడానికి కమలనాథులు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో శశికళకు వ్యతిరకంగా అన్నాడిఎంకె వర్గాలు విలీనమయ్యేట్టు చేయడంలో కృతకృత్యులయ్యారు. రాష్ట్రంలో ఏభై ఏళ్ళ క్రితం జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కి నూకలు చెల్లాయి. జాతీయ పార్టీలను అధికార పీఠం దరిదాపుల్లోకి రానివ్వకుండా చేయడంలో ఉభయ డిఎంకెలు ఇంతవరకూ సఫలీకృతమయ్యాయి. అయితే,డిఎంకె దాయాదుల్లో ఏదో ఒక పార్టీతో కాంగ్రెస్,బీజేపీ పొత్తు కుదుర్చుకుని కేంద్రంలో మంత్రి పదవులు ఇవ్వడం ప్రారంభించాయి. కేంద్రంలో సంకీర్ణ కూటముల పాలన వల్ల ఇది సాధ్యమైంది.ఇప్పుడు కూడా అదే పద్ధతిలో అన్నా డిఎంకెని కేంద్ర మంత్రివర్గంలో చేర్చుకునేందుకే కేంద్రంలో కమలనాథులు ఈ వర్గాల విలీనానికి తెరవెనక ఉండి మార్గదర్శనం చేశారు.ఈ రెండువర్గాల విలీనానికి ప్రజల మద్దతు ఏమేరకు ఉంటుందనేది భవిష్యత్‌లో తేలుతుంది. శశికళ మేనల్లుడు దినకరన్‌కు ప్రస్తుతం 20 మంది ఎమ్మెల్యేల మద్దతుమాత్రమే ఉంది.ఇప్పటికే అనేక కేసుల్లో నిందితుడైన దినకరన్‌ను కూడా జైలుకి పంపిస్తేనే చీలికవర్గాల విలీనం నిలబడుతుంది. ఈ వర్గాల విలీనం వల్ల రాష్ట్రా నికి ఎంత మేరకుమేలు జరుగుతుందన్నది ప్రశ్నార్థకమే. పదవులు దక్కనివారు అసమ్మతి రాజకీయాలునడపడం తమిళనాడులో కొత్త కాదు.

జై జవాన్, జై కిసాన్, జై కేసీఆర్

భారతదేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డును -2017 కుకాను తెలంగాణ సిఎం కె.చంద్రశేఖరరావు గారు ఎంపికకావడం గర్వంగా ఉంది. ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాధన్ ఆధ్వర్యంలోని కమిటీ కేసీఆర్ గారు చేస్తున్న చెరువుల పూడికతీత ప్రాజెక్టుల నిర్మాణానికి ఆపరేషన్ భగీరథ 17 వేల కోట్ల మేర వ్యవసాయ రుణాల మాఫీ వంటి ప్రభుత్వ చర్యల ద్వారా, సాగునీటిని ప్రాజెక్టుల ద్వారా రీ డిజైనింగ్ చేస్తూ కోటి ఎకరాలకు సాగునీటిని అందించేలా, బడ్జెట్ 25 వేల కోట్లు, కేటాయిస్తూ, ఎకరాకు ఏటా 8 వేల రూపాయల చొప్పున రైతులకు ఆర్థిక సహాయం అందించడమేకాక, ఈ యాసంగి నుంచి వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తూ, రైతులకు అన్నదాతగా గుర్తించబడ్డ సిఎం కేసీఆర్ గారికి అగ్రకల్చర్ షిప్ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల వ్యవసాయంను ప్రేమతో చూసే సిఎం గారు తెలంగాణాలోని నాలుగున్నర కోట్ల ప్రజలనుంచి శిరసువంచి వందనాలు చేస్తూ ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో వ్యవసాయ కళాశాల ఏర్పాట్లు చేస్తూ మనకు అన్నంపెట్టే రైతన్నకు మనం ఉపాధి కల్పిద్దామని తమ వ్యవసాయ క్షేత్రంలో సిఎం గారు

అల్లం పంట పండిస్తూ తమ ఫాం హౌస్‌లోని పంటను తన కలల పంటగా చూసుకుంటున్న సిఎం గారు రైతేరాజుగా భావిస్తూ, వారిని అభినందిస్తున్నాము.

-కోలిపాక శ్రీనివాస్
బెల్లంపల్లి, మంచిర్యాల జిల్లా

మంచి మాట

అనేక సంఘర్షణలకు నష్టాలకు గురయ్యాక మనుషులు వినమ్ర శీలురుగా వివేకులుగా మారతారు.

● బెంజమిన్ ఫ్రాంక్లిన్

హరిత వనంగా పాలమూరు

పరుగులు తీస్తున్న ప్రాజెక్టు పనులు



పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు పరుగుపెడుతున్నాయి. ఈ ఏడాది పూర్తి ఆయకట్టుకు నీరిచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు..లక్ష్యం దిశగా సాగుతున్నాయి. తెలంగాణ వచ్చేదాకా కరవుచిహ్నంగా ఉన్న పాలమూరు ప్రాజెక్టులు పూర్తయితే.. బీళ్ళు పోయి సస్యశ్యామలంగా మారుతుందని ప్రభుత్వం చెబుతోంది. గత ఏడాది పాక్షికంగా పూర్తిచేసిన ప్రాజెక్టుల నుండి వచ్చిన నీటితోనే పాలమూరులో నవోత్సాహం కనిపించింది. బతుకుదెరువుకు వలసవెళ్ళిన వారు తమ గ్రామాల్లో ఏదో అద్భుతం జరుగుతుందంటూ ఆశగా చూశారు. ఆ ఆశను శాశ్వతం చేసే దిశగా.. రైతుల దశాబ్దాల కష్టాలు గట్టెక్కించేదిశగా ప్రభుత్వం గట్టి సంకల్పం తీసుకుంది.

గత ఏడాది తెలంగాణ ప్రభుత్వం చేసిన చిరుప్రయత్నానికే అద్భుత మార్పు రాగా, ప్రజల్లో సంతోషం వెల్లివిరిసింది. ఈ ఏడాది మరింత పట్టుదలతో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల లక్ష్యసిద్ధికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. నాలుగు ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులను పాక్షికంగా పూర్తిచేసి.. గత ఏడాది పాలమూరు చెరువులను నింపి 4లక్షల ఎకరాలకు సాగునీరందించారు. ఇది ఆ ప్రాంత రూపురేఖల్నే మార్చేసింది. పగిలిన బీళ్ళను మాత్రమే ఎరిగిన జనం జలసిరుల రాకతో భూమి తొడిగిన పచ్చనిసింగారం చూసి సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. తెలంగాణలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్న దీక్ష తీసుకున్న ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రధానంగా పాలమూరు ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల సమస్యలను తొలగించే అంశంపై సుదీర్ఘకసరత్తు చేశారు. అందులో భాగంగానే భూసేకరణ చట్టాన్ని తెచ్చారు. కేసులను ఎదుర్కొని.. వ్యూహాత్మకంగా నిర్వాసితులకు నచ్చజెప్పి.. ప్రాజెక్టుల భూసేకరణ సమస్యలు పరిష్కరిస్తూనే పెండింగ్ పనులను గత రెండేళ్ళుగా పరుగు పెట్టిస్తున్నారు. గత ఏడాది ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులైన కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పాక్షికంగా పూర్తిచేసి 4లక్షల ఎకరాలకు సాగునీరందించారు. ఈ జలపంపిణీ పాలమూరు రైతాంగంలో కొత్త ఆశలు తీసుకొచ్చింది. రైతులు, ప్రజల్లో నెలకొన్న ఉత్సాహం.. నీటితో ప్రజలలో వచ్చిన మార్పును గమనించిన ప్రభుత్వం పెండింగ్ పనులను ఈ ఏడాది డిసెంబర్‌కల్లా పూర్తిచేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా బడ్జెట్‌లోనూ ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించింది. పాలమూరు ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు మునుపెన్నడూ లేని రీతిలో ఈఏడాది ప్రభుత్వం రూ.1635 కోట్ల నిధులు కేటాయించింది. కల్వకుర్తి ప్రాజెక్టుకు గరిష్ఠంగా రూ.వేయికోట్లు నిధులు కేటాయించగా, భీమాకు రూ.200కోట్లు, నెట్టెంపాడు ప్రాజెక్టుకు రూ.234.10, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు రూ.197.36కోట్లు మంజూరు చేసింది. భీమా ప్రాజెక్టుకు ప్రభుత్వం 1194ఎకరాలు, కోయిల్‌సాగర్‌కు 98.31ఎకరాలు, నెట్టెంపాడు ప్రాజెక్టుకు 1107ఎకరాలు, జూరాల ప్రాజెక్టుకు 200ఎకరాలు, కల్వకుర్తి ప్రాజెక్టుకు 1785ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. కొత్త భూసేకరణ చట్టం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని, వరదలు వచ్చేలోగా పనులు రాత్రింబవళ్ళు శ్రమించి పూర్తిచేయాలని మంత్రి హరీష్ ఆదేశించారు.

ప్రాజెక్టుల వద్దే నిద్ర : ముఖ్యమంత్రి కెసిఆర్ సూచనల మేరకు కార్యక్షేత్రంలోకి దూకిన మంత్రి హరీష్ రావు ప్రతి పనినీ పరిశీలిస్తూ.. పెండింగ్ సమస్యల పరిష్కారానికి సూచనలిస్తూ ముందుకు సాగుతున్నారు. గత ఏడాది కూడా హరీష్ నిర్విరామంగా శ్రమించి, ప్రాజెక్టుల వద్దే నిద్రించిన ఫలితంగా పనులు ఒక దశ కొలిక్కివచ్చాయి. భూసేకరణ చట్టానికి ఇబ్బందులు రాకుంటే.. మొత్తం ప్రాజెక్టు పనులు ఇప్పటికే పూర్తయ్యేవని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఖరీఫ్ సమయానికి ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రాజెక్టు పూర్తిచేసేందుకు శ్రమపడాలనీ, ఇందుకోసం.. ఏకకాలంలో చేపట్టాల్సిన పనులను ఇటీవలి సమీక్షలో ముఖ్యమంత్రి కెసిఆర్ వివరించారు. సిఎం సూచనలు, మంత్రి హరీష్ పర్యవేక్షణతో పాలమూరు ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు పరుగుపెడుతున్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనుల పూర్తికి భూసేకరణ చిక్కులే ప్రధాన అడ్డంకిగా ఉన్న వీటిని అధిగమించి ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి లక్ష్యం 3లక్షల ఎకరాలకు సాగునీరందించాలని సిఎం ఆదేశించారు. అధికారవర్గాలు కూడా లక్ష్య సాధనపై ధీమాగా ఉన్నాయి. కోయిల్‌సాగర్ ద్వారా గత ఏడాది 20వేల ఎకరాలకు సాగునీరందించగా, ఈ ఏడాది మొత్తం 50వేల ఎకరాలకు సాగునీరందించాలని నిర్ణయించారు. ఇక భీమా ప్రాజెక్టు ద్వారా 2లక్షల ఎకరాలకు, నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా 1.5లక్షల ఎకరాలకు సాగునీరందించాలని శ్రమిస్తున్నారు. జూరాల ప్రాజెక్టు ద్వారా ఇచ్చే లక్ష ఎకరాలతో కలుపుకుని మొత్తం 8లక్షల ఎకరాలకు సాగునీరందించాలని, గత ఏడాది కంటే డబుల్‌పంట పండించాలని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ ఏడాదితో పాలమూరు ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల కథ ఇక గతం కావాలని ప్రభుత్వం సంకల్పాన్ని నిర్దేశించుకుంది. గత ఏడాది 4లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వడం ద్వారా మొదలైన ముందడుగు.. ఈ ఏడాది 8లక్షల ఎకరాలకు పెరుగుతుందని, రానున్న రెండేళ్ళలో దీనిని 16లక్షల ఎకరాలకు తీసుకెళ్ళాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రణాళిక రూపొందించారు. వాతావరణం కూడా ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా సహకరిస్తుండడంతో.. పాలమూరు పచ్చబడుతోంది. కొత్త కాంతులు నింపుకుంటోంది.

-కంది రామచంద్రారెడ్డి


పాలమూరు ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల లక్ష్యాలు ఇలా

ప్రాజెక్టు పేరు	భూసేకరణ లక్ష్యం	నిధుల కేటాయింపు (2017-18)కోట్లలో	ఆయకట్టు (ఎకరాల్లో)
కల్వకుర్తి	1785.57	1000	3 లక్షలు
భీమా	1194.09	200	2 లక్షలు
నెట్టెంపాడు	1107.4	234.10	1.5లక్షలు
కోయిల్‌సాగర్	98.31	197.36	0.5లక్షలు

బీసీల చిరకాల స్వప్నం నెరవేరేదెన్నడు?

జాతీయ కమిషన్‌కు రాజ్యాంగబద్ధతలో అడుగడుగునా నిర్లక్ష్యం

స్వాతంత్ర్యం సిద్ధించిన నాటినుండి అధికారంలోకి వచ్చిన ఒక్క జనతా ప్రభుత్వం, జనతాదళ్ కూటమి ప్రభుత్వాలు మినహాఅన్ని రాజకీయ పక్షాలు, వెనకబడిన వర్గాలను నిర్లక్ష్యం చేస్తూనే వచ్చాయి. ఈ వర్గాల జనాభా గణనను సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్యారంగాల వారీగా శాస్త్రీయంగా లెక్కించి ఆ దిశ గా వీరి ప్రగతికి కృషి చేయాలని అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు మొదలు రాష్ట్రాల హైకోర్టులు ఇచ్చిన తీర్పులను పెడచెవిన పెడుతూనే వచ్చాయి. 1931లో బ్రిటిష్ పాలిత ప్రాంతాల్లో సేకరించిన కులాల లెక్కలనే ఇప్పటికీ చూపిస్తూ వాటి ఆధారంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. అరకొర నిధులు కేటాయిస్తున్నాయి. బీసీల పట్ల ఆయా ప్రభుత్వాలకు ఉన్న చిన్న చూపును ఇది తెలియజేస్తోంది. అనేక ఉద్యమాల అనంతరం నాటి కేంద్ర ప్రభుత్వం 2011లో కులాల వారీ గణన చేపట్టినప్పటికీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్‌డిఏ ప్రభుత్వం ఆ లెక్కలను బయటపెట్టకపోవడం వెనకున్న ఆంతర్యం, మర్మం ఏమిటో స్పష్టం చేయాల్సి ఉంది. దేశంలోని వెనకబడిన తరగతుల వారు తమకు రాజ్యాంగబద్ధమైన అవకాశాలు కల్పించాలని దశాబ్దాలుగా కోరుకుంటున్నారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధ అధికారాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. రాజ్యాంగ బద్ధంగా జాతీయ బీసీ కమిషన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం దేశంలో ఒక నూతన అధ్యాయానికి శుభారంభంగా చెప్పుకోవచ్చు. ప్రజలు నిత్యం ఎదుర్కొనే అనేక సమస్యలను పరిష్కరించి, అండగా నిలబడే మానవ హక్కుల కమిషన్‌ల వల్లే, రాజ్యాంగంలో 338 బి ఆర్టికల్ ద్వారా రాజ్యాంగబద్ధ అధికారాలతో బీసీ కమిషన్‌గా ఏర్పడబోతోంది. రాజ్యాంగపరమైన, న్యాయపరమైన అధికారాలు బీసీ కమిషన్‌కు సంక్రమించటం ఓబీసీలకు వరం. రాజ్యాంగ బద్ధ అధికారాలను జాతీయ కమిషన్‌కు కల్పించే ప్రక్రియను మొదలుపెడుతున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు బేషరతుగా మద్దతు ప్రకటించడం హర్షణీయం. ఆయన ఆదేశాల మేరకు పార్లమెంటు ఉభయ సభలలో సభ్యులు మద్దతుగా నిలవడం ముఖ్యమంత్రి గారికి బీసీ వర్గాల పట్ల ఉన్న అంకితభావాన్నీ, చిత్తశుద్ధినీ స్పష్టం చేసింది. ఇటీవల రాజ్యసభలో 123వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టినప్పటికీ, అందులో అత్యంత కీలకమైన క్లాజ్ -3 లేకుండానే ఆమోదించారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధ అధికారాలను ఇది ప్రశ్నార్థకంచేసింది. అధికారపక్షం ఉదాసీనత, విపక్షాల అనాలోచిత వైఖరితో సునాయాసంగా జరిగిపోవాల్సిన ఈ ప్రక్రియ తిరిగి ఉభయ సభల్లో ఆమోదం పొందాల్సిన అగత్యం ఏర్పడడం విచారాన్ని కలిగిస్తోంది. దేశంలోని 52 శాతం జనాభాకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు రాజ్యసభలో చర్చకు వచ్చిన సందర్భంలో అధికార పార్టీకి సంబంధించిన ఐదుగురు మంత్రులు, ముప్పై మంది సభ్యులు గైర్హాజరవడం కేంద్ర ప్రభుత్వానికి ఈ వర్గాల పట్ల ఉన్న నిర్లక్ష్య భావాన్ని స్పష్టం చేస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ బిల్లు అంశంలో ఎన్‌డిఏకి చెందిన ఎంపీలు, మంత్రులు ఓటింగ్‌లో పాల్గొనకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. విపక్షాలు కూడా కొన్ని ఆమోదయోగ్యమైన సవరణలతో పాటుగా, పలు అసంబద్ధమైన సవరణల కోసం అనవసరంగా రాజకీయ కోణంలో పట్టుపట్టాయి. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధ అధికారాలు సంక్రమింపబడకుండా అడ్డు



తగిలాయనే ఆరోపణలను ఆ పార్టీలు ఈ కారణంగా ఎదుర్కొంటున్నాయి. తిరిగి ఈ బిల్లులు రెండు సభలలో సవరణలు ఎప్పుడు ఆమోదానికి నోచుకుంటాయి? బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధ అధికారాలు ఎప్పుడు దక్కుతాయన్న ఆందోళన బీసీలలో పెరుగుతోంది. ఈ నిర్వాకంతో ప్రస్తుతం అమలులో ఉన్న జాతీయ బీసీ కమిషన్ చట్టం - 1993 రద్దయ్యింది. కొత్తగా రాజ్యాంగబద్ధ అధికారాలు, హక్కులు ఎప్పుడు కల్పిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఎస్సి, ఎస్టిల రిజర్వేషన్‌ల సమస్య 1932 పుణె ఒప్పందంతో పరిష్కారమై అన్ని రంగాల్లో రిజర్వేషన్‌లు కొనసాగుతున్నాయి. బీసీల రిజర్వేషన్‌లను భారత రాజ్యాంగ రచనలో చేర్చలేదు. జనవరి 29, 1953లో కాకా కాలేల్కర్ అధ్యక్షతన ఏర్పాటైన బీసీ కమిషన్ 1955లో బీసీలకు రిజర్వేషన్‌లు అక్కర్లేదని అభిప్రాయపడింది.

రామ్‌మనోహర్ లోహియా ఆలోచనా విధానంతో ప్రభావితమైన జనతా పార్టీ 1977లో అధికారంలోకి వచ్చిన తరువాత బిపి మండల్ నాయకత్వంలో బీసీల సమగ్ర అధ్యయనం కోసం మండల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. నివేదిక సమయానికి కేంద్రంలో తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాన్ని పక్కన పడేసింది. జనతాదళ్ నాయకత్వంలో 1989లో వి.పి.సింగ్ ప్రధానమంత్రయ్యాక తిరిగి మండల్ కమిషన్ అమలుకు చేసిన ప్రయత్నంలో ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు సుప్రీం కోర్టు ఇంద్ర సాహ్ని కేసులో ఇచ్చిన తీర్పును అనుసరించి కేంద్ర ప్రభుత్వ సర్వీసులలో 27 శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తూ అన్ని రాష్ట్రా ల్లో, కేంద్రంలో బీసీ కమిషన్‌లను చట్టబద్ధంగా శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. చట్టసభల్లో రిజర్వేషన్‌లు ఇంకా అమల్లోకి రాలేదు.


ఈ దశలో జాతీయ బీసీ కమిషన్‌కు సంబంధించిన 123వ రాజ్యాంగ సవరణ ముందుకు వచ్చింది. ఇలా జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధ అధికారాలు కల్పించడానికి సిద్ధపడ్డ కేంద్ర ప్రభుత్వం, 123వ రాజ్యాంగ సవరణ బిల్లు 2017లో అనేక సందేహాలకు, అనుమానాలకు తావిచ్చేలా సెక్షన్‌లను, క్లాజ్‌లను చేర్చి బిల్లును ముందుకు తీసుకురావడం ద్వారా జాతీయ స్థాయిలో ఈ అంశం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం అమలులో ఉన్న జాతీయ బీసీ కమిషన్ చట్టం -1993 ను నంబర్ 70/2017 ను లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆ బిల్లును 10 ఏప్రిల్, 2017 నాడు ఆమోదింప చేసుకుంది. 123వ రాజ్యాంగ సవరణ బిల్లు 2017 ద్వారా జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధ అధికారాలు కల్పించడానికి 10 ఏప్రిల్, 2017న లోక్‌సభలో బిల్లును ఆమోదించారు. ఆ దశలోనే పలు రాజకీయ పక్షాలు, ఓబీసీ సంఘాలు, న్యాయ నిపుణులు, సామాజికవేత్తలు లేవనెత్తిన అంశాలను సవరణలు చేస్తే బాగుండేది. తమకు మెజారిటీ ఉందనే భావనతో ప్రభుత్వం ఎలాంటి సవరణలకు అవకాశం ఇవ్వకుండానే బిల్లులను లోక్‌సభలో ఆమోదింపజేసుకుంది. అవే బిల్లులను రాజ్యసభలో ఆమోదం కొరకు యధాతథంగా ప్రవేశపెట్టడంతో అక్కడ మెజారిటీ సభ్యులు కలిగిన విపక్షాలు అడ్డుకున్నారు. రాజ్యసభ సభ్యుడు భూపేందర్ యాదవ్ నాయకత్వంలో 25 మందితో కూడిన సెలక్ట్ కమిటీని నియమించారు. ఈ కమిటీ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాల, ఆయా రాష్ట్రాలకు చెందిన బీసీ కమిషన్‌ల, న్యాయనిపుణులు, సామాజిక వేత్తలు, సామాజిక ఉద్యమకారుల అభిప్రాయాలను కోరింది. ఎలాంటి సముచిత సవరణలకు సిఫారసు చేయకుండానే సెలక్ట్ కమిటీ తన నివేదికను జులై 19, 2017న సమర్పించింది. కేంద్ర ప్రభుత్వం కూడా తన మంకు పట్టును నిలబెట్టుకోవాలనే ప్రయత్నం చేసిందే తప్ప, బిల్లులోని మెరిట్స్, డీమెరిట్స్ గురించి పట్టించుకోలేదు. ఎలాగైనా బిల్లును ఆమోదించుకోవాలనే తాపత్రయ పడింది. ఈ దశలో హైడ్రామా అనంతరం రాజ్యసభలో జులై 31న, 123వ రాజ్యాంగ సవరణ బిల్లులోని ప్రధాన భాగమైన క్లాజ్ -3 లేకుండానే ఆమోదం పొందింది.

తలలేని మొండెం చందంగా బీసీ కమిషన్ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందడం విడ్డూరంగానూ, వింతగానూ ఉంది. రాష్ట్రా ల యొక్క అధికారాలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం గుప్పిట్లోకి మారిపోతాయనీ, ఇది ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కల్పిస్తుందన్న వాదనలో స్పష్టమైన బలం ఉంది.

బిల్లులోని సెక్షన్ -3(9) ప్రకారం The Union and every State Government shall consult the commission on all major policy matters affecting socially and educationally backward classes.

తెలంగాణ రాష్ట్రం విషయానికి పరిమితమై పరిశీలించి నప్పుడు, బీసీల సమగ్ర వికాసం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమల్లోకి తెచ్చింది. జిఓ నెం.9 ద్వారా రాష్ట్రంలోని బీసీ జాబితాను పునఃసమీక్షించాలని కోరింది. వృత్తులను నవీకరించడానికి, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను, అత్యంత వెనుకబడిన వర్గాలను గుర్తించాలని సూచించింది. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఈ కార్యాచరణను ఒక పవిత్రయజ్ఞంలా కొనసాగిస్తున్నది. ఈ కార్యక్రమం పూర్తవడానికి సమయం పడుతుంది. ఈలోగా రాజ్యాంగబద్ధ కమిషన్ బిల్లు యధాతథంగా ఆమోదింపబడి చట్టం అయిన యెడల అప్పుడు జాతీయ బీసీ కమిషన్ పరిశీలనార్థం పంపించాల్సి ఉంటుందా? లేదా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవచ్చా? అనే అనుమానం వ్యక్తమవుతున్నది. ఇలాంటి అనేక అనుమానాలను, సంశయాలను, ఆందోళనలను సెక్షన్ 3(9) రేకెత్తిస్తోంది. ఇలాంటి వాటిపై కేంద్ర ప్రభుత్వం నివృత్తి చేయాల్సి ఉంది. ఆ దిశగా సానుకూలంగా చర్యలు చేపట్టాల్సి ఉంది. అలాకాకుండా ముందు బిల్లు ఆమోదింపచేసుకున్న అనంతరం సంబంధిత కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిక మంత్రిత్వ శాఖ ద్వారా నియమ నిబంధనలను రూపొందించుకొని అమలు చేసుకోవచ్చని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ సెలవివ్వడం విచిత్రంగా ఉంది. పార్లమెంటులో ఆమోదం పొందిన చట్టంను యధాతథంగా అమల్లోకి తేవాల్సి ఉంటుంది. అందుకు భిన్నంగా నియమ, నిబంధ నల ద్వారా ఇలాంటి సవరణలకు తావిచ్చి అమలు చేస్తామనడం ఎంతగా అనాలోచితమో, ఆచరణ యోగ్యం కాదో కేంద్ర ప్రభుత్వానికి తెలియదా? అనే చర్చకు దారివ్వడమే అవు తుంది.

-డా॥ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు
తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు



కన్నవారిని కాపాడుకుందాం

సమాజంలో వ్యవస్థీకృత బంధాల సంబంధాల వైఫల్యాలున్నాయి. ఇలాంటి వేళ విలువలను, సంస్కారాన్ని, మానవత్వాన్ని పెంచి పోషించాల్సి ఉంది. తల్లిదండ్రులు తమ సంతానానికి (అందించిన) కడుపులో పడ్డనాటి నుండి కట్టెకాలేదాక పడిన తపన. చేసిన కృషికి, పిల్లలు రుణం తీర్చుకోవడానికి ప్రతిఫలం ఈ సృష్టిలోనే లేదు. ఆధునిక జీవనశైలి, వ్యక్తిగత స్వేచ్ఛా జీవనానికి ప్రాధాన్యత ఇస్తూ కొందరు, ఖర్చులు భరించలేక సేవలు చేయలేక, పొట్టకూటికోసం బతుకు దెరువుకై వలసలు వెళ్లడాల వల్ల, వృద్ధ తల్లిదండ్రులు తమకు అండగా ఉంటారనుకుంటే? గొప్ప గొప్ప చదువులు చదివిన వారు సైతం ఉద్యోగాల పేరుతో ఊరు వదిలి వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు ఒంటరి జీవితాన్ని మిగిల్చుతుంది నిజం కాదా! కొందరైతే వృద్ధాశ్రమాల్లో చేర్చి, డబ్బులు కట్టి చేతులు దులుపుకుంటున్నారు. కొందరు పిల్లల్ని చిన్నప్పుడు అల్లారుముద్దుగా పెంచి పెద్దచేస్తే తల్లి చావు బతుకుల మధ్య జీవన పోరాటం చేసి పిల్లలు పెద్దవాళ్ళయ్యే కొద్దీ పెద్దలు పిల్లలవుతుంటారు. చిన్నప్పుడు బిడ్డల్ని ఎలా ఆడించి, లాలించి, పాలిచ్చి పెంచి పెద్ద చేశారో అలా తమను చూసుకోవాలని తల్లిదండ్రులు ఆశపడతారు. వారి ఆశలు వృద్ధాప్యంలో అనాథలుగా ఆశ్రమాల్లో ఉంటూ కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందని పిల్లలతో పేగు బంధాన్ని మరిచిపోలేక కని పెంచి పెద్ద చేసినా వారే పొమ్మంటు ఇళ్ళల్లో నానా ఇబ్బందులకు సూటిపోటి మాటలకు కొందరు గురవుతు న్నారు. సమాజంలో ఇంకొందరు తల్లిదండ్రులను ప్రేమానురాగాలతో చూస్తున్నారు. చాలామంది కనీస బాధ్యతలను మరిచి తల్లిదండ్రులను ఆస్తి పంచుకున్నట్టు పంప కాలు చేస్తున్నవారూ ఉన్నారు. మరి కొందరైతే తల్లిదండ్రులు చనిపోతే కడచూపు చూడడానికి రాని కఠినాత్ములు ఉన్నారు. మానవత్వం మంటగలిసి పట్టణీకరణ, ఆధునికీకరణ, ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంత దారుణంగా లేదు. కష్టసుఖాల కావడి మోస్తూ భోగభాగ్యాలవైపు చూస్తూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను కావడిలో మోసిన శ్రవణుడిని మనం ఆదర్శంగా తీసుకోవాలి అది కథ మాత్రమే కాదు మానవత్వం విలువలు, బాధ్యతలు దాగి ఉన్న వాస్తవం! విద్యావిధానంలో లోపాలు: మార్కుల వేటే తప్ప ఆట పాటలు, ఆత్మీయతలు సామాజిక స్పృహలేదాయె. విలువలు, సంస్కారం, ప్రేమానుబంధా లకు తావులేదాయె. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు విచ్ఛిన్నం లాంటి వాటివల్లే ఈ దుస్థితి. నీతి కథలు, పంచతంత్ర కథలు వేమన, సుమతి, భాస్కర శతకాలు పుస్తకాల్లో తగ్గిపోయాయి. ఈ తరానికి సరిగా ఆలోచించడం నేర్పాలి. చదువులు, జీవితం, సమాజం బంధాల గురించి చాలామందికి సరిగా ఆలోచించడం రావట్లేదు. ప్రేమానురాగాలు పెరగాలి. భారతీయుల బంధుప్రీతి, రక్తసంబంధాల గొప్పదనం ఈ తరానికి తెలియకపోతుంది నిజం కాదా! విద్యా విధానంలో వాటికి స్థానం పెంచాలి.ప్రభుత్వాలు వృద్ధులు, నిర్భాగ్యులు, అనాథ స్త్రీలు వంటి దారిద్ర్య రేఖకు దిగువనున్న వారికి పెన్షన్ పథకం ఇవ్వడం, వారి క్షేమాన్ని కోరుకోవడం అభినందనీయం. దీనితో పాటు సమాజంలో పెద్దవారిని, వృద్ధ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడంపై నెలకొన్న అమానవీయ విధానాన్ని రూపు మాపవలసిన బాధ్యత పాలకులపై ఉంది. ఆధునిక జీవనానికి వ్యక్తిగత స్వేచ్ఛ కోసం వృద్ధ తల్లిదండ్రులను ఆశ్రమాల్లో పెట్టడం ఉపేక్షించరాని నేరం. బయట సమాజానికి చెప్పుకోలేక కక్కలేక మింగలేక కన్నీళ్లను దిగమింగుతున్న వృద్ధుల జీవనంపై సర్వే నిర్వహించి స్వాంతన చేకూర్చాలి. బాధించే వారిలో పరివర్తన కలిగించాలి. మార్పురాని యెడల కఠిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కళాజాతల ద్వారా సమాజాన్ని చైతన్యపరచటానికి ప్రచారం నిర్వహించి, అవమానకర విధానాన్ని ఎండగట్టి వారు చేసే తప్పులను తెలియజేసి, ఆ తర్వాత చర్యలకు పూనుకోవడం ఎంతైనా అవసరం ఇలా చేయడం వలన వృద్ధాశ్రమాల ఊసే లేకుండా పోతుందనటంలో సందేహమే లేదు. దీనితో కుటుంబ సభ్యులు వారి పెద్దలను ఓదార్చడానికి పూనుకుంటారు.ఈ సమాజంలో ఆస్తికుడైనా, నాస్తికుడైనా మానవీయకోణం కలిగి, పరస్పర అభిప్రాయాలను గౌరవిస్తూ, సమాజాన్ని గౌరవించాలి. పెద్దరికానికి పెద్ద పీట వేయాలి, ఇది ఈ తరం యువతీ యువకులు ఆచరించాలి. ప్రపంచీకరణ, ఆధునికీకరణ సరళీకరణలంటూ వ్యక్తిగత స్వేచ్ఛ ముసుగులో తరతరాలుగా ఉన్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమైనది. బంధాలు, బంధుత్వాలు మొత్తం ఆర్థిక ప్రయోజనాలు, వ్యాపార ధోరణులతో పెనవేసుకొని పోయాయి. నేటి యువత అసాంఘిక కార్యక్రమాలవైపు వెళుతున్నారు. పాలకులు పాలనలో మానవీయ కోణాన్ని విలువలను, నైతికతకు ప్రాధాన్యతనిస్తూ పాలన సాగాలి. పెద్దలను గౌరవించేలా కన్నతల్లిదండ్రులకు సేవలు చేసేలా వారి బాగోగులు పట్టించుకోవాలి ఆశ్రమాల్లో చేర్చడం మాని, వారి సమస్యల పరిష్కారానికి పూనుకోవాలి. కుటుంబాలు, మనుషులు, బంధు త్వాల మధ్య అవగాహన పెంచుకొని, ఈ సమాజంలో వృద్ధ ఆశ్రమాలు లేని సమాజాన్ని ఏర్పర్చుకోవాలి. వ్యక్తులు మారాలి, వ్యవస్థను మార్చాలి. ఆదర్శాలే ఆలం బన కావాలి. జీవితం అంటే ఏమి అనుభవిస్తు న్నామనేది కాదు, ఎలా ప్రతిస్పం దిస్తున్నా మనేది ప్రధానం కావాలి. ఆనందానికి మించిన ఆరోగ్యం లేదు. సంతోషానికి మించిన సంపద లేదు. సేవకు మించిన పర్వం లేదు. ఏ పోరా టం చేయలేని వృద్ధుల సమస్య పరిష్కారానికి సమాజం, యువత, పాలకులే కదిలి ఆదర్శ సమాజాన్ని నిర్మించాలి.

-మేకిరి దామోదర్,
9573666650

తెలుగు రాష్ట్రాల్లో వృద్ధులు			
70 లక్షలు (అంచనా)	ఆసుపత్రుల్లో	53 శాతం	
వృద్ధాశ్రమాలు	600	బహిరంగ ప్రదేశాల్లో	14 శాతం
హైదరాబాద్‌లో	250	అల్లుళ్ళ వేధింపులు	19 శాతం
ప్రభుత్వ	4	సంతానం పట్టించుకోక	
(మిగిలిన ప్రైవేటు ఎన్జీవోలవి)		ఒంటరిగా ఉంటున్న వృద్ధులు	81
ఆకలితో బాధపడుతున్నవారు	55 శాతం	సంతానం లేని ఒంటరి వృద్ధులు	13
భర్తకోల్పోయిన వృద్ధురాళ్ళు	55 శాతం		
నిరక్షరాస్యులు	73 శాతం		
కంటిచూపు బాధితులు	12 శాతం		

(హెల్ప్ ఏజ్ ఇండియా సర్వే వివరాలు)

దేశాభివృద్ధే ప్రధాని సంకల్పం

● చైనా, పాక్ కుట్రలు చేస్తున్నాయి: దత్తాత్రేయ



హైదరాబాద్,ఆంధ్రప్రభ : దేశాన్ని అభివృద్ధిలో 2022 నాటికి ప్రపంచంలోనే అగ్రభాగాన నిలపాలన్నదే ప్రధాన మంత్రి నరేంద్రమోడి సంకల్పమని కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. పక్క దేశాలు ఎన్ని కుట్రలు చేసినా.. వాటిని ఎదుర్కొనే శక్తి మన దేశానికి ఉందని ఆయన ఉద్ఘాటించారు. దేశంలో పేదరికాన్ని నిర్మూలించే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమ 75వ వార్షికోత్సవం సందర్భంగా ఈఎస్ఐసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తిరంగ యాత్రను నిర్వహించారు. బాబుజగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ఈ యాత్రను దత్తాత్రేయ జెండా ఊపి ప్రారంభించగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ రాంచందర్‌రావుతో పాటు ఈఎస్ఐసీ మెడికల్ కళాశాల వైద్యులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ చైనా, పాకిస్తాన్ దేశాలు కలిసి మన దేశంలో చిచ్చు పెట్టాలని కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. దేశాన్ని ఉగ్రవాదరహిత దేశంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం నడుం బిగుస్తోందని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలో దశాబ్దాలుగా పాలించిన కాంగ్రెస్ అసమర్థత వల్లే సరిహద్దు గొడవలు ఇంకా కొనసాగుతున్నాయని, ఉగ్రవాదాన్ని అరికట్టడంలో విఫలమయ్యారని, తద్వార దేశంలో అస్థిర పరిస్థితులు ఏర్పాటుకు కారకులయ్యారని ఆయన విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాకనే ఉగ్రవాదంపై పోరాటం ప్రారంభమైందని ఆయన గుర్తు చేశారు.

రైతు ఆత్మహత్యలు పెరిగినందుకా అవార్డు?

● బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇంద్రసేనారెడ్డి

హైదరాబాద్,ఆంధ్రప్రభ : తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు వ్యవసాయాభివృద్ధికి కృషి చేసినందుకు అవార్డు ఇవ్వడంపై బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణలో అత్యధికంగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నందుకా..? ఈ అవార్డు అంటూ నిలదీశారు. సోమవారం ఆయన బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. టీఆర్ఎస్ ఈ మూడేళ్ల పాలనలో దాదాపు 3 వేలకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, రైతుల ఆత్మహత్యలు అరికట్టంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజక వర్గంలోనే అత్యధికంగా రైతుల ఆత్మహత్యలు జరిగాయన్నారు. రాష్ట్రంలోని రైతాంగానికి భరోసా కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతు సమస్యలపై కమిషన్ వేయాలని న్యాయస్థానాలు సూచించి ఏడాది గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కమిషన్ ఏర్పాటుతో రాష్ట్రంలోని రైతులు సమస్యలు కొంతమేరకైనా పరిష్కారం అవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

డిండి ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదు

● కల్వకుర్తి టన్నెల్ తగ్గింపులో మంత్రి పాత్ర: వంశీచంద్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తాము డిండి ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా నీరివ్వరాదనే తాము కోరుతున్నామని కాంగ్రెస్ పార్టీకి చెందిన కల్వకుర్తి ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి చెప్పారు. కల్వకుర్తి టన్నెల్, కాలువల స్థాయి తగ్గించడంలో మంత్రి జూపల్లి కృష్ణారావు హస్తం ఉందని ఆరోపించారు. సోమవారం శాసనసభ మీడియా పాయింట్‌లో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. పాలమూరు ఎత్తిపోతలపై చర్చకు రావాలని తాను మంత్రికి సవాల్ చేస్తే, తన సవాల్‌ను స్వీకరించలేదని విమర్శించారు. వాస్తవాలేంటో బహిరంగ చర్చ ద్వారా ప్రజలకు తెలిసేదని అన్నారు. తాను చేసిన సవాల్‌పై మంత్రి మాట్లాడకుండా టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలతో విమర్శలు చేయిస్తున్నారని ఆరోపించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఈ పథకం సాగు నీరిచ్చే పరిధిని 62 వేల ఎకరాల నుంచి 37 వేలకు కుదించారని విమర్శించారు. ఆయకట్టు కుదించారని తాను ఇప్పటికీ చెబుతున్నానని, కుదించలేదని చెప్పగలరా అని ప్రశ్నించారు. పాలమూరు ఎత్తిపోతల నుంచి నీరు తీసుకుపోవద్దని సీఎం కేసీఆర్‌కు జూపల్లి లేఖ రాయలేదని నిరూపించగలరా అని వంశీచంద్ ప్రశ్నించారు. కల్వకుర్తి టన్నెల్, కాలువల వెడల్పు తగ్గించడంలో కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. పాలమూరు ఎత్తిపోతలపై చర్చకు రావాలని శనివారం మంత్రికి వంశీచంద్ సవాల్ విసిరిన విషయం తెలిసిందే. 21 వ తారీఖు మధ్యాహ్నం వరకు చర్చకు రావాలని, సీఎల్పీ కార్యాలయంలో తాను సిద్ధంగా ఉంటానని సవాల్ చేశారు. ఈ మేరకు ఉదయం 11 గంటలకే వంశీచంద్ సీఎల్పీ కార్యాలయానికి వచ్చారు.

జాతీయ గీతాన్ని అవమానించిన

కాశ్మీరీ విద్యార్థుల అరెస్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జాతీయ గీతాన్ని అవమానపర్చిన ముగ్గురు వ్యక్తులపై హైదరాబాద్ రాజేంద్రనగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. జమ్మూ కాశ్మీర్‌కు చెందిన ఓమర్ ఫైజల్, ముదాబీఆర్ షబ్బీర్, జమునుగల్‌లు నగరంలోని రేతిబౌలిలో ఉంటున్నారు. చేవెళ్లలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నారు. ఆదివారం సాయంత్రం అత్తాపూర్‌లోని మంత్రామాల్ థియేటర్‌లో సినిమా చూడటానికి వెళ్లారు. సినిమా ప్రారంభానికి ముందు థియేటర్‌లో జాతీయ గీతం వస్తున్న సమయంలో ప్రేక్షకులందరూ లేచి నిలబడగా.. ఈ ముగ్గురు వ్యక్తులు కూర్చునే ఉన్నారు. తోటి ప్రేక్షకులు వారిని ప్రశ్నించగా దురుసుగా సమాధానమిచ్చారు. ఈ విషయం థియేటర్ నిర్వాకుల దృష్టికి తీసుకుపోగా.. వారు పోలీసుల సమాచారం ఇచ్చారు. రాజేంద్రనగర్ పోలీసులు ఆ ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని జాతీయ గీతాన్ని అవమానపర్చినందుకు కేసులు నమోదు చేశారు.

రూ. 18 లక్షల గంజాయి స్వాధీనం

● రైళ్లలో తనిఖీలు ముమ్మరం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైళ్లలో తనిఖీలను ముమ్మరం చేశారు, రైల్వే స్టేషన్‌లలో కూడా నిఘాను కట్టుదిట్టం చేశారు. గత కొంత కాలంగా ఆకస్మిక తనిఖీలు పెరిగాయి. గంజాయిని తరలించడంపైన ప్రధానంగా దృష్టికేంద్రీకరించారు. డ్రగ్స్ మాఫియా వ్యవహారాలను అరికట్టడానికి నిరంతరం తనిఖీలు కొనసాగిస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్‌ను తనిఖీ చేసి అక్రమంగా ఒడిసాలోని భాల్గా నుండి ముంబాయికి తరలిస్తున్న దాదాపు రూ. 18 లక్షల విలువైన 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇటీవలి కాలంలో ప్లాట్‌ఫామ్‌లపైన అహార కల్తీని అరికట్టడానికి కూడా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించారు. తెలంగాణ రోడ్డు భద్రత, రైల్వేస్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ టి. కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు నిరంతరం తనిఖీలు కొనసాగిస్తున్నామని సికింద్రాబాద్ రైల్వే పోలీసు జిల్లా ఎస్.పి. ఎస్.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ప్రయాణికుల భద్రత, గంజాయితో పాటు ఇతర మత్తు పదార్దాల అక్రమ తరలింపుపైన గట్టి నిఘా కొనసాగుతుందన్నారు.

సుధా అగ్రో ఇండస్ట్రీస్‌లో భారీ విస్ఫోటనం



● తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటలో ఘటన ● 30 మంది కార్మికులకు తీవ్ర గాయాలు ● 10 మంది పరిస్థితి విషయం



కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: సోమవారం తెల్లవారుఝామున రెండున్నర నుంచి మూడున్నర మధ్యలో తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం- సామర్లకోట పట్టణాల మధ్య ప్రధాన రహదారిని ఆనుకుని నున్న సుధా ఆగ్రో ఇండస్ట్రీస్ పరిశ్రమలో భారీ విస్ఫోటనం జరిగింది. వ్యవసాయ వ్యర్థాల్ని గరిష్ట ఉష్ణోగ్రతల్లో మండించడం ద్వారా వెలువడే ఆవిరిని హైడ్రోజన్‌తో మిళితం చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే క్రమంలో ఒత్తిడిని తట్టుకోలేక హైడ్రోజన్‌తో నిండున్న ట్యాంకర్ ఒక్కసారిగా పేలిపోయింది. భారీ శబ్దంతో జరిగిన ఈ పేలుడుకు పరిశ్రమలోనే కాక.. పరిసరాల్లోని వందలాది ఇళ్ళు బీటలువారాయి. ముప్పైమందికి పైగా కార్మికులు తీవ్రగాయాలపాలయ్యారు. వీరిలో పది మంది పరిస్థితి విషమంగా ఉంది. అయితే యాజమాన్యం ఈ వివరాల్ని బయటకు పొక్కనీయడంలేదు. అధికారుల్ని లోనికి రానీయడంలేదు. కనీసం అర్ధరాత్రి విధినిర్వహణలో ఉన్న కార్మికుల వివరాల్ని కూడా అందించడంలేదు. క్షతగాత్రుల్ని ప్రైవేటు ఆసుపత్రులకు పంపి రహస్యంగా చికిత్సనందిస్తున్నారు. సాక్షాత్తు ఉపముఖ్యమంత్రి, హోమ్‌మంత్రి చినరాజప్ప ప్రాతినిధ్యం వహిస్తున్న పెద్దాపురంలో ఒక బలమైన సామాజికవర్గానికి చెందిన ఈ సంస్థ యాజమాన్యానికి ప్రభుత్వ పెద్దలవద్దనున్న పలుకుబడి కారణంగా ఇంత భారీ విస్ఫోటనం జరిగినా ఎవరూ యాజమాన్యంపై చర్యలకు ఉపక్రమించడంలేదు. భారీ విస్ఫోటనం చేసుకుని హైడ్రోజన్ గ్యాస్ లీకైనా అధికారులు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. యాజమాన్యాన్ని అదుపులోకి తీసుకుని చట్టబద్ధంగా కేసులు నమోదు చేసి శిక్షించాలని ప్రజా సంఘాలు ఉద్యమానికి సిద్ధమౌతున్నాయి.

తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం, సామర్లకోట పట్టణాల నడుమ మూడు దశాబ్ధాలక్రితమే ప్రధాన రహదారినానుకుని సుధా ఆగ్రో ఇండస్ట్రీస్ అనే సంస్థ ఏర్పాటైంది. తొలుత తవుడు నుంచి వంటనూనెను ఇందులో ఉత్పత్తి చేసేవారు. క్రమంగా దీన్ని వ్యవసాయ వ్యర్థాల్నుంచి విద్యుత్ తయారీ పరిశ్రమగా మార్చేశారు. ఇలాంటి పరిశ్రమ జనావాసాల నడుమ పట్టణాల్ని అనుకుని అదీ ప్రధాన రహదారి వెంబడి ఏర్పాటు చేయడం సరికాదంటూ ఎందరో పర్యావరణ వేత్తలు, సామాజిక నిపుణులు ప్రభుత్వానికి ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేశారు. కానీ ఈ సంస్థ అధినేతలకు ప్రభుత్వం వద్దనున్న పరపతి కారణంగా అవన్నీ వీగిపోయాయి. ఇప్పటికే ఈ సంస్థలో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. కాగా ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దీర్ఘకాలంగా నిపుణులూహించినదే చోటు చేసుకుంది. సోమవారం తెల్లవారుఝామున రెండున్నరగంటల ప్రాంతంలో ఈ పరిశ్రమలో భారీ విస్ఫోటనం జరిగింది. ఓ పెద్దసైజ్ బ్రాయిలర్ పేలిపోయింది. అది తునాతునకలుగా విడిపోయింది. దాన్నుంచి వేరుపడ్డ ఇనుపముక్కలు, రజనుతో పాటు లోపల 1240సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో మండుతున్న వ్యవసాయ వ్యర్థాలు కూడా చుట్టుప్రక్కలకు శబ్దవేగంతో దూసుకొచ్చేశాయి. ఈ విస్ఫోటన ఒత్తిడికి పరిశ్రమలోని మరికొన్ని బ్రాయిలర్లు తునాతునకలయ్యాయి. లోపలున్న భవనాలు కుప్పకూలాయి. చుట్టూ ఉన్న ప్రహరీ బీటలు వారింది. పరిసరాల్లోని ఇళ్ళు కంపించిపోయాయి. కొన్ని ఇళ్ళకు పునాదుల్నుంచి నిలువునా బీటలుదీశాయి. లోపల పనిలో ఉన్న మూడు డజన్లమందికి పైగా తీవ్రగాయాలపాలయ్యారు. వారిలో 11మంది ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం. ఆ సమయానికి రోడ్డువెంబడి వెళ్తున్న వారిపైకి ఇనుపముక్కలు దూసుకుపోయాయి. చుట్టుపక్కల ఖాళీస్థలాలు, ఇళ్ళవద్ద కాపలాదార్ల శరీరాల్లోకి ఉక్కుముక్కలు దిగబడిపోయాయి. అంతా కొన్ని నిమిషాల వ్యవధిలోనే జరిగింది. అయితే అర్ధరాత్రి కావడంతో లోపల కార్మికులు పెద్దగా లేరు. అలాగే రోడ్డువెంబడి ప్రయాణికులు కూడా లేరు. అయితే యాజమాన్యం తన స్వయంసిద్ధ విధానాన్నే ఇప్పుడు కూడా అనుసరించింది. వెంటనే ప్రధాన గేటును మూసేసింది. పిట్టను కూడా లోనికి అనుమతించడంలేదు. కార్మికుల్తోపాటు దెబ్బతిన్న పరిసరవాసుల్ని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. అక్కడే చికిత్సలందిస్తున్నారు. ఉపముఖ్యమంత్రి, హోమ్ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప సమాచారం అందగానే ప్రమాద వివరాల్ని ఆరాతీశారు. ఆయనను సైతం లోనికి అనుమతించలేదు. ఇక రెవెన్యూ డివిజనల్ అధికారి విశ్వేశ్వరరావు, అగ్నిమాపక కేంద్రం, పరిశ్రమల శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తూతూ మంత్రంగా విచారణ జరిపి అక్కడ్నుంచి తిరిగెళ్ళిపోయారే తప్ప దీనిపై ఎటువంటి చర్యలు తీసుకునేది స్పష్టం చేయలేదు.

భూకంపం వచ్చిందనుకున్నాం: పరిసరవాసులు

అర్ధరాత్రి రెండున్నర తర్వాత భీకరశబ్దం రావడంతో భూకంపం వచ్చిందని బెంబేలెత్తిపోయినట్లు పరిసరవాసులు మీడియాకు వెల్లడించారు. ఒక్కసారిగా భారీ విస్ఫోటనం, ఆ వెనువెంటనే మంటలు, దట్టమైన పొగ, సుధా ఆగ్రోలో వ్యాపించాయని వారు మీడియాకు వెల్లడించారు. ఈ సంస్థకు పర్యావరణ శాఖ ఇచ్చిన అనుమతులకు కాలం చెల్లిపోయింది. పర్యావరణ శాఖ ఈ సంస్థకు ఈ ఏడాది మార్చి 31 వరకే అనుమతులిచ్చింది.ఆ తర్వాత సంస్థలో ఉత్పత్తులు నిలిపేయాలని ఆదేశించింది. అయినా వీటిని కూడా యాజమాన్యం పక్కనపడేసింది. ఈ పేలుడు వెనుక యాజమాన్యంపై కూడా అనేక సందేహాలు వ్యక్తమౌతున్నాయి. అర్ధరాత్రి సమయంలో ఓ పథకం ప్రకారమే దీన్ని అమలు చేశారన్న అనుమానాలు కూడా ఉన్నాయి. ఇన్సూరెన్స్ క్లైమ్ కోసం యాజమాన్యం ఈ విస్ఫోటనాన్నితామే ఏర్పాటు చేసుకునుంటుందంటూ ఒక రెవెన్యూ అధికారి చేసిన వ్యాఖ్యలు ఈ అనుమానాల్ని మరింత బలపరుస్తున్నాయి.

సమగ్ర కుటుంబ సర్వే వివరాలు బయటపెట్టండి

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల డిమాండ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కుటుంబ సమగ్ర సర్వే వివరాలను బయటపెట్టాలని, ఇళ్ళు, భూమిలేని వారికి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సమకూర్చాలని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. పేదలకు మూడెకరాల భూమి, అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణం చేపట్టాలని, స్థానిక సంస్థలకు బకాయి ఉన్న రూ.15వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అజ్మీరా రాజునాయక్‌కూడా పాల్గొన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ పాలన గ్రాఫిక్స్ ఊహా చిత్రాలు, ప్రచారాలు, ప్రకటనలతో నడుస్తున్నదని, ప్రభుత్వాన్ని పీఆర్‌వోలే నడిపిస్తున్నట్లు ఉన్నదని చంద్రశేఖరరెడ్డి అన్నారు. వీరు పంపే వార్తలు, ఊహాచిత్రాలే తప్ప పాలనలో క్రియాశీలత నెలకొందని ఆయన దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రోజుకో కొత్త పథకం, దానికి సంబంధించిన ఊహాచిత్రాలను విడుదల చేస్తూ ప్రజలను మధ్య పెడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. మత్స్య పరిశ్రమ 20వేల కోట్ల పెంచుతున్నామని సర్కార్ చెబుతున్న చేపలు, మొక్కలు లెక్కలు పెట్టడమంటే ఆకాశంలో నక్షత్రాలను లెక్కించడమేనని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజాధనం ఖర్చుచేసి సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారని ఇది ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతుందని ఆయన ప్రశ్నించారు. ఈ సర్వే వివరాలను కంప్యూటరీకరించి వాటి వివరాలను ఎందుకు బయటపెట్టడం లేదని ఆయన నిలదీశారు. ఇప్పుడు మళ్ళీ సమగ్ర భూ సర్వే అంటూ మరో సర్వేకు తెర తీస్తున్నారని అన్నారు.


మూడు నెలల్లోగా రుణవిమోచన కమిషన్

● రాష్ట్ర సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైతుల ఆత్మహత్యలు నివారించేనిమిత్తం వ్యవసాయ నిపుణులతో తెలంగాణ రాష్ట్ర రుణ విమోచన కమిషన్‌ను మూడు నెలల్లో ఏర్పాటు చేయాలని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. చిన్న రైతులు, వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం నిబంధనల మేరకు ఈ కమిషన్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్ వాదనలు వినిపిస్తూ రైతు రుణ విమోచన కమిషన్‌ను ప్రభుత్వం మూడు నెలల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచనల మేరకు కోర్టుకు హామీ ఇస్తున్నట్లు తెలిపారు. రాష్టంలో రైతుల ఆత్మహత్యలు నివారించేందుకు రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేసేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థిస్తూ భాజపా జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్. ఇంద్రసేనారెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వై. బాలాజీ వాదనలు వినిపిస్తూ కేవలం హామీ ఇచ్చినంత మాత్రాన సరిపోదని, తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. దీంతో ధర్మాసనం రైతు రుణ విమోచన కమిషన్‌ను మూడు నెలల్లో ఏర్పాటు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని పరిష్కరించింది.

నేరెళ్ల ఘటనపై మరో వ్యాజ్యం


కరీంనగర్ జిల్లా నేరెళ్ల గ్రామంలో దళితులపై పోలీసులు దాడి చేయడంపై హైకోర్టులో మరో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. నేరెళ్లలో కొందరు దళితులను పోలీసులు చిత్రహింసలకు గురి చేయడంపై ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్‌కు ఓ లేఖను రాశారు. ఆ లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. ఈ వ్యాజ్యంపై హైకోర్టు మంగళవారం



విచారణ చేపట్టే అవకాశం ఉంది. పోలీసుల దాడిలో గాయపడిన వారికి రూ.10 లక్షలు చెల్లించేలా తెలంగాణ సర్కారును ఆదేశించాలని జస్టిస్ చంద్రకుమార్ అభ్యర్థించారు. అలాగే బాధితుల కుటుంబ సభ్యుల ప్రకటనలను నమోదు చేయాలి. అలాగే బాధితుల ప్రకటనలను నమోదు చేసేలా జిల్లా అదనపు జడ్జీలను, చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేట్లను ఆదేశించాలి. విచారణను సంబంధిత సంస్థలకు అప్పగించేలా ఆదేశించాలని పిటిషనర్ హైకోర్టును అభ్యర్థించారు. నేరెళ్ల ఘటనపై ఇంతకు ముందే పౌరహక్కుల సంఘం నాయకుడు గడ్డం లక్ష్మణ్ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ప్రయాణికులకు 'తత్కాల్' భరోసా

● ముందు టిక్కెట్..తర్వాత డబ్బులు
● జాప్యం లేకుండా టికెట్ జారీ
● 14 రోజుల్లోగా డబ్బు చెల్లించాలి
● రద్దు చేసుకుంటే అదనపు చార్జీ



అమరావతి, ఆంధ్రప్రభ : రైల్వే ప్రయాణికులకు ఆ శాఖ సరికొత్త భరోసాను కల్పించింది. తత్కాల్ టిక్కెట్ల బుకింగ్‌లో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, మరింత వేగంగా ప్రయాణికులకు టిక్కెట్లను జారీ చేసేందుకు ఓ చక్కని వెసులుబాటును కల్పించింది. ముందు టిక్కెట్లను బుక్ చేసుకోండి..డబ్బులు తర్వాత చెల్లించండి అన్నదే ఆ అవకాశం.

బుకింగ్ ఇలా చేసుకోవాలి..

తత్కాల్ టిక్కెట్లను ఇంతకుముందు ఎలా బుక్ చేసుకున్నారో ఇకపైనా అదే విధంగా బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ముందుగా ప్రయాణం తేదీ, ఏ రైలు, తత్కాల్ ఆప్షన్లను ఎంపిక చేసుకున్న అనంతరం తర్వాత పేజీలో పేరు, వయసు తదితర వివరాలు ఇవ్వాలి. అనంతరం పేమెంట్ పేజీలోకి వెళ్లి, అక్కడ ఎడమ చేతివైపు ఉండే ఆప్షన్లలో పే ఆన్ డెలివరీ / పే లేటర్ అనే ఆప్షన్ ఉంటుంది. దాన్ని ఎంచుకుంటే బుకింగ్ ప్రక్రియ వేగంగా జరుగుతుంది. పే ఆన్ డెలివరీ / పే లేటర్ ఆప్షన్ సెలక్ట్ చేసుకున్న తర్వాత పే ఆన్ డెలివరీ (పవర్డ్ బై ఆండ్యూరిల్ టెక్నాలజీస్) అని ఒక ఆప్షన్ వస్తుంది. ఈ పే లేటర్ (పవర్డ్ బై అర్థశాస్త్ర ఫిన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్) పేరుతో మరో ఆప్షన్ ఉంటుంది. వీటిలో పే ఆన్ డెలివరీ ఆప్షన్ ఎంచుకుంటే మీ ఇంటికే తత్కాల్ టిక్కెట్ తీసుకొచ్చి ఇస్తారు.

అప్పటికప్పుడు నగదు లేదా కార్డు ద్వారా చెల్లించాలి. అలా కాకుండా ముందు టిక్కెట్ బుక్ చేసుకుని తర్వాత డబ్బులు చెల్లించాలనుకుంటే ఈపే లేటర్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. పే ఆన్ డెలివరీ ఆప్షన్ ఎంచుకుంటే మేక్ పేమెంట్ ఆప్షన్ ను ఓకే చేయాలి. అప్పుడు తర్వాత పేజీ వెళుతుంది. చిన్న విండోలో నిబంధనలు దర్శనమిస్తాయి. అవన్నీ చదివి అర్థం చేసుకుని ఓకే చెబితే తర్వాత పేజీలో ప్రొఫైల్ వివరాలు, చిరునామా వివరాలు ఉంటాయి. ఏ చిరునామాకు డెలివరీ చేయాలన్నది అడ్రస్ డిటైల్స్‌లో ఇవ్వాలి. ప్రొఫైల్ డిటైల్స్‌లో ఫోన్ నెంబర్, మెయిల్ ఐడీ,పేర్ల వివరాలు ఇవ్వాలి. ఈ వివరాలు ఒక్కసారి ఇస్తే సరిపోతుంది. ఆ తర్వాత నుంచి ఈ తరహా బుకింగ్ సమయంలో మొదటిసారి ఇచ్చిన వివరాలు తీసుకుంటుంది. టిక్కెట్ బుక్ అయిన వెంటనే పీఎన్ఆర్ వివరాలతో ఈ టిక్కెట్ ఎస్ఎంఎస్, ఈ మెయిల్‌కు వచ్చేస్తుంది. ఫిజికల్ కాపీని ఇంటికే పంపిస్తారు. అప్పుడు డబ్బులు చెల్లించాలి. చెల్లించేందుకు నిరాకరిస్తే క్యాన్సిలేషన్ ఛార్జీలు వసూలు చేస్తారు. విఫలమైతే అకౌంట్ డీ యాక్టివేట్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఒక వేళ ప్రయాణం రానున్న 24 గంటల్లోపు ఉంటే ఈ మెయిల్ కు వచ్చే పేమెంట్ లింక్ ద్వారా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆ లోపు డెలివరీ సాధ్యంకాదు గనుక. ఇంటికే వచ్చి డబ్బులు తీసుకోవడం అన్నది బుకింగ్ తర్వాత 24 గంటల నుంచి 72 గంటలలోపు ఉంటుంది. ప్రయాణం తేదీ లోపు డబ్బులు చెల్లించకపోతే టిక్కెట్ రద్దవుతుంది. క్యాన్సిలేషన్ చార్జీలు చెల్లించాలి. రిఫండ్ అమౌంట్ వచ్చుదుంటే బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు.ఈ పే లేటర్‌ఆప్షన్ లో టిక్కెట్లను అప్పటికప్పుడు బుక్ చేసుకోవచ్చు. డబ్బులను తర్వాత 14 రోజుల్లోపు చెల్లించాలి. ఇందుకుగాను మొత్తం టిక్కెట్ విలువలో 3.5 శాతం చార్జీని అదనంగా వసూలు చేస్తారు. ఈ సదుపాయాన్ని అర్థశాస్త్ర ఫిన్ టెక్ అనే సంస్థ సహకారంతో ఐఆర్ సీటీసీ అందిస్తోంది. బుకింగ్ తర్వాత ఈ మెయిల్‌కు పేమెంట్ లింక్ వస్తుంది. ఆ లింక్ ద్వారా 14 రోజుల్లో డబ్బు చెల్లించొచ్చు. డబ్బు చెల్లించడంలో విఫలమైతే ఆ నగదు మొత్తంపై 36 శాతం వార్షిక వడ్డీ ప్రకారం వసూలు చేస్తారు. ఐఆర్ సీటీసీ ఖాతాను కూడా డీయాక్టివేట్ చేస్తారు.

నేడు కృష్ణా రివర్ బోర్డు సమావేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశాన్ని ఈ నెల 22న నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సారి అమరావతిలో ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు బోర్డు అధికార వర్గాలు తెలిపాయి. జూన్ ప్రారంబం నుంచి 2017-18 నీటి సంవత్సరం ప్రారంబమయ్యాక తొలిసారి పూర్తిస్థాయిలో బోర్డు కీళకసమావేశం ఏర్పాటు చేస్తోంది. ఈ సమావేశంలో ఈ ఏడాది జూన్ నుంచి కృష్ణా నదిలో నీటి ప్రవాహాలు, జూరాల , శ్రీశైలం, నాగార్జున సాగర్ పులిచింతల తదితర ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిలువలు , ఈ ఏడాది ఇప్పటివరకూ చేరిన కొత్త నీటి వివరాలు తదితర అంశాలను బోర్డు సమావేశంలో చర్చించనున్నారు. అంతే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నీటి అవసరాలపై కూడా చర్చించనున్నారు. కృష్ణా నదిపై ఉన్న ప్రధాన ప్రాజెక్టుల వద్ద తొలిదశ టెలిమీటర్ల ఏర్పాటు అంశం కూడా అజెండాలో చేర్చారు. కృష్ణారివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు లోగోను కూడా ఈ సమావేశంలో చర్చించి ఎంపిక చేయనున్నారు. అదేవిధంగా బోర్డు నిర్వహణకు సంబంధించిన నిధుల ఏర్పాటుపై కూడా సమావేశంలో చర్చకు రానుంది.

ఈసీకి టీడీపీ ఎంపీల ఫిర్యాదు

● రాష్ట్ర ఎన్నికల అధికారి పక్షపాత వైఖరి
● మా ఫిర్యాదులపై స్పందన లేదు
● వైకాపా ఫిర్యాదులపై మాత్రమే చర్యలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : నంద్యాల ఉప ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి భన్వర్ లాల్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని తెలుగుదేశం పార్టీ ఎంపీలు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేశారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను కలిసి 7 పేజీల ఫిర్యాదును అందజేశారు. ఎంపీలు కింజారపు రామ్మోహన్ నాయుడు, మాల్యాద్రి సంతకాలతో కూడిన ఈ ఫిర్యాదులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతో సహా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి భన్వర్ లాల్ వివక్షాపూరితంగా వ్యవహరిస్తున్నారని కూడా పేర్కొన్నారు. నోటరీ లైసెన్సు ముగిసిపోయినవారి సంతకంతో వైకాపా అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలను ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఆమోదించారని ఫిర్యాదు చేశారు. అలాగే ఎన్నికల ప్రచారం సందర్భంగా వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి తమ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును నడిరోడ్డుపై కాల్చి చంపినా తప్పులేదని చేసిన వ్యాఖ్యల గురించి కూడా ప్రస్తావించారు. వీటిపై తాము రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు.

అలాగే వైకాపా నేతలు, కార్యకర్తలు బహిరంగంగా ఓటర్లను ప్రలోభపెడుతూ డబ్బులు పంచుతున్నారని, దీనిపై స్థానిక పత్రికల్లో ఫొటోలతో సహా ప్రచురితమైన కథనాలను ఆధారాలుగా చూపుతూ రిటర్నింగ్ అధికారికి, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేశామని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వైకాపాకు చెందిన పత్రిక, టీవీ ఛానెళ్లలో తమ ముఖ్యమంత్రిపై ఇష్టా రీతిన కథనాలు ప్రసారం చేస్తున్నారని, వాటిపై కూడా తాము ఫిర్యాదు చేశామని తెలిపారు. అయితే తామిచ్చిన ఏ ఫిర్యాదుపైనా ఎన్నికల ప్రధానాధికారి స్పందించకపోగా, వైకాపా నేతలు తెలుగుదేశం పార్టీపై ఇచ్చిన తప్పుడు ఫిర్యాదులకు స్పందించి చర్యలు తీసుకుంటున్నారని ఆనంతరం ఎంపీలు మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. డీఎస్పీని బదిలీ చేయడం, సర్వేలు జరపకుండా నిషేధం విధించడం ఇందులో భాగమేనని రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ అన్నారు. భన్వర్ లాల్ ఏకపక్షంగా, పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పారదర్శకంగా, నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలని తాము కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్టు ఎంపీలు తెలిపారు.

నేరెళ్ల దాష్టీకంపై నివేదిక

● సీఎస్‌కు జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేరెళ్లలో పోలీసుల దాష్టీకంపై జాతీయ ఎస్సీ కమిషన్ స్పందించింది. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , డీజీపీని ఆదేశించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సాధ్యమైనంత త్వరగా నివేదిక సమర్పించాలని కోరింది. నేరెళ్లలో నలుగురు దళితులపై ఎస్పీ విశ్వజిత్ నేతృత్వంలో పోలీసులు ఐదు రోజుల పాటు చిత్రహింసలకు పాల్పడడం, ప్రైవేట్ విభాగాలపై కరెంట్ షాక్ విధించి హింసించడంపై ఎఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ డాక్టర్ రామచంద్ర కుంతియా నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదుపై స్పందించి ఎస్సీ కమిషన్ నివేదికను కోరింది.

నేరెళ్ల ఘటనపై సీబీఐ విచారణ

● రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

హైదరాబాద్/సోమాజిగూడ, ఆంధ్రప్రభ : నేరెళ్లలో దళితులు, బలహీన వర్గాలపై పోలీసులు ప్రయోగించిన థర్డ్‌డిగ్రీ ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని వివిధ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఘటనకు పాల్పడిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సామాజిక తెలంగాణ కోసం ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ వర్గాలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ జేఏసి చైర్మన్ గజ్జెల కాంతం అధ్యక్షతన సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ నెల 31న అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాలతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 2న ఢిల్లీలో రాష్ట్రపతి, హోం మంత్రి, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అదే నెలలో నిజాం కాలేజీలో బహిరంగ సభను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గజ్జెల కాంతం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దొరల పెత్తనం సాగుతోందని ఆరోపించారు. నేరెళ్ల ఘటనలాంటి సంఘటనలు గతంలో ఎన్నడూ చూడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గడచిన మూడు సంవత్సరాలలో ఇసుక లారీల వల్ల 43 మంది చనిపోయిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతే అంటూ అహంకారపూరితంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారని, 8 మంది తెలంగాణ ఉద్యమ కారులపై అక్రమ కేసులు పెట్టించారని కాంతం విమర్శించారు. బాధిత కుటుంబంపై పెట్టిన కేసులు ఎత్తివేసి.. రూ. 25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘాల జేఏసీ చైర్మన్ ఓరు గంటి వెంకటేశం, ఓయూ జేఏసీ నాయకులు అంజిబాబు, కొమ్ము తిరుపతి, శంకర్, మేడి మహేశ్, సంజీవ్‌నాయక్, సుద్దాల లక్ష్మణ్ తదితరులు మాట్లాడారు.

రైళ్ల భద్రతపై ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సురక్షితమైన రైలు ప్రయాణం అత్యంత ప్రధానం అని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. జోన్ పరిధిలో భద్రతపైన ఆయన సోమవారం సంబంధిత ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. భద్రత విషయంలో అన్ని ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. నిర్లిప్తతకు తావు లేదన్నారు. రాబోవు రోజులను దృష్టిలో ఉంచుకొని నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలనలు జరపాలనీ, తనిఖీలు నిర్వహించాలని, సమన్వయంతో వ్యవహరించవలసి ఉంటుందని సూచించారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డిఆర్ఎంలతో పాటుగా రైల్ నిలయంలోని ఉన్నతాధికారులకు కూడా సమీక్షలో పాల్గొన్నారు. అన్ని విభాగాల్లో భద్రత పైన సమీక్షలో చర్చించారు. పెట్రోలింగ్, మానిటరింగ్ నిరంతర ప్రక్రియగా కొనసాగాలన్నారు. జోన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సంబందిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దిష్టకాల వ్యవధిలో పనులు పూర్తి కావలసి ఉందని ఆదేశించారు.

సికింద్రాబాద్ - హౌరా మధ్యన ప్రత్యేక రైలు

సికింద్రాబాద్ నుండి హౌరాకు ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలు ఈ నెల 22న 17.55 గంటలకు సికింద్రాబాద్ నుండి బయలుదేరనుందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ రైలు తిరుగు ప్రయాణంలో హౌరా నుండి 25వ తేదీన 01.05 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 04.00 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందన్నారు. మార్గమధ్యలోని అన్ని ప్రధానమైన స్టేషన్‌లలో ఈ రైలును ఒకటి, రెండు నిమిషాలు పాటు నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. బెంగుళూరు - హౌరా మధ్యన ఈ నెల 22, 24 తేదీలలో తిరిగే ప్రత్యేక రైలులో అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకొనేందుకు బెర్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బెంగుళూర్ - హౌరా మధ్యన నాలుగు ప్రత్యేక రైళ్లు

బెంగుళూరు - హౌరా మధ్యన నాలుగు ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నారు. ఈ రైళ్లు బెంగుళూరు నుండి హౌరాకు ఈ నెల 22న బయలుదేరి తిరుగు ప్రయాణంలో హౌరా నుండి 27 తేదీన బయలుదేరనుంది. హౌరా - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు హౌరాలో 24న బయలుదేరనుంది. అదే విధంగా బెంగుళూరు - హౌరా ప్రత్యేక రైలు 23న బెంగుళూరులో బయలుదేరుతుంది.

కూరగాయల విస్తీర్ణం పెంచండి

- వ్యవసాయ కమిషనర్ పార్థసారథి అధికారులకు ఆదేశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో కూరగాయల విస్తీర్ణం, ఉత్పత్తి పెంచాలని ఉద్యాన, మార్కెటింగ్ శాఖాధికారులతో వ్యవసాయ కమిషనర్ సి.పార్థసారధి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న కూరగాయల ధరల దృష్ట్యా సోమవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ధరలపై తక్షణం తీసుకోవలసిన చర్యలు, భవిష్యత్ ప్రణాళికలు, వాటిపై తగిన సూచనలు చేశారు. పార్థసారధి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇప్పటికే మన కూరగాయలు పథకం కింద రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, నల్గొండ జిల్లాల పరిధిలో 128 గ్రామాలను గుర్తించి 48 సేకరణ కేంద్రాలు ఏర్పాటుచేసి బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌కు అనుసంధానంచేసి మార్కెటింగ్ శాఖ విజయవంతంగా కార్యక్రమం అమలు చేస్తున్నది. ఈ గ్రామాలలో ప్రస్తుతం సాగు చేస్తున్న కూరగాయల విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకత పెంచడంతో పాటు మార్చి నుండి ఆగస్టు వరకు కొరత ఉన్న కూరగాయలను గుర్తించి వాటి నిరంతర సాగు, సరఫరా జరిగేలా ఉద్యానశాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలు అనుసంధానం చేస్తూ ఉద్యానశాఖ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఉద్యానశాఖ కమిషనర్ ఎల్.వెంకట్రామిరెడ్డి, మార్కెటింగ్ శాఖ అధికారి లక్ష్మీబాయి ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం, మచిలీపట్నం, చిత్తూరు ఉద్యోగులకు అలవెన్స్ పెంపు


హైదరాబాద్, ఆంధ్రప్రభ : శ్రీకాకుళం, మచిలీపట్నం, చిత్తూరు జిల్లా కేంద్రాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీపి కబుతు అందించింది. ఈ మూడు జిల్లాల్లో పనిచేస్తున్న 35వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటిఅద్దె, అలవెన్స్‌లు 14.5 శాతం నుంచి 20 శాతానికి పెంచుతూ ఫైలుపై సీఎం చంద్రబాబు సోమవారం సంతకం చేశారు. పెంచిన ఇంటిఅద్దె, అలవెన్స్‌కు సంబంధించిన ఉత్తర్వులు ఒకటి, రెండు రోజుల్లో వెలువడే అవకాశం ఉంది.

జగన్‌పై ఈసీకి టీడీపీ ఫిర్యాదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపైన అసత్యపు ఆరోపణలు చేశారని టీడీపీ నాయకులు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. జగన్ తన ఎన్నికల ప్రాచారంలో సీఎం చంద్రబాబును, టీడీపీ నేతలను కించపరిస్తూ విమర్శలు చేశారని ఆరోపించారు. తనకు చెందిన సాక్షి పత్రికలో కూడా అసత్యపు ఆరోపణలతో చంద్రబాబును విమర్శిస్తూ కథనాలు రాశారని ఆరోపించారు. అన్నింటినీ పరిశీలించి జగన్‌పై ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద తగు చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎంపీలు కొనకళ్ల నారాయణ, కేశినేని శ్రీనివాస్ ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారికి ఫిర్యాదు చేశారు.

పేరుకే ఆన్‌లైన్... బ్రోకర్లదే హవా

- ఆర్టీఏలో కొనసాగుతున్న అక్రమాల పరంపర • నేరుగా వెళ్తే నిరీక్షణే... బ్రోకర్ల ద్వారా క్షణాల్లో పనులు • అధికారుల తీరుపై వాహనదారుల ఆగ్రహం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్టీఏ కార్యాలయాల్లో ఇప్పటికీ బ్రోకర్లే రాజ్యమేలుతున్నారు. ప్రతి ఆర్టీఏ కార్యాలయం సమీపంలో పది నుండి 15 వరకు బ్రోకర్ల కార్యాలయాలు కొనసాగడమే అందుకు నిదర్శనం. తెలంగాణ ప్రభుత్వం 57 రకాల రవాణా సేవలను ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తెచ్చినట్టు ప్రకటించింది. దరఖాస్తుదారులు ఆన్‌లైన్లో స్లాట్ బుక్ చేసుకొని నిర్దేశించిన సమయానికి వచ్చిన పక్షంలో వెంటనే పని అయిపోతుందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే వాస్తవాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. అర్టీఏ కార్యాలయాల్లో కొన్ని ముఖ్యమైన సేవలకు కౌంటర్లను ఏర్పాటు చేశారు. ప్రతి పనికి ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న వాహనదారులు సంబంధిత కౌంటర్ వద్ద క్యూలో నిలబడి దరఖాస్తులను అందచేయవలసి ఉంటుంది. కానీ ఈ క్యూలలో దరఖాస్తుదారులకంటే కూడా బ్రోకర్‌లే ఎక్కువగా కనిపిస్తారు. వారి వెంట అవసరమైతే దరఖాస్తుదారు ఉంటారు. బ్రోకర్ ముఖం చూసిన వెంటనే కౌంటర్‌లోని సిబ్బంది చకచకా పనులు చేసిపెడుతుంటారు. అదేమిటని అడిగితే బ్రోకర్ ద్వారా అందే దరఖాస్తులు నిబంధనల మేరకు అన్ని పత్రాలను జత చేసి ఉంటాయని సిబ్బంది వెల్లడించడం గమనార్హం. డ్రైవింగ్ లైసెన్స్ పొందడం, రెన్యూవల్ చేసుకోవడం, కొత్త వాహనం రిజిస్ట్రేషన్, రుసుములు చెల్లించడం ఇప్పటికీ బ్రోకర్ల కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. స్లాట్ బుక్ చేయడం మొదలుకొని క్యూలో నిలబడి దరఖాస్తును సమర్పించడం వరకు బ్రోకర్లతోనే పనులు జరిగిపోతున్నాయి. గంటలతరబడిక్యూలో నిలబడి కౌంటర్‌లోని సిబ్బంది వేసే కొర్రీలతో బిక్కమొఖం వెసుకొని వెనుదిరుగుడు ఎందుకులే అనుకునే వారు బ్రోకర్లను ఆశ్రయించి పనులు చక్కబెట్టుకుంటున్నారు. క్యూలో నిలబడి పనులు చేయించుకోవాలనుకునే వారికి ఆర్టీఏ సిబ్బంది ఏవో కుంటి సాకులు చెపుతూ చుక్కలు చూపిస్తున్నారు, ఆఖరికి హెల్ప్ డెస్క్‌లో ఉండే సహాయకులు కూడా బ్రోకర్లను సంప్రదించమని సూచించడం గమనార్హం. డ్రైవింగ్ టెస్టుకు వెళ్లాలన్నా, కొత్త వాహనం రిజిస్ట్రేషన్ కోసం తనిఖీలు చేయించాలన్నా బ్రోకర్ హస్తం అనివార్యం అనే భావన కలిగిస్తున్నారు. అన్ని సేవలను అన్‌లైన్ చేశామని ప్రకటించిన ప్రభుత్వం ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ బ్రోకర్ల కార్యాలయాలను ఎందుకు అనుమతిస్తుందనే ప్రశ్నకు అధికారుల నుండి సమాధానం రావడం లేదు. నిబంధనలను సాకుగా చేసుకొని అధికారులు, బ్రోకర్లు అన్‌లైన్ వ్యవస్థను అపహస్యం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్లాట్ బుక్ చేసుకొని నిర్దేశించిన సమయానికి కార్యాలయాలకు వెళ్లిన దరఖాస్తుదారులకంటే కూడా బ్రోకర్ వద్ద అన్‌లైన్‌లో స్లాబ్ బుక్ చేసుకునే వారి పనులు అతి త్వరగా జరిగిపోతున్నాయి, బ్రోకర్లు ఒకొక్క సేవకు ఒకొక్క రుసుము వసూలు చేస్తున్నారు. తాము వసూలు చేసే సేవా రుసుములో సిబ్బందికి వాటా కూడా ఉంటుందని వారు బాహాటంగానే వెల్లడిస్తున్నారు. బ్రోకర్లను కార్యాలయం లోనికి అనుమతించడం లేదని అధికారులు చేస్తున్న ప్రకటనల్లో వాస్తవం లేదని, జంటనగరాల్లోని అన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో బ్రోకర్ల మాటే చెల్లుబాటు అవుతుందని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. హెల్ప్ డెస్కులను పటిష్టం చేయాలని, సరైన మార్గ నిర్దేశం చేసే వారిని హెల్ప్ డెస్కులో నియమించాలని, అవసరమైతే హెల్ప్‌డెస్కులోనే నామ మాత్రం రుసుముతో స్లాట్ బుక్ చేసుకొనే వెసులుబాటు కల్పించాలని వారు కోరుతున్నారు.

తెలుగుదేశం ప్రలోభాలను అడ్డుకోండి

- ఈసీకి వైకాపా ఫిర్యాదు


హైదరాబాద్, ఆంధ్రప్రభ: నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ నేతలు ఓటర్లను ప్రలోభపెడుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ ఫిర్యాదు చేసింది. సోమవారం ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాను కలిసిన వైకాపా నేతలు ఫిర్యాదు పత్రం అందచేశారు. నంద్యాలలో విచ్చల విడిగా డబ్బు పంపిణీ చేస్తూ ఓటర్లను టీడీపీ నేతలు ప్రలోభ పెడుతున్నట్టు ఆరోపించారు. అందుకు సంబంధించిన సాక్ష్యాలతో కూడిన సీడీనికూడా అందచేశారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల్లోని మహిళలను రోజరమణి, మీరాకుమారి ప్రలోభపెడుతున్నారని వారిని ఉద్యోగాలనుంచి వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అంతే కాకుండా కొందరు పోలీసులు, రెవెన్యూ అధికారులు కూడా తెలుగుదేశంపార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్టు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ప్రధానాధికారి భన్వర్‌లాల్‌కు వైకాపా నేతలు శివకుమార్ , భాస్కర్ రెడ్డి, గోపాలాచారి, డా.మురళీధర్ రెడ్డి తదితరులు విజ్ఞప్తి చేశారు.

నేడు బ్లాక్ డేగా పాటిస్తున్నాం

- ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వేతన స్కేళ్లకై నియమించిన ప్రొఫెసర్ చౌహాన్ కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ అండ్ కాలేజ్ టీచర్ల ఆర్గనైజేషన్ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం దేశ వ్యాప్తంగా బ్లాక్ డేగా పాటిస్తున్నట్టు తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కాలేజీల లెక్చరర్ల అసోసియేషన్ ప్రకటిచింది. తెలంగాణ వ్యాప్తంగా బ్లాక్ డేగా పాటిస్తున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏ సంజీవయ్య, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ప్రొఫెసర్ చౌహాన్ కమిటీ తన నివేదికను ఫిబ్రవరిలోనే ప్రభుత్వానికి సమర్పించినప్పటికీ ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం ఆ కమిటీ నివేదికను బహిరంగ పర్చలేదన్నారు. కమిటీ సిఫారసులను అమలు చేయడం లేదని వారు విమర్శించారు. నూతన పేస్కేళ్లను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా దేశ వ్యాప్తంగా బ్లాక్ డేను పాటిస్తున్నట్టు వారు తెలిపారు. అందులో భాగంగా నేడు తెలంగాణలోనూ బ్లాక్ డేను పాటిస్తున్నట్టు సంజీవయ్య, సురేందర్‌రెడ్డి తెలిపారు.

మొక్కజొన్న పరిశోధనలపై సదస్సు



రాజేంద్రనగర్,కెఎన్ఎన్: మొక్క జోన్న పంట సాగు, పరిశోధనలపై గత ఐదేళ్లుగా జరుగుతున్న కార్యక్రమాలపై రెండు రోజుల పాటు జరిగే దక్షిణ మండల సమీక్షా సమావేశం సోమవారం రాజేంద్రనగర్‌లో ప్రారంభమైంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత వ్యవసాయ పరిశోధనా మండలి, భారత మొక్కజొన్న పరిశోధనా సంస్థసంయుక్తంగా రాజేంద్ర నగర్‌లోని విస్తరణ విద్యాసంస్థలో నిర్వహిస్తోన్న రెండు రోజుల సమావేశానికి అఖిల భారత సమన్వయ పథకం దక్షిణ మండలానికి చెందిన పరిశోధనా సంస్థల శాస్త్రవేత్తలు హాజరయ్యారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, శాంతినికేతన్‌లోని విశ్వవిద్యాలయం ఉపకుపలతి డాక్టర్ దత్తా నేతృత్వంలోని కమిటీ సమీక్షిస్తోంది. కోయంబత్తురు, వర్గాయ్, హైదరాబాద్, కరీంనగర్, కొల్హాపూర్ రాహూరి, ధార్వాడ్, మాండ్యాల్లోని మొక్కజొన్న పరిశోధనా పథకాల శాస్త్రవేత్తలు గడిచిన ఐదేళ్లుగా ఆయా ప్రాంతాల్లో జరిపిన పరిశోధనలు, నూతన వంగడాల రూపకల్పన, విత్తనాభివృద్ధి వంటి పలు అంశాలను కమిటీ ముందు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజిరెడ్డి, డాక్టర్ శర్మ, డాక్టర్ సెయిన్‌దాస్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ హాలవత్, డాక్టర్ సుజయ్ రక్షిత తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం వ్యాన్ లూటీ

జైపూర్: రాజస్థాన్‌లోని బిల్‌వారా జిల్లాలో ఏటీఎం క్యాష్ డెలవరీ వ్యాన్ నుంచి గుర్తు తెలియని దుండగులు రూ. 57 లక్షలు అపహరించారు. ఈ సంఘటన రాష్ట్ర రాజధాని జైపూర్‌కు సమీపంలోని బిల్‌వారాలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ఏటీఎంలో డిపాజిట్ చేయాల్సిన డబ్బును జిల్లా కేంద్రంలోని కోర్టు సమీపంలో దుండగులు ఎత్తుకెళ్ళినట్లు స్థానికులు వెల్లడించారు. ఏటీఎంకు వెళ్ళే దారిలో వాహనం టైర్ పంక్చర్ అయింది. ఇదే అదునుగా భావించిన దుండగులు సిబ్బంది టైర్ పంక్చర్ చేస్తున్న సమయంలో రూ. 57 లక్షలను అపహరించారు. ఈ విషయంపై బిల్‌వారా జిల్లా ఎస్పీ ప్రదీప్ మోహన్ శర్మ స్పందించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధ్యయనం చేస్తున్నామన్నారు. ఏటీఎం నిలిపిన ప్రదేశానికి సమీపంలో గల సీసీటీవీ పుటేజీలను పరిశీలిస్తున్నామన్నారు. ఇప్పటికే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు.

నేడే నంద్యాల పోలింగ్

- భద్రతపై ప్రత్యేక నిఘా
- ఎన్నిక ప్రక్రియ వీడియో చిత్రీకరణ
- కేంద్ర పారా మిలటరీ బలగాల పహారా
- 110 పోలింగ్ కేంద్రాలు
- 255 పోలింగ్ బూత్‌లు
- సమస్యాత్మకం - 71
- అత్యంత సమస్యాత్మకం - 104

నంద్యాల, కెఎన్ఎన్: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నిక పోలింగ్ భద్రతపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. అధికార ప్రతిపక్షాలు ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఉప పోరు హోరాహోరీగా సాగుతోంది. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో ముగించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను చేస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టిపెట్టడంతో రాష్ట్రఎన్నికల సంఘం ఎన్నికల పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసింది. జిల్లా ఎస్పీ గోపీనాథ్ జెట్టికి అదనంగా చిత్తూరు, ప్రకాశం, విశాఖ జిల్లాల ఎస్పీలు రాజశేఖర్‌బాబు, సత్య యేసుబాబు, రాహేల్ వర్మలను ఉప ఎన్నికలకు ప్రత్యేకంగా నియమించారు. ఐదుగురు అడిషనల్ ఎస్పీలతోపాటు 30 మంది డిఎస్పీలు, 70 మంది సీఐలు, 200లకుపైగా ఎస్సైలతోపాటు వందల సంఖ్యలో కానిస్టేబుళ్ళను ఎన్నికల విధులకు నియమించారు. ప్రచార పర్వం ముగియడంతో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అధికార యంత్రాంగం సిద్ధం అవుతోంది. జిల్లా కలెక్టర్ సత్యనారాయణ, జిల్లా ఎస్పీ గోపీనాథ్‌జెట్టిలు ఎన్నికల ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉప ఎన్నికల రిటర్నింగ్ అధి కారి ప్రసన్న వెంకటేష్ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలతోపాటు బూత్‌లను ప్రత్యేకంగా సందర్శించారు. నియోజకవర్గంలో 2,18,852 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 110 పోలింగ్ కేంద్రాల్లో 255 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక బూత్‌లుగా 71 కేంద్రాలను గుర్తించారు. అత్యంత సమస్యాత్మక బూత్‌లుగా 104 కేంద్రాలను గుర్తించారు. దేశంలోనే మొదటిసారి ఓటరు ఏ పార్టీకి ఓటు వేశారో తెలిసేలా వీవీ ప్యాడ్స్‌ను ప్రవేశ పెట్టారు. ఈ పరికరంపై ప్రజల్లో అపోహలు నెలకొనడంతో అధికారులు వాటిని నివృత్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర పారా మిలటరీ బలగాలు పహారా కాయనున్నాయి. ఎన్నికల ప్రక్రియను వీడియో ద్వారా చిత్రీకరించనున్నారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద బాడీ -1 కెమెరాలతోపాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాతో ప్రత్యేక నివేదికను నెలకొల్పారు. సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలను గుర్తించి కేంద్రాల వద్ద పారా మిలటరీ బలగాలతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. షాడో పార్టీలు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, యాంటీ సబోటెజ్ చెక్ టీమ్స్, యాక్సెస్ కంట్రోల్ సీమ్స్ రంగంలోకి దిచారు. పోలింగ్‌ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద జరిగే పోలింగ్ సరళిని కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఓఎస్‌డి రవిప్రకాశ్, అడిషనల్ ఎస్పీలు వెంకటేష్, రుషికేశ్వరరెడ్డిలు కంట్రోల్ రూమ్ బాధ్యతలను చేపట్టారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల పరిశీలకులు హిమాంగ్ షు జ్యోతి చౌదరితోపాటు వ్యయ పరిశీలకుడిగా ముకాంబికేయన్ నియమించింది. ఇప్పటికే పరిశీలకులు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. బుధవారం జరుగనున్న పోలింగ్‌కు అధికార



యంత్రాంగం నుంచి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఇప్పటికే నంద్యాల పట్టణంతోపాటు నంద్యాల, గోస్పాడు మండలాలకు కేంద్ర బలగాలు చేరుకున్నాయి. మంగళవారం పోలింగ్ సిబ్బంది వారి వారి పోలింగ్ కేంద్రాలకు పంపేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రచారానికి తెర

హోరాహోరీగా సాగుతున్న నంద్యాల ఉప ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రంతో ముగిసింది. ఈసీ ఆదేశాల నేపథ్యంలో మరోవైపు నంద్యాలలో తిష్ట వేసిన వివిధ పార్టీల నేతలు తిరుగుపయనమయ్యారు. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి పోలింగ్ ముగిసే వరకు బయట వారు ఎవరూ నంద్యాలలో ఉండరాదని ఎన్నికల అధికారులు నిర్దేశించారు. నంద్యాల ప్రజలు కూడా బయటకు రావద్దన్నారు. ఇందుకు సంబంధించి కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్లకు దిశా నిర్దేశం చేశారు. ఓటర్లను ప్రభావితం చేసే ఎలాంటి కార్యక్రమాలు జరిగినా, వార్తలు ప్రచురించినా క్రిమినల్ చర్యలు ఉంటాయి. పోలింగ్ ముగిసే వరకు వైన్‌షాపులు కూడా మూసివేయాలని ఆదేశాలిచ్చారు. మీడియా సంస్థలు ఎలాంటి సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ నిర్వహించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పార్టీల ప్రచారం నువ్వా, నేనా అన్నట్టు సాగినా ఫలితం ఎలా వుంటుందోననే విషయమై సస్పెన్స్ కొనసాగుతోంది.




నిశ్శబ్ద వాతావరణం

ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు నంద్యాలయేతర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా లాడ్జీలను ఖాళీ చేయడంతో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. మైకులు కూడా సోమవారం సాయంత్రం నుంచి మూగబోయాయి. మంత్రులు, ఎం.పి.లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరూ గదులను ఖాళీ చేశారు. అయితే రాజకీయ పార్టీలు నంద్యాల నుంచి వెళ్ళిపోయినప్పటికీ జిల్లా అవతల సమీప ప్రాంతాలలోనే వుండటం విశేషం. కర్నూలు సరిహద్దు అవతల వున్న పొద్దుటూరు, గిద్దలూరు వంటి ప్రాంతాలలో మకాం వేశారు. గెలుపే లక్ష్యంగావున్న నేతలు నంద్యాల కేడర్‌కు అందుబాటులోవుండాలనే లక్ష్యంతో ఈ విధంగా నిర్ణయం తీసుకున్నారు.



సర్వేలపై నిషేధం చట్ట విరుద్ధం


- కౌంటర్లు దాఖలు చేయండి
- ప్రతివాదులకు హైకోర్టు ఆదేశం



హైదరాబాద్,ఆంధ్రప్రభ : కర్నూలు జిల్లా నంద్యాల శాసనసభ ఉపఎన్నికల సందర్భంగా ఓటర్ల ఒపీనియన్ సర్వేల పై సర్వేలను నిషేధిస్తూ రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఉత్తర్వులు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 126(ఏ)కు విరుద్ధమని ఉమ్మడి హైకోర్టు ప్రాథమికంగా అభిప్రాయ పడింది. చట్ట నిబంధనల మేరకు 48 గంటల ముందు నుంచి సర్వే నిర్వహణ, వాటి వివరాల ప్రచురణపై నిషేధం ఉన్న నేపథ్యంలో 23న జరగనున్న నంద్యాల ఉపఎన్నికు సంబంధించి సోమవారం సాయంత్రం నుంచి సర్వేలపై ప్రసారాలు నిలిచిపోతాయని హైకోర్టు గుర్తు చేసింది. తాము విచారణ జరుపుతున్న సమయానికి 48 గంటల గడువు అమల్లోకి రావడానికి కేవలం మూడు గంటలు మాత్రమే మిగిలి ఉందని హైకోర్టు పేర్కొంది. అలాంటప్పుడు రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఉత్తర్వులను నిలుపుదల చేసినా ఉపయోగం ఉండదు కదా అని హైకోర్టు పిటిషనర్ ను ఉద్దేశించి వ్యాఖ్యానించింది. రిటర్నింగ్ అధికారి ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ వ్యాజ్యంపై పూర్తి వివరాలతో ప్రమాణ పత్రం దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి , సీఈఓ, ఆర్వోలకు నోటీసులు జారీ చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ ,జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ వ్యాజ్యంపై సోమవారం విచారణ చేపట్టి, ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. నంద్యాల ఉపఎన్నిక ముగిసే వరకు విద్యార్థులు, ఎన్జీవోలు, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా నిర్వహించే అన్ని రకాలైన ఓటర్ల ఒపీనియన్ సర్వేలను నిషేధిస్తూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఈ నెల 15న జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ..హైదరాబాద్ కు చెందిన సోషియో పొలిటికల్ అనాలిసిస్ అండ్ రీసెర్చ్ సెంటర్ కార్యదర్శి ఎన్.రాంబాబు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది కనకమేడల రవీంద్ర కుమార్ వాదనలు వినిపిస్తూ.. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 126ఏ(1) ప్రకారం ఎన్నికకు ముందు 48 గంటల ముందు ఎగ్జిట్ పోల్స్ నిర్వహణ, ఫలితాల ప్రచురణపై నిషేధం ఉందన్నారు. పోల్ సర్వేలపై నిషేధం లేదన్నారు. ఆర్వో ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని అభ్యర్థించారు. ఎన్నికల కమిషన్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ .. అభిప్రాయ సర్వే ముసుగులో ఓటర్లను బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. అధికార పార్టీకి ఓటేయకుంటే వివిధ పథకాల కింద అందే ప్రయోజనాలను కత్తిరించేస్తామని బెదిరిస్తున్నట్లు ఆ ఫిర్యాదుల్లో పేర్కొన్నట్లు తెలిపారు. ఇరు పక్షా ల వాదనలు విన్న ధర్మాసనం .. సర్వేపై నిషేధం విధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు చట్ట విరుద్ధంగా ఉన్నాయని అభిప్రాయపడింది. 48 గంటల గడువు అమల్లోకి రావడానికి కేవలం మూడు గంటలు మాత్రమే మిగిలి ఉందని గుర్తు చేసింది. పూర్తి వివరాలతో ప్రమాణ పత్రాలు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది.

పోలింగ్ ముగిసేదాకా అప్రమత్తం

- కేడర్‌కు చంద్రబాబు సూచన



నంద్యాల, ఆంధ్రప్రభ: నంద్యాల అభివృద్ధికి తాను ఎంతో ప్రాధాన్య తనిచ్చానని, టీడీపీ అభ్యర్థిని గెలిపించి పార్టీ ప్రతిష్టను మరింతగా ఇనుమడింపజేయాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. తన స్వంత నియోజక వర్గమైన కుప్పంలో కూడా ఇంతగా పెద్ద ఎత్తున తాను నిధులు కేటాయించలేదన్నారు. ప్రచారానికి చివరిరోజు అయిన సోమవారం ఆయన నంద్యాలలో వున్న కొందరు మంత్రులు, సీనియర్ నాయకులు, స్థానిక కేడర్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ పోలింగ్ ముగిసేదాకా వ్యవహరించాల్సిన తీరుపై దిశానిర్దేశం చేశారు. వచ్చే 36 గంటల సమయం ఎంతో కీలకమైనదని పేర్కొన్న ముఖ్యమంత్రి ఏ దశలో కూడా అలక్ష్యం వహించరాదని హెచ్చరించినట్టుశుూచారం. ఇంతవరకు నిర్వహించిన ప్రచారం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన టీడీపీ అధినేత ఇంతటితో ఆగితే సరిపోదన్నారు. ఫలితం వచ్చే దాకా పట్టు విడవరాదని పేర్కొన్న చంద్రబాబు నాయుడు తన పర్యటన సందర్భంగా వివిధ సామాజికవర్గాల నుంచి లభించిన స్పందన పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. తాను నిర్వహించిన సర్వేకు అనుగుణంగానే ఫలితం దక్కుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేసిన చంద్రబాబు మరోవైపు సామాజిక వర్గాల వారీగా అనుసరించనున తీరును వివరించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిననాటి నుంచి ఇప్పటిదాకా పక్కా ప్రణాళికతో జరిగిన ప్రచారం ఫలితంగా బాగా పుంజుకోగలిగామని, ప్రత్యర్థిని నియంత్రించగలిగామని అన్నారు. మంత్రులు, ఇంచార్జిలు నంద్యాల లో వుండే పరిస్థితి లేకపోవడంతో స్థానిక నేతలు సమన్వయంతో వ్యవహరించాలని, ఎక్కువ ఓట్లు రాబట్టేవిధంగా పట్టుదలను ప్రదర్శించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

బాబు పాలనకు ఇది తీర్పు

- నంద్యాల రోడ్ షోలో జగన్



నంద్యాల, కెఎన్ఎన్ : నంద్యాల నియోజకవర్గం ఇప్పటికే దేశ చిత్ర పటంలో గుర్తింపు పొందిందని, ఉప ఎన్నికల్లో చారిత్రాత్మకమైన తీర్పును ఇవ్వాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా అభివృద్ధి తన బాధ్యతగా స్వీకరిస్తున్నానని ప్రకటించారు. రాష్ట్రంలోని 13 జిల్లాలను 25 జిల్లాలుగా మారుస్తానని, నంద్యాలను జిల్లా కేంద్రంగా చేస్తానని పేర్కొన్నారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన 13వ రోజు నంద్యాలలో సోమవారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలతో ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతానన్నారు. గత 13 రోజులుగా నంద్యాల ప్రజలు చూపించిన ప్రేమానురాగాలను ఎప్పటికి మరువబోనన్నారు. ప్రజాదరణ చూసి చంద్రబాబు వెన్నులో భయం పుట్టిందన్నారు. తనను ఆదరించిన ప్రజలకు శిరస్సు వంచి హృదయపూర్వక కృతజ్ఞతలను తెలిపారు. నంద్యాల ఉప ఎన్నిక చంద్రబాబు పాలనపై ప్రజలు ఇస్తున్న తీర్పుగా అభివర్ణించారు. గుండ్రేవుల ప్రాజెక్టును పూర్తి చేస్తానని, నంద్యాల ఉప ఎన్నిక మహాసంగ్రామమని, నంద్యాలలో కొత్త మార్పుకు శ్రీకారం చుట్టాలని, అదే ఒరవడిని శ్రీకాకుళం దాకా కొనసాగించాలన్నారు. ఇవాల ఉప ఎన్నిక వచ్చే సరికి మళ్లీ అవే వాగ్దానాలు, అవే మోసాలు, అవే అబద్ధాలతో అరిగిపోయిన టేప్ రికార్డర్ వేస్తున్నారని ఎద్దేవా చేశారు.

హస్తినకు ధర్నాచౌక్ పోరాటం

•తెలంగాణలో ప్రజాస్వామిక జీవనంలేదు:కోదండరాం •కేసీఆర్‌ను గద్దె దించడానికి ఏకమవ్వాలి: వీహెచ్ •సాయుధ పోరాట స్ఫూర్తితో పోరాడాలి:సీతారాం ఏచూరి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లో ప్రజలు తమ నిరసన తెలిపే ప్రజాస్వామిక వాతావరణం లేకుండా పోయిందని తెలంగాణ జేఏసీ ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ధర్నాచౌక్ పునరుద్ధరణ కోసం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి పోరాటం చేపట్టిన ఆయన సోమవారం ఉదయం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ ధర్నాకు ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో పాటు కాంగ్రెస్ పార్టీ, మరికొన్ని ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, రాష్ట్ర నేతలు తమ్మినేని వీరభద్రం, చాడా వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీ. హనుమంతరావు తదితర నేతలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం కోదండరాం నేత త్వంలో ఒక బృందంగా ఏర్పడి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు .హైదరాబాద్ నగరంలో తమకూ నిరసన తెలుపుకునే ప్రదేశం కావాలని, ఇందిరాపార్క్ ప్రాంతాన్ని ధర్నాచౌక్‌గా పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంమంత్రిని కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం ప్రజలకు కల్పించిన మాట్లాడే స్వేచ్ఛను తెలంగాణ ప్రభుత్వం హరిస్తోందని ఫిర్యాదు చేశారు. నిరసన తెలిపే హక్కు లేకుండా నియంతృత్వంతో వ్యవహరిస్తోందని ఈ మేరకు ఒక విజ్ఞాపణ పత్రాన్ని రాజ్‌నాథ్‌కు అందజేశారు. దానిపై కేవలం సంతకం చేసి పంపించకుండా, కేంద్ర హోంమంత్రిగా అభిప్రాయాన్ని క ాడా రాస్తూ రాష్ట్రానికి పంపాలని కోరారు. ఇందుకాయన సానుకూలంగా స్పందించారని అనంతరం కోదండరాం వెల్లడించారు.

ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ తీరుపై విరుచుకుపడ్డారు. ''ధర్నాచౌక్ పున రుద్ధరించడం అంటే ప్రజాస్వామిక జీవితాన్ని పునరుద్ధరించడం. ఇది లేదంటే ప్రజాస్వామిక జీవితాన్ని ఊహించుకోలేం. తెలంగాణాలో ప్రస్తుతం ఇదే జరుగుతోంది'' అని ఆయన వ్యాఖ్యానించారు. తాత్కాలిక ఉద్యోగులు, ఆదివాసీలు, రైతులు, నిరుద్యోగులు, విద్యార్థి సంఘాలు, ఇలా సమాజంలోని అనేక వర్గాలు తమ నిరసన వ్యక్తం చేయడానికో, లేక తమ ఆకాంక్ష ప్రభుత్వ పెద్దలకు వినిపించడానికో ప్రజాస్వామ్యయుతంగా ధర్నాలు చేస్తుంటారని కోదండరాం అన్నారు. తెలంగాణలో సమస్యల్లో ఉన్న అనేక వర్గాలవారు తమ డిమాండ్లు చెప్పడానికి సరైన ప్రదేశం లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఎంతో

మంది స్వచ్ఛందంగా ధర్నాచౌక్ పునరుద్ధరణ కోసం ముందుకొస్తున్నారని ఆయనన్నారు. ''ఈ క్రమంలో ఢిల్లీ వరక ు రావడమంటే మామూలు విషయం కాదు. ఇంకా చాలామంది ఒక రైలు వేయమని అడిగారు. కానీ రైలు కాదు కదా, కనీసం బోగీలు కూడా ఇవ్వడం లేదు. అయినా సరే చాలా మంది సొంత ఖర్చులతో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.'' అని కోదండరాం వెల్లడించారు. అనంతరం ధర్నాకు హాజరైన ఇతర నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ''ధర్నాచౌక్ సమస్యను ఢిల్లీ వరకు తీసుకొచ్చాం. ఇంకా చాలా రాజకీయ పార్టీలను కలిసి మన ఆకాంక్షలను వినిపించాల్సి అవసరం ఉంది. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రాకపోతే ఏం చేయాలన్న విషయంపై మరోసారి కూర్చుని ఆలోచించుకోవాలి. మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలి. మనమంటే ఇక్కడిదాకా వచ్చాం. కానీ తెలంగాణలో అందరూ ఇక్కడి వరకు రాలేరు. వారి కోసం మనం మన పోరాటాన్ని కొనసాగించాలి''అని పిలుపునిచ్చారు.ఇందిరాపార్క్ పరిరక్షణ సమితికి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న సిపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఐదు నెలలుగా డిమాండ్ చేస్తున్నా అసలేమాత్రం పట్టించుకోకపోగా, అణచివేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖరరావుకు వ్యవసాయంలో కాదు, హక్కులను కాలరాసే నియంతగా అవార్డ్ ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రశ్నించడానికి అవకాశం ఇవ్వని నియంత త్వ ప్రభుత్వం నడుస్తోందని అన్నారు.''ప్రశ్నించే హక్కును కాదంటే మరో రూపంలో నిరసన వ్యక్తం అవుతుంది. దీన్నెవరూ ఆపలేరు. ఇందిరా పార్క్ కాదంటే హైదరాబాద్ నగరమంతా ధర్నాచౌక్ అవుతుంది.'' అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించే చర్య కేంద్ర ప్రభుత్వం తీసుకోకపోతే తెరాసతో ఢిల్లీ సర్కారు కుమ్మక్కైందని ఊరూరా చాటింపేసి ఎండగడతామని తమ్మినేని హెచ్చరించారు.

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంత రావు మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో ఇందిరా పార్కు వద్ద ధర్నాలు చేసిన కేసీఆర్ ఇప్పుడు అదే ధర్నాచౌక్ తొలగించారని అన్నారు. సామాన్యుడికి ప్రవేశం లేని ప్రగతి భవన్ నుంచి కేసీఆర్ పాలన సాగిస్తే తమ ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలని సామాన్యులంతా ఆవేదన చెందుతున్నారని వీహెచ్ అన్నారు. ప్రధాని మోడీకి వ్యతిరేకంగా సెక్యులర్ శక్తులు ఏకమవుతున్న తీరున తెలంగాణలో కేసీఆర్‌ను గద్దె దించడానికి అన్ని పార్టీలు ఏకమవ్వాలని పిలుపునిచ్చారు.

ధర్నాచౌక్ పోరాటానికి పూర్తి మద్దతు ప్రకటించిన సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచారి, దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ సాధించుకున్న తీరును గుర్తుచేశారు. బాబ్రీ మసీదు ఘటన తర్వాత ఢిల్లీ బైట్ క్లబ్ దగ్గర ఉన్న ధర్నా చౌక్‌ను అప్పటి కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ వెలుపలకు తరలించిందని, పోరాడి జంతర్ మంతర్ సాధించుకున్నామని ఆయనన్నారు.

ఇదే తరహాలో ఇందిరాపార్క్‌ను కూడా సాధించుకుంటామని ఏచూరి వ్యాఖ్యానించారు. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం, ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట స్ఫూర్తితో ఈ హక్కును సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

క్యాబ్ రేటుకే హెలీ ట్యాక్సీ

బెంగళూరు: గ్రీన్‌సిటీగా పేరొందిన బెంగళూరు నగరంలో ట్యాక్సీల తరహాలో హెలి ట్యాక్సీలు అందుబాటులోకి రానున్నాయి. క్యాబ్‌కు ఎంతైతే చెల్లిస్తారో అంతే మొత్తం ఈ హెలి క్యాబ్‌కు చెల్లిస్తే చాలు, ట్రాఫిక్‌లో గంటల తరబడి వేచి చూడకుండా.. హాయిగా గాల్లో తేలుతూ గమ్యానికి చేరిపోవచ్చు. దేశంలోనే తొలిసారిగా బెంగళూరులో హెలీ ట్యాక్సీ సేవలు డిసెంబర్‌లో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (బీఐఏఎల్).. కేరళకు చెందిన తంబే ఏవియేషన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీ నుంచి ఎయిర్ పోర్ట్‌కు హెలికాప్టర్‌లో దాదాపు 15 నిమిషాల సమయం పడుతుంది. అదే రోడ్డు మార్గంలో వెళ్తే దాదాపు 90 నుంచి 150 నిమిషాలు ప్రయాణించాలి. ఈ నేపథ్యంలో 6 సీట్ల హెలికాప్టర్ ట్యాక్సీ ధరలకే ఈ సేవలు అందించనుంది. ఇది సక్సెస్ అయితే హైదరాబాద్, ఢిల్లీ, ముంబైలలో కూడా అందుబాటులోకి తేనున్నారు.

ఎంపీ కాన్వాయ్ బీభత్సం..

పాట్నా: ఎంపీ, కాంగ్రెస్ అధికార ప్రతినిధి రంజీత్ రంజన్ కాన్వాయ్ బీభత్సం సృష్టించింది. బీహార్‌లో ఎంపీ ప్రయాణిస్తున్న కాన్వాయ్‌కి చెందిన ఓ వాహనం ఢీకొట్టడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఘటన సమయంలో రంజీత్‌తో పాటు ఉన్న నిర్మాలి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రామ్‌ప్రసేశ్ యాదవ్.. గాయపడిన వారిని తన వాహనంలో ఎక్కించుకొని సమీప ఆసుపత్రికి తరలించారు.సుపోల్ నియోజకవర్గ ఎంపీ అయిన రంజీత్.. ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి పాట్నాకు వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఈమె జన్ అధికార్ పార్టీ అధినేత పప్పూ యాదవ్ భార్య కావడం గమనార్హం.

మాణిక్యం దొరికింది..కోటీశ్వరుడయ్యాడు!

అమృత్‌సర్: పంజాబ్‌లోని సిర్సా జిల్లా దబ్వాలీ గ్రామానికి చెందిన గౌరీశంకర్ సీట్లు తయారు చేసి విక్రయించే వ్యాపారం చేస్తుంటాడు. ఆదాయం సరిపోక అతడు తన ఇంట్లో ఉన్న పాత సామగ్రి (స్క్రాప్) అమ్మేద్దామనికుని ఇంట్లో ఉన్న పాత వస్తువులన్నింటినీ పోగు చేస్తుండగా.. ఓ నాణెం కనిపించింది. అదేమిటో తెలుసుకుందామని దగ్గరలోని మసీదు వద్దకు వెళ్లాడు. దాన్ని పరిశీలించిన మసీదు ఇమామ్.. నాణెంపై '1450, మదీనా' అని రాసున్నాయని, అది ఆ కాలానికి చెందిన అత్యంత అరుదైన నాణెమని తెలిపాడు. వెంటనే గౌరీశంకర్ ఆ నాణేన్ని ఫొటో తీసి దుబాయ్‌లో ఉండే మిత్రుడికి పంపించాడు. విషయం తెలుసుకున్న దుబాయ్‌కి చెందిన ఓ వ్యక్తి దాన్ని ఇస్తే.. రూ. 1.5 కోట్లు చెల్లిస్తానని ముందుకొచ్చాడు. నాణెం విలువ తెలుసుకున్న గౌరీశంకర్.. ఇప్పుడు దాన్ని రూ. 3.5 కోట్లకు వేలానికి పెట్టాడు.

జీసీసీ కమిటీ నియామకం

హైదరాబాద్,ఆంధ్రప్రభ : తెలంగాణ గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ కమిటిని ప్రభుత్వం పునర్‌నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటి ఛైర్మన్‌గా మోహన్‌గాంధీ నాయక్, డైరెక్టర్లుగా గిరిజన కోపరేటివ్ కార్పొరేషన్ ఎండీ, ఆర్థిక శాఖ కార్యదర్శి, జీసీసీ అడిషన్ కార్య దర్శితో పాటు గిరిజన గురుకులాల కార్యదర్శులు ఉంటారు.

డీజీపీకి ఎస్సీ కమీషన్ నోటీసులు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: నేరెళ్ల ఘటనపై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ డీజీపీకి నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ట్ క్యాస్ట్స్ (ఎస్సీ కమిషన్) నోటీసులు జారీ చేసింది. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి ఆర్‌సీ కుంతియా సహా ఇతర ఎంపీలిచ్చిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న కమిషన్, ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం తీసుకున్న చర్యలేంటో చెప్పాలని నోటీసుల్లో పేర్కొంది.

ప్రియుడిని కడతేర్చిన ప్రేయసి

న్యూఢిల్లీ: వంట చేసే విషయంలో ప్రేమికుల మధ్య వివాదం మొదలై... ఘర్షణకు దారితీసింది. ఒకరినొకరు తోసుకున్నారు... కొట్టుకున్నారు. ఆగ్రహానికి గురైన యువతి కత్తి తీసుకొని బాయ్‌ఫ్రెండ్ పొడిచేసింది. క్షణాల్లో ప్రియుడు అక్కడికక్కడే ప్రాణాలొదాడు. ఈ ఘటన ఈశాన్య ఢిల్లీలోని ఉత్తమ్ నగర్‌లో శనివారం సాయంత్రం జరిగింది. ఈ కేసులో 28 ఏళ్ల నైజీరియన్ యువతిని పోలీసులు అరెస్టు చేశారు.పోలీసుల కథనం ప్రకారం.. నైజీరియాకు చెందిన ఈజు (30) ఉత్తమ్ నగర్‌లో నివాసముంటున్నాడు. అతనికి ఎల్వి ఉజుమా (28) అనే ప్రియురాలు ఉంది. ఆమె అప్పుడప్పుడు ఈజు ఇంటికి వచ్చి వెళ్తుండేది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ఈజు ఇంటికి ఉజుమా వచ్చింది. వంట ఎవరు చేయాలనే విషయంపై వీరి మధ్య వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు అరుచుకున్నారు. ఈజు ఆగ్రహంతో ఉజుమాను కొట్టాడు. దీంతో కోపోద్రేకానికి గురైన ఉజుమా వంట గదిలో నుంచి కత్తి తీసుకొచ్చింది. తన దగ్గరకు వస్తే పొడిచేస్తానంటూ బెదిరించింది.

అయినా ఈజు ఆమెపైకి దూసుకెళ్లాడు. దీంతో ఉజుమా ఇష్టమొచ్చినట్లు ఈజుకు పొడిచేసింది. వెంటనే వేరే గదిలోకి పారిపోయి తలుపు వేసుకుంది. అరగంట తరవాత తిరిగొచ్చి చూసేసరికి ఈజు రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ఈ విషయాన్ని ఉజుమా ఫోన్‌లో తన ఫ్రెండ్స్‌కి చెప్పింది. వారు తక్షణమే వచ్చి ఈజును ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే అతని మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఇంటి యజమాని ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఉజుమాను అరెస్టు చేశారు.

బీసీ వెల్ఫేర్‌కు రూ. 7.50 కోట్లు విడుదల

హైదరాబాద్,ఆంధ్రప్రభ : బీసీ కులాల అభివృద్ధికి గాను తెలంగాణ ప్రభుత్వం రూ. 7.50 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌కు పరిపాలన అనుమతులు ఇస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జి. అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఈ నిధులు రెండో విడత కింద కేటాయించారు.

సిరిసిల్ల ఎస్పీ విశ్వజిత్‌పై వేటు

సెలవుపై వెళ్ళారా.. పంపించారా?



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎట్టకేలకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ విశ్వజిత్ కంపాటిపై ప్రభుత్వం బదిలీ వేటువేసింది. శిక్షణ నిమిత్తం కంపాటి నెల రోజులపాటు లడక్ వెళ్ళేందుకు సెలవుకు దరఖాస్తు పెట్టుకున్నారని ఆయన అభ్యర్ధనను ఆమోదించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఈ జిల్లాలో ఇటీవల దళితులపై జరిగిన దాడి ఘటనలో ఎస్పీని సస్పెండ్ చేయాలని వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు పెద్దఎత్తున ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. దళితులపై జరిగిన దాడి ఘటనలో ప్రభుత్వం ఒక ఎస్‌ఐని సస్పెండ్ చేసింది. అకారణంగా ఎస్‌ఐని బలి పశువును చేశారని మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ జిల్లాలో ఎస్పీపైవేటువేయకుండా ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆరోపణలు వెల్లువెత్తాయి. విపక్షపార్టీలు, ప్రజా సంఘాలు సిరిసిల్లలో పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించాయి. దళితులను విచక్షణారహితంగా కొట్టిన పోలీసులపై కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. అయితే విపక్షాలు తమ ఆందోళలను మరింత ఉధృతం చేయడంతో ప్రభుత్వం ఎస్పీ విశ్వజిత్‌ను సెలవుపై వెళ్ళాలని కోరినట్టు ప్రచారం జరుగుతోంది. విశ్వజిత్ స్థానంలో కరీంనగర్ నగర పోలీస్ కమిషనర్ వీబీ కమలహాసన్‌రెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగిస్తూ డీజీపీ అనురాగ్ శర్మ ఉత్తర్వులు జారీచేశారు. జమ్మూ కాశ్మీర్‌లోని లడక్‌లో శిక్షణ నిమిత్తం విశ్వజిత్‌ను పంపాలని కేంద్ర ప్రభుత్వం కోరినందున నెల రోజులపాటు ఆయనను పంపిస్తున్నామని అనురాగ్ శర్మ వివరించారు.

ఎట్టకేలకు అమ్మవారి విగ్రహం లభ్యం


బాసర, కెఎన్ఎన్: చదువుల తల్లి కొలువై ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహం మాయమైన ఘటన కలకలం రేపింది. అమ్మవారి విగ్రహాన్ని తరలించి నల్గొండ జిల్లా దేవరకొండలో ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి, సప్తశథి పారాయణదారుడు ప్రణవ్ శర్మలు సరస్వతీ పూజ నిర్వహించి అక్షరభ్యాసాలు చేసినట్లు ప్రధాన ఆరోపణ. ఈ విషయమై ఆలయ అధికారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు సైతం అందించారు. ఈ సంఘటనపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రీజినల్ జాయింట్ కమిషనర్ అధికారిచే విచారణ నిర్వహించేందుకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో నల్గొండ జిల్లా దేవరకొండలో అమ్మ వారి విగ్రహాన్ని తరలించి అక్షరభ్యాస పూజలను నిర్వహించినట్లు ప్రధాన ఆరోపణ ఎదుర్కొంటున్న సంజీవ్ పూజారికు సంబంధించిన రెండు బీరువాలను రెవెన్యూ తహసీల్దార్ వెంకటరమణ, ముథోల్ సీఐ రఘుపతి, ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి, ఆలయ సూపరిండెంట్ గిరిధార్, స్థానాచార్యుడు ప్రవీణ్ పాఠక్, అర్చకుల సమక్ష్యంలో బీరువాలను పగులగొట్టారు. ప్రధానంగా స్టోర్‌రూమ్‌లోని బీరువాలో ఎలాంటి విగ్రహం బయట పడలేదు. ఆలయ అర్చకుల కోసం విశ్రాంతి గది లోని ప్రధాన అర్చకుడికి చెందిన బీరువాను తెరిచి చూడగా.. పంచలోహాలతో కూడిన అమ్మవారి విగ్రహం, రూ. 8వేల నగదు తదితర వస్తువులు బయట పడ్డాయి. ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా.. నిబంధనలకు విరుద్ధంగా ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ తనకు కేటాయించిన స్టోర్ రూమ్‌లో ఆలయానికి చెందిన వస్తువులను భద్రపర్చుకున్నప్పటికీ నిబంధనలకు విరూద్ధంగా మరో బీరువాలో భద్ర పర్చినట్లు పేర్కొన్నారు. ఈ విచారణపై రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు పూర్తి నివేదిక సమర్పిస్తామని ఈవో పేర్కొన్నారు.

పెద్దపల్లి కేశోరామ్ సిమెంట్ లీజు పొడగింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పెద్దపల్లి జిల్లా రామగుండం మండలంలోని టెక్కల్లపల్లి గ్రామంలో కేశోరమ్ సిమెంటు కంపెనీకి లైమ్‌స్టోన్ మైనింగు తీసుకునేందుకు 50ఏళ్లకు రాష్ట్ర ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. ఈ మేరకు సోమవారం పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. టెక్కల్లపల్లి గ్రామంలో 122.28హెక్టార్లల్లో కేశోరమ్ సిమెంట్ కంపెనీ ఇదివరకే లైమ్‌స్టోన్ నిక్షేపాలను తవ్వుకుంటున్నది. దీనికి సంబంధించి గతంలో 20ఏళ్ల వరకూ ప్రభుత్వం లీజు ఇవ్వగా, ప్రస్తుతం ఆ లీజు గడువును 50ఏళ్లకు పెంచినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రతి మండలంలో..ప్రతి నెలా 100 ఇళ్ళు

- ఇంకా 5.5 శాతం వర్షపాతం లోటు
- భూగర్భ జలాల పెంపుకు చర్యలు చేపట్టాలి
- ప్రతి నెలా ఒక్కొక్క మండలంలో 100 ఇళ్ళు నిర్మాణం పూర్తి కావాలి
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి, ఆంధ్రప్రభ : అధికార యంత్రాంగానికి , ప్రజా ప్రతినిధులకు అభివృద్ధి ఒక ఫ్యాషన్‌గా మారాలని, పేదల సంక్షేమం దినచర్య కావాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. సోమవారం నీరు - ప్రగతి, వ్యవసాయ పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు అధికారులు, ప్రజా ప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వారం వర్షాలు కురవడంతో రైతులకు కొంత స్వాంతన లభించింద న్నారు. వర్షపాతం అనిశ్చితి, రిజర్వాయర్లలో నీటిమట్టం తక్కువగా ఉండడం క్లిష్ట సమస్యగా మారాయన్నారు. ఎగువ రాష్ట్రాల నుంచి కృష్ణానదికి నీరు రావడం లేదని, ఈ పరిస్థితి తాను ముందే ఊహించి పట్టిసీమను పూర్తిచేయడంతో మేలు జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంకా 5.5శాతం వర్షపాతం లోటు ఉందని తెలిపారు. ఈ నెలాఖరు వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని, పడిన ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గత ఏడాది కన్నా రాష్ట్రవ్యాప్తంగా 1.3మీటర్లు భూగర్భ జలాలు పెరిగాయన్నారు. రాయలసీమలో భూగర్భజలాలు మరింతగా పెరగాల్సిన అవసరం ఉందని, దీనికి అనుగుణంగా పంటకుంటల త్రవ్వకం, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వాగులు, వంకల్లో నిర్మిస్తున్న వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌లే రిజర్వాయర్లుగా ఉపయోగపడతాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నరేగా నిధులను అడ్డుకునేందుకు కేంద్రానికి కొందరు లేఖలు రాశారని, అయితే స్వల్పకాలంలో పూర్తయ్యేలా అనేక ఈ లేఖలకు తిరుగులేని జవాబులని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న నిధులను అధికారులు సద్వినియోగం చేయాలని, శాఖల మధ్య మరింత సమన్వయం ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పూర్తయిన 54వేల పంటకుంటల్లో 22వేల కుంటల్లో నీరు చేరడం పట్ల ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 698 సెలయేళ్ల అభివృద్ధి, 5359 చెక్ డ్యామ్‌ల నిర్మాణం పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు మిగిలిన లక్ష్యాలను కూడా వెంటనే పూర్తిచేయాలని కోరారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయని, వీటిని మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంకా రూ. 460 కోట్ల నరేగా నిధులు మిగిలి ఉన్నాయని, వీటికి తోడు రూ. 550 కోట్లు సోమవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనుందని చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7లక్షల 36వేల మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయ్యాయని, 5,47,795 పంటకుంటల త్రవ్వకం పనులు జరుగుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

ప్రతినెలా 100ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయాలి..

ప్రతినెలా ప్రతి మండలంలో 100 ఇళ్ళ నిర్మాణం పూర్తిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. 2016-17సం.లో మంజూరైన 76వేల ఇళ్ళ నిర్మాణం పూర్తయిందని, పనులు ప్రారంభమైన అన్ని ఇళ్ళు తక్షణమే పూర్తయ్యేలా లబ్ధిదారులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలన్నారు. ఇంకా రాష్ట్ర వ్యాప్తంగా 3లక్షల 25వేల ఇళ్ళను మంజూరు చేయాల్సి ఉందని, వీటికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు..

పీవీఆర్‌కే ప్రసాద్ కన్నుమూత



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ కార్యనిర్వహణాధికారి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీఎస్ఆర్‌కే ప్రసాద్ సోమవారం కన్నుమూశారు. ఆయన వయసు డెబ్బై ఏడేళ్ళు. గుండెపోటుకు గురైన పీవీఆర్‌కేను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఒక పాఠశాల ఉపాధ్యాయుడి కుమారుడిగా విద్యతో మంచి ప్రతిభను ప్రదర్శించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. వివిధ హోదాల్లో రాష్ట్ర ప్రభుత్వంలోనే కాకుండా, పీవీ నర్సింహారావు ప్రధానిగా ఉన్నపుడు ఆయన మీడియా సలహాదారుగా కూడా పనిచేశారు. ఇటీవల కాలంలో పీవీఆర్‌కే ధార్మిక కార్యక్రమాలకు ప్రచారకర్తగా పనిచేశారు. పలు పుస్తకాలను కూడా రచించారు.

పీవీఎస్ఆర్‌కే మృతికి ప్రముఖుల సంతాపం

గుండెపోటుతో పీవీఎస్ఆర్‌కే ప్రసాద్ మరణించడం పట్ల ఉభయ రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, మం త్రులు కేటీఆర్, హరీష్‌రావు, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఆయన సేవలు మరిచిపోలేనివని కొనియాడారు.

డిజిటల్ పోలీస్ పోర్టల్ ప్రారంభం

న్యూఢిల్లీ: డిజిటల్ పోలీస్ పోర్టల్‌ను కేంద్ర హోంమంత్రి రాజ్ నాథ్ సింగ్ సోమవారంనాడిక్కడ ప్రారంభించారు. సీసీటీఎన్ఎస్ ప్రాజెక్టు కింద ఈ పోర్టల్‌ను ఆవిష్కరించారు. నేరాలు, నేరస్తులకు సంబంధించిన డేటాను ఈ పోర్టల్‌లో పొందుపరుస్తారు. డిజిటల్ పోలీస్ పోర్టల్ ద్వారా సాధారణ పౌరులు ఆన్‌లైన్ ఫిర్యాదులు చేయవచ్చు అని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు.క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ ప్రాజెక్ట్ (సీసీటీఎన్ఎస్) వ్యవస్థ మొత్తం 13,775 పోలీస్‌స్టేషన్లలో ఉన్నట్లు పేర్కొన్నారు. సీసీటీఎన్ఎస్ వద్ద పాత నేరాలకు సంబంధించి ఏడు కోట్ల డేటా రికార్డులు ఉన్నాయని రాజ్‌నాథ్ చెప్పారు. .



అరబిందో ఫార్మా హెచ్ఐవీ ఔషధానికి యూఎస్ఎఫ్‌డీఏ అనుమతి

హైదరాబాద్ : ఔషధ దిగ్గజం అరబిందోఫార్మాకు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి హెచ్ఐబీ -1 టాబ్లెట్ తయారు చేసి మార్కెట్ చేసుకోవడానికి అనుమతి లభించింది. యూఎస్ ప్రెసిడెంట్ ఎమర్జెన్సీ ప్లాన్ ఫర్ ఎయిడ్స్ రిలీఫ్ (పీఈపీఎఫ్ఆర్) కింది కొత్త ఔషధం డొల్టెగ్రావిర్, లామిమ్యుడిన్, టెనోఫోవిర్ డిసోప్రోక్సిల్ ఫుమారేట్ (టీఎల్‌డి) టాబ్లెట్లు తయారు చేసుకోవడానికి అనుమతించింది. ఈ అనుమతించిన ప్రొడక్టులు హెచ్ఐబీ-1 ఇన్‌ఫెక్షన్ సోకిన వారికి పెద్దలు, పిల్లలు 40 కేజీలు, అంత కంటే ఎక్కువ బరువు గల వారి కోసమని కంపెనీ సోమవారం నాడు విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. కాగా వివి హెల్త్‌కేర్, అరబిందో ఫార్మా రెండు కంపెనీలు 2014లో లైసెన్సింగ్ ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీని వల్ల అరబిందో ఫార్మా డొల్టెగ్రావిర్ 50 ఎంజీ, 92 దేశాలల్లో సరఫరా చేసుకోవడానికి లైసెన్స్‌లు దక్కించుకున్నట్లయింది. అయితే ఆయా దేశాల స్థానిక నియంత్రణా సంస్థల అనుమతులు లభించిన తర్వాతనే మార్కెట్ చేసుకోవడానికి వీలవుతుందని ప్రకటనలో వివరించింది.

AUROBINDO
Committed to healthier life!

SBI

వివిధ రకాల రుణాలపై ఎస్‌బీఐ ప్రాసెసింగ్ రుసుము మాఫీ

ముంబై : రాబోయే పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వివిధ రకాల రుణాలపై పరిమితి కాలానికి వంద శాతం ప్రాసెసింగ్ రుసుమును మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఉదాహరణకు కారు, బంగారం, వ్యక్తిగత రుణాలపై ఈ మాఫీ ఉంటుందని బ్యాంకు ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుతం కొత్తగా గృహ రుణాలు తీసుకునే వారికి ప్రాసెసింగ్‌ను మాఫీ చేస్తున్నామని, దాంతో పాటు బ్యాంకు ఇచ్చే పలు రకాల రుణాలపై ప్రాసెసింగ్ రుసుమును మాఫీ చేస్తున్నట్లు తెలిపింది. డిసెంబర్ 31వ తేదీ వరకు కారు రుణాలపై 100 శాతం, వ్యక్తిగత బంగారం రుణంపై మాత్రం 50 శాతం ప్రాసెసింగ్ రుసుము మాఫీ చేస్తున్నట్లు అక్టోబర్ 31 వరకు అమల్లో ఉంటుంది. దీంతో పాటు ఎక్స్‌ప్రెస్ క్రెడిట్ కార్డుతో వ్యక్తిగత రుణాలు తీసుకుంటే వారికి సెప్టెంబర్ 30 వరకు ప్రాసెసింగ్ రుసుమును మాఫీ చేస్తున్నట్లు బ్యాంకు వివరించింది.

మెర్సిడెజ్ బెంజ్ నుంచి ఎఎంజీ జీటీ ఆర్ ఎఎంజీ జీటీ రోడ్‌స్టార్

• ప్రారంభ ధర రూ.2.19 కోట్లు

న్యూఢిల్లీ : జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ కంపెనీ మెర్సిడెజ్ బెంజ్ సోమవారం నాడు కొత్త కారు ఎఎంజీ జీటీ ఆర్‌ను భారత్ మార్కెట్ కోసం విడుదల చేసింది. దీని ధర రూ.2.23 కోట్లు (ఎక్స్ షో రూం), దీంతో పాటు ఎఎంజీ జీటీ రోడ్‌స్టార్ ను మార్కెట్లో విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.2.19 కోట్లుగా నిర్ణయించింది. ఈ రెండు కొత్త మోడల్ కార్లు కస్టమర్లను ఆకర్షిస్తాయన్న నమ్మకాన్ని మెర్సిడెజ్ బెంజ్ ఎండీ, సీఈవో రోలాండ్ ఫోల్గర్ మీడియాతో చెప్పారు. జీటీ రోడ్‌స్టర్ 476 హెచ్‌పీ పవర్‌తో గంటకు 302 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుందిన తెలిపారు. ఈ రెండు కొత్త కార్ల విడుదలతో దేశంలో మెర్సిడెజ్ బెంజ్ 12 ఎఎంజీ కార్లను విడుదల చేసినట్లవుతుంది. ఈ రెండు కార్లను దేశంలోని సంపన్నులు ఆకర్షిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని ఫోల్గర్ అన్నారు.



జీఎస్టీతో కార్పోరేట్ లాభాలకు గండి

• క్యూ1లో 15.7 శాతం క్షీణత • జూన్ చివరి నాటికి లాభాలు రూ.87,475 కోట్లు • కేర్ రేటింగ్ ఏజెన్సీ

హైదరాబాద్ : ఈ ఆర్థికసంవత్సరం మొదటి త్రైమాసికంలో దేశీయ కార్పొరేట్ లాభాలకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) భారీగానే గండికొట్టించింది. జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో భారతీయ కంపెనీల నికరలాభాలు 15.7 శాతం క్షీణించి రూ.87,475 కోట్లకు దిగివచ్చాయి. జులై 1 నుంచి కొత్త జీఎస్టీ అమల్లోకి రానున్న నేపథ్యంలో కంపెనీలు సరకు ఉత్పత్తులతో పాటు విక్రయాలు తగ్గించుకున్నాయని కేర్ రేటింగ్ ఏజెన్సీ తాజా నివేదికలో వెల్లడించింది.

కేర్ రేటింగ్ ఏజెన్సీ మొత్తం 2,108 కంపెనీలపై విశ్లేషణ జరిపింది. 2016-17 ఆర్థికసంవత్సరం మొదటి త్రైమాసికంలో భారత కార్పొరేట్ నికరలాభాలు రూ.1.04 లక్షల కోట్లుగా తేలాయి. కాగా ఈ ఆర్థికసంవత్సరం క్యూ1లో కంపెనీల అమ్మకాలు కూడాజూన్ చివరి నాటికి 8.7 శాతం తగ్గాయి. అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 9.5 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

CARE Ratings
Professional Risk Opinion

ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో అన్నీ కంపెనీలకు జీఎస్టీ సెగ తగిలింది. ప్రభుత్వం జులై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి తేవాలన్న పట్టుదలతో ఉండటంతో కార్పొరేట్లకు పరిస్థితులు ఒడిదుడుకులుగా మారాయి. కొత్తగా జీఎస్టీ అమల్లోకి వస్తున్న నేపథ్యంలో చాలా మటుకు కంపెనీలు తమ వద్ద ఉన్న సరకును వదిలించుకోవడానికి ప్రయత్నించాయి. దీంతో వ్యాపారాలపై తీవ్రప్రభావం పడిందని రేటింగ్ ఏజెన్సీ వివరించింది.

జీఎస్టీ వల్ల మొత్తం ఏడు రంగాలకు చెందిన పరిశ్రమలు నష్టపోయాయి. 33 రంగాలు లాభాలపై తీవ్ర ప్రభావం కనిపించింది. సంవత్సరం ప్రాతిపదికన చూస్తే నికరలాభాలు బాగా తగ్గిపోయాయి. అత్యధికంగా నష్టపోయిన రంగాలు విషయానికి వస్తే కన్స్యూమర్‌గూడ్స్, ఆటోమొబైల్ దానికి అనుబంధగా ఉండే కంపెనీలు, నిర్మాణం, రియల్ ఎస్టేట్, ఫైనాన్స్, రిఫైనరీస్,పేపర్ అండ్ పేపర్ ప్రొడక్ట్స్, పెస్టిసైడ్స్, ఆగ్రోకెమికల్ రంగాలున్నాయి. అలాగే సేవల రంగానికి వస్తే ఆతిథ్యం, రిటైలింగ్ రంగాల లాభాలపై భారీగానే ప్రభావం చూపించింది.

జీఎస్టీ అమల్లోకి వస్తున్న నేపథ్యంలో కంపెనీలు తమ వద్ద ఉన్న సరకును వదిలించుకునే ప్రయత్నాలు చేశాయి. దీంతో కంపెనీల లాభాల మార్జిన్ బాగా తగ్గిపోయాయని నివేదికలో వివరించింది. అమ్మకాల విషయానికి వస్తే 40 రంగాలకు చెందిన కంపెనీల అమ్మకాలు జోరందుకున్నాయి. వాటిలో చక్కెర, ఎలక్ట్రానిక్స్, ప్యాసింజర్‌కార్స్, ట్రాక్టర్లు, క్యాపిటల్‌గూడ్స్, మెటల్స్, ఎన్‌బీఎఫ్‌సీ, హోటల్స్, రిసార్ట్స్, రెస్టారెంట్స్, మైనింగ, రిఫైనరీలు, ప్లాస్టిక్ ప్రొడక్ట్స్, ఇండస్ట్రియల్ గ్యాసెస్, ఫ్యూయెల్స్ ఉన్నాయి.

దీనికి వ్యతిరేకంగా తొమ్మిది రంగాల అమ్మకాల తిరోగమనబాటపట్టాయి. వాటిలో ఫార్మా, డ్రగ్స్, ఆటో, ట్రక్కులు/ ఎల్‌సీవీలు, ఫెర్రోస్ మెటల్స్, టెలికం సర్వీస్ ప్రొవైడర్లున్నారు. అయితే గృహాల్లో వినియోగించే వస్తువుల రంగాలకు వస్తే స్థిరంగా ఉన్నాయి. ఫార్మాస్యూటికల్స్, ఔషధ రంగాల విషయానికి వస్తే ఎగుమతులు మందగించడంతో అమ్మకాలు భారీగా తగ్గాయి. కన్స్యూమర్ రంగానికి చెందిన పరిశ్రమలవిషయానికి వస్తే ఉదాహరణకు టెక్స్‌టైల్స్, డ్యూరబుల్స్.. వీటిలోనే ఆటో రంగం కూడా వస్తుంది. (ట్రాక్టర్లు తప్పించి) ఈ రంగాలు కాస్తా నిలదొక్కుకున్నాయని రేటింగ్ ఏజెన్సీ తెలిపింది.

జీఎస్టీ అమల్లోకి రానున్న నేపథ్యంలో పాత సరకును వదిలించు కోవడంతో అమ్మకాలు కూడా బాగానే పెరిగాయని కేర్ రేటింగ్ పేర్కొంది. జీఎస్టీ ప్రభావంతో కన్స్యూమర్‌గూడ్స్, కన్స్యూమర్ ఫుడ్స్, గృహాలకు వినియోగించే వస్తువులు, వ్యక్తిగత వస్తువుల విభాగం, ఔషధాలు, ఫార్మా రంగాలపై బాగానే ప్రభావం చూపించిందని కేర్ రేటింగ్స్‌నివేదికలో వివరించింది.

జీఎస్టీ మొదటి ఫైలింగ్ ద్వారా ప్రభుత్వానికి రూ.42వేల కోట్ల ఆదాయం

జీఎస్టీ అమల్లోకి వచ్చి మొదటి నెల పూర్తయింది. జీఎస్టీఫైలింగ్ ద్వారా ప్రభుత్వానికి రూ.42వేల కోట్ల ఆదాయం లభించింది. ఈ వారాంతానికి మరిన్ని ఫైలింగ్‌లు వచ్చే అవకాశం ఉన్నందు వల్ల ప్రభుత్వానికి వచ్చే రెవెన్యూ పెరిగే అవకాశాలున్నయని సీనియర్ ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలియజేశారు. వివరాల్లోకి వెళితే ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ(అంతరాష్ట్రాల మధ్య సరకు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి) సరకు తరలింపుపై రూ.15వేల కోట్లు, అలాగే విలాసవంతమైన కార్లు, పొగాకు ఉత్పత్తులపై రూ.5వేల కోట్లు, మరో రూ.22వేల కోట్లు కేంద్ర - జీఎస్టీ రాష్ట్ర జీఎస్టీల ద్వారా లభించింది. ఈ మొత్తాన్ని కేంద్ర రాష్ట్రాల మధ్య సమంగా పంచుకుంటాయి. సోమవారం ఉదయం వరకు జీఎస్టీపన్ను రూ.42వేల కోట్ల వరకు జమ అయ్యిందని ప్రభుత్వ ఉన్నతాధికారి తెలిపారు. జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీ తర్వాత వ్యాపారస్తులు ప్రతి నెలా తమ రిటర్న్స్ ఫైల్ చేయాల్సి ఉంటుంది. అయితే మొదటి నెల పూర్తయినందుకు తుది గడువును ఈ నెల 25 వరకు పొడిగించారు. వాస్తవానికి ఈ నెల 20 చివరి తేదీ కాగా..వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తినందుకు వల్ల తేదీని పొడిగించారు.

నేడు పీఎస్‌యు బ్యాంకు ఉద్యోగుల సమ్మె

న్యూఢిల్లీ : బ్యాంకింగ్‌రంగంలో ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలకు వ్యతిరేకంగా ప్రభుత్వ రంగానికి చెందిన ఉద్యోగులు(యూనైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్స్) (యూఎఫ్ బీయు) నేతృత్వంలో మంగళ వారం దేశవ్యాప్తంగా ఒక రోజు సమ్మెకు పిలుపునిచ్చాయి. దీంతో సాధారణ బ్యాంకింగ్ లావాదేవీ లకు విఘాతం కలుగుతుంది. బ్యాంకులో డిపాజిట్లు, విత్ డ్రాయల్స్, చెక్కుల క్లియరెన్స్; ఎన్ఈఎఫ్‌టీ, ఆర్‌టీజీఎస్ లావాదేవీలకు ఆటంకం కలుగుతుంది. అయితే ప్రైవేట్ బ్యాంకు ఐఈసీఐసీఐ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, కొటక్ మహీంద్రా బ్యాంకులు యధావిధిగా పనిచేస్తాయి. అయితే చెక్కులక్లియరెన్స్‌లో జాప్యం జరగవచ్చు. ఏపీ, తెలంగాణలో : మంగళవారం జరిగే సమ్మెలో ఏపీ, తెలంగాణకు చెందిన సుమారు 80వేల మంది సిబ్బంది సమ్మెలో పాల్గొంటారు. యూఎఫ్‌బీయు ఇచ్చిన సమ్మె పిలుపు మేరకు ఏపీ, తెలంగాణలో ఉన్న 5వేల బ్రాంచీల సిబ్బంది ఈ సమ్మెలో పాల్గొంటారని తెలంగాణ, ఏపీ యూనిట్‌ల యుఎఫ్‌బీయు కన్వీనర్ వీవీఎస్ఆర్ శర్మ సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రాబ్యాంకుకు చెందిన దేశవ్యాప్తంగా ఉన్న 300కు పైగా బ్రాంచీల్లో పనిచేస్తున్న సుమారు 21వేల మంది సిబ్బంది ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. తెలంగాణలో 600లకు పైగా ఉన్న శాఖల్లో పనిచేస్తున్న 5వేల మంది సిబ్బంది పాల్గొంటారని, హైదరాబాద్ ప్రధాన కార్యాలయ వద్ద నిరసన కార్యక్రమం చేపడతారు.



చేతులు మారిన ఎస్సార్ ఆయిల్

రుణ భారం తగ్గించుకున్న గ్రూపు

ముంబై : రుయాలకు చెందిన ఎస్సార్ ఆయిల్ భారత్‌లోని తమ ఆస్తులను రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్ కన్సార్షియంకు 1290 కోట్ల డాలర్లకు విక్రయించినట్లు సోమవారం నాడు ప్రకటించింది. తాజా లావాదేవీతో ఎస్సార్ గ్రూపు అప్పులు రూ.70వేల కోట్ల వరకు తగ్గుతాయి. ప్రస్తుతం కంపెనీ అప్పులు రూ.40వేల కోట్లుగా తేలాయి. మొత్తం డీల్ విలువ 1290 కోట్ల డాలర్లు. అయితే 500 కోట్ల గ్రూపు రుణాలతో పాటు గ్రూపునకు చెందిన మరో 600 కోట్ల డాలర్ల రుణాలను రాస్‌నెఫ్ట్ కన్సార్టియం తీరుస్తుందని ఎస్సార్ గ్రూపు డైరెక్టర్ ప్రశాంత్ రుయా సోమవారం మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ఒక విదేశీ కంపెనీలో భారత్‌లో అతి పెద్ద టేకోవర్ చేయడం ఇదే అవుతుంది. ఈ లావాదేవీ ముగిసిన తర్వాత గ్రూపు ఆస్తులు 1700 కోట్ల డాలర్లకు దిగివస్తాయి. గ్రూపు చేతిలో ఉక్కు, విద్యుత్, పోర్ట్స్, షిప్పింగ్, రిఫైనింగ్, గ్యాస్ వ్యాపారాలున్నాయి. ఎస్సార్ ఆయిల్ టేకోవర్ చేసిన తర్వాత షేర్ హోల్డింగ్ ఈ విధంగా ఉంటుంది. రాస్‌నెఫ్ట్‌దాని అనుబంధ సంస్థపెట్రోల్ కాంప్లెక్స్ పీటీఈ లిమిటెడ్‌కు 49.13 శాతం, ట్రాఫిగురా - యూసీపీ కన్సార్షియం (కేసాని ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ లిమిటెడ్)కు అంతే మొత్తం వాటాలుండగా.. మిగిలిన వాటాలు 1.74 శాతం, రిటైల్ వాటాదారుల చేతిలో ఉంటాయని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇదిలా ఉండగా ఎస్సార్ ఆయిల్‌ను రాస్‌నెఫ్ట్ కన్సార్షియానికి విక్రయించడానికి ఐసీఐసీఐ బ్యాంకు కీలకపాత్ర పోషించింది. ఐసీఐసీఐ బ్యాంకు ఎస్సార్‌గ్రూపునకు పెద్దమొత్తంలో రుణాలు ఇచ్చింది. తాజా లావాదేవీతో 50 శాతం వెనక్కి వచ్చినట్లేనని బ్యాంకు సీఈవో చందాకొచ్చార్ ఒక ప్రకటనలో తెలిపారు.

మార్కెట్లకు సిక్కా సెగ


• గ్లోబల్ మార్కెట్లు అదే దారిలో

• బీఎస్ఈ 266 పాయింట్లు పతనం

• ఇన్ఫోసిస్ షేరు 5.4 శాతం ఆవిరి

ముంబై: స్టాక్ మార్కెట్లు సోమవారం నాడు ప్రారంభంలో లాభాలతో మొదలైనా అటు తర్వాత నష్టాలను చవిచూశాయి. ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ రెండో రోజు కూడా నష్టాలతో ముగిసింది. కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విశాల్‌సిక్కా రాజీనామాతో షేరు భారీగా నష్టపోయింది. సోమవారం నాడు కూడా షేరు భారీగా క్షీణించింది. దీని ప్రభావం బీఎస్ఈ, ఎన్ఎస్ఈ రెండు సూచిలపై పడి రెండు నష్టపోయాయి.

బీఎస్ఈ 265.83 పాయింట్లు క్షీణించి 31,258.85 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ 83.05 పాయింట్ల నష్టపోయి 9,754.35 వద్ద ముగిసింది. వరుసగా రెండో రోజు స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ఇన్ఫోసిస్ 5.37 శాతం క్షీణించింది. విశాల్‌సిక్కా రాజీనామా తర్వాత నుంచి చూస్తే షేరు ఏకంగా 14.4 శాతం వరకు నష్టపోయింది. టీసీఎస్ మాత్రం 0.6 శాతం లాభపడింది. బీఎస్ఈలో వివిధ సూచిలను చూస్తే ఐటీ 2.04 శాతం, టెక్ 1.89 శాతం, పీఎస్‌యు 1.81 శాతం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 1.68 శాతం నష్టపోయాయి. బీఎస్ఈలో అత్యధికంగా నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి. ఇన్ఫోసిస్ 5.37 శాతం, అదానీపోర్ట్స్ 2.74 శాతం, డాక్టర్ రెడ్డీస్ 2.51 శాతం, సన్‌ఫార్మా 2.01శాతం, ఒఎన్‌జీసీ 1.99శాతం, దీనికి వ్యతిరేకంగా లాభాలను మూటగట్టుకున్న కంపెనీలు ఇలా ఉన్నాయి. యాక్సిస్ బ్యాంకు 0.7 శాతం టీసీఎస్ 0.34 శాతం, ఎంఅండ్ఎం 0.27 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 0.22 శాతం, ఐటీసీ 0.12 శాతం వరకు ఉన్నాయి.




ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ బోర్డు శనివారం నాడు రూ.13,000 కోట్ల షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించినా.. ఇన్ఫీ షేరు మాత్రం దారుణంగా పడి పోతోంది. బైబ్యాక్ ధర షేరుకు రూ.1,150గా ప్రకటించింది. శుక్ర వారం ముగింపు రూ.923.10తో పోల్చు కుంటే 25 శాతం వరకు డిస్కౌంట్ ఇచ్చినట్లు లెక్క. ఇన్ఫోసిస్ షేర్లు ఎప్పుడు కోలుకుం టాయో చెప్పడం కాస్తా ఇబ్బందే నని మార్కెట్ నిపుణులు చెబుతు న్నారు. కంపెనీ సంక్షోభంలో చిక్కుకుపోయిందని ఇప్పటికి ప్పుడే బయటపడే పరిస్థితి లేదంటున్నారు. లోహ రంగంలో వేదాంత 2.7 శాతం, హిందాల్కో 2.8 శాతం లాభ పడ్డాయి గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే వరుసగా మూడో ట్రేడింగ్ సెషన్ కూడా నష్టాలతో ముగిసింది. ఆసియా మార్కెట్లు కూడా అదే దారిలో పయనించాయి.

రిటైల్ ద్రవ్యోల్బణం 2-6 శాతం మధ్యనే

• బీఓఎఫ్ఏఎంఎల్

• ఆర్‌బీఐ అంచనా ప్రకారమే

న్యూఢిల్లీ : రిటైల్ ద్రవ్యోల్బణం రిజర్వుబ్యాంకు అంచనా ప్రకారం 2-6 శాతం మధ్యలోనే ఉంటుందని, డిసెంబర్ 6వ తేదీ జరిగే రిజర్వుబ్యాంకు ద్రవ్యపరపతి సమీక్షలో 25 బేసిస్ పాయింట్లు వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలున్నాయని అంచనా వేసింది. బ్యాంకు ఆఫ్ అమెరికా మెర్రిల్లించ్ (బీఓఎఫ్ఏఎంఎల్) ప్రకారం ద్రవ్యోల్బణం ఒత్తిడిని.. వర్షాలు తగ్గిస్తాయని, వృద్ధిరేటు తగ్గడంతో పాటు కమాడిటి ధరలుతగ్గడంతో ద్రవ్యోల్బణంపై పెద్దగా ఒత్తిడి ఉండదని తెలిపింది. అక్టోబర్‌లో జరిగే ఆర్‌బీఐ పరపతి సమీక్షలో వడ్డీరేట్ల జోలికి ఆర్‌బీఐ పోకపోవచ్చునని, డిసెంబర్ 6వ తేదీన జరిగే పరపతి సమీక్షలో మాత్రం పావు శాతం వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలున్నాయని అంచనా వేస్తోంది. బీఓఎఫ్ఎఎంల్ అంచనా ప్రకారం 2018 మొదటి సగభాగానికి సరాసరి ద్రవ్యోల్బణం 4.5 శాతం, మార్చి చివరి నాటికి 4.7 శాతం వరకు నమోదు కావచ్చునని పేర్కొంది. మొత్తానికి ద్రవ్యోల్బణం మాత్రం రిజర్వుబ్యాంకు అంచనా ప్రకారం 2-6 శాతం మధ్యలో తచ్చాడుతుందని, తమ అంచనా ప్రకారం డిసెంబర్ 6 నాటికి 0.25 శాతం వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలున్నాయని బీఓఎఫ్ఎఎంఎల్ ఒక పరిశోధన పత్రంలో వెల్లడించింది. అయితే ఈ నెలాఖరు నాటికి రుతుపవనాలు కనుమరుగయ్యే ప్రమాదం కూడా ఉందని దీంతో వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగి ద్రవ్యోల్బణం కోరలు చాచే అవకాశాలు లేకపోలేదని.. మార్చి చివరి నాటికి రిటైల్ ద్రవ్యోల్బణం ఐదు శాతానికి ఎగబాకుతుందని దీంతో ఆర్‌బీఐ చివరగా ఫిబ్రవరిలో మరోసారి వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలు వాయిదాపడే అవకాశాన్ని తోసి పుచ్చలేమని నివేదికలో తెలిపింది. వృద్ధిరేటు తగ్గముఖం పట్టడంతో ద్రవ్యోల్బణంపై దాని ప్రభావం ఉంటుంది. కాగా ఆర్‌బీఐ మాత్రం ద్రవ్యోల్బణాన్ని నాలుగు శాతం ప్లస్ లేదా మైనస్ రెండు శాతంగా తీసుకురావాలని గట్టి ప్రయత్నం చేస్తోంది. మార్చి త్రైమాసానికి బ్రెంట్ ముడి చమురు బ్యారల్ 49 డాలర్లు పలుకుతుందని బీఓఎఫ్ఎఎంఎల్ అంచనా వేస్తోంది. ఇదిలా ఉండగా టోకు ద్రవ్యోల్బణం జులైలో భారీగా పెరిగి 1.88



శాతానికి ఎగబాకింది. అంతకు ముందు జూన్‌లో 0.9 శాతంగా నమోదైంది. కూరగాయల ధరలతో పాటు ఆహార పదార్థాల ధరలు పెరగడంతో ద్రవ్యోల్బణం మళ్లీ మొదటికొచ్చింది.

ఇక రిటైల్ ద్రవ్యోల్బణం విషయానికి వస్తే జులైలో 2.36 శాతానికి ఎగబాకింది. దీనికి ప్రధాన కారణం చక్కెర, మిఠాయిలు తయారు చేసే వస్తువులు, పాన్, పొగాకు, ఆరోగ్యానికి హానికరం చేస్తేవస్తువుల ధరలు పెరగడంతో దాని ప్రభావం రిటైల్ ద్రవ్యోల్బణంపై పడింది. ఆర్‌బీఐ ఈ నెలలో జరిపిన ద్రవ్య పరపతి సమీక్షలో వడ్డీరేట్లు 0.25 శాతం తగ్గించింది. దీంతో గృహ, ఆటో, ఇతర రుణాలపై వడ్డీరేట్లు తగ్గుతాయి. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది.

యమహా నుంచి 250 సీసీ బైక్

ఫేజర్ 25 ధర రూ.1.28 లక్షలు

న్యూఢిల్లీ : జపాన్‌కు చెందిన ద్విచక్ర వాహన తయారీ కంపెనీ యమహా సోమవారం నాడు కొత్త బైక్ 250 సీసీ ఫేజర్ 25ను మార్కెట్లో విడుదల చేసింది. దీని ధర రూ.1.28 లక్షలని ప్రకటించింది. ఈ ఏడాది కంపెనీ మార్కెట్లో రెండో బైక్‌ను విడుదల చేస్తోంది. ఈ ఏడాది జనవరిలో ఎఫ్‌జెడ్ 25ను విడుదల చేసింది. కొత్త బైక్ వచ్చే నెల రోడ్డుపైకి వస్తుంది. కస్టమర్ల అంచనాకు తగ్గట్టు బైక్‌లో కొన్ని మార్పులు చేర్పులుచేశామని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మాసాకి అసానో బైక్‌ను ప్రారంభిస్తూ చెప్పారు. కొత్త బైక్ అమ్మకాలు జోరందుకుంటా యన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.




24 వరకు బిఎస్ఎన్ఎల్ మెగా మేళా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బిఎస్ఎన్ఎల్ ఈ నెల 24 వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మెగామేళా నిర్వహిస్తుంది. ఈ మేళాలో వినియోగదారులు ఉచిత 3జి స్మార్టు సిమ్‌లను పొందవచ్చని చీఫ్ జనరల్ మేనేజర్ అనంతరామ్ తెలిపారు. వినియోగదారులు కొత్త కనెక్షన్‌తో 350 ఎంబి ఉచిత డాటా పొందవచ్చన్నారు. కస్టమర్ సర్వీస్ సెంటర్లు, ఫ్రాంచైజ్, రిటైల్ ఔట్‌లెట్‌లతో పాటుగా రోడ్ షోలలో బిఎస్ఎన్ఎల్ సేవలను పొందవచ్చన్నారు.

లగ్జరీ కార్ల ధరకు రెక్కలు

• సుంకం 25 శాతానికి పెంపు?




హైదరాబాద్ : త్వరలో లగ్జరీ కార్ల ధరలు పెరగనున్నాయి. కేంద్రప్రభుత్వం రాబోయే కొన్ని వారాల్లోనే ఆర్డినెన్స్ ద్వారా లగ్జరీ కార్ల సుంకాన్ని 15 శాతం నుంచి 25 శాతానికి పెంచే ఆలోచనలో ఉంది. ఇదిలా ఉండగా జీఎస్టీ కౌన్సిల్ ఎస్‌యూవీలు, పెద్దకార్లు, మిడ్‌సైజ్, లగ్జరీ కార్లపై సుంకాన్ని ప్రస్తుతం 15 శాతం సుంకాన్ని 25 శాతానికి పెంచాలని సిఫారసు చేసింది. ఆర్డినెన్స్‌లో మార్పులు చూస్తే మాత్రం అత్యధికంగా అమ్ముడుపోయే సెడాన్‌లు హోండాసిటీ, మారుతి సియాజ్‌తో పాటు సుమారు 50 కార్ల వరకు ధరలు పెరుగుతాయి. అయితే గత నెల 1 నుంచి కేంద్రప్రభుత్వం జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత కార్ల ధరలు 10-15 శాతం వరకు తగ్గాయి.

దీనికి కారణం గతంలో వసూలు చేసే ఎక్సైజ్, సేల్స్‌టాక్స్, వ్యాట్‌తో పాటు ఇతర పన్నులు ఉదాహరణకు ఆక్ట్రాయ్ లాంటివి జీఎస్టీ వచ్చిన తర్వాత మటుమాయం అయ్యాయి. కొత్తగా జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత కార్లపై అత్యధికంగా 28 శాతం పన్నుతో పాటు లగ్జరీ కార్లయితే 1-15 శాతం వరకు పన్ను విధిస్తున్నారు. అదనపు సుంకాన్ని ప్రభుత్వం జీఎస్టీ అమలుతో రాష్ట్రాలు నష్టపోతున్న రెవెన్యూను ఈ డబ్బుతో సర్దుబాటు చేస్తాయి. ఆర్డినెన్స్‌లో సవరణ చేయాలంటే జీఎస్టీషెడ్యూలు సెక్షన్ 8లో (రాష్ట్రాలకు పరిహారం)చట్టం -2017లో మార్పులు చేయల్సి వస్తుంది. దీనికి ఆర్థికమంత్రిత్వశాఖ అనుమతి అవసరం అవుతుంది. ఇదిలా ఉండగా రాష్ట్రపతి కోవింద్ అనుమతి ఇచ్చిన వెంటనే వచ్చే శీతాకాల సమావేశంలో ఆర్డినెన్స్‌కు ఆమోదం లభిస్తుంది. అటు తర్వాత నుంచి కార్ల ధరలు పెరుగుతాయి.

నేడు యువ సీఈవోలతో మోడీ భేటీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోడీ మంగళవారం నాడు యువకులైన 200 యువ సీఈవోలతో భేటీకానున్నారు. వాటిలో రాజీవ్ బజాజ్ (బజాజ్‌ఆటో), అవిన్ బియానీకి చెందిన ఫ్యూచర్ రిటైల్‌తో సమావేశం కానున్నారు. వృద్ధిరేటు పెంచుకోవడానికి, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి వారి నుంచి సలహాలు సూచనలు తీసుకుంటారు. ఇలాంటి కార్యక్రమమే గత వారం నీతీ ఆయోగ్ ఏర్పాటు చేసింది. ఛాంపియన్ ఆఫ్ చేంజ్ పేరుతో 212 మంది యువ వ్యాపారవేత్తలతో ప్రధాని సమావేశం అయ్యారు. ఛాంపియన్స్ ఆఫ్ చేంజ్ కింద యువ సీఈవోలతో మొత్తం ఆరు అంశాలపై నిశితంగా చర్చించారు. 2022 నాటికి కొత్త భారత్‌ను ఆవిష్కరించడం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, రేపటి కోసం కొత్త నగరాలను సృష్టించడం, మేకిన్ ఇండియాను మరింత ముందుకు తీసుకెళ్లడం, ఆర్థికరంగంలో సంస్కరణలు తీసుకురావడం, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడం. కాగా యువ సీఈవోలు ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు కేంద్రమంత్రులు, వారిలో ఆర్థికమంత్రిని సోమవారం కలుస్తారు. ఈసమావేశాల తర్వాత విందు ఏర్పాటు చేస్తారు. దీనికి ప్రధానమంత్రి కూడా హాజరవుతారు. మంగళవారం నాడు సీఈవోలు ప్రధానమంత్రికి 15 సంవత్సరాల విజన్ డాక్యుమెంటును ప్రదర్శించి చూపుతారని నీతి ఆయోగ్ అధికారి ఒకరు చెప్పారు. మొత్తం 200 మంది యువ సీఈవోలు ఆరు జట్లుగా విడిపోతారు. సంబంధిత మంత్రితో వీరిని జత చేస్తారు. కీలక అంశాలకు వీరు దక్సూచిగా నిలుస్తారు. ఈ యువ సీఈవోల్లో పార్క్ హోటల్‌కు చెందిన ప్రియాపంత్, ఎస్కార్ట్స్‌కు చెందిన నిఖిల్ నందాలు కూడా ఉంటారని ఆయన అన్నారు.



నిరుపేద యువతకు ఐసిఐసిఐ అకాడమి శిక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఐసిఐసిఐ ఫౌండేషన్ ఫర్ ఇన్‌క్లూజివ్ గ్రోత్ ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూట్, ఐసిఐసిఐ అకాడమీ ఫర్ స్కిల్స్ ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు చెందిన యువతకు వృత్తి విద్యాశిక్షణను అందిస్తూ వారికి స్థిరమైన జీవన ఉపాధి కల్పించేందుకు సహాయ పడుతోంది. హైదరాబాద్‌లోని అకాడమీ, సంబంధిత ప్రాక్టికల్ శిక్షణను నిరుపేద యువతకు అమ్మకపు నైపుణ్యం, రిటైల్ సేల్స్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్‌లలో శిక్షణ ఇస్తుంది. ప్రతి ఏడాది 50 బ్యాచ్‌లకు శిక్షణ అందించే సామర్థ్యం ఈ అకాడమీకి ఉంది. హైదరాబాద్ కేంద్రం ద్వారా ఇప్పటికీ 7,300 మందికి శిక్షణ అందిస్తే, ఇందులో 50శాతం మంది మహిళలే ఉన్నారు. దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో నైపుణ్యాభివృద్ధి అనేది అతి ముఖ్యమైన అంశంగా ఈ సంస్థ గుర్తించింది. ప్రతి ఒక్కపూ స్థిరమైన జీవనోపాధి పొందడంతో పాటు సమృద్ధి కావడానికి మానవ వనరుల లభ్యత, ఎంప్లాయిబిలిటీ నడుమనున్న అతిక్లిష్టమైన ఖాళీ పూరించడం ముఖ్యమన్నారు. ఈ లక్ష్యంతోనే వృత్తి నైపుణ్యాభివృద్ధి కోసం స్కిల్స్ అకాడమీలను ఏర్పాటు చేయాలనే ఆలోచన స్ఫురించింది. ఐసిఐసిఐ అకాడమీ స్కిల్స్‌ను 2013వ సంవత్సరంలో ప్రారంభించింది. ఉచితంగా జాబ్ ఓరియెంటెడ్ శిక్షణ అందించడంతో పాటుగా నిరుపేద యువత తమ శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఉపాధి పొందేందుకు సహాయ పడుతోంది. ఇండస్ట్రీ నెట్‌వర్క్ భాగస్వామ్యం ద్వారా ఈ ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ఈ స్కిల్స్ అకాడమీల ద్వారా 11 నైపుణ్యాలలో శిక్షణ ఇస్తోంది. ప్రస్తుతం 24 స్కిల్ అకాడమీలు దేశవ్యాప్తంగా ఉన్నాయి. ఐసిఐసిఐ అకాడమీ ఫర్ స్కిల్స్, రూరల్ ఇనిషియేటివ్, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ ద్వారా లక్షా 56వేల మంది యువతకు శిక్షణ ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఐసిఐసిఐ ఫౌండేషన్ 1.2 లక్షల మంది యువతకు శిక్షణ అందించడాన్ని లక్ష్యంగా ఈ ఫౌండేషన్ ముందుకు అడుగులు వేస్తోంది.

'ఐఎఫ్‌ఎల్' రెడీ టు ఈట్ ఉత్పత్తులు

• తెలుగు రాష్ట్రాల్లో ఆవిష్కరణ

• త్వరలో అందుబాటులోకి అన్ని రకాలు

• సంస్థ వైస్ ప్రెసిడెంట్ సౌరభ్ కుమార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మారుతున్న సమాజానికి అనుగుణంగా, అన్ని వర్గాల ప్రజల అభిరుచులకు తగిన విధంగా రెడీ టు ఈట్ ఆహారోత్పత్తులను మార్కెట్లోకి ఆవిష్కరిస్తున్నట్లు ఇన్నోవేటెడ్ ఫుడ్స్ లిమిటెడ్ (ఐఎఫ్‌ఎల్) సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగం వైస్ ప్రెసిడెంట్ సౌరభ్ కుమార్ తెలిపారు. ఇండియన్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీలో తమ ప్రాజెన్ ఫుడ్ శ్రేణిని 'సుమేరు' బ్రాండ్‌తోతెలుగు రాష్ట్రాల్లో ఆవిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. అతిత్వరలోనే అన్ని నగరాలు, పట్టణాలకు తమ సంస్థ ఆహార ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో చర్యలు ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ప్రముఖ మాస్టర్ చెఫ్ అజయ్ చోప్రాతో కలిసి మాట్లాడారు. ప్రజలు అనేక సందర్భాల్లో రెస్టారెంట్ తరహా భోజనాన్ని ఇంట్లోనే తయారు చేసుకునే విధంగా అన్ని రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు సౌరభ్ ప్రకటించారు.

దేశవ్యాప్తంగా పరాటాను ఎక్కువమంది అభిమానిస్తున్నందున వారి అభిరుచలకు అనుగుణంగా వివిధ రకాల పరాటాలను రెడీ టు ఈట్ తరహాలో అన్ని మార్కెట్లలో లభించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీట్‌రూట్, జీరా, టర్మరిక్, అజ్వైన్, మేథీ, స్పినాచ్, మల్టీ గ్రెయిన్ తదితర ఒరిజినల్ ఫ్లేవర్లలో రెడీ టు ఈట్ పరాటాలు దొరుకుతాయన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ధరలు నిర్ణయించామన్నారు. ఐదు పరాటాలతో కూడిన ప్యాక్ ధర కేవలం రూ.80 నుంచి రూ.100లోపు మాత్రమే లభిస్తుందని సంస్థ ఉపాధ్యక్షుడు సౌరభ్ కుమార్ వెల్లడించారు.

మరుగుదొడ్ల మరమ్మతులకు నిధులు

● 9820 పాఠశాలలను గుర్తించిన అధికారులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు కెజిబివిలలోనూ అవసరమైన మరుగుదొడ్లను నిర్మించడంతోపాటు, ఇప్పటికే ఉన్న వాటి మరమ్మతులు, నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో కలిపి 61,202 మరుగుదొడ్లు ఉన్నాయి. వాటిలో కొన్నింటికి మరమ్మతులు చేయాల్సి ఉన్నట్టు అధికారులు గుర్తించారు. పాఠశాలలు ప్రారంభం కాకముందే వాటిని గుర్తించిన అధికారులు మరమ్మతులు చేయించాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాదిలో 9,820 పాఠశాలల్లో మరమ్మతులు చేయాల్సిన మరుగుదొడ్లు ఉన్నట్టు గుర్తించారు. వాటిలో ప్రైమరీ స్కూల్స్‌లో 6,374, అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌లో 1,362, హైస్కూల్స్‌లో 2,084 ఉన్నాయి. వాటిలో మరమ్మతులను ఇప్పటికే ప్రారంభించినట్టు అధికారులు చెబుతున్నారు. సర్వశిక్షఅభియాన్ నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులను కలిపి మరుగుదొడ్ల మరమ్మతులు చేపడుతున్నారు. అంతేకాకుండా మరుగుదొడ్ల నిర్వహణ కోసం కూడా ప్రత్యేకంగా నిధులను మంజూరు చేశారు. ఇప్పటికే దీనికి సుమారు రూ. 10 కోట్ల నిధులను విడుదల చేసినట్టు అధికారులు చెబుతున్నారు. విద్యార్థుల సంఖ్య బడిబాట తరువాత పెరిగిన పక్షంలో అవసరం అయితే కొత్తగా మరుగుదొడ్లను సైతం ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు అధికారులు చెబుతున్నారు. గత ఏడాదిలో మరుగుదొడ్ల మరమ్మతులు, కొత్త వాటి నిర్మాణం కోసం రూ. 31 కోట్లను ఖర్చు చేసినట్టు అధికారులు చెబుతున్నారు.

రైలు కింద పడి కవలలు మృతి

కామారెడ్డి క్రైం, కెఎన్ఎన్ : కామారెడ్డి మండలం నర్సన్నపల్లి గ్రామంలో సోమవారం రైలు కింద పడి ఇద్దరు కవలలు మృతి చెందారు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విద్వేష్(2), విగ్నేష్(2) కవలలు రైలు పట్టాలపై ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు రైలు కింద పడి మరణించారు. ఇద్దరు పిల్లలు ఒకేసారి ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు రోదనలు వర్ణనాతీతం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

డిగ్రీలో వెబ్ ఆప్షన్లకు మరో అవకాశం

● నేడు డిప్యూటీ సీఎం వద్ద దోస్త్ సమావేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరడం కోసం దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మరోసారి వెబ్ ఆప్షన్లకు సర్కార్ అవకాశం ఇవ్వనుంది. ఇప్పటికే మూడు విడతలుగా వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చిన సర్కార్ సీట్లు పొందిన వారికి కాలేజీల్లో చేరడానికి అవకాశం ఇచ్చింది. మూడో విడతలో సీట్ల కేటాయింపులో కొంత గందరగోళం జరగడంతోపాటు, దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి ఏ కాలేజీలోనూ సీటు రాని వారు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జరిగిన దోస్త్ సమావేశంలో ఇప్పటికే దరఖాస్తు చేసుకుని ఉన్న వారికి మరోసారి వెబ్‌ఆప్షన్లకు అవకాశం ఇవ్వాలని ప్రతిపాదన వచ్చినట్టు తెలిసింది. ఇదే అంశంపై మంగళవారం ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి ఉన్నతవిద్యా మండలి, కాలేజీయేట్ కమిషనరేట్ అధికారులతో సమీక్షనిర్వహించి నిర్ణయం తీసుకోనున్నారు.

నేడు ఇంటర్ విద్యా మండలి సమావేశం

ఇంటర్మీడియట్ విద్యా మండలి సమావేశం మంగళవారం జరగనుంది. సమావేశం సచివాలయంలో విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు సమావేశం జరగనుంది. ఇంటర్‌లో అడ్మిషన్ల ప్రక్రియ తోపాటు, అనుబంధ గుర్తింపు ప్రక్రియపై నేడు ప్రధానంగా చర్చ జరగనుంది. అనుబంధ గుర్తింపు కోసం ప్రభుత్వం సోమవారం తుది గడువుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో అన్ని యూనివర్సిటీల ఉపకులపతులు, కాలేజీయేట్ కమిషనర్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ తదితరులు పాల్గొంటారు.

వేధింపులు మానుకోవాలి

● స్కూల్ డైరెక్టరేట్‌ను ముట్టడించిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులపై ఉన్నతాధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ సంఘం అధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం పాఠశాల విద్యా శాఖ సంచాలకులు కార్యాలయాన్ని ముట్టడించారు. డైక్టరేట్ ముట్టడికి ప్రయత్నించిన ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేశారు. సుదీర్ఘ కాలంగా పరిష్కారానికి నోచుకోని తమ సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్ డిమాండ్ చేశారు. ముట్టడి కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శాగ కైలాసం, నాయకులు సంతోష్ నాయక్, హరిలాల్, సంజీవరావు, విజయ్ కుమార్‌తోపాటు జిల్లాల నాయకులు పాల్గొన్నారు. విద్యా శాఖలో అవినీతికి పాల్పడుతున్న అగ్రవర్ణ ఉన్నతాధికారులను కాపాడుతూ, అమాయక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన చిన్న స్థాయి అధికారులను బదిలీ చేయడం ఆపాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్ డిమాండ్ చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ వచ్చినందున ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూర్చేందుకు జీవో నంబర్ 342కు అనుబంధంగా ఉన్న మోమో నంబర్ 26559 వెంటనే రద్దు చేయాలన్నారు. 2003 డీఎస్సీ అభ్యర్థులకు సీపీఎస్- జిపిఎఫ్ ఏరియర్స్ పొందేందుకు స్పష్టమైన ఆదేశాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్‌ను కొనసాగించాలన్నారు. ప్రమోషన్స్‌లో రిజర్వేషన్ జీవో ఎంఎస్ నంబర్ 2లో అడెక్వెన్సీ అనేపదాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ వర్తింప చేయాలన్నారు.

బీసీ భవన్ ఏర్పాటు చేయాలి

● మంత్రి ఈటలకు బీసీ నేతల విజ్ఞప్తి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో బీసీల సంక్షేమం కోసం బీసీ భవన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. బీసీ భవన్‌ను ఏర్పాటు చేయించేలా చూడాలని కోరుతూ ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు సంఘం నేతలు సోమవారం విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, నేతలు ఎస్ దుర్గయ్యగౌడ్, కనకాల శ్యాం కురుమ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, ఆర్ యుగంధర్‌గౌడ్, సింగం నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీసీ జనాభా 52 శాతం ఉన్నారని వారి అభివృద్ధి కోసం 10 ఎకరాల్లో రూ. 100 కోట్లతో బీసీ భవన్‌ను ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. తమిళనాడు తరహాలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచే బీసీ సబ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న 112 బీసీ కులాల్లో అత్యంత వెనుకబడిన వారు, సంచారజాతుల వారు ఉన్నారని అన్నారు. బీసీ భవన్ కోసం ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావును కలిసి చర్చించి ఒప్పిస్తానని మంత్రి ఈటల రాజేందర్ హామీ ఇచ్చారని జాజుల తెలిపారు.

హైదరాబాద్‌లో సరస్ ఎగ్జిబిషన్

• వచ్చే నెల 14 నుంచి 26 వరకు నిర్వహణ



(ఫైల్ ఫొటో)

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో ప్రతి ఏటా దసరాపండుగ కంటే ముందు నిర్వహించేద్వారా ఉత్పత్తుల సరస్ ఎగ్జిబిషన్ కు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సరస్‌ను వచ్చే నెల 14వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ హైదరాబాద్‌లో నిర్వహించాలని సెర్ప్ నిర్ణయించింది. ప్రతి ఏటా నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో సరస్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం అనవాయితీ. కానీ ఈ ఏడాది పీపుల్స్‌ప్లాజా వేరే కార్యక్రమాలకు బుక్ అయినట్లు తెలిసింది. అంతేకాకుండా ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు వస్తున్నట్లు సమాచారం.

దీంతో ఈ ఏడాది పీపుల్స్ ప్లాజాలో సరస్ ఎగ్జిబిషన్‌కు అనుమతి ఇవ్వలేమని హెచ్ఎండీఏ అధికారులు వెల్లడించినట్లు తెలిసింది. దీంతో ఎగ్జిబిషన్ స్థలం కోసం సెర్ప్ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందుగా బుక్ చేసుకోకపోవడంతో ఈ ఇబ్బందులు తలెత్తినట్లు అధికారులు చెబుతున్నారు.

ఎగ్జిబిషన్ స్థలం కోసం ఎన్టీయార్ స్టేడియం, ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లను సోమవారం సెర్ప్ సీఇఓ పరిశీలించారు. ఈ రెండింటిలో ఏదో ఒక దాంట్లో ఎగ్జిబిషన్‌ను నిర్వహించాలని అధికారులు యోచిస్తున్నారు. కానీ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించాలంటే ఖరీదు ఎక్కువగా ఉంటుందని, ఎన్టీయార్ స్టేడియం అయితే తమ బడ్జెట్‌కు సరిపోతుందని అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. సరస్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ నిధులను వెచ్చిస్తుంది. కానీ ఆ నిధులు పెద్దగా సరిపోవడం లేదు. గతేడాది సరస్‌కు సుమారు రూ.80లక్షలు ఖర్చయినట్లు అధికారులు అందించిన లెక్కల ప్రకారం తెలుస్తోంది. కానీ కేంద్రప్రభుత్వం సరస్ ఎగ్జిబిషన్ కోసం రూ.40లక్షలు మాత్రమే విడుదల చేస్తుంది. దీంతో మిగిలిన నిధులను అయా బ్యాంకుల సహకారంతో సమకూర్చేందుకు సెర్ప్ చొరవ తీసుకుంటుంది. ఇదిలా ఉండగా సరస్ ఎగ్జిబిషన్‌ను ఇక నుంచి ఏడాదిలో రెండుసార్లు నిర్వహించాలని సెర్ప్ నిర్ణయించింది. దీంతో వచ్చే నెలలో నిర్వహించే సరస్‌లో 250స్టాళ్ల కంటే ఎక్కువగా అనుమతించరాదని నిర్ణయించింది.

ఆర్టీసీ ఉద్యోగుల సామూహిక దీక్షలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆందోళన బాట పట్టింది. సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే క్షేత్ర స్థాయిలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలను నిర్వహించింది. మంగళవారం నాడు అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట సామూహిక నిరాహార దీక్షలు నిర్వహించబోతుంది. యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. రాజిరెడ్డి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 2017 నుండి రావలసిన పే స్కేల్‌ను అమలు జరపాలని, జాప్యం జరిగినందున 30 శాతం ఐఆర్ ఇవ్వాలని, కార్మికులపై పని భారం తగ్గించాలని, ఆర్టీసీలో మూసివేతలను నిలిపివేయాలని, ప్రైవేటు బస్సుల అక్రమ రవాణాలను అరికట్టాలని, సకల జనుల సమ్మె కాలానికి వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని, అద్దె బస్సులను రద్దు చేసి సొంత బస్సులను పెంచుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంతగా సామూహిక నిరాహార దీక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాజిరెడ్డి తెలిపారు.

నల్లగొండలో బిఎంఎస్ రాష్ట్ర మహాసభలు

బిఎంఎస్ అనుబంధ టిఎస్‌ఆర్‌టిసీ కార్మిక సంఘ్ రాష్ట్ర ద్వితీయ మహసభలు ఈ నెల 27న నల్లగొండలో నిర్వహించబోతున్నామని కార్మిక సంఘ్ ప్రధాన కార్యదర్శి పి. రమేష్ కుమార్ తెలిపారు. మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కార్మికుల న్యాయబద్ధమైన సమస్యల సాధనలో కార్మిక సంఘ్ ఎల్లెడలా ముందుంటుందన్నారు. ఆర్టీసీలో అనేక అవకతవకల కారణంగా సంస్థ నష్టాల భారిన పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహాసభల్లో తెలంగాణలోని అన్ని డిపోల నుండి సుమారు 250 మంది ప్రతినిధులు హాజరవుతారని రమేష్ కుమార్ వెల్లడించారు.

కాకినాడ ఎన్నికల తర్వాతనే...

తుని కేసుల్లో 'అభియోగ పత్రాలు' దాఖలు!

అమరావతి, ఆంధ్రప్రభ : కాకినాడ కార్పోరేషన్ ఎన్నికల తర్వాత తుని ఘటనపై చార్జిషీట్ల దాఖలుకు సీఐడీ ఏర్పాట్లు చేస్తోంది. గత నెలలోనే తుని ఘటనపై చార్జిషీట్ల దాఖలకు సీఐడీ సిద్ధమైనప్పటికీ ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో పెండింగ్‌లో ఉంచారు. ఈ నెల 29న కాకినాడ కార్పోరేషన్ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ మొదటి వారంలో తుని ఘటనలపై నమోదైన అన్ని కేసుల్లోను చార్జిషీటు దాఖలుకు సిఐడి అధికారులు నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తూర్పుగోదావరి జిల్లా తునిలో కాపులను బీసీల్లో చేర్చాలంటూ 2016 జనవరి 31న కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం నేతృ త్వంలో జరిగిన నిరసన కార్యక్రమం విధ్వంసానికి దారితీసింది. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వచ్చిన యువకులు ఆవేశానికి లోనై రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ బోగీలను ధ్వంసం చేయడంతో పాటు పోలీసు స్టేషన్, పోలీసు వాహనాలకు నిప్పుపెట్టారు. ఈ ఘటనలో పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల నష్టం భారీగా జరిగింది. తుని ఘటనలపై విచారణ బాధ్యతలను ప్రభుత్వం సీఐడీకి బదలాయించింది. సీఐడీ అదనపు డీజీ సిహెచ్.ద్వారకా తిరుమలరావు నేతృత్వంలో పలు బృందాలు తుని ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాయి. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకొని సెల్‌ఫోన్ కాల్స్ డేటా, సీసీ టీవీ ఫుటేజ్ వంటి వివరాలు తీసుకొని 69 కేసులు నమోదు చేశారు. ఆయా కేసుల్లో 324మందిని నిందితులుగా చేర్చిన సీఐడీ అధికారులు.. మెజారిటీ కేసుల్లో మొదటి ముద్దాయిగా ముద్రగడ పద్మనాభంను పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం ఉద్రేకపూరిత ప్రసంగాలతో రెచ్చగొట్టడం కారణంగానే ఆవేశానికి లోనైన యువత విధ్వంసక చర్యలకు పాల్పడినట్లు సీఐడీ అధికారులు నిర్ధారించారు. ముద్రగడ పద్మనాభం మలివిడత మహా పాదయాత్ర నేపథ్యంలో గత నెలలో తొలి విడతగా 29 కేసుల్లో కాకినాడ కోర్టులో చార్జిషీటు దాఖలుకు సీఐడీ అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించి అభియోగ పత్రాలన్నీ సిద్ధం చేసుకున్నారు. ఆయా కేసుల్లో ముద్రగడ సహా ఇతర నిందితులు, వారు నేరం చేసిన విధానం వంటి అన్ని అంశాలను పొందుపరిచారు. గత నెలాఖరలో కాకినాడ కోర్టులో చార్జిషీటుకు సీఐడీ అధికారులు సమాయత్తమైన తర్వాత ప్రభుత్వం పునరాలోచనలో పడింది. అప్పటికే కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణకు హైకోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలు వెలువడటంతో తుని కేసుల్లో చార్జిషీటు దాఖలు చేయడం వలన వచ్చే ఇబ్బందులపై సమీక్ష జరిగినట్లు చెపుతున్నారు. కాకినాడలో కాపు సామాజిక వర్గం ఎన్నికల్లో ప్రధాన ప్రభావం చూపనుంది.

పైగా తూర్పు గోదావరి జిల్లాలో ముద్రగడ పద్మనాభానికి బలమైన అనుచర వర్గం ఉంది. కాకినాడ కార్పొరేషన్‌లో ప్రధాన రాజకీయ పక్షాలు మెజారిటీ వార్డులు కాపులకు కేటాయించడమే ఇందుకు నిదర్శనం. ఈ దశలో తుని ఘటనపై చార్జిషీట్లు దాఖలు చేస్తే ఎన్నికలపై ప్రభావం చూపుతుందనే అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే అభియోగ పత్రాల దాఖలుకు కొంత సమయం తీసుకోవాంటూ ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు వెలువడినట్లు చెబుతున్నారు.

ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంలో
8 మందికి రెండేళ్ల జైలు

అమరావతి, ఆంధ్రప్రభ : ఉపాధి హామీ నిధుల దుర్వినియోగం కేసులో ఎనిమిది మంది నిందితులకు సోమవారం కర్నూలు ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కె.సుధాకర్ జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం చెర్ల కొత్తూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో 2007-08, 2008-09 సంవత్సరాల్లో నిధుల దుర్వినియోగం జరిగినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. దీంతో కర్నూలు రేంజ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరిపి జాబితాలో పేర్కొన్న కూలీలను విచారించగా తాము పనులకు వెళ్లలేదని, కూలీ రూపంలో ఇంత వరకు డబ్బులు తీసుకోలేదని రాతపూర్వక సమాధానాలు ఇచ్చారు. ఇందులో భాగంగా రూ. 1.18 లక్షల రూపాయలు దుర్వినియోగం జరిగినట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు ఏసీబీ డీజీ ఆదేశాల మేరకు ఫీల్డు అసిస్టెంట్ ఎం.ధనలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ కె.లక్ష్మీదేవీ, అదనపు ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.రామకృష్ణుడు, ఉద్యోగులు జి.మహేష్, బి.వెంకటరాములు, ఈ.రాజేశ్వరి, శ్రీనివాసులు, గోవర్ధనగిరి బ్రాంచి పోస్టుమాస్టర్ ఎల్లప్పపై కేసులు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ ఆరోపించిన ఒక్కొక్క నేరానికి రెండేళ్ల కారాగార శిక్ష, రూ.వెయ్యి రూపాయల ఒక్కొక్కరికి రూ.3వేల జరిమానా విధించారు.

ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా నగిలి షణ్మోహన్

అమరావతి, ఆంధ్రప్రభ : ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయ అదనపు కమిషనర్‌గా నగిలి షణ్మోహన్ బాధ్యతలు స్వీకరించారు. ఏటూరు ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ విధులనుండి రిలీవ్ అయిన ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. అమరావతి గవర్నమెంట్ సిటీ ప్రాజెక్టు వ్యవహారాలను అదనపు కమిషనర్‌గా షణ్మోహన్ పర్యవేక్షించనున్నారు. 2013 బ్యాచ్‌కు చెందిన ఐఏస్ అధికారిగా ఈయన ఒంగోలులో శిక్షణ పూర్తిచేసుకున్నారు. అనంతరం పశ్చిమ గోదావరి జిల్లా కేఆర్ పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా నియమితుల య్యారు. ఇటీవల ఐఏస్‌ల బదిలీల్లో షణ్మోహన్‌ను ఏపీ సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా ప్రభుత్వం నియమించిన సంగతి విదితమే.

తెలంగాణ జీవోతో ఏపీలో మోసం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఒక రాష్ట్రం జారీ చేసిన జీవో (ప్రభుత్వ ఉత్తర్వు)లను మరో రాష్ట్రంలో మోసానికి వాడుతున్నారు. మోసగాళ్లకు జీవోలు కూడా వరంగా మారుతున్నాయి. నిరుద్యోగులను మోసగించేందుకు పక్క రాష్ట్ర జీవోలను పకడ్బంధీగా వాడుతున్నారు. రాష్ట్రం పేరు మార్చి యధాతథంగా ప్రభుత్వ ఉత్తర్వును వాడుకుని నిరుద్యోగులకు టోకరా పెడుతున్నారు. తాజాగా తెలంగాణ రాష్ట్ర ఆర్థికశాఖ ఇచ్చిన ఉద్యోగ నియామకాల జీవోను ఏపీలో కొందరు ప్రబుద్ధులు వాడుకుని నిరుద్యోగులకు ఎసరు పెట్టేందుకు ప్రయత్నించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. 2017 జూలై 7న తెలంగాణ ఆర్థిక శాఖ 1506 డిప్యుటీ కలెక్టర్లు, డిప్యుటీ తమశీల్దార్ల నియామకాలకు సంబంధించి జీవో జారీ చేసింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో భర్తీకి అనుమతించి ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఫైనాన్స్ సెక్రటరీ ఎన్ శివశంకర్ పేరుతో జారీ అయిన జీవోను ఏపీకి చెందిన కొందరు మోసగాళ్లు తెలంగాణ జీవోఐఆర్ వెబ్‌సైట్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం అని ఉన్న చోట ఏపీ ప్రభుత్వంగా పేరు మార్చారు. తేదీని యథాతథంగా ఉంచుతూ నకిలీ జీవో సృష్టించారు. ఈ జీవోను చూపుతూ ఉద్యోగాలు ఇప్పిస్తాం అంటూ ఏపీలోని నిరుద్యోగులకు గాలం వేయడం ఆరంభించారు. ఒక్కో డిప్యుటీ కలెక్టర్ పోస్టుకు నాలుగు లక్షలు, డిప్యుటీ తహశీల్దార్‌కు రూ. 3లక్షలు అని రేటు కట్టారు. కొత్త తరహాలో ఈ నకిలీ జీవోను సోషల్ మీడియా వేదికగా పోస్టు చేసి మరీ ప్రచారం చేశారు. దీంతో అనుమానం వచ్చిన ఒక నిరుద్యోగి జీవో కాపీని ఏపీ సీఎంవోకు సమాచారం నిమిత్తం పంపడంతో డొంక కదిలింది. ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఎలాంటి జీవో ఇవ్వలేదని, ఎన్ శివశంకర్ పేరుతో సెక్రటరీ ఏపీలో లేరని, తెలంగాణ సెక్రటరీ అని వెల్లడించింది. అయితే ఈ నకిలీ జీవోతో ఎవరూ మోసపోలేదని తెలిసింది.

శిక్షణతో కొత్త విషయాలు తెలుస్తాయ్

● మేజర్ జనరల్ శ్రీనివాసరావు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : భద్రతా పర అంశాలపై ప్రత్యేక శిక్షణతో నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని మేజర్ జనరల్ ఎన్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఇక్కడ డీఆర్‌డీఓ అధికారులకు భద్రత, పేలుడు పదార్థాల నిర్వీర్యంపై ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమిలో ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల్లో భారత సైన్యం, డిఆర్‌డీఓకు చెందిన 26 మంది అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో భద్రతా విభాగాలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. భద్రతాపర అంశాలపై ఎప్పటికప్పుడు శిక్షణ అవసరమన్నారు. మాజీ సైనికులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడం హర్షించదగ్గ విషయమని ఆయన అన్నారు.

పాటకు పునాది తెలంగాణ స్త్రీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణలో పాటకు తరతరాలుగా పాటకు పునాదిగా స్త్రీలు నిలుస్తున్నారని ప్రముఖ రచయిత గోగుశ్యామల అన్నారు. సోమవారం తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో గోగుశ్యామల ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ సంస్మరణ ప్రసంగం చేశారు. పాడినవారు ఎవరైనా ఆ పాటలో తెలంగాణ జీవన వైవిధ్యం నిక్షిప్తమైందంటే అందుకు స్త్రీలే ప్రధానపాత్ర వహించారని తెలిపారు. స్త్రీలు పాటల్లో శాంతి ప్రధాన స్రవంతిగా ఉంటుందన్నారు. ఎన్నో పాటలు నిదర్శనమని విశ్లేషించారు. జానపద కళలకు తెలంగాణ పుట్టినిల్లని, తెలంగాణ కళల్లో పాట ప్రధానమైందని తెలిపారు. పాటలను పురుషులు కూడా పెద్ద సంఖ్యలో పారుతున్నా ఇక్కడి స్త్రీలే పాటకు పునాది అనే విషయాన్ని ప్రస్తవించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రామారావు, గోవిందరాజు, పలువురు పాల్గొన్నారు.

బీసీ భవన్‌కు స్థలం కేటాయించండి

● సీఎం కేసీఆర్‌కు ఆర్. కృష్ణయ్య లేఖ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి హాస్టల్‌కు 10 ఎకరాల స్థలం కేటాయించి, రూ. 10 కోట్లను కేటాయించిన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య తెలిపారు. అయితే ఇదే మాదిరిగా రాష్ట్రంలో ఉన్న 112 బీసీ కులాల వారికి కూడా భవనాలు నిర్మించుకోవడం కోసం స్థలాన్ని కేటాయించాలని, భవన నిర్మాణాలకు నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన సోమవారం ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు లేఖ రాశారు. ఒక శాతం కూడా లేని బ్రాహ్మణుల కోసం బ్రాహ్మణ సదన్‌కు ఎకరా స్థలం కేటాయించడం, రూ. కోటి నిధులు ఇవ్వడం మంచిదే అదేపద్ధతిలో కులవృత్తులు చేసుకుంటూ, సమాజానికి సేవలు చేస్తున్న బీసీ కులాలు ఉన్నాయని వారికి కూడా స్థలాలను కేటాయించాలని ఆర్ కృష్ణయ్య తన లేఖలో పేర్కొన్నారు.

64 కులాల వారు వివిధ వృత్తులు చేసుకుంటూ సమాజంలో కీలక భూమిక పోషిస్తున్నారని తెలిపారు. ఇటువంటి కులాల వారికి జనాభా నిష్పత్తి ప్రకారం ఎకరం నుంచి 20 ఎకరాల వరకు స్థలం కేటాయించి, భవనాల నిర్మాణం కోసం రూ. 5 కోట్ల నుంచి రూ. 20 కోట్ల వరకు బడ్జెట్ కేటాయిస్తే అన్ని సౌకర్యాలతో వారు భవనాలను నిర్మించుకుంటారని తెలిపారు. అలాగే రాష్ట్రంలో 250 బీసీ, 170 ఎస్సీ, 102 ఎస్టీ, కాలేజ్ హాస్టల్స్ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని అన్నారు.

ట్రంప్‌ను ఆస్ట్రేలియా
సమర్థించడం దారుణం

ప్యాగ్యాంగ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ చర్యలను ఆస్ట్రేలియా సమర్థించడంపై ఉత్తర కొరియా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అగ్రరాజ్యం భద్రతా దళాలకు ఆస్ట్రేలియా ప్రధాని టర్న్‌బౌల్ సాయం చేస్తానని ప్రకటించడం ఆత్మహత్యాసదృశ్యంగా కొరియా అభివర్ణించింది. ఉత్తర కొరియా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి కేసీఎన్ఏ ఈ మేరకు సోమవారం వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియా ప్రధాని టర్న్‌బౌల్ అమెరికా భద్రతా బలగాలతో కలసి ఆ దేశసైన్యం సైనిక విన్యాసాలు నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రస్తుత పరిస్థితి తీవ్రతను గమనించకుండా ఆస్ట్రేలియా నిర్ణయం తీసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అమెరికా పాల్గొన యుద్ధాల్లో పాలుపంచుకున్న ఆస్ట్రేలియా భారీ మూల్యం చెల్లించుకున్న విషయాన్ని మరవరాదని గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా అంతే నష్టం ఆస్ట్రేలియాకు జరుగుతుందని వివరించారు. ఆ గుణపాఠాలను ఆస్ట్రేలియా మరవడం లేదన్నారు. అయితే, ఈ వ్యాఖ్యలపై ఆస్ట్రేలియా ప్రధాని టర్న్‌బౌల్ ఘాటుగా స్పందించారు. ఉత్తర కొరియా ప్రజానీకం పట్ల కిమ్ జ్యాంగ్‌కు ఎటువంటి బాధ్యత లేదని విమర్శించారు. సొంత దేశ ప్రజల రక్షణ, సంక్షేమంపై పట్టింపు లేదని ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి తీర్మానం మేరకు అన్ని దేశాలు నడుచుకోవాలని ఆస్ట్రేలియా పిలుపునిచ్చినట్లు గుర్తు చేశారు. కానీ, కొరియా మాత్రం యూఎస్ నిబంధనలకు తూట్లు పొడిచిందని ఆరోపించారు. ప్రపంచ శాంతికి అందరం కలసి కృషి చేయాలని ఆకాంక్షించారు. కాగా ఉత్తర కొరియా తొలి వార్షిక సైనిక క్షిపణి పరీక్షలు సోమవారం మొదలెట్టాయి. ఈ పరీక్షలు ఆగస్టు 31వ తేదీన ముగియగా, అందులో వేలాది కొరియన్ సైనికులు పాల్గొననున్నారు.

వెదురు వంతెన



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర దినజ్‌పూర్ జిల్లాలో వరదలో ఊరు దాటేందుకు వెదురు బొంగులతో ఏర్పాటు చేసుకున్న బ్రిడ్జి

సైకిల్ వ్యాన్



కోల్‌కతా : సైకిల్ వ్యాన్‌లో స్కూల్ నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థినులు

మాజీ మంత్రి సమ్మయ్య కన్నుమూత

• పలువురు నేతల సంతాపం • నేడు పరకాలలో అంత్యక్రియలు



కెఎన్ఎన్ బ్యూరో,వరంగల్: సీనియర్ రాజకీయ వేత్త, మాజీ మంత్రి బొచ్చు సమ్మయ్య (78) కన్ను మూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సమ్మయ్య సోమవారం ఉదయం 11 గంటలకు హైదరా బాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం నాడు పరకాలలో అధికారిక లాంఛనాలతో జరుగుతాయి. సమ్మయ్య మృతిపట్ల డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, పరకాల శాసన సభ్యులు చల్లా ధర్మారెడ్డిలు సంతాపం వ్యక్తం చేశారు. పరకాలలో దళిత కుటుంబంలోజన్మించిన సమ్మయ్య ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి 1977లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి పింగిళి ధర్మారెడ్డి ఆశీస్సులతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన సమ్మయ్య 1978లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో పరకాల నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన సమ్మయ్యకు మంత్రి పదవి దక్కింది. మర్రి చెన్నారెడ్డి, భవనం వెంకట్రాం, కోట్ల విజయ్‌భాస్కర్ రెడ్డి మంత్రి వర్గాల్లో సమ్మయ్య గనులు, మత్స్యశాఖ, పట్టుపరిశ్రమశాఖలను నిర్వర్తించారు. 1983లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభంజనంలో పరకాల నుంచి రెండోసారి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అ తర్వాత 1985-89-94 ఎన్నికల్లో పరకాల నుంచి పోటీ చేసి ఓడిపోయారు. కాంగ్రెస్ పార్టీలో క్రీయాశీలక నాయకుడిగా కొనసా గిన సమ్మయ్య దివంగత ప్రధాని పి.వి. నర్సింహ రావుకు అత్యంత సన్నిహి తుడు. కాకతీయ విశ్వ విద్యాలయం సెనెట్ సభ్యుడి గా, షెడ్యూల్ కులాలు, తెగల జాతీయ కమిషన్ సభ్యుడిగా సమ్మయ్య పనిచేశారు. కాంగ్రెస్ పార్టీలో సమ్మయ్య అనేక పదవులు నిర్వర్తించారు. తొలుత యువజన కాంగ్రెస్ రాష్ట్రప్రధాన కార్యదర్శిగా అ తర్వాత పీసీసీ ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా కాంగ్రెస్ ఎస్సీ,ఎస్టిసెల్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సమ్మయ్య హైదరాబాద్ లోని వైద్యం కోసం నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. సోమవారం ఉదయం 11 గంటకు ఆయన తుది శ్వాస విడిచారు. సమ్మయ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు న్యాయ మూర్తి గా పనిచేస్తున్నారు. పరకాలలోని దళిత వాడలో నివాసం ఉండే సమ్మయ్య అంత్యక్రియలు మంగళవారం నాడు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. సమ్మయ్య అంత్యక్రియలను అధికారిక లాంఛనంగా నిర్వర్తించాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

సమ్మయ్య మృతికి సీఎం సంతాపం

వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బొచ్చు సమ్మయ్య మృతి పట్ల సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సమ్మయ్య అంత్యక్రియలను పోలీసు లాంఛనాలతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి బాధ్యతలు అప్పగించారు.



రిజర్వేషన్ల కోసం మహిళా కాంగ్రెస్ సంతకాల ఉద్యమం

• 5 లక్షల సంతకాలు లక్ష్యం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంగ్రెస్ దేశవ్యాప్తంగా సంతకాల ఉద్యమం ప్రారంభించింది. అఖిలభారత మహిళా కాంగ్రెస్ పిలుపుమేరకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కూడా ఈ నెల 13 న గాంధీభవన్‌లో ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ డాక్టర్ రామచంద్ర కుంతియా టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమక్షంలో ఈ కార్యక్ర మాన్ని ప్రారంభించారు. రాష్ట్రం నుంచి కనీసం 5 లక్షల మంది మహిళల సంత కాలు సేకరించాలని రాష్ట్ర పార్టీ లక్ష్యంతో ఉంది. ఈ నెల 25 వరకు ఈ కార్యక్ర మానికి చివరి తేదీగా నిర్ణయించారు. అన్ని జిల్లా, నియోజక వర్గం,మండల కేంద్రాలలో కూడా ఇప్పటికే సంతకాల ఉద్యమం ప్రారంభిం చింది. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు నేరెళ్ల శారద జిల్లాల్లో పర్యటిస్తూ ఈ విషయమై కార్యకర్తలను చైతన్యం చేస్తున్నారు. అన్ని వర్గాలు, రాజకీయ పార్టీలకు చెందిన మహిళలను కూడా కలిసి సంతకాలు చేయించాలని ఆమె జిల్లా నాయకత్వాలకు సూచించారు. హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్ జిల్లా ల్లో నేరెళ్ల శారద సంతకాల సేకరణ కార్యక్రమం లో పాల్గొన్నారు. గద్వాలలో ఆదివారం ఎమ్మెల్యే డీకే అరుణ తన నివాసంలో సంతకాల ఉద్యమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్ర మంలో జిల్లా అధ్యక్షు రాలు బండల పద్మావతి కూడా పాల్గొన్నారు. అదే విధంగా నర్సాపూర్ నియోజకవర్గంలో మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, రంగారెడ్డి జిల్లాలో మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్నారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు , కార్యదర్శులు సదాలక్ష్మి, పారిజాత, దుర్గా రాణి, అచ్యుత, స్వప్న తదితరుల సంత కాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

మోడీ పాలనలో దళితులు, మైనారిటీలపై పెరిగిన దాడులు

• ఏఐసీసీ మైనారిటీ సెల్ చైర్మన్ ఖుర్షీద్ అహ్మద్



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: మూడేళ్ల ప్రధానినరేంద్ర మోడీ పాలనలో దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగాయని, ఆయన అసమర్థుడని ప్రజలకు తెలిసిపోయిందని ఎఐసీసీ మైనారిటీసెల్ చైర్మన్ ఖుర్షీద్ అహ్మద్ సయ్యద్ విమర్శించారు. తెలుగు రాష్ట్రా ల పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. మోడీ, కేసీఆర్ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని, మతతత్వవాదులు రెచ్చిపోతున్నారని, చర్చ్ లు, పాస్టర్లపై దాడులు సర్వసాధారణమయ్యాయనిఆయనఆరోపించారు. గోరక్ష పేర ఇప్పటి వరకు దేశంలో 14మంది అమాయకులు హత్యకు గురయ్యారని చెప్పారు. సీఎం కేసీఆర్ అబద్ధాలు చెబుతూ ముస్లింలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయనకు చిత్త శుద్దిఉంటే 12 శాతం రిజర్వేషన్లు ఇప్పటికే ఇచ్చేవారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీకి పాలనా సమర్థత లేదని తేలిపోయిందని, ఆయన కూడా మాటలకే పరిమితమయ్యారని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా కేవలం కబుర్లతోనే పాలన సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. ముస్లిం తలాక్ గూర్చి మాట్లాడే మోడీ తన భార్య విషయం ఎందుకు చెప్పడం లేదనిఖుర్షీద్ ప్రశ్నించారు.వారణాసీలో వేలాది మంది హిందూ వితంతువులు ఉన్నారని,వారి సంక్షేమం గూర్చి మోడీకి పట్టదా అనిఆయనప్రశ్నించారు. యూపీఏ హయాంలో నిర్భయ ఘటన జరిగితే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టిన బీజేపీ, ఇప్పుడు తమ హయాంలో దేశవ్యాప్తంగా నిర్భయ ఘటనలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు.

సర్వీసు రూల్స్‌పై తర్జనభర్జన

• పదోన్నతులపై స్పష్టంగా తేల్చాలన్న సంఘాలు • మూడు రోజుల్లో ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించిన విద్యాశాఖ సంచాలకులు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్‌పై ఇంకా స్పష్టత రాలేదు. తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలు పదోన్నతులు, నియామకాలపై తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి సూచించాయి. అయితే అన్ని సంఘాలు తమ సూచనలను స్పష్టంగా చెబితే తద్వారా ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్‌ను రూపొందించడానికి వీలుంటుందని సర్కార్ భావిస్తోంది. ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించడం కోసం రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయ సంఘాలతో పాఠశాల విద్యా శాఖ సంచాలకులు జి కిషన్ సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఉన్న మూడు ఉపాధ్యాయ సంఘాల జేఏసీలు సోమవారం జరిగిన సమావేశంలో పాల్గొన్నాయి. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ, జాక్టోతోపాటు టిటీజేఏసీ నేతలు సమావేశంలో పాల్గొన్నారు. యుటిఎఫ్ నేతలు రవి, నర్సిరెడ్డి, టిటిఎఫ్ నేత రఘునందన్ , పిఆర్‌టియు నేత సరోత్తమ్ రెడ్డి, టిటియు నేత రాధాకృష్ణ, ఎస్టీయు, తెలంగాణ పిఆర్‌టియు నేత చెన్నయ్య, ఎస్సీ,ఎస్టీ టీచర్స్ యూనియన్ నేత కిషన్ నాయక్, డిటిఎఫ్ తదితర సంఘాల నేతలు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ పదవుల ప్రమోషన్లపైనే సమావేశంలో చర్చించారు. ఎంఈవో పోస్టును అప్‌గ్రేడ్ చేయాలని దాదాపు అన్ని సంఘాలు సూచించాయి. ప్రతి డివిజన్‌కు ఒక డిప్యూటీ డీఈవో ఉండేలా చూడాలన్నారు. పదోన్నతుల్లో జాతీయ ఉపాధ్యాయ శిక్షణ మండలి నిబంధనలను తప్పకుండా పాటించాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులుగా నేరుగా 1 శాతం మందిని నియామకం చేపట్టాలని ఉందని ప్రభుత్వం పేర్కొంది. అయితే ఈ నిబంధనను అమలు చేయవద్దని దాదాపు అన్ని సంఘాలు సూచించాయి. ఒక ఉపాధ్యాయునికి కనీసం 12 నుంచి 15 సంవత్సరాలు అయినా ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు రావడం లేదని సంఘాల నేతలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యా యుల పదోన్నతులకు ఎన్‌సిటీఈ నిబంధనలను అమలు చేయవద్దని సూచించాయి. అన్ని సంఘాల తమ ప్రతిపాదనలను మూడు రోజుల్లో అందజేస్తామని తెలిపాయి. ప్రతిపాదనలు వచ్చిన తరువాత సర్వీస్ రూల్స్‌ను రూపొందించనున్నారు.

నూతన మద్యం పాలసీ ముసాయిదా రూపొందించండి

కీలక మార్పులతో సీఎం ఆమోదం: మంత్రి పద్మారావుగౌడ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మద్యం దుకాణదారులతో సమావేశం ఏర్పాటు చేసివారి అభిప్రాయాలు తీసుకోండి...అక్టోబర్‌లో కొత్త విధానం నేపథ్యంలో వచ్చే నెలలో డ్రాఫ్ట్ పాలసీని రూపొందించాలి..ఈ ఏడాది పాలసీలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పనిచేద్దాం' అని అబ్కారీ శాఖ మంత్రి తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. నూతన మద్యం పాలసీపై ప్రతిపాదనలు సిద్ధం చేసి సీఎం ఆమోదం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు బడుగా, బలహీన వర్గాలకు ఆత్మగౌరవం పెరిగిందన్నారు. సోమవారం సచివాలయంలో ఆయన ఎక్సైజ్ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నూతన మద్యం పాలసీ, జాతీయ రహదారులపై మద్యం దుకాణాల తరలింపు, నీరా స్టోరేజ్, తాటి చెట్లు ఎక్కే యంత్రాలు వంటి కీలక అంశాలపై 3 గంటలపాటు సుధీర్ఘంగా సమీక్షించి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది మద్యం పాలసీని అనేక మార్పులతో రూపొందించాలని ప్రభుత్వం భావిస్తున్నదని చెప్పారు. ముందుగా వ్యాపారుల అభిప్రాయాలను సేకరించాలని ఆయన అధికారులకు సూచించారు. ఇప్పుడు లైసెన్సులు కలిగి ఉన్న వ్యాపారులతో ఒక సమావేశం ఏర్పాటు చేసుకోవాలని, లైసెన్సు రుసుములు, జనాభా స్లాబ్‌లు, పన్నుల విధానం, మార్జిన్ పెంపుదల, అదనపు ప్రివిలేజ్ రుసుములపై వెసులుబాటు వంటి కీలక అంశాలపై వారితో చర్చించాలని సూచించినట్లు తెలిసింది. సమయ పాలన, ఇతర అంశాలపై ఎటువంటి మార్పులు లేకుండా చూడనున్నట్లుగా తెలిసింది. రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారుల డీ నోటిఫికేషన్ ఎంత వరకు వచ్చిందనే విషయంపై ఆయన ఆరా తీశారు. డీ నోటిఫై తర్వాత ఎన్ని దుకాణాలను షిఫ్టింగ్ చేయాల్సి ఉంటుందో లెక్కలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

టీఆర్ఎస్ ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమానికి తీసుకున్న అనేక చర్యలను అమలులోకి తెచ్చేందుకు అధికారులు సహకరించాలని ఆయన కోరారు. నీరా అమలులోకి తెచ్చే విధానంపై అధ్యయనం చేయాలని, నీరా స్టోరేజీపై సవివర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. తాటి చెట్లు ఎక్కే యంత్రాల పరిశీలన, కొనుగోలు, నీరా మార్కెటింగ్, కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డుల జారీపై అడిగి తెలుసుకున్నారు. ఆయా పనుల్లో జాప్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ల బదలీలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి సోమేష్ కుమార్, కమిషనర్ చంద్రవదన్, జాయింట్ సెక్రటరీ రామ్‌సింగ్, అదనపు కమిషనర్ రాజశేఖర్‌రావు, టీఎస్‌బిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, ఓఎస్‌డీ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

• సీఎం కేసీఆర్‌కు లక్ష్మణ్ లేఖ



హైదరాబాద్,ఆంధ్రప్రభ : అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం సీఎం కేసీఆర్‌కు లక్ష్మణ్ ఈ మేరకు ఒక లేఖ రాశారు. తెలంగాణ సలహామండలి సిఫార్సులను వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడి కేంద్ర పరిధిలోకి వచ్చే కార్మికులకు 42 శాతం కనీస వేతనాలు పెంచారని లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలోని కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన వివరించారు.

గుర్ఖాల్యాండ్ శాంతి కోసం చర్చలు అవశ్యం

• బెంగాల్ ప్రభుత్వానికి జీజేపీ విజ్ఞప్తి



డార్జిలింగ్: కొండ ప్రాంతమైన గుర్ఖాల్యాండ్‌లో శాంతిని స్థాపించేందుకు చర్చలు అవసరమని గుర్ఖా జనముక్తి మోర్చ (జీజేఎం) అభిప్రాయపడింది. ఆందోళనకారులతో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం చర్చలు నిర్వహించాలని సోమవారం విజ్ఞప్తి చేసింది. ప్రత్యేక గుర్ఖాల్యాండ్ కోసం 68 రోజులుగా నిరవధికంగా సమ్మె జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే, ఆ ప్రాంతంలోని ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పార్టీ తెలిపింది. ఈ నేపథ్యంలో కొండ ప్రాంతంలో శాంతి నెలకొల్పాల్సిన అవసరం ఉందని కోరింది. శాంతి కోసం చర్చలు నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను జీజేఎం కోరడం ఇదే మొదటిసారిగా చెప్పుకోవచ్చు. ఈ మేరకు ఆ పార్టీ సంయుక్త కార్యదర్శి బినయ్ తమాంగ్ వెల్లడించారు. డార్జిలింగ్ కొండ ప్రాంతాల్లోప్రజలకు ఇబ్బందుకు కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. డార్జిలింగ్‌లో ఇటీవల జరిగిన రెండు బాంబు పేలుళ్ళలో నిందితుడిగా జీజేఎం అధ్యక్షుడు బిమల్ గురుంగ్ పేరును మమతా బెనర్జీ సర్కారు యూపా చట్టం కింద అభియోగ పత్రంలో చేర్చేసరికి పార్టీ వాదనలో మార్పు వచ్చిందన్న ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. జీజేఎం ప్రజాస్వామిక విలువలను గట్టిగా నమ్ముతుందని తమంగ్ చెప్పారు.

నాణ్యమైన జీవనప్రమాణాల్లో హైదరాబాద్ 1

(మొదటిపేజీ తరువాయి)

ఇంత పెద్ద ఫ్లైఓవర్ వంతెనను ఎవరూ నిర్మించలేదని, ఈ ఫ్లైఓవర్‌ను మరింత దూరం పొడిగించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. రాజధాని హైదరాబాద్‌లో రూ.3వేల కోట్ల వ్యయంతో రహదారులు, ఫ్లైఓవర్ నిర్మాణాలు జరుగుతున్నాయని ఇంకా 10వేల కోట్ల ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. రక్షణశాఖ భూముల్లో అతిపెద్ద స్కైవేలను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని త్వరలోనే వీటి నిర్మాణానికి టెండర్లను ఆహ్వానిస్తామని చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని, తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిఎస్-ఐపాస్ ద్వారా 4,100 యూనిట్లకు అనుమతులు ఇచ్చామని దీనివల్ల రూ.70వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. కొత్తగా ఏర్పాటైన పరిశ్రమల ద్వారా రాష్ట్రంలో రెండు లక్షల 30వేల మందికి ఉపాధి అవకాశాలు లభ్యమయ్యాయని, రియల్ రిస్టేట్ రంగంలో హైదరాబాద్ దేశంలోనే అతివేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే లాభమా? నష్టమా అనే చర్చ గత మూడేళ్ళ క్రితం జరిగిందని తెలంగాణ వస్తే పెట్టుబడులు రావని కొంతమంది అపోహలు సృష్టించారని చెప్పారు. ప్రణాళికాబద్ధంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తున్నామని ఈ నగరం విశ్వనగరంగా ఏర్పాటయ్యేందుకు కొంత సమయం పడుతుందని చెప్పారు. తమది మాటల ప్రభుత్వం కాదని ఏదున్నా చేతల్లో చూపిస్తామని చెప్పారు. నాణ్యమైన జీవన ప్రమాణాలున్న నగరాల్లో దేశం లోనే హైదరాబాద్ మొదటిస్థానంలో ఉందని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాగునీరు, విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని గతంలో కోతలతో కూడా విద్యుత్ సరఫరా చేసేవారని మంచినీటి కోసం ఖైరతాబాద్‌లోని హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ కార్యాలయం ఎదుట అనునిత్యం ఖాళీ కుండలు, బిందెలతో నిరసన ప్రదర్శనలు నిర్వహించేవారని ప్రస్తుతం అవి లేకుండా చేశామని పేర్కొన్నారు. శివారు మునిసిపాలిటీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.2వేల కోట్లను ఖర్చు చేస్తున్నామని చెప్పారు. రైతుల కోసం తమ ప్రభుత్వం



ప్రాజెక్టులు నిర్మిస్తుంటే వాటికి కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా అడ్డు తగులుతోందని చనిపోయిన వారి పేర్లతో న్యాయస్థానాల్లో కేసులు వేయించి అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారని చెప్పారు. చనిపోయిన వారి పేర్లతో కేసులు వేయించామని కాంగ్రెస్ నేతలు నిస్సిగ్గుగా శాసనసభ వేదికగా ప్రకటించారని దుయ్యబట్టారు. రాష్ట్రమంతటా ప్రమాణాలతో కూడిన రహదారులను నిర్మిస్తామని దేశంలోనే హైదరాబాద్‌ను అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఎర్రటి ఎండల్లో సైతం విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కోతల్లేని విద్యుత్‌ను అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదని చెప్పారు. గత 50 సంవత్సరాలుగా పేరుకుపోయిన సమస్యలన్నింటిని పరిష్కరిస్తున్నామని 50 ఏళ్ళ కాంగ్రెస్ పాలనలోని జిడ్డును తొలగిస్తున్నామని చెప్పారు. తెలంగాణ వస్తే రాష్ట్రం అంధకారమవుతుందని మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తూ మరి ఇప్పుడు రాష్ట్రం ఎలా ఉందని ప్రశ్నించారు. నాగోల్ నుంచి మియాపూర్ వరకు ఏర్పాటు చేసిన మెట్రోరైల్‌ను నవంబర్‌లో ప్రారంభిస్తామని, రెండోదశ మెట్రోరైల్ ప్రాజెక్టును చేపట్టాలన్న ఆలోచన ప్రభుత్వ పరిశీలనలో ఉందని చెప్పారు. అధికారానికి శాశ్వతంగా దూరమవుతామన్న భయంతో హైదరాబాద్‌కు తాగునీరు రాకుండా కాంగ్రెస్ పార్టీ అడ్డు పడుతోందని దుయ్యబట్టారు. ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ వరకు రూ.1000 కోట్ల వ్యయంతో ఫ్లైఓవర్‌ను నిర్మిస్తున్నామని, అంబర్‌పేట 6వ నెంబర్ నుంచి రామాంతాపూర్ వరకు కూడా మరో ఫ్లైఓవర్‌కు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని రెండు సెంటీమీటర్ల వర్షం పడితేనే ఆ వర్షంనీటిని తొలగించే వ్యవస్థ లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ 60 ఏళ్ళ దరిద్ర్యం మూడేళ్ళలో ఎలా పోతుందని దశల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మన పంట, మన పెట్టుబడి పేరుతో వచ్చే ఏడాది నుంచి రైతాంగానికి రూ.8వేలను పెట్టు బడిగా ఇస్తున్నామని హైదరాబాద్‌లో శాశ్వత నివాసం లేని ప్రతి ఒక్కరికి రెండు గదుల ఇండ్లను నిర్మించి ఇస్తామని చెప్పారు. తెలంగాణ వస్తే ఆంధ్రావాళ్ళను బతకనివ్వమని ప్రచారం చేశారని మూడేళ్ళలో ఒక్క సంఘటనైనా జరిగిందా అని ప్రశ్నించారు. తెరాస ప్రభుత్వానిది కొత్త సంసారమని, ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్క రించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. బాలానగర్ ఫ్లైఓవర్ వంతెనను ఇరవై మాసాల్లో పూర్తిచేసి తిరిగి ప్రారంభోత్సవానికి తానే వస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ తెలంగాణను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని ఆయన నాయకత్వంలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపి మల్లారెడ్డి, రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

చైనా కుప్పిగంతులు


బీజింగ్: చైనా సైనిక శకటాలు,ట్యాంకులు, పదాతి దళాలు గత వారం నిర్వహించిన డ్రిల్స్ అన్నీ భారత్‌ని హెచ్చరించేందుకేనని చైనీస్ మీడియా పేర్కొంది. ఈ విన్యాసాల్లో హెలికాప్టర్లు కూడా పాల్గొన్నాయి. భారత్‌కు యుద్ధ భయాన్ని సృష్టించడం కోసమేనని కూడా చైనా అధికార పత్రిక గ్లోబల్‌టైమ్స్ పేర్కొంది. గతవారం చైనానిర్వహించిన విన్యాసాల్లో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్ఎ) యూనిట్లు పదివరకూ పాల్గొన్నాయని కూడా ఆ పత్రిక పేర్కొంది. డోక్లాం సరిహద్దుల్లో భారత్ సేనలను మోహరించినందుకు ప్రతిగానే ఈ విన్యాసాలను నిర్వహించినట్టు గ్లోబల్ టైమ్స్ పేర్కొంది. పిఎల్ఏకి చెందిన పశ్చిమ మండలం యూనిట్ ఈ విన్యాసాలను నిర్వహించింది.ప్రత్యక్షయుద్ధ సన్నాహాల్లో భాగంగా చైనా దళాలు ఎత్తుఅయిన కొండల్లో కాల్పులు జరిపారనీ, తర్వాత హెలికాప్టర్లు ఉపరితలంపై ఉన్న లక్ష్యాలపై క్షిపణులను ప్రయోగించాయని సెంట్రల్ టెలివిజన్‌ను ఉటంకిస్తూ చైనీస్ పత్రికలు పేర్కొన్నాయి.

ఉద్రిక్తతకు బాధ్యత భారత్‌దే

డోక్లాం సరిహద్దులలో ఉద్రిక్తత ఏర్పడటానికి పూర్తి బాధ్యత భారత్‌దేనని చైనీస్ మీడియా ఆరోపించింది. డోక్లాం సరిహద్దుల పక్కనుంచిచైనా మహామార్గాన్ని నిర్మించుకుంటే భారత్ అడ్డు చెప్పాల్సిన అవసరం ఏమిటని చైనా మీడియా ప్రశ్నించింది. భూటాన్ సైనికులు ఫిర్యాదు చేశారంటూ భారత్ అనుచిత జోక్యం చేసుకున్నదనిచైనా మీడియా ఆరోపించింది.

వ్యంగ్యాస్త్రాలు

భారత్‌పై చైనీస్ వార్తా సంస్థలు,పత్రికలు గడిచిన కొద్ది రోజులుగా వ్యంగ్యాస్త్రాలతో కూడిన వ్యాసాలను వెలువరిస్తున్నాయి. పత్రికల్లో కార్టూన్లు ప్రచురితం అవుతున్నాయి.భారత్‌ని ఒక వైపు ఆకాశానికి ఎత్తేస్తూనే,మరో వైపు భారత్ ఇప్పుడు పొరుగు దేశాలతో ఉద్రిక్తతలను ఉద్దేశ్యపూర్వకంగానే సృష్టిస్తోందంటూ చైనీస్ పత్రికలు వ్యాసాలు ప్రచురించాయి.









అమెరికాలోని అరిజోనా రాష్ట్రంలో సోమవారం ప్రారంభమైన సూర్యగ్రహణం సుమారు 14 రాష్ట్రాల్లో సందడి చేసింది. చంద్రుడు, సూర్యుడిపైకి పూర్తిగా ఆవహించిన తరుణంలో భానుడు రెండు వృత్తాల మాదిరి కనిపించి అందరినీ అబ్బురపరిచాడు. ఈ సంపూర్ణ సూర్య గ్రహణం వీక్షించేందుకు ఆయా ప్రదేశాల్లో జనాలు పెద్ద సంఖ్యలో గుమిగూడారు.

అంటు కుదిరింది



చెన్నై: అన్నాడీఎంకే హైడ్రామాకు తెరపడింది. రెండాకుల పార్టీలోని రెండు వర్గాలు జతకట్టాయి. చిన్నమ్మ శశికళ ను వ్యతిరేకించి అన్నాడీఎంకే పార్టీని రెండుగా చీల్చిన పన్నీరుసెల్వం మళ్లీ సొంతగూటికి చేరుకున్నారు. ఆరు నెలల క్రితం రెండు వర్గాలుగా విడిపోయిన రెండు వర్గాలు చర్చపచర్చల తర్వాత ఏకమయ్యాయి. సీఎం పళనిస్వామి, మాజీ సీఎం పన్నీర్ సెల్వం చేతులు కలిపి అమ్మపార్టీని కలిసికట్టుగా ముందుకు తీసుకెళ్తామని ప్రతిన బూనారు. పలనిస్వామి సీఎంగానే కొనసాగుతుండగా..పన్నీర్‌కు డిప్యూటీసీఎం పదవితోపాటు పార్టీ కోఆర్డినేటర్ గా నియామకమయ్యారు. డిప్యూటీ కో ఆర్డినేటర్ పదవిని అలంకరించారు. మొదట పార్టీ ఆఫీస్‌కు సీఎం పళనిస్వామి చేరుకోగా..కొద్ది సేపటికే మాజీసీఎం పన్నీర్ సెల్వం వచ్చారు. ఇరు వర్గాల విలీనంపై పన్నీర్ సెల్వం అధికారిక ప్రకటన చేశారు. సంయుక్త ప్రకటన తర్వాత పళని, ప న్నీరు ఎంజీఆర్, అమ్మ మెమోరియల్ లను సందర్శించారు.

డిప్యూటీ సీఎంగా పన్నీర్ ప్రమాణం



అన్నాడీఎంకే పార్టీలోని రెండు వర్గాలు ఏకమవడంతో తమిళనాడు రాష్ట్ర కేబినెట్‌ను విస్తరించారు. పన్నీర్ సెల్వంతో పాటు ఆయన వర్గం నేతలు మంత్రివర్గంలో చేరారు. డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ విద్యసాగర్ రావు పన్నీర్, ఆయన వర్గం నేతలతో ప్రమాణ స్వీకారం చేయించారు. పన్నీర్‌కు కీలకమైన ఆర్థికశాఖ దక్కించుకోగా.. ఆయన వర్గానికి చెందిన నాయకులకు క రాడా కీలక శాఖలు దక్కాయి. డి. జయకుమార్‌కు ఫిషరీస్ శాఖ ను కట్టబెట్టారు. ఇక ఉడుమలై కె రాధాకృష్ణన్‌కు హౌసింగ్ డెవలప్ మెంట్ శాఖను అప్పగించారు.కె. పండితరాజన్‌ను కూడా కేబినెట్ లోకి తీసుకున్నారు.



శశికళను వ్యతిరేకించి అన్నాడీఎంకే పార్టీలో చీలక సృష్టించిన పన్నీర్ సెల్వం...ఆమెను పార్టీ నుంచి తప్పిస్తే తప్పా..విలీనానికి ఒప్పుకోనని పదేపదేచెబుతూ వచ్చారు. ప్రమాణ

శశికళ ఉద్వాసన లేనట్లేనా..?

స్వీకారానికి కొన్నిగంటల ముందు వరకు కూడా సెల్వం తన పంతాన్ని నెగ్గింకోవాలని అనుకున్నారు. ఈనేపథ్యంలో సీఎం పళని స్వామి పార్టీ ఆఫీస్‌కు చేరుకున్నా...కొద్ది సేపటి వరకు పన్నీర్ పార్టీ కార్యాలయానికి రాలేదు. శశికళపై వేటు వేసేందుకు పళని స్వామి ఒప్పుకోకపోవడం వల్లే పన్నీర్ పార్టీ కార్యాలయానికి లేటుగా వచ్చారని పార్టీ వర్గాలు చెబుతున్నాయ. అయితే మధ్యవర్తిత్వం వహించిన నేతలు పన్నీర్‌కు నచ్చజెప్పడంతో పాటు...శశికళపై ఈసీ నిర్ణయానికి సీఎం కట్టుబడి ఉంటారని చెప్పడంతో వెనక్కితగ్గినట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి శశికళకుపార్టీ నుంచి ఇప్పట్లో ఉద్వాసన లేదనే ప్రచారం జరుగుతోంది.

అమ్మ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని ఇరువురు నేతలు చెప్పుకొచ్చారు. తాము ఒక తల్లికి పుట్టిన బిడ్డలమని...తమను ఎవరూ వేరు చేయలేరని వ్యాఖ్యానించడం గమనార్హం. అమ్మ ఆత్మ ఆదేశానుసారంగా విలీనం జరిగిందని తెలిపారు.

ప్రధాని శుభాకాంక్షలు

అన్నాడీఎంకేపార్టీలోని రెండు వర్గాలు ఏకమవడాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వాగతించారు.కొత్తగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పన్నీర్ సెల్వంకు ఇతర మంత్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి పళని, ఉప ముఖ్యమంత్రి పన్నీర్ నేతృత్వంలో తమిళనాడు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకారం అందిస్తుందని ట్విట్టర్ వేదికగా తెలియజేశారు.

ప్రజలపై జోకర్ టోపి: కమల్

పళని, పన్నీరు వర్గాల విలీనంపై సినీ నటుడు కమల్ హాసన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరువురు నేతలు తమిళ ప్రజలను మోసం చేశారని ట్విట్టర్ వేదికపై విమర్శలు గుప్పించారు.తమిళుల తలపై గాంధీ టోపీ, కాషాయం టోపీ,కాశ్మీర్ టోపీతో పాటు ఇప్పుడు జోకర్ టోపీని కూడా పెట్టారని ట్వీట్ చేశారు. ఇప్పటికే పళని ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు గుప్పించిన కమల్...ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

జయ మరణాంతర పరిణామాలు



ఒక్కటైన తరువాత అమ్మకు అభివాదం చేస్తున్న పళని, పన్నీర్

తమిళ రాజకీయాల్లో ప్రకంపణలు సృష్టించిన అన్నాడీఎంకే పార్టీలోని రెండు వర్గాలు ఎట్టకేలకు ఏకమయ్యాయి. సీఎం పళనిస్వామి, మాజీ సీఎం పన్నీర్ సెల్వం విభేదాలను పక్కనబెట్టి ఒక్కటౌతున్నట్లు ప్రకటించారు. అమ్మ పార్టీలో చీలికలు రాకూడదని.. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకూడదనే కలిసిపోతునట్లు స్పష్టం చేశారు.

డిసెంబర్ 7,2016: అన్నాడీఎంకే సీనియర్ నాయకుడు పన్నీరు సెల్వం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం. తమిళనాడు రాజ్ భవన్‌లో గవర్నర్ విద్యాసాగర్ రావు . అర్ధరాత్రి పన్నీర్ సెల్వంతో ప్రమాణం చేయించారు.

డిసెంబర్ 29, 2016: జయలలితకు అత్యంత సన్నిహితురాలైన వీకే శశికళ అన్నాడీఎంకే పార్టీ జనరల్ సెక్రటరీగా ఎంపిక. శశికళకు పార్టీ జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం. జయ నివాసం పొయెస్ గార్డెన్ పన్నీర్ సెల్వంతో భేటీ తర్వాత శశికళ పార్టీ తీర్మానాన్ని అంగీకరించారు.

ఫిబ్రవరి 5, 2017: పార్టీలో శశికళ పెత్తనాన్ని నిరసిస్తూ పన్నీర్ సెల్వం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు సెల్వం ప్రకటన. శశికళ ఒత్తిడి వల్లే సీఎం పదవికి రాజీనామా చేసినట్లు రెండ్రోజుల తర్వాత సెల్వం తిరుగుబాటు. పార్టీ నాయకులు తనకు అండగా ఉంటే రాజీనామాను వెనక్కి తీసుకుంటానని ప్రకటన. సెల్వంను కోశాధికారి పదవి నుంచి తొలగించిన శశికళ. పన్నీర్ సెల్వంను విశ్వాసఘాతకుడిగా అభివర్ణించిన శశికళ.

ఫిబ్రవరి 10, 2017: అన్నాడీఎంకే పార్టీలోని రెండు వర్గాలను మెజారిటీ నిరూపించుకోవాలి కోరిన తమిళనాడు గవర్నర్ విద్యాసాగర్ రావు. 100 మంది ఎమ్మెల్యేలతోకూడిన శశికళ మద్దతుదారులను కూవత్తూరులోని గోల్డెన్ రిసార్టుకు తరలింపు. ఎమ్మెల్యేలను శశికళ బంధించిందని ఆరోపణలు. వారంరోజులకుపైగా రిసార్ట్ లోనే గడిపిన ఎమ్మెల్యేలు. అక్రమాస్తుల కేసులో శశికళకు శిక్షపడే అవకాశముందన్న వార్తలతో ఒక్కసారిగా వేడెక్కిన రాజకీయాలు.

ఫిబ్రవరి 16, 2017: అక్రమాస్తుల కేసులో శశికళను దోషిగా తేల్చిన సుప్రీంకోర్టు. దోషిగా తేలడంతో ముఖ్యమంత్రి పదవి అధిష్టించాలనుకున్న శశికళ ఆశలు ఆవిరి. రెండ్రోజుల తర్వాత అంటే ఫిబ్రవరి 18న తమిళనాడు సీఎంగా శశికళ విశ్వాసపాత్రుడు పళనిస్వామి ప్రమాణం. పళని సీఎం చేయడంపై పన్నీరు వర్గంలో అసంతృప్తి. ఫిబ్రవరి 20న 122 మంది ఎమ్మెల్యేల మద్దతుతో తమిళనాడు అసెం బ్లీలో నిర్వహించిన బలపరీక్షలో నెగ్గిన పళనిస్వామి. పన్నీరు సెల్వంకు పోలైన ఓట్లు కేవలం 11 ఓట్లు.

ఫిబ్రవరి 16, 2017: జయలలిత మరణంతో ఖాళీ అయిన ఆర్కే నగర్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికల నేపథ్యంలో పార్టీ గుర్తు రెండాకులపై పన్నీరు, పళని వర్గాల్లో విభేదాలు. పార్టీ గుర్తుకోసం ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించిన ఇరువర్గాలు. అన్నాడీఎంకేలో చీలక నేపథ్యంలోపార్టీ గుర్తును స్తంభింపజేసిన ఎన్నికల కమిషన్. ఓటర్లకు డబ్బు ముట్టజెపుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఆర్కే నగర్ ఉప ఎన్నికలు ఏప్రిల్ 10కి వాయిదా.

ఏప్రిల్ 17, 2017: అన్నాడీఎంకే జనరల్ సెక్రటరీ టీటీవీ దినకరణ్ పై కేసు నమోదు చేసిన ఢిల్లీ క్రైంబ్రాంచ్ పోలీసులు. పార్టీ గుర్తు విషయంలో ఎన్నికల కమిషన్ అధికారికి లంచం ఇవ్వజూపారన్నఆరోపణ నేపథ్యంలో ఏప్రిల్ 26 అర్ధరాత్రి దినకరణ్ అరెస్ట్. ఢిల్లీలో నాలుగురోజులపాటు దినకరణ్ ను ప్రశ్నించిన పోలీసులు. జూన్ 1న బెయిల్ పై విడుదల.

ఆగస్టు 18, 2017: టీటీవీ దినకరణ్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న తరుణంలో అన్నాడీఎంకే లోని రెండు వర్గాల మధ్య మొదలైన విలీన చర్చలు.విలీనంపై అత్యవసరంగా భేటీ అయి చర్చించిన 25 మంది మంత్రులు.విలీన చర్చలు ఆశాజనకంగానే సాగుతున్నాయని మీడియాకు వివరించిన పన్నీర్ సెల్వం వర్గానికి చెందిన డి. జయకుమార్. పార్టీ నుంచి శశికళ, దినకరణ్‌ను బహిష్కరించాలని ప్రతిపాదనలు చేసిన పన్నీర్ సెల్వం వర్గీయులు.

ఆగస్టులోనే హైడ్రామాకు తెర

పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా దినకరణ్ నియామకం అంగీకారం కాదన్న ముఖ్యమంత్రి పళనిస్వామి. పళని ప్రకటనతో పన్నీర్‌తో దోస్తీకి తెరుచుకున్న ద్వారాలు. ఆగస్టు18న పలుమార్లు పళని, పన్నీర్ వర్గాల భేటీ. ఆగస్టు 21న శుభవార్త చెబుతామని ప్రకటించిన పన్నీరువర్గం. ఆగస్టు 21న ఏకమైన పన్నీర్, ప ళని వర్గీయులు.

శశికళ బైటికెళ్లి వచ్చారు!

అక్రమాస్తుల కేసులో కర్ణాటకలోని పరప్పన అగ్రహారం సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న అన్నాడీఎంకే నాయకురాలు శశికళ రాజభోగాలు అనుభవిస్తున్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. జైలులో ఉన్న శశికళ నిబంధనలకు విరుద్ధంగా నల్లరం గు కుర్తా వేసుకుని చేతిలో బ్యాగు పట్టుకుని దర్జాగా వెళ్తున్నట్లు మీడియాకు చిక్కిన సీసీటీవీ కెమెరా దృశ్యాలు సంచలనంగా మారాయి. శశికళ జైలు అధికారులకు లంచం ముట్టజెడ్డి రాజభోగాలు అనుభవిస్తున్నారన్న ఆరోపణలకు సీసీటీవీ దృశ్యా లు బలాన్ని చేకూరుస్తున్నాయి. శశికళ జైలు అధికారులకు లంచం ఇచ్చి రాజభో గాలు అనుభవిస్తున్నారని గతంలో జైళ్ల శాఖ డీఐజీగా పనిచేసిన డి.రూప ఆరోప ణలు చేశారు. రూప ఆరోపణలను గతంలోనే కొట్టిపారేసిన కర్ణాటక ప్రభుత్వం ఆమె ను జైళ్లశాఖ నుంచి ట్రాఫిక్ విభాగానికి బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో తన ఆరోపణ లు నిజం అని నిరూపించేందుకు సీసీటీవీ దృశ్యాలను ఏసీబీకి అందజేశారు.

ఈ వారంలోనే మోడీ కేబినెట్‌లో

మార్పులు.. చేర్పులు

- ప్రభుత్వంతోపాటు పార్టీలోనూ..
- దక్షిణాది రాష్ట్రాలకు సింహభాగం
- కేంద్ర మంత్రివర్గంలో జేడీయూకు 1, ఏఐఏడీఎంకేలకు 2 బెర్తులు
- ఎన్నికల సైన్యానికి తుదిమెరుగులు
- బీజేపీ సీఎంలతో మోడీ, షా సమావేశం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ కు అంతా సిద్ధమైంది. అన్నా డీఎంకే విలీనంతో ముడిపడ్డ కసరత్తు దాదాపు ఓ కొలిక్కి వచ్చింది. మార్పులు చేర్పుల కొత్త కేబినెట్ ఒకట్రెండు రోజుల్లో కొలువుదీరనుంది. తుది మెరుగులు దిద్దేందుకు పార్టీ అధినేత అమిత్ షా తన తమిళ నాడు పర్యటనను సైతం రద్దు చేసుకున్నారు. అనుకున్న సమయానికి కసరత్తు పూర్తయితే ఈ వారాంతంలోనే అంటే 24 లేదా 26 తేదీల్లో కొత్త మంత్రులు ప్రమాణస్వీకారం చేయవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 2019 ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని జరుగుతున్న కేబినెట్ పునర్వ్యవస్థీకరణ కావడంతో అత్యంత పకడ్బందీగా ఈ కసరత్తు చేస్తున్నారని తెలుస్తోంది. కేబినెట్‌లోకి కొత్తవారిని తీసుకోవడం లేదా, అప్పటికే ఉన్న మంత్రుల శాఖల్లో మార్పులు, చేర్పులు చేయ డంతో సరిపెట్టే పునర్వ్యవస్థీకరణ కాదిది. ఈసారి మంత్రుల పనితీరు, పార్టీ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొందరిని ప్రభుత్వం నుంచి పార్టీకి పంపవచ్చని తెలుస్తోంది. అదే తర హాలో కొందరిని పార్టీ నుంచి ప్రభుత్వంలోకి తీసుకోవచ్చని కూడా కథనాలు వినిపిస్తున్నాయి. ఎవరెక్కడ సమర్ధవంతం గా పనిచేయగలరో అక్కడ బాధ్యతలు అప్పగిస్తారని పార్టీలో కొందరు సీనియర్ నేతలు చెబుతున్నారు. పార్టీ కార్యక్రమా ల్లో చురుగ్గా వ్యవహరించి ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపొం దడంలో ముఖ్య భూమికనిర్వహించిన నేతలకు నజరానాగా మంత్రి పదవులు కట్టబెట్టిన విషయం తెలిసిందే. అయితే ఆయా నేతలు ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత అటు పార్టీకి, ఇటు ప్రభుత్వానికి పెద్దగా ఉపయోగం లేకుండా పోయిందనే విమర్శలున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టు కుని ఈ సారి పునర్వ్యవస్థీకరణ జరగనుందని అర్థమవుతోంది. అందుకే జోడు పదవుల విధా నానికి కూడా స్వస్తి పలకాలని అధినేతలిద్దరూ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో అటు పార్టీలోనూ, ఇటు ప్రభుత్వంలోనూ కీలక పదవు లు కలిగిన నేతలను ఏదో ఒక పదవికే పరిమితం చేసే అవకాశాలున్నాయి. అందుకే ఈ పునర్వ్యవస్థీకరణ కేవలం ప్రభుత్వానికే కాదు, పార్టీకి కూడా వర్తించనుంది. కేబినెట్ విస్తరణను అనుసరిస్తూ పార్టీలోనూ భారీగా మార్పులు చేపట్టే అవకాశముంది. అలాగే ఖాళీగా ఉన్న గవ ర్నర్ పదవుల భర్తీ కూడా కేబినెట్ విస్తరణ అనంతరం జరగ నుంది. క్రియాశీల రాజకీయాల్లో చురుగ్గా పనిచేయలేక పోతున్న సీనియర్లకు గవర్నర్ పదవులు కట్టబెట్టి గౌరవప్ర దంగా రిటైర్మెంట్ ఇవ్వాలని అధినేతలిద్దరూ భావిస్తున్నారు. ఇందుకోసం అనధికారికంగా 75ఏళ్ల కటాఫ్ నిబంధన అమ లు చేస్తున్న విషయం తెలిసిందే. గతంలో నజ్మా హెప్తుల్లా వం టి నేతలను కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పించి గవర్నర్‌గా పంపించారు. ఈసారి కూడా 75ఏళ్లు పైబడిన కల్‌రాజ్ మిశ్రా కేంద్ర మంత్రులతో పాటు ఆనందిబెన్ పటేల్, డీ.హెచ్ శంకరమూర్తి వంటి నేతలకు గవర్నర్ బెర్తులు ఖరారైనట్టు తెలుస్తోంది. ఇదే సమయంలో రాజ్యసభలో అడుగుపెడుతు న్న బీజేపీ అధినేత అమిత్ షా కేంద్ర రాజకీయాల్లో మరింత కీలకంగా వ్యవహరించనున్నారు. తొలుత ఆయన కీలక మం త్రిత్వశాఖను చేపడతారని ప్రచారం జరిగింది. అయితే తాను 2019 వరకు పార్టీ కోసమే పనిచేస్తానని స్పష్టం చేశారు.

బీజేపీ ముఖ్యమంత్రులతో సమావేశం

కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ కోసం తుది మెరుగులు దిద్దుతున్న పార్టీ, ప్రభుత్వాధినేతలు అమిత్ షా, మోడీలు సోమవారం సాయంత్రం బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమం త్రులు, ఉప ముఖ్యమంత్రులతోతూ సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మరి కొద్ది నెలల్లో జరగనున్న కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపైనా ప్రధానంగా చర్చించా రు. మిషన్ 350 ప్లస్ లక్ష్యాన్ని చేరుకోవడం కోసం ఇంకా ఎలాంటి చర్యలు చేపట్టాలన్న విషయంపై చర్చించా రు.

దక్షిణాదికి సింహభాగం


ఈసారి మంత్రివర్గ విస్తరణలో దక్షిణాది రాష్ట్రాలకు సింహభాగం దక్కనుందని తెలుస్తోంది. 'మిషన్ 350 ప్లస్'లో భాగంగా చేపట్టిన ఆపరేషన్ దక్షిణ్ భారత్ కోసం వీలైనన్ని ఎక్కువ పదవులను ఈ రాష్ట్రాలకు ఇచ్చే అవకాశముంది. ప్రతి రాష్ట్రం నుంచి బీజేపీ మంత్రులుం డేలా కూర్పు జరుగుతోంది. ఈ క్రమంలో అసలు ప్రాతిని ధ్యం లేని కేరళ నుంచి సురేష్ గోపీని మంత్రిగా తీసుకోను న్నారని తెలుస్తోంది. ఇక తమిళనాడులోనూ సొంత ఎంపీ లు లేరు. కాకపోతే అన్నా డీఎంకే ఎన్డీయేలో చేరి రెండు మంత్రి పదవులు తీసుకోనుంది. అయితే ఈ రాష్ట్రానికి చెందిన బీజేపీ నేత, నామినేటెడ్ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి కేంద్ర మంత్రి పదవి ఆశిస్తున్నారని తెలుస్తోంది. ఏకంగా కేంద్ర ఆర్థికశాఖ మీదనే కన్నేశారని అప్పట్లో కథనాలు వెలువడ్డాయి. ఎకనామిక్స్‌లో ప్రఖ్యాత హార్వార్డ్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ చేసిన సుబ్రహ్మణ్య స్వామి గతంలో చంద్రశేఖర్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పు డు కేంద్ర మంత్రిగా పనిచేశారు. త్వరలో ఎన్నికలు జరగ నున్న కర్ణాటకకు కూడా మంత్రి పదవుల వాటా పెంచే అవ కాశం కనిపిస్తోంది. తొలుత రైల్వే మంత్రిగా మొదలు పెట్టి న్యాయశాఖ మంత్రిగా, తర్వాత గణాంకాల శాఖ మంత్రి గా ప్రతి కేబినెట్ విస్తరణలోనూ ప్రాధాన్యత కోల్పో తూ వచ్చిన సదానంద గౌడకు ఈసారి ప్రాధాన్యత కలిగిన పద వి ఇచ్చే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే తెలంగాణలో బీజేపీకి ఉన్న ఏకైక ఎంపీ బండారు దత్తాత్రే య ఇప్పటికే కేంద్ర కార్మికశాఖ సహాయ మంత్రి (స్వతం త్ర హోదా)గా ఉన్నారు. అయితే దక్షిణాదికి ప్రాధాన్యత పెంచే క్రమంలో ఆయన్ను అదే శాఖలో కొనసాగిస్తూ కేబినెట్ హోదా కల్పించే అవకాశ ముంది. తెలంగాణకు చెందిన పార్టీ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావును కూడా కేంద్ర మంత్రిగా తీసు కుంటారని తొలుత ప్రచారం జరిగినా, ఆ తర్వాత ఆయన పేరు పెద్దగా వినిపించలేదు. ఏపీ నుంచి రాంమాధవ్‌ను కేంద్రంలోకి తీసుకోవాలని గట్టిగా నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.

త్వరలో డోక్లామ్ సమస్యకు పరిష్కారం



న్యూఢిల్లీ: సిక్కిం,భూటాన్ సరిహద్దుల్లో డోక్లాం వద్ద చైనా నిర్మిస్తున్న మహామార్గంపై తలెత్తిన వివాదం త్వరలోనే పరిష్కారం అవుతుందన్న ఆశాభావాన్ని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యక్తం చేశారు. ఆయన సోమవారం ఢిల్లీలో ఇండో-టిబెటన్ సరిహద్దు దళాల కార్యక్రమంలో ప్రసంగిస్తూ పొరుగుదేశాలతో భారత్ శాంతినే కోరుతున్నదనీ,భారత్ యత్నాలకు చైనా నుంచి సానుకూలమైన స్పందన లభించగలదని ఆశిస్తున్నామని ఆయన చెప్పారు. భారత్ శాంతిని కోరుతున్నదనే విషయాన్ని పొరుగుదేశాలకు స్పష్టం చేయదల్చుకున్నానని ఆయన చెప్పారు. తమ సరిహద్దులను పరిరక్షించేసామర్థ్యం భారత సైనికులకు ఉందని ఆయన స్పష్టం చేశారు. సరిహద్దులను పరిరక్షించే సామర్థ్యం మన భద్రతాదళాలకు ఉందని ఆయన అన్నారు. జమ్ము,కాశ్మీర్ నుంచి అరుణాచల్ ప్రదేశ్ వరకూ సరిహద్దులలో గస్తీ కాస్తున్నది ఇండో-టిబెటన్ పోలీసులేనని ఆయన అన్నారు. చైనాతో సరిహద్దు వివాదం కూడా శాంతియుత చర్చల ద్వారా పరిష్కారం కాగలదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

మాలేగావ్ నిందితుడికి బెయిల్



న్యూఢిల్లీ: మాలెగావ్ పేలుడు కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ శ్రీకాంత్ పురోహిత్‌కు భారత సర్వోన్నత న్యాయస్థానం సోమవారం బెయిల్ మంజూరు చేసింది. ముందుగా ఆయన బెయిల్ విజ్ఞప్తిని బొంబాయి హైకోర్టు తిరస్కరించింది. హైకోర్టు వెల్లడించిన ఉత్తర్వులను సవాల్‌చేస్తూ పురోహిత్ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో, పురోహిత్ కేసును పూర్తిగా విచారించిన జస్టిస్ ఆర్కే అగర్వాల్, ఏఎం సప్రేతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ సందర్భంగా పురోహిత్ తరపున సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు వినిపిస్తూ నిందితుడు తొమ్మిదేళ్ళుగా జైలులోనే ఉన్నా ఇప్ప టివరకూ ఆయనపై అభియోగాలు నమోదు చేయలేదని వెల్లడించారు. పురోహిత్‌పై మహారాష్ట్ర వ్యవస్థీకృత నేరాల నియంత్రణ చట్టం కింద మోపిన అభియోగాలను వెనక్కి తీసుకున్నందున మధ్యంతర బెయిల్ పొందేందుకు పురోహిత్ అర్హుడని కోర్టుకు నివేదించారు.

ఆక్సిజన్ అందక పసికందుల మృతి

- రాయ్‌పూర్ ఆస్పత్రిలో మరో గోరఖ్‌పూర్ ఉదంతం
- ముగ్గురు శిశువుల దుర్మరణం



న్యూఢిల్లీ: రాయ్‌పూర్ ఆసుపత్రిలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆక్సిజన్ అందక ముగ్గురు పసికందులు మృతి చెందారు. ఈ సంఘటన ఛత్తీస్‌ఘర్‌లోని రాయపూర్ ఆసుపత్రిలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఆసుపత్రిలో ఆక్సిజన్ సరిపడా ఉన్నప్పటికీ, సిబ్బంది నిర్లక్ష్యంతోనే చిన్నారులు మృతి చెందినట్లుస్థానిక అధికారులు ధృవీకరించారు. ఈ ఘటనకు బాధ్యుడిగా చేస్తూ, ఆక్సిజన్ ఆపరేటర్‌ను విధుల నుంచి తొలగిం చారు. మృతి చెందిన పసికందులు గుండెకు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. వైద్యం అందిస్తున్న సమయంలో ఆక్సిజన్ అయిపోంది. ఈ విషయాన్ని గుర్తించిన డ్యూటీ డాక్టర్లు సంబంధిత విభాగ అధికారులకు సమాచారమిచ్చారు. ఆపరేషన్ థియేటర్‌లో ఆక్సిజన్ కావాలని సంబంధిత విభాగ బాధ్యులకు తెలిపినప్పటికీ, వారు సరైన సమయంలో ఆక్సిజన్‌ను అందజేయలేదు. దీంతో, చిన్నారులు ఊపిరాడక చనిపోయారు. ఈ ఘటనపై ఛత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ తీవ్రంగా స్పందించారు. చిన్నారుల మృతి తనను ఎంతో మనోవేధనకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ మేరకు ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి వైద్యారోగ్య శాఖ కార్యదర్శి, ఉత్తర రాయ్‌పూర్ ఎమ్మెల్యే శ్రీచంద్ సుందరాని ఆసుపత్రి సందర్శించి బాధితులను పరామర్శించారు.

గుజరాత్‌పై కాంగ్రెస్ నజర్

- ఎమ్మెల్యేలకు సోనియా దిశానిర్దేశం
- గాంధీ మార్గంలో నడవాలని సూచన



న్యూఢిల్లీ: రాజ్యసభ ఎన్నికల్లో అహ్మద్ పటేల్ విజయం తో బీజేపీకి షాక్ ఇచ్చిన కాంగ్రెస్ గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలపై దృష్టిపెట్టింది. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేలంతా ముక్తకంఠంతో ముందుకు సాగాలని కాంగ్రె స్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ నేతల కు దిశానిర్దేశం చేశారు. గుజరాత్ ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా భేటీ అయిన సోనియా, రాహుల్ వచ్చే ఎన్నికల్లో అనుసరిం చాల్సిన వ్యూహాలపై చర్చించారు. మహాత్మాగాంధీ పుట్టిన గడ్డపై నీతి, నిజాయితీని కాపాడాలని... అందుకోసం కాంగ్రెస్ నేతలంతా కలిసికట్టుగా ముందుకుసాగాలని సోనియా పిలుపునిచ్చారు. అహ్మద్ పటేల్ గెలుపులో చూపించిన తెగువపై ఎమ్మెల్యే లను అభినందించిన సోని యా.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదేవిధంగా ముందుకు సాగాలని ఆదేశించారు. అరగం టకు పైగా జరిగిన ఈ సమావేశంలో రాహుల్, సోనియా రాజ కీయ వ్యవహారాల కార్యదర్శి అహ్మద్ పటేల్ కూడా ఎమ్మె ల్యేలకు పలు సూచనలు చేశారు. మహాత్మా గాంధీ చూపించి న మార్గంలోనే ఎమ్మెల్యేలు నడవాలని రాహుల్ గాంధీ నేతలకు సూచించారు.

ఈసీ, అహ్మద్ పటేల్‌కు హైకోర్టు నోటీసులు

అహ్మదాబాద్ హైకోర్టు ఎన్నికల కమిషన్‌తోపాటు అహ్మద్ పటేల్,అమిత్ షా, స్మృతి ఇరానీలకు నోటీసులిచ్చిం ది. గుజరాత్ నుంచి రాజ్యసభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఇద్దరు కాంగ్రెస్ రెబల్ నాయకులు ఓట్లు చెల్లవని ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ... బీజేపీ అభ్యర్థి బల్వంత్ సింగ్ రాజ్‌పూర్ హైకోర్టును ఆశ్రయించడంతో ఈసీతో పాటు ఆయా నేతలు వివరణ కోరింది. రెబల్ ఎమ్మె ల్యేలతో పాటు మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా నిబంధనలు ఉల్లంఘించారని పిటిషనర్ ఆరోపించారు.

సింగపూర్ వద్ద నౌకలు ఢీ


వాషింగ్టన్: సింగపూర్ సమీపంలో మాలాకా జలసంధి వద్ద అమెరికా యుద్ధ నౌక యూఎస్ఎస్ జాన్ మెక్ కెయిన్‌ను ఆయిల్ ట్యాంకర్ నౌక ఢీకొన్న ప్రమాదం లో అమెరికాకు చెందిన పదిమంది నావికులు గల్లంతు అయ్యారు.మరో ఐదుగు రు గాయపడ్డారు.ఈ ఘటన ఈ తెల్లవారు జామున ఐదున్నర ప్రాంతంలో జరి గింది. గల్లంతు అయిన వారంతా అధికారులేననీ, వారి కోసం గాలింపు చర్యలు ప్రారంభించామని నౌకాదళాధికారి ఆడమ్ రిచర్డ్ సన్ తెలిపారు. గల్లం తయిన నౌకాధికారుల కోసం గాలింపు చర్యల కోసం హెలికాప్టర్లను వినియో గించాల్సిం దిగా నౌకాదళాధికారులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదే శించారు. రెండు నెలలకాలంలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం ఇది రెండవ సారి. దక్షిణ జపాన్ ప్రాంతంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో ఏడుగురు మరణిం చారు. ఆయిల్ ట్యాంకర్ నౌక 30వేల టన్నుల బరువు ఉన్నట్టు సమాచారం.

ఇంజనీరింగ్‌కు నీట్ తరహా పరీక్ష లేదు: హెచ్‌ఆర్‌డీ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వైద్య విద్యకు ఒకే ఎంట్రన్స్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు, ఇంజనీరింగ్ విభాగానికి ఆ విధంగా ఉండదని కేంద్ర మానవ వనరుల శాఖ అభిప్రాయపడింది. ఇంజనీరింగ్ విద్యలో రాష్ట్రాలు సొంతంగా ప్రవేశాలు జరుపుకోవచ్చని తెలిపింది. ఈ విధానాన్ని వచ్చే సంవత్సరం నుంచి ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఆ శాఖ మంత్రి ప్రకాశ్ జవదేవకర్ సోమవారం తెలిపారు. ఇంజనీరింగ్ ప్రవేశాలకు దేశవ్యాప్తంగా ఒకే ఎంట్రన్స్ ఎగ్జామ్ నిర్వహించాలా? లేక రాష్ట్రాలవారీగా నిర్వహించాలా? అన్న అంశంపై ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యూకేషన్ (ఏఐసీటీఈ) నివేదిక తయారు చేస్తుందని చెప్పారు.



యువీ పునారగమనం కష్టమే: గంభీర్



న్యూఢిల్లీ: టీమిండియా ప్రపంచకప్ హీరో యువరాజ్‌సింగ్ పునరాగమనం కష్టమేనని సహచరుడు గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. అతడికి విశ్రాంతి కల్పించామని చెప్పడం సరైన పదం కాదేమోనన్నాడు. 'విశ్రాంతి అనేది సరైన పదం కాదనుకుంటున్నా. ఎందుకంటే యువీ ఈ మధ్య కాలంలో ఎక్కువగా క్రికెట్ ఆడనేలేదు. ఐతే అతడు ఆడాలనే పట్టుదలతో ఉన్నాడు. అతడిని ప్రపంచకప్‌లో ఆడించాలనుకుంటే ఎక్కువ అవకాశాలు ఇవ్వాలి. యువీ లాంటి ఆటగాడిని లయ కోల్పోకుండా చూడాలి. ఓ సిరీస్‌లో ఆడించి మరో దాంట్లో విశ్రాంతి ఇవ్వకూడదు. అందుకే యువీ టీమిండియాలోకి పునరాగమనం చేయడం చాలా కష్టం. ఐతే అతడొక దిగ్గజం. మళ్లీ అవకాశం రావాలని ఆశిస్తున్నా' అని గంభీర్ అన్నాడు. అదేవిధంగా 2019 ప్రపంచకప్‌లో చోటు సంపాదించుకునేలా మిస్టర్ కూల్ మహేంద్ర సింగ్ ధోనీ బ్యాటింగ్‌లో నిలకడ కొనసాగించాలి. మ్యాచ్ ఫినిషర్ పాత్రను తిరిగి అందిపుచ్చుకోవాలి అని గంభీర్ అభిప్రాయపడ్డాడు. శ్రీలంకతో పరిమిత ఓవర్ల సిరీస్‌కు యువీని బీసీసీఐ సెలక్టర్లు ఎంపిక చేయలేదు. అతడిక జట్టులోకి రాకపోవచ్చని విమర్శలు చెలరేగాయి. చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ యువీకి విశ్రాంతినిచ్చామని అతడికి తలుపులు తెరిచే ఉన్నాయని వివరణ ఇచ్చారు.

లంక జట్టులో చండీమాల్ దుమారం



కొలంబో: భారత్‌తో జరిగిన తొలి వన్డేలో ఘోర ఓటమి శ్రీలంక క్రికెట్‌లో చిచ్చురేపుతోంది. ఐదు వన్డేల సిరీస్‌కు మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ దినేశ్ చండీమాల్‌ను ఎంపిక చేయకపోవడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. దీనిపై లంక తాత్కాలిక కోచ్ నిక్ పొథాస్ మౌనం దాల్చారు. సెలక్షన్ లోపాలపై మాట్లాడేందుకు నిరాకరిస్తున్నారు. గత రెండేళ్లుగా టెస్టులకు నాయకత్వం వహిస్తున్న చండీమాల్ లంక వన్డే జట్టులో కీలక ఆటగాడిగా ఉన్నాడు. చండీమాల్ స్థానాన్ని వన్డే కెప్టెన్ ఉపుల్ తరంగకు కట్టబెట్టిన సెలక్షన్ కమిటీ చీఫ్ సనత్ జయసూర్య, ఆరోనంబర్ బ్యాట్స్‌మన్‌గా కపుగెదెరను ఎంపిక చేశారు. తొలివన్డే అనంతరం చండిమాల్ ఎంపిక గురించి మీడియా పొథాస్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. ఇందుకు సమాధానాన్ని దాటవేసిన ఆయన, జట్టు ఎంపిక గురించి సెలక్షన్ కమిటీని అడగండంటూ ముక్తాయింపు ఇచ్చారు.


అభిమానుల ఆక్రోశం.. క్రికెటర్ల బస్సు నిలిపివేత

కొలంబో: టీమిండియాతో జరుగుతున్న సిరీస్‌లో ఆతిథ్య జట్టు శ్రీలంక పేలవమైన ప్రదర్శన ఇస్తున్న విషయం తెలిసిందే. దీంతో అభిమానుల్లో తీవ్ర ఆగ్రహజ్వాలలు పెల్లుబికుతున్నాయి. డంబుల్లాలో మొదటి వన్డే ఓటమి తర్వాత ఏకంగా సభ్యులను ఘొరావ్ చేసినట్లు తెలుస్తోంది. సుమారు 50 మంది క్రికెట్ ఫ్యాన్స్ ఆదివారం వన్డే ముగిశాక క్రికెటర్లు ప్రయాణిస్తున్న బస్సును అడ్డగించి వ్యతిరేక నినాదాలు చేశారని సమాచారం. వెంటనే రంగంలోకి దిగిన భద్రతా సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తెచ్చే తీవ్రంగానే యత్నించినట్లు స్థానిక మీడియాలు వెల్లడించాయి. మరోవైపు జట్టులో అంతర్గత కలహాలపై కోచ్ నిక్ పోతస్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆటగాళ్లు ఫిట్‌నెస్ పరంగా అద్భుతంగా రాణిస్తున్నారని, అయితే సమస్యలు డ్రెస్సింగ్ రూంలోనే పుడుతున్నాయని వ్యాఖ్యానించారు. అదే సమయంలో తనకు జట్టులో స్వేచ్ఛ ఇవ్వాలంటూ బోర్డుకు విజ్ఞప్తి చేసారు. మరోపక్క జట్టుపై వస్తున్న విమర్శల నేపథ్యంలో మాజీ ఆటగాడు కుమార సంగక్కర స్పందించారు. ఇలాంటి సమయంలో సంయమనంతో ఉండి జట్టు సభ్యులకు మద్ధతుగా నిలవాలంటూ సంగక్కర ఓ వీడియో సందేశంలో పిలుపునిచ్చారు.

వైఫల్యాల నుంచి ఎంతో నేర్చుకున్నా

శిఖర్ ధావన్

అంతర్జాతీయ క్రికెట్‌లో శిఖర్ ధావన్ ఆటతీరు ప్రత్యేకం. క్రీజులో కుదురుగా ఉంటూనే, బౌలర్లపై ఎదురుదాడి చేయడం అతని ప్రత్యేకత. 2013 ఐసీసీ చాంపియన్ షిప్ ట్రోఫీలో రెండు సెంచరీలు, ఒక అర్ధసెంచరీతో కెరీర్‌ను ఘనంగా ప్రారంభించాడు. 2015 ప్రపంచ కప్‌లోనూ అదే ఆటతీరును పునరావృతం చేసిన ధావన్, 2017 చాంపియన్స్ ట్రోఫీలోనూ సత్తాచాటాడు. ఈ ఈవెంట్ల మధ్య కాలంలో కొన్నిసార్లు వైఫల్యాలతో జట్టుకు దూరమైన సందర్భాలూ ఉన్నాయి. అయితే ఇటీవల తిరిగి జట్టులోకి పునరాగమనం చేసిన ధావన్ మ్యాచ్ మ్యాచ్‌కూ రాటుదేలుతున్నాడు. జట్టు కీలక ఆటగాళ్ల బృందంలో ఒకడిగా చోటు సంపాదించాడు. శ్రీలంకతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో తాజా ప్రదర్శనతో అందరి దృష్టిని తనవైపు మళ్లించాడు. 132 (నాటౌట్) పరుగులతో కదంతొక్కడం ద్వారా జట్టు ఘనవిజయంలో కీలకపాత్ర పోషించాడు.



వైఫల్యాలే పాఠాలు నేర్పాయి..

"ప్రతీసారి మెరుగైన ఆటతీరును ప్రదర్శించే ప్రయత్నం చేస్తాను. అదే నాలక్ష్యం. రికార్డులను పట్టించుకోను. జట్టులో ప్రతిభావంతు లైన బ్యాట్స్‌మెన్ ఉన్నారు. నేను ఏమాత్రం వెనుకబడినా నా స్థానాన్ని లాగేసుకుంటారు" అంటూ ధావన్ గత వైఫల్యాలను, అనుభవాలను గుర్తుచేసుకున్నాడు. వైఫల్యాలే తనను రాటుదేల్చాయని చెప్పుకొచ్చాడు. ఆ గడ్డుకాలం ఇప్పటికీ చేదు అనుభవమేనన్న ధావన్, సరిగ్గా ఆడని సందర్భాలలో ఆటను మెరుగు పరుచుకోవడంపై దృష్టిసారించేవాడినని పేర్కొన్నాడు. వైఫల్యాలు మనకు పాఠాలు నేర్పుతాయని నమ్ముతాను. నేను అదృష్టవంతుడిని. వైఫల్యాల నుంచి ఎంతో నేర్చుకున్నాను అంటూ గత స్మృతులను నెమరువేసుకున్నాడు.

> "ప్రతీసారి మెరుగైన ఆటతీరును ప్రదర్శించే ప్రయత్నం చేస్తాను. అదే నాలక్ష్యం. రికార్డులను పట్టించుకోను. జట్టులో ప్రతిభావంతులైన బ్యాట్స్‌మెన్ ఉన్నారు. నేను ఏమాత్రం వెనుకబడినా నా స్థానాన్ని లాగేసుకుంటారు. వైఫల్యాలే నన్ను బ్యాట్స్‌మెన్‌గా రాటుదేల్చాయి. నేను అదృష్టవంతుడిని వైఫల్యాల నుంచి ఎంతో నేర్చుకున్నాను"
>
> \- ధావన్

ఫిట్‌నెస్ కీలకం

"జట్టులో యువకులు ఉన్నారు. అందువల్ల ఫిట్‌నెస్‌ను కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుంటాను. ఎక్కువ పరుగులు చేయాలన్న లక్ష్యాలు ఏమీ లేవు. క్రికెట్‌ను ఆస్వాదిస్తూ ముందుకు వెళ్లడమే ప్రధాన ఉద్దేశం. ఫిట్‌నెస్, నైపుణ్యం, ఫీల్డింగ్‌లో రాణించడంపైనే దృష్టిపెడతాను. క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలోనూ ఫీల్డింగ్ ప్రధానమైనది. అందుకు ఫిట్‌నెస్ మెరుగ్గా ఉండాల్సిందే. ఫీల్డింగ్‌లో ఒక్క చిన్న పొరపాటు మ్యాచ్ స్వరూపాన్నే మార్చివేస్తుంది. ఈ రోజుల్లో క్రికెట్‌లో వేగం పెరిగింది. దానికి తగ్గట్లుగా ఆడాలంటే ఫిట్‌గా ఉండటం తప్పనిసరి. ప్రతి జట్టూ ఈ ప్రమాణాలను పాటిస్తోంది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ వంటి జట్లు ఫిట్‌నెస్‌కు కొన్ని కొలమానాలను నిర్దేశించుకున్నాయి. ఆ మేరకు ఆటగాళ్లను తుది జట్టులోకి ఎంపిక చేస్తున్నాయి.

నేనెతే నోటి దురుసుగా ప్రవర్తించను..

లంక జట్టులో యువకులు ఎక్కువగా ఉన్నారు. వారంత పరివర్తన దశలో ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో అనుభవం కీలకం. కాలం గడిచేకొద్దీ వాళ్ల ఆటతీరు మెరుగవుతుందని భావిస్తున్నా. మైదానంలో కొన్నిసార్లు దూకుడులో భాగంగా నోటికి పనిచెప్పడం సహజమే. కానీ నేను మాత్రం వారిలా అసభ్య పదజాలాన్ని ఉపయోగించను. నోటి దురుసుకు దూరంగానే ఉంటాను. శ్రీలంక నుంచి ఇంత చెత్తప్రదర్శ నా కెరీర్‌లో ఇదే తొలిసారి. వారికి మెరుగైన సీమర్లున్నారు. చాంపియన్స్ ట్రోఫీలోనూ మమ్మల్ని ఓడించారు. ఇప్పుడు మేము పరిణితి చెందిన బృందంలో ఉన్నాము. చాలా మంది అనుభవజ్ఞులు ఉన్నారు. ఒత్తిడిని పరిస్థితులను అధిగమించడంలో రాటుదేలారు. శ్రీలంక జట్టు కూడా కాలక్రమేణా పుంజుకుంటుంది అని ధావన్ పేర్కొన్నాడు.

టీ20 ప్రపంచకప్ టార్గెట్ - మిథాలీ



న్యూఢిల్లీ: వన్డే క్రికెట్ ప్రపంచకప్ టోర్నీలో అసాధారణ ప్రదర్శన చేసిన భారత మహిళ జట్టు తుదపరి లక్ష్యం టీ20 ప్రపంచకప్ అని కెప్టెన్ మిథాలీ రాజ్ స్పష్టం చేశారు. లండన్ వన్డే చాంపియన్ టోర్నీ నుంచి స్వదేశం చేరుకుని నెలరోజులైంది. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట జరిగే ఈవెంట్లతో బిజీ అయిపోయాను. జట్టులోని మిగతా సభ్యులంతా విరామ సమయాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. త్వరలోనే మేమంతా మళ్లీ శిక్షణా శిబిరానికి చేరుకోవాల్సి ఉంది అని భారత టాప్ ఆర్డర్ మహిళా బ్యాట్స్‌మన్ మిథాలీ చెప్పారు. లండన్ ప్రదర్శన మాకు మంచి గుర్తింపునిచ్చింది. ఫైనల్ దాకా చేరడంతో అభిమానుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఎక్కడికి వెళ్లినా సానుకూల ప్రతిస్పందన కనిపిస్తోంది. ఇది మహిళా క్రికెట్‌కు శుభ పరిణామం. అంతర్జాతీయ టోర్నీలు ఆటగాళ్లలోని నైపుణ్యాన్ని వెలికితీస్తాయి. వచ్చే యేడాది ప్రపంచ కప్ టీ20 సిరీస్ ఉన్నందున ఆస్ట్రేలియాలో జరగనున్న బిగ్‌బాష్ లీగ్‌పై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. నేను రిటైర్ అయ్యేనాటికి భారత మహిళా జట్టును అత్యంత శక్తివంతంగా తీర్చిదిద్దాలన్నదే ధ్యేయం. అదృష్టవశాత్తు నేను మంచి ఫామ్‌లో ఉన్నాను. మరికొంత కాలం ఇదే ప్రదర్శనను కొనసాగిస్తానన్న నమ్మకం ఉంది. ఇండియా తొలి రెండు ర్యాంకులకు చేరుకోవాలన్నదే లక్ష్యం. అప్పుడే నేను నిజంగా గర్విస్తా. ప్రస్తుతం టీ20 ప్రపంచకప్ టోర్నీపైనే దృష్టిసారించాను. ఇంతకు ముందు ఈ టోర్నీలో సరైన ప్రదర్శన చేయలేకపోయాము. కానీ ఇప్పుడు మాపై అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకు తగ్గట్లు ఆడాల్సిన బాధ్యత మాపై ఉంది. అందరి ఆశలను నిజం చేస్తామన్న విశ్వాసంతో ముందుకు వెళ్తాము అని మిథాలీ రాజ్ చెప్పారు.

తొలి రౌండ్‌లో కిదాంబి విజయం



గ్లాస్కో: స్కాట్లాండ్‌లో జరుగుతున్న 2017 ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ తొలిరౌండ్ గేమ్‌లో భారత ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ విజయం సాధించాడు. రష్యా ఆటగాడు సర్గే సిరాంత్‌పై 21-13, 21-12 స్కోరుతో వరుస సెట్లలో ఆధిక్యం చాటాడు. ప్రత్యర్థిపై మొదటి నుంచే ఆధిక్యం కనబరిచిన శ్రీకాంత్‌కు ఏ దశలోనూ చెమటోడ్చాల్సిన అవసరం రాలేదు. తదుపరి గేమ్‌లో కిదాంబి శ్రీకాంత్ ఫ్రాన్స్ క్రీడాకారుడు లుకాస్ కర్వీ లేదా చైనాకు చెందిన తైపీస్ లిన్ యు హైసిన్‌తో తలపడాల్సి ఉంటుంది.



ఛేజింగ్‌లో విరాట్ రికార్డు

దంబుల్లా: పరుగుల యంత్రంగా ముద్రపడిన భారత కెప్టెన్ విరాట్ కోహ్లి మరో అరుదైన క్లబ్‌లో చేరిపోయాడు. శ్రీలంకతో జరిగిన తొలి వన్డేలో కోహ్లి మరో ఘనతను సాధించాడు. సక్సెస్ ఫుల్ ఛేజింగ్‌ల్లో నాలుగువేల పరుగుల మార్కును కోహ్లి అందుకుని ఆ ఘనత సాధించిన మూడో క్రికెటర్‌గా నిలిచాడు. లంకేయులతో మ్యాచ్ లో కోహ్లి అజేయంగా 82 పరుగులు నమోదు చేశాడు. తద్వారా నాలుగు వేల పరుగుల సక్సెస్ ఫుల్ ఛేజింగ్ క్లబ్‌లో కోహ్లి చేరిపోయాడు. అంతకుముందు సచిన్ టెండూల్కర్(5,490), రికీ పాంటింగ్(4,186)లు మాత్రమే దీన్ని సాధించారు. అయితే ఈ ఘనతను సాధించే క్రమంలో విరాట్ కోహ్లి బ్యాటింగ్ సగటు 100.02గా ఉండటం విశేషం. కాగా, ఇక్కడ సచిన్ 55.45 సగటుతో, రికీ పాంటింగ్ 57.34 సగటుతో మాత్రమే ఈ ఫీట్ ను సాధించారు. ప్రస్తుతం విరాట్ ఖాతాలో 28 వన్డే సెంచరీలున్నాయి. అందులో ఛేజింగ్ చేసే క్రమంలో విరాట్ సాధించిన సెంచరీలు 18. వీటిలో 16 సెంచరీలు భారత్ కు విజయాన్ని అందించాయి.



కోల్‌కతా: 2017 యూత్ ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీకి ముస్తాబవుతున్న సాల్ట్‌లేక్ స్టేడియం

రఫెల్ నాదల్ నెం.1

- ఏటీపీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి స్పెయిన్ క్రీడాకారుడు
- తొమ్మిదేళ్ల తర్వాత తిరిగి మొదటి ర్యాంకు కైవసం

ఏటీపీ తాజా ర్యాంకింగ్స్‌లో రఫెల్ నాదల్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. సోమవారం విడుదల చేసిన ర్యాంకిగ్స్‌లో నెంబర్ 1గా నిలవడంపై రఫెల్ ఉబ్బితబ్బిబ్బయ్యాడు. రెండేళ్ల కిందట 13వ స్థానంలో ఉన్న తాను ఈస్థాయికి చేరడాన్ని నమ్మలేకపోతున్నా నంటూ సంతోషం వ్యక్తం చేశాడు. 31 ఏళ్ల ఈ స్పెయిన్ క్రీడాకారుడు ఈ యేడాది 15వ గ్రాండ్‌శ్లామ్‌ను నెగ్గి సంచలనం సృష్టించాడు. ఫైనల్ మ్యాచ్‌లో రొనాల్డొపై విజయం సాధించాడు. బ్రిటన్ క్రీడాకారుడు ఆండీ ముర్రే గాయం కారణంగా టోర్నీ నుంచి మధ్య లోనే వైదొలగడంతో నాదల్‌కు కలిసొచ్చింది. తొలిసారి ఆగస్టు 2008లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకులోకి అడుగుపెట్టిన నాదల్, దాదాపు 141 వారాలపాటు ఆ స్థానాన్ని నిలబెట్టుకు న్నాడు. అయితే ఆ తర్వాత మోకాలి గాయంతో ఒక్కో మెట్టూ కిందికి జారుతూ 2015లో 13వ ర్యాంకుకు పడిపోయాడు. తిరిగి తొమ్మిదేళ్ల తర్వాత అగ్రపథానికి చేరుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్ లో రఫెల్ నాదల్ తర్వాత ద్వితీయ స్థానంలో ఆండీ ముర్రే నిలిచారు. తర్వాతి స్థానాల్లో రోజర్ ఫెదరర్(3), స్టాన్ వావ్రింకా (4), నొవాక్ జకోవిచ్ (5), అలెగ్జాండర్ జ్వెరొవ్ (6), మారిన్ సిలిక్ (7), డొమినిక్ థియమ్ (8), గ్రిగర్ దిమిత్రొవ్ (9), నిషికొరి (10) నిలిచారు.





పాక్‌లో మళ్లీ క్రికెట్ సంబరాలు

- వరల్డ్ఎలెవన్ టూర్ ఖరారు
- సెప్టెంబర్‌లో మూడు టీ20 మ్యాచ్‌లు
- క్రికెటర్లకు దేశాధ్యక్షుడి తరహాలో భద్రత
- పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్ నాజం సేథీ వెల్లడి
- లాహోర్‌లో టీ20 సిరీస్‌కు విండీస్ అంగీకారం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ క్రికెట్‌కు మళ్లీ మంచిరోజులు వచ్చాయి. పాక్ అభిమానులు మునుపటిలా స్వదేశంలో క్రికెట్‌ను ఆస్వాదించేందుకు మార్గం సుగమం అయింది. మార్చి 2009లో శ్రీలంక క్రికెటర్లు ప్రయాణిస్తున్న బస్సుపై ఉగ్రదాడి అనంతరం ఆ దేశంతో క్రీడా సంబంధాలకు వివిధ దేశాలు నో చెప్పాయి. 2011 ప్రపంచ కప్ ఆతిథ్య దేశాల జాబితాలో పాక్ ఉన్నప్పటికీ దాదాపు అన్ని మ్యాచ్‌లు ఇండియా, శ్రీలంక, బంగ్లాదేశ్‌ల్లోనే జరిగాయి. కేవలం ఆఫ్ఘనిస్తాన్, జింబాబ్వే మాత్రమే పాక్‌లో రెండు వన్డేలు ఆడాయి. దీంతో పాక్ క్రికెట్ సంక్షోభంలో పడింది. ఆదాయం గణనీయంగా తగ్గింది. ఇలాంటి పరిసితుల్లో దేశంలో క్రికెట్ పునరుద్ధరణకు పీసీబీ (పాక్ క్రికెట్ బోర్డు) చేపట్టిన చర్యలు ఫలించాయ. ఇస్లామాబాద్‌తో క్రికెట్ సంబంధాల పునరుద్ధరణకు తొలుత శ్రీలంక గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పుడు వరల్డ్ ఎలెవన్ మ్యాచ్‌లకు రంగం సిద్ధమైంది. లాహోర్‌లో జరగనున్న టీ20 సిరీస్‌కు జింబాబ్వే లెంజండరీ క్రికెటర్ ఆండీఫ్లవర్ సారథ్యంలోని 15 మంది సభ్యుల బృందం సెప్టెంబర్‌లో పాక్‌లో అడుగుపెట్టనుంది. ఈ విషయాన్ని పీసీబీ చైర్మన్ నాజం సేథి సోమవారం స్పష్టం చేశారు. అదే క్రమంలో పాక్‌తో టీ 20 సిరీస్ ఆడేందుకు వెస్టిండీస్ అంగీకారం తెలపడం పీసీబీకి మరింత సంతోషకరమైన విషయం. ఈ సిరీస్ నవంబర్‌లో జరిగే అవకాశం ఉంది. వరల్డ్ ఎలెవన్‌తో మూడు మ్యాచ్‌లు జరుగుతాయన్న పీసీబీ, భద్రతా కారణాల రీత్యా షెడ్యూల్ వివరాలను వెల్లడించేందుకు నిరాకరించింది.

దేశాధ్యక్షుడి స్థాయి భద్రత

పాక్‌లో పర్యటించే విదేశీ క్రికెటర్లకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసేందుకు పంజాబ్ ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తంచేసింది. దేశాధ్యక్షుడి తరహా భద్రత కల్పిస్తామని పీసీబీకి స్పష్టం చేసింది. వరల్డ్ ఎలెవన్ సిరీస్ సవ్యంగా జరిగితే, భద్రతపై సంతృప్తికరంగా ఉంటే తదుపరి తాము పాక్‌లో అడుగుపెడతామని శ్రీలంక తెలిపింది. ఈ నెలాఖరులో ఐసీసీ భద్రతా ప్రమాణాల పర్యవేక్షక బృందం ఇస్లామాబాద్ చేరుకుంటుంది. క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు అనుకూల వాతావరణం ఉందా? లేదా? అన్న దానిపై పర్యవేక్షిస్తుంది. ఇవన్నీ పాక్ క్రికెట్‌కు శుభపరిణామాలేనని సేథీ వ్యాఖ్యానించారు. లాహోర్ వెలుపల కూడా కొన్ని మ్యాచ్‌లు నిర్వహించాలని భావిస్తున్నాము. కరాచీ వేదికగా క్రికెట్ అభిమానులను అలరించే ప్రయత్నం చేస్తాం అని సేథీ చెప్పారు.

ప్రపంచ చాంపియన్‌షిప్‌కు సిద్ధం

గ్లాస్కో: ఈసారి రియో ఒలింపిక్స్ కంటే మెరుగైన ప్రదర్శన చేస్తానని అంటోంది కరొలినా మారిన్. ప్రపంచ చాంపియన్ షిప్ డిఫెండింగ్ చాంపియన్ అయిన మారిన్, మూడోసారి టైటిల్ సాధించడంపై దృష్టిసారించింది. స్వర్ణాన్ని కొద్దిలో చేజార్చుకున్న అనుభవం పునరావృతం కానివ్వను. రియో తర్ఫీదును మించిన కసరత్తు చేస్తున్నాను. మొత్తంగా రెండు నెలల కాలపరిమితి శిక్షణలో ఉన్నాను. మెరుగైన ప్రదర్శన చేసితీరతానన్న నమ్మకం ఉంది అని మీడియాతో మార్లిన్ వ్యాఖ్యానించింది. స్వర్ణం గెలవడమే నా లక్ష్యం. కొన్ని కఠినమైన మ్యాచ్‌లను ఎదుర్కొనాల్సి వస్తుంది. అయినా, నేను అధైర్యపడటం లేదు. ఒక్కో మ్యాచ్ గెలుస్తూ టైటిల్ చేజిక్కించుకుంటాను అని మారిన్ చెప్పింది. రియో ఒలింపిక్స్ తర్వాత తొడ నొప్పి సమస్యను ఎదుర్కొన్న ఆమె ఒక్క టైటిల్ కూడా నెగ్గలేదు. దీంతో ఆమె ర్యాంకింగ్ నాలుగో స్థానానికి పడిపోయింది. రియో జరిగి ఏడాదైంది. ఆ తర్వాత గాయాల పాలయ్యాను. సహజంగానే తీవ్ర ఒత్తిడికి లోనయ్యాను. ఇప్పుడు ఫిట్‌గా ఉన్నాను. ప్రత్యర్థి ఎవరైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాను అని మాజీ ప్రపంచ నంబర్ 1 బ్యాడ్మింటన్ క్రీడాకారిణిధీమా వ్యక్తం చేసింది.

స్వర్ణంపై సింధు గురి!

భారత బ్యాడ్మింటన్ ఆశాకిరణం పీవీ సింధు ప్రపంచ చాంపియన్‌షిప్‌పై గురిపెట్టింది. ఇంతకు ముందు రెండు పర్యాయాలు క్యాంస్య పతకాలు సాధించిన తెలుగు తేజం, ఈసారి అత్యుత్తమ ప్రదర్శన చేస్తానని చేస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నది. పసిడి పతకం లక్ష్యంగా ప్రాక్టీసు చేస్తున్నట్లు పరోక్షంగా పేర్కొంది. ఆస్ట్రేలియా ఓపెన్ తర్వాత రెండు నెలల వ్యవధి ఉంది. అందువల్ల ప్రాక్టీసుకు సరిపడా సమయం ఉంది. నేను ఫిట్‌గా ఉన్నాను. నా శక్తిమేరకు ఉత్తమ ఆటతీరు కనబరుస్తానన్న విశ్వాసం ఉందని సింధు తెలిపింది. 2016లో రియో ఒలింపిక్స్, చైనా ఓపెన్ ఆ తర్వాతి యేడాది జరిగిన ఇండియా ఓపెన్‌లలో సత్తాచాటింది. 2013-14 ఎడిషన్స్‌లో రెండు సార్లు కాంస్య పతకాలను కైవసం చేసుకుంది. రియో ఒలింపిక్స్‌లో కరొలినా మారిన్ చేతిలో ఓటమికి ఇండియా ఓపెన్‌లో బదులు తీర్చుకున్న సింధుకు ప్రపంచ చాంపియన్ షిప్ రెండవ రౌండ్‌లో కొరియా క్రీడాకారణి కిమ్ హై మిన్ లేదా ఈజిప్టు క్రీడాకారిణి హదియా హోస్ని ప్రత్యర్థులుగా ఎదరుయ్యే అవకాశం ఉంది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.



నేడు సెల్ఫీ.. రేపు బోతీ

దూసుకొస్తున్న నయా ట్రెండ్స్

* దాయాది దేశాలు ఒకరికోసం ఒకరు జాతీయ గీతాలాపన
* శునకం నోటికి ప్లకార్డు... బర్గర్ కంపెనీ వినూత్న ప్రచారం
* పిక్క బలం చూపిస్తూ... మజిల్స్ షేక్ చేస్తే 2కోట్ల హిట్లు
* గూగుల్ మ్యాప్ కొత్త ఫీచర్ సేవ్ యువర్ పార్కింగ్

సోషల్ మీడియా లేటెస్ట్ ట్రెండ్స్, మార్కెట్ ను ముంచెత్తే వైరల్ కాన్సెప్ట్ లు నెటిజన్లను ఎప్పుడూ డిస్టర్బ్ చేస్తూనే ఉంటాయి. వన్స్ అక్కడ లాక్ అయ్యామంటే వాటికి మనం లాగిన్ అయిపోయినట్లే లెక్క. కాకపోతే కొన్ని కాన్సెప్ట్ లు మనల్ని ఎప్పుడూ అలర్ట్ చేస్తూ ఉంటాయి. ఇంకొన్ని కొత్తవాటిని నేర్చుకోమంటాయి. మాకెందుకొచ్చిన గొడవలే మేమిలాగే ఉంటాం....మాకు నచ్చినట్లుగానే ఉంటాం.... అప్‌డేట్ కాము అనుకుంటే... ప్రపంచం అంటే ఏంటో తెలియని అజ్ఞానులుగా మనం ముద్ర వేయించు కున్నట్లే . అందుకే ఎప్పటికప్పుడు ట్రెండ్‌ను ఫాలో అవుతూ ఉండాలి. సోషల్ మీడియాలో ఏం జరుగుతుందో తెలుసుకుంటూ ఉండాలి. లేకపోతే అవుట్ డేటెడ్ అయిపోతాం.

బోతీ సంచలనం



బోతీ అంటే సెల్ఫీ కాదు.. బయటివాళ్లు మనల్ని తీసే యూయీ కాదు, రెంటి కలయిక. బోతి కాన్సెప్ట్ లో రెండు కెమెరాలు ఒకేసారి పనిచేస్తాయి., మనల్ని మన చుట్టు ప్రక్కల ప్రాంతాన్ని మొబైల్ లోని రెండు కెమేరాలు ఒకేసారి క్యాప్చర్ చేస్తాయి. ఫ్రంట్ కెమేరాతో మనల్ని... రియర్ కెమేరాతో చుట్టు పక్కల వాతావరణాన్ని క్యాప్చర్ చేయడం బోతి ఫీచర్ ప్రత్యేకత. ఇమేజ్ క్యాప్చర్ చేస్తూనే లైవ్ వీడియో కాల్ కూడ చేసుకోవచ్చు. త్వరలో ఆక్స్ ఫర్డ్ డిక్షనరీలో దోతి అనే పదానికి చోటు దక్కుతుందని చెబుతున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ మార్కెట్లో గట్టిగా పాగా వేయాలనే లక్ష్యంలో హెచ్ ఎండి ప్రొడక్షన్ లో కాంపిటీషన్ కు దిగిన నోకియా దీనికి శ్రీకారం చుట్టింది. 4డేస్ బ్యాక్ రిలీజ్ చేసిన ఫ్లాగ్ షిప్ ఫోన్ నోకియా 8తో ఈ ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. అక్టోబర్ నుంచి నోకియా 8 ఇండియాలో అందుబాటులో ఉంటుంది. మార్కెట్లో బోతి బులిటీస్ ఫీచర్ ఉన్న ఆండ్రాయిడ్ ఫోన్ ఇదొక్కటే. ఎల్ జి వి20,ఎల్ జి వి6లో ఈఫీచర్ వచ్చినా... ఆ కంపెనీ దానికి ఏ పేరు పెట్టలేదు. నోకియా 8తో ఈ ఫోన్ తెస్తూనే బోతి పేరు పెట్టి నోకియా ట్రెండ్ సృష్టించింది. సెల్ఫీకి చెక్ పెట్టి బోతీ సరికొత్త వండర్ క్రియేట్ చేయడం ఖాయమంటున్నా టెక్ నిపుణులు.

స్కేరీ వర్కవుట్ క్రాంప్

అమెరికాలోని కాలిఫోర్నియా సిటిజన్... ఏంజెల్ బెర్మడెజ్ చేసిన ఒకే ఒక స్కేరీ వర్కవుట్.... వెబ్ దునియాలో కోట్ల మందిని భయపడుతూనే... వీక్షించేలా చేసింది. బెర్ముడా ట్రయాంగిల్ పేరు చెబితే ఎంతలా భయపెడతారో



అంతగా కాకపోయినా... ఆ పేరు పెట్టుకున్నందుకు కొంతైనా భయపెడదామని... కండరాల కదలికలను చూపిస్తూ ఇలాక్కూడా చేయెచ్చా అనేలా నెటిజన్లను ముక్కున వేలేసుకునేలా చేశాడు. ఆగస్టు 15న తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో సరదాకు పెట్టిన ఈ వీడియో ఇంతలా హల్‌చల్ చేస్తుందని అతను అస్సలు ఊహించనే లేదు. కారు డ్రైవింగ్ సీట్‌లో కూర్చుని కుడికాలిని డ్యాష్ బోర్డ్ కు బలంగా నొక్కిపెట్టి.... పిక్క భాగాన్ని బలంగా బిగబెడుతూ వర్కవుట్ చేయడం ద్వారా పిక్క కండరాల కదలికలను స్పష్టంగా చూపించాడు. ఈ వీడియో చూడగానే కాస్త స్కేరీగా ఉన్నప్పటికీ... ఒక వేవ్‌లా తన కండరాలు కదిలించడం చూపిస్తూ చేసిన ఫీట్ గా దీనిని సోషల్ మీడియా అభిప్రాయ పడింది. అందుకే ఈ వీడియోను రెండు కోట్ల పదమూడు లక్షల మంది చూశారు. అన్నట్లు ఈ వర్కవుట్ క్రాంప్ ఎవరైనా చేయాలంటే .... వ్యాయామానికి ముందు... ఆ తరువాత కడుపునిండా నీరు త్రాగాల్సి ఉంటుంది. ఈ ఫీట్ తో తిమ్మిర్లు పోతాయని కొందరు చెబుతున్నారు. కాని ఆరోగ్య నిపుణులు ఎవ్వరూ... ఇలాంటి వర్కవుట్ సాహసాలపై ఇప్పటి వరకు స్పందించలేదు కాబట్టి... మనం ఈ తరహా ఫీట్స్ ను చేయకపోవడమే ఉత్తమం.

లింక్:https://www.facebook.com/angel.bermudez.585/videos/10214589751283169/

సేవ్ యువర్ పార్కింగ్

గూగుల్ ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలు చేస్తూనే ఉంది. తాజాగా గూగుల్ మ్యాప్ తన కొత్త ఫీచర్... సేవ్ యువర్ పార్కింగ్‌ను తీసుకొచ్చింది. ఈ ఫీచర్‌ను తీసుకురావడానికి కారణం... చాలామంది తమ వెహికల్‌ను పార్కింగ్‌లో పెట్టినప్పుడు ...తిరిగి గుర్తించే సమయంలో కంగారు పడుతుంటారు. ఇంకొందరు తమ వెహికల్ కనిపించ లేదని లేనిపోని టెన్షన్ పెట్టుకుంటారు. అలాంటి వారికోసమే గూగుల్ ఈ ఫీచర్ తీసుకువచ్చింది. ఈ ఫీచర్ మన కారు లేదా బండిని ఎక్కడ ఎక్జాట్‌గా పార్క్ చేశామో చెప్పేస్తుంది. దీని కోసమని మన మొబైల్‌లో గూగుల్ మ్యాప్ ఓపెన్ చేయాలి. అందుల్లో కనిపించే బ్లూ డాట్ మీద క్లిక్ చేయాలి. ఆ తరువాత సేవ్ యువర్ పార్కింగ్



మీద క్లిక్ చేయాలి. ఆ టైమ్లో మన లొకేషన్‌తో పాటు కావాలనుకుంటే పార్క్ చేసిన స్పాట్ ను ఫొటో తీసి.. ఫీచర్‌కు దానిని యాడ్ చేయాలి. ఇలా చేయడం ద్వారా మన వెహికల్ ను తీసుకునే సంధర్బంలో ఎలాంటి టెన్షన్ వాతావరణం మనలో కనిపించదు. అంతేకాదు మన ఫ్రెండ్స్ కు సేవ్ యువర్ పార్కింగ్ లింక్ షేర్ చేసి ... అతనికి మన వెహికల్ తాళాలు ఇచ్చి ఈజీగా తెమ్మనొచ్చు. అంతేకాదు బండి ఎక్కడుందో, ఎంత దూరంలో ఉందో కూడా ఈ ఫీచర్ నేవిగేట్ చేస్తుంది.ఇలాంటి విషయాలన్నీ మనకు మెసేజ్ రూపంలో గూగుల్ మనకు అందిస్తుంది. ఆండ్రాయిడ్ యూజర్లతో పాటు ఐఓయస్ యూజర్లు కూడా సేవ్ యువర్ పార్కింగ్ ఫీచర్ ను వినియోగించుకోవచ్చు.

చైనాలో కుక్కతో ప్రచారం

పబ్లిసిటీలో క్రియేటివిటీది ఎప్పుడు అగ్రతాంబూలమే. అందుకే వినూత్నంగా ఆలోచించేవారు విపణిలో విజయాలను వెనకేసుకుంటూ ఉంటారు. తాజాగా చైనాలోని ఓ బర్గర్ షాప్ యజమానికి సరికొత్త ఆలోచన వచ్చింది. తన ఫుడ్ ప్రోడక్ట్ ను ప్రమోట్ చేయడానికి టీవీలను ,వార్తా సంస్థలను ఎందుకు నమ్ముకోవాలి అనుకున్నాడు. దానిలో భాగంగా ఓ మేలు జాతి శునకానికి ట్రైనింగ్ ఇచ్చి... తమ షాప్ ప్రచారానికి వాడుకున్నాడు. అతను ఎంతో తెలివిగా కుక్క నోటి చేత ప్లకార్డు పట్టుకునేలా చేసి ...దానిని దారిని పోయేవారికి చూపిస్తూ తన షాపు ఫుడ్ ప్రొడక్ట్ విశేషాలను చూపించే విధంగా తర్ఫీదు ఇచ్చాడు. అనుకునట్లే ఈ ప్రచారం మంచి విజయవంతమైంది. టూరిస్టులు శునకాన్ని ఫొటోలు తీస్తూ ఈ ఆలోచన వచ్చిన షాపు యజమానికి కలుస్తూ అతని బిజినెస్ కు ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు.



దేశభక్తికి ఫేస్‌బుక్ సలాం

అస్సాంలో వరదలు ముంచెత్తి అల్లకల్లోలమైన వేళ.... ఇండిపెండెన్స్ డే సంధర్బంగా అక్కడి త్రివర్ణ పతాకం ఎగరవేయడం గగనమైపోయింది. అయినప్పటికీ నడుం లోతు నీళ్లల్లోంచి పిల్లలు జెండాకు వందనం చేస్తూ దిగిన పిక్ చాలా వైరల్ అయింది. ఈ పిక్‌కు లక్షల్లో లైక్లు ,కామెంట్లు ,షేర్లు వచ్చాయి. ఇదంతా అసోంలో ధుబ్రి ప్రాంతంలో నష్కర ప్రాథమిక పాఠశాలలో జరిగిన అపురూప సంఘటన. ఉధృత వరదలు కావడంతో అక్కడి జెండా వందనానికి ప్రధానోపాధ్యాయుడు,ముగ్గురు స్టూడెంట్స్ మాత్రమే వచ్చారు. ఇద్దరు చిన్నారులు తమ భుజాల వరకు వరదనీరు ఉన్నా..జెండా వందనం చేసారు. ప్రధానోపాధ్యాయుడు మిజనూర్ రెహమాన్ మాట్లాడుతూ ..ప్రస్తుతం మేము ఎలా ఉన్నామో చెప్పలేదు. ఈ ఫొటో చూస్తే మీకు అర్థమవుతుందని చెప్పాడు. ఈ రాష్ట్ర నిబంధనల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే ప్రతి కార్యక్రమాన్ని ఫొటోలు తీసి విద్యాశాఖకు పంపించాలి. ఇలా తీసిన ఈ ఫొటోను ఇటు విద్యాశాఖకు అటు సోషల్ మీడియాకు మిజనూర్ రెహమాన్ పోస్ట్ చేశారు. దీంతో ఈ పిక్ గురించే కాకుండా అక్కడి పరిస్థితుల గురించి కూడా సోషల్ మీడియాలో మాట్లాడుకునేలా చేశారు. ఈ పిక్‌తో కేంద్రం అసోం పరిస్థితులను భాగా అర్ధం చేసుకున్నట్లయింది. ఒక మంచి విషయాన్ని ఇంతలా షేర్ చేసుకున్నందుకు గాను ఫేస్ బుక్ మన ఇండియన్స్ కు సలాం కొట్టింది.



ఒకరికోసం ఒకరు.. గీతాలాపన

దాయాది దేశాలైన భారత్ ,పాకిస్థాన్‌లు ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు నిత్యం సంధించుకుంటూనే ఉన్నారు. దశాబ్దాల నుంచి అది రొటీన్‌గా కొనసాగుతూనే ఉంది. అయితే ఇరు దేశాలకు స్వాతంత్ర్యం వచ్చి 70 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సంధర్బంగా జస్ట్ ఫర్ చేంజ్ అనుకున్నారో ఏమో.... ఇరువైపుల నుంచి రెండు యువ వర్గాలు ముందుకు వచ్చి.... ఒకరి జాతీయ గీతాన్ని మరొకరు ఆలపించి ఒకరికొకరు తమ స్నేహ హస్తాలను అందిపుచ్చుకున్నారు. అయితే ఈ ప్రాసెస్‌లో ముందుగా మన దేశానికి చెందిన క్యాపెల్లా బ్యాండ్ వోక్సార్డ్ టీం... వాయిస్ ఆఫ్ రామ్ అనే సంస్థతో కలిసి పాకిస్థాన్ జాతీయ గీతాన్ని పాడి వారికి ఇండిపెండెన్స్ డే గిఫ్ట్ ను అందించారు. ఇలా చేసినందుకు గాను దేశవ్యాప్తంగా ఈ బ్యాండ్ పై విమర్శలు వచ్చాయి. శత్రుదేశ జాతీయ గీతాన్ని పాడటమేంటి అంటూ వీరిని అంతా తిట్టి పోశారు. విషయం వైరల్ అయింది. చివరకు మ్యాటర్ హోం శాఖ వరకు వెళ్లింది. క



రెక్ట్‌గా ఇదే టైమ్‌లో పాకిస్థాన్ లోని లాహోర్ క్రిస్టియన్ కాలేజ్ విద్యార్థులు మనకు రిటర్న్ గిఫ్ట్ గా మన జనగణమన పాటను ఆలపించి ఇష్యూని క్లోజ్ చేశారు. దీంతో సోషల్ మీడియాలో ఈ సంఘటన యుద్ధ వాతావరణంలో ఉన్నటువంటి ఇరుదేశాలకు చక్కటి శాంతి సందేశ మంత్రాన్ని ఇచ్చినట్లయింది. ఫేస్ బుక్ వేదికగా ఎందరో ఇరుదేశాల యువకులు స్పందిస్తూ... బ్రిటీష్ వాళ్లొచ్చి ఇండియా,పాక్ లను విడదీసారని...లేకపోతే మనమంతా కలిసే ఉండేవారమని పాకిస్థాన్ జాతీయులు పలువురు పాజిటివ్‌గా కామెంట్స్ చేశారు.

లింక్:https://www.facebook.com/VORdotcom/videos/1780772328618737/

ఇలా చెప్పుకుంటూ పోతే పలువురు పలురకాలుగా మార్కెట్ లో ట్రెండ్ సెట్ చేయడానికి తమ వంతు ప్రయత్నం తమకు తెలియకుండానే చేశారు. కాకపోతే వారిలో కొందరు ప్రయత్నాలు పాజిటివ్ యాంగిల్లో వైరల్ అయ్యాయి. ఇంకొందరివి భయపెట్టే ప్రయత్నం చేశాయి. ఏది ఏమైనా ట్రెండ్ టుడేలో వీరంతా భాగస్వాములయ్యారు.

- సూర్యమ్ కలిదిండి

సరా యాప్‌కు లాగిన్ అవుతున్నారా..?

గత రెండు నెలలుగా సరా యాప్ మార్కెట్లో ట్రెండ్ క్రియేట్ చేస్తుంది .కొన్ని మాసాల క్రితం ఈజిప్ట్,సౌదీ దేశాల్లో రిలీజైన ఈ యాప్ అక్కడ ప్రజాదరణ పొందింది. అది కూడా కంపెనీ యాజమాన్యాలకు ఉద్యోగులకు మధ్య గ్యాప్ ఫిల్ చేయడం కోసం అన్నట్లుగా.... అక్కడివారు దీనిని డిజైన్ చేశారు. అయితే సడన్ గా ఇండియాలో సరా యాప్ ....టాక్ ఆఫ్ ది యాప్ గా మారిపోయింది. మెసేజ్ సెండింగ్ రిసీవింగ్ లకు ఉద్దేశించిన ఈ యాప్‌లో మన ప్రొఫైల్ ను క్రియేట్ చేసుకోవచ్చు. దానికి ఎవరైనా మెసేజ్ పంపించే యునీక్ ఫీచర్ ఉంది. మార్కెట్లో ఈ తరహాకాన్సెప్ట్ గల ఏకైక యాప్ ఇదొక్కటే. టోటల్లీ డిఫరెంట్ యాప్‌గా మనం దీనిని ట్రీట్ చేయవచ్చు. అలాగే లాగిన్ కాకుండానే మన ప్రొఫైల్‌ను ఎవరైనా చూడొచ్చు. మనకు మెసేజ్ పెట్టవచ్చు.

ఎట్ ది సేమ్ టైమ్ మనకు వచ్చిన మెసేజ్ లను ఫ్లాగ్ చేసుకోవచ్చు. డిలీట్ చేయెచ్చు. రిప్లయ్ ఇవ్వొచ్చు. నచ్చిన వాటిని ఫేవరెట్ గా పెట్టుకోవచ్చు. సోషల్ మీడియా ఇప్పటి వరకు ఈ కాన్సెప్ట్ మనకు ఎక్కడా కనిపించదు. ఈ ట్రెండీనెస్ సరాకు విపరీతమైన పాపులారిటీని తెచ్చిపెట్టింది.

సరాపై భిన్నాభిప్రాయాలు

మన పేరును సెర్చ్ నుంచి కావాలంటే రిమూవ్ చేయవచ్చు. ఆడియన్స్ ను లిమిట్ చేయవచ్చు.తెలియనవారు మన ప్రొఫైల్ కు లాగిన్ కాకుండా షేర్ చేయకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. అయితే ప్రైవసీ విషయంలో యాప్ డెవలపర్లు మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది . ఆ లోపం ఈ యాప్ లో లో కనిపించింది. మానసికంగా ధృడంగా లేనివారు ఈ యాప్ ను వాడకపోవడం మంచిది. ఎందుకంటే ఎవరైనా మనపై కామెంట్ చేస్తే దానిని తట్టుకునే మానసికధైర్యం చాలామంది ఉండదు. కొంతమంది దీనిని అడ్వాంటేజ్ గా తీసుకుని హద్దులు దాటవచ్చు.అమ్మాయిలకు ఇది మరిన్ని కొత్త సమస్యలను తెచ్చిపెట్టవచ్చు. ఇక రివ్యూల పరంగా చూస్తే సరా యాప్ కు 50శాతం మందికి నచ్చిందని... 50శాతమంది నచ్చలేదని చెప్పడం విశేషం.



చింతన

ధర్మానికే పట్టం

పూర్వకాలంలోనూ, ఇప్పుడూ ఉత్తములందరూ ధర్మాన్ని నమ్ముతారు. సత్య ధర్మాలనే తమకు ఆలంబనగా చేసుకుంటారు. అలా సత్య ధర్మాలు పాటించేవారు ఎప్పుడూ నలుగురి చేత ప్రశంసింప బడతారు. రాక్షసులు మానవులను తింటారు. అరణ్యంలోకి వచ్చిన పాండవులను అమాయకులని వారిని చంపడం అధర్మమని రాక్షసి అయినా హిడింబ భావించి వారిని అక్కడి నుంచి వెళ్లిపోమని చెప్పింది. భీముని అందం ఆమెను ఆకర్షించడం కూడా అందుకు ఒక కారణం. ఏది ఏమైనా ఆమె తన సోదరుని ఆజ్ఞ కంటే ధర్మానికే కట్టుబడింది.



మనాలిలోని హిడింబాదేవి ఆలయంలోని విగ్రహం

భారతంలో చిన్న కథలు

భారతంలో ఉన్న హిడింబ వృత్తాంతం ఇది. మహాభారతంలో లక్క ఇంటి నుంచి పాండవులు సొరంగమార్గంలో బయటపడిన సంగతి తెలిసిందే. ఆ అరణ్యంలో ప్రవేశించిన వారికి హిడింబ తారస పడుతుంది. సొరంగ మార్గం నుంచి బయటపడ్డాక వారు అరణ్యంలో చాలా దూరం నడిచారు. అలసిపోయారు. అయితే బలవంతుడైన భీముడు కుంతిని కొంతదూరం తాను మోసి తీసికెళ్లాడు కూడా. చివరకు ఒక మర్రి చెట్టు కింద వారు ఆగారు. విశ్రాంతి తీసుకుందామనుకున్నారు. ఆ సమయంలో వారికి దాహం వేసింది. భీముడు ఎక్కడైనా కొలను ఉందేమో నని ఆ చెట్టు ఎక్కి చూడగా పద్మాలతో ఉన్న కొలను దగ్గరలో కనబడింది. అక్కడకు వెళ్లి నీరు తీసుకువస్తానని వెళ్ళాడు. కొలనులో నీళ్లుతాగి తన వారికి తామరాకు దొప్పల్లో నీటిని తీసుకువెళ్లాడు. వెళ్లేసరికి అందరూ నిద్రపోతున్నారు. సుకుమారి అయిన తల్లి కుంతీదేవి, అగ్రజుడు ధర్మరాజు కటికనేల మీద నిద్రపోవడం చూసి బాధపడ్డాడు. వారిని నిద్రలేపడం కంటె లేచిన తర్వాతే నీరు ఇవ్వచ్చని అనుకున్నాడు. వారికి కావలిగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. కాపలాగా తిరగడం మొదలుపెట్టాడు.

అక్కడికి దగ్గరలోనే హిడింబాసురుడు అనే రాక్షసుడు ఉన్నాడు. వాడికి హిండింబ అనే చెల్లెలు ఉంది. వారిద్దరు కలిసి జంతువులను వేటాడి జీవిస్తుండేవారు. మధ్యలో మానవులు కనిపిస్తే కూడ హిడింబాసురుడు వదలేవాడు కాదు. అందువల్ల అటుగా మానవులెవరూ వచ్చేవారు కాదు. పాండవులు అక్కడికి రాగానే దూరంగా ఎవరో వచ్చారని గ్రహించిన ఆ అసురుడు వారిని పట్టి చంపి, వండి రుచికరంగా వండి పెట్టమని చెల్లెలిని పంపాడు. వెతకడానికి బయలుదేరిన హిడింబకు కొద్ది దూరంలో పొడవైన దేహం, బలమైన బాహువులు కల భీముడు కనిపించాడు. అతని ఆకారం చూసి ఆమె మన్మథావస్థకు గురయింది. అతడిని వివాహం చేసుకుని, అతని వంటి పుత్రులను కంటే ఎంత బాగుండునో అనుకుంది. కామ రూపంతో అందమైన మానవ కాంతగా మారి వారి వైపు వెళ్ళింది. వస్తున్న ఆమెను చూసి ఆమె కామరూపంతో ఉన్న రాక్షసి అని గ్రహించిన భీముడు 'ఎవరు నువ్వు, దూరంగా పో! లేకుంటే నా చేతుల్లో చావు తప్పదు' అని హెచ్చరించాడు. ఆమె తాను హిడింబాసునురుని సోదరినని, అతను చాలా బలవంతుడని వారిని చూస్తే క్షణంలో తినేస్తాడని చెప్పింది. అతను సరే అంటే అతన్ని రక్షిస్తానని తనతో వచ్చి సుఖంగా జీవించవచ్చు అని చెప్పింది. దానికి భీముడు, 'ఓ నారీమణీ! నీవెంత అల్పబుద్ధివి. ఏ మాన వుడైనా స్వసుఖం కోనం తోబుట్టువులను, కన్నతల్లిని విడిచి వేస్తాడా? అసలు అలా విడిచేవాడు మనిషేనా? నన్ను నువ్వు తప్పుగా భావిసున్నావనీ అన్నాడు. హిడింబాసురుడే కాదు స ర్వ దేవతలూ గుమి కూడి వచ్చినా తాను వారి రక్షణ కోసం వారందరినీ ఎదిరించి పోరాడగలనని అన్నాడు.

ఇంతలో హిడింబాసురుడే వచ్చాడు. తన సోదరి మానవులను చంపక వారితో మాట్లాడ్డం చూసి కోపంతో ఊగిపోయాడు. వేగంగా భీముని పైకి రాబోయాడు. అయితే వాడితో పోరాడేటపుడు ఆ శబ్దానికి తన వారికి నిద్రా భంగమవుతుందని ఒక్క ఊపుతో హిడింబాసురుణ్ని 8 ధనుస్సుల దూరానికి తీసుకుపోయాడు. అక్కడ వారిద్దరూ మల్ల యుద్ధం చేశారు. రెండు కొండల్లా పోట్లాడుకుంటున్నారు. వారి తాకిడికి పెద్ద పెద్ద చెట్లు కూలిపోయాయి. ఈ చప్పుళ్ళకు పాండవులు నిద్రలేచారు. ఎదురుగా అద్భుత సౌందర్యంతో హిడింబ కనబడింది. ఆమె వారికి నమస్కరించింది. వారు భీముని కోసం అటూఇటూ చూడడం గమనించి ఆజానుబాహువులు కలిగిన మీ పుత్రుడు మా సోదరునితో యుద్ధం చేస్తున్నాడని, తను ఎవరైందీ చెప్పింది. వారిని పోరాటం జరుగుతున్న చోటికి తీసుకెడుతూ తాను భీముని వలచాననే విషయం చెప్పింది. తనను కోడలిగా చేసుకోమని కుంతీదేవిని కోరి, ధర్మరాజుని భీమునికి నచ్చజెప్పమని అర్థించింది. వారు సరేనన్నారు. ఇంతలో ఆరుగురు పోరాటం జరుగుతున్న ప్రాంతానికి వచ్చారు. భీముడు హిడింబాసురుని చేతికి చిక్కించుకుని గిరగిరా తప్పి నేలకేసి కొట్టి అతి భయంకరంగా చంపివేశాడు.

అది చూసిన హిడింబ కన్నీరు పెట్టుకుంది. హిడింబాసురుడు తన అన్నే గాని అధర్మానికి పాల్పడేవాడని, అమాయకులను అమాంతంగా తినేసేవాడని చెప్పింది. ఆ పీడ విరగడ చేసి ఈ ప్రాంతాన్ని జనవాసంగా చేశారని అభినందించింది.

అనంతరం భీముడు కుంతితో, ' అమ్మా! మనం ఇక్కడి నుంచి బయలుదేరుదాం. ఈమె నన్ను వలచిందనడం అనుమానం. రాక్షస స్త్రీలు వంచించేబుద్ధి కలిగి ఉంటారు' అన్నాడు. అయితే కుంతీదేవి 'అలా కాదు ఈ అమ్మాయి నిన్ను మనసు పడింది. ధర్మబద్ధంగా నీకు భార్యగా ఉండాలి అనుకుంటోంది' అని చెప్పింది. ధర్మరాజు కూడా ఆవ్మాయిపై బంధుత్వ భావనే కలుగుతోందని అన్నాడు.

అంతలో హిడింబ, అమ్మా! నాకు భవిష్యత్తును తెలుసుకునే శక్తి ఉంది. మీకు నేను మేలు చేస్తాను. నా వల్ల పుట్టిన సంతానాన్ని మీ వంశానికి కీర్తి తెచ్చేట్టుగానే పెంచుతాను' అంది. అలాగే ఇక్కడకు దగ్గరలోనే శాలి హోత్రుడనే ముని ఆశ్రమం కనబడుతుంది. అక్కడ ఒక సరోవరం వృక్షం ఉన్నాయి. ఆ రెండూ ఆ ముని ప్రభావంతో ఏర్పడినవే. ఆ సరోవరం నీటిని తాగిన వారికి ఆకలి దప్పులు ఉండవు. ఆ చెట్టు అధిక శీతోష్ణాల నుంచి మిమ్మల్ని రక్షిస్తుంది. అక్కడ మీరు కొంత కాలం ఉంటారు. అక్కడ మీ వద్దకు వ్యాసుల వారు వస్తారు. వారు మీకు ఇష్టమైన మాటలు చెబుతారు. మీరు సంతోషంగా ఉంటారు. నేను సదా మీకు అనుకూలంగా ఉంటాను అంది. మీరు నడవలేని పరిస్థితుల్లో మిమ్మల్నంతా మోసుకుని మీరు అనుకున్న ప్రాంతానికి అనాయాసంగా చేర్చగలను' అంది.

ఇంకా ఇలా మాట్లాడుతూ, అమ్మా! నేను ఈ భీముడిని చూసిన వెంటనే నా మనస్సులో భర్తగా భావించుకున్నాను. ఇప్పుడు ఇతడు కాదంటే నేను ప్రాణాలు వదలి వేస్తాను ' అంది. ఇంత మంచి చేసే వనిత వల్ల మేలే జరుగుతుందని భీమునికి నచ్చజెప్పి హిడింబతో భీముని పెళ్లి చేశారు ధర్మరాజాదులు. అలా హిడింబతో భీముని పెళ్లి అయింది కుంతీ దేవి వారిద్దరినీ కొంతకాలం విహరించి రమ్మని పంపింది. హిడింబ చెప్పినట్లుగానే మిగతా పాండవులు, కుంతి శాలిహోత్రుని ఆశ్రమానికి వెళ్లారు. అక్కడ కొంతకాలం సేదతీరాలని వారు అనుకున్నారు. భీమునికి, హిడింబకు పుట్టినవాడే ఘటోత్కచుడన్న విషయం తెలిసిందే.

\- అశ్విని

సర్వదేవతారాధనకు అనువైన భాద్రపద మాసం




భాద్రపదమాసం వచ్చింది. ఇది నెలల్లో ఆరవది. 12 నెలల తెలుగు సంవత్సరంలో ఇది మధ్య వస్తుంది. భాద్రపద మనగానే ఎవరికైనా గుర్తు వచ్చేది శుక్ల పక్ష చవితి నాడు వచ్చే ఆదిపూజ్యుడైన గణేశుని పూజ. సర్వవిఘ్నాలనూ హరించి శుభాలను చేకూర్చే విఘ్నేశుడు ఈ నెలలోనే పుట్టాడు. అందుకే కాబోలు ఈ నెలలో ప్రతిపది నుంచి పండుగలు వరుసగా వచ్చాయి. ఈ నెలలో ప్రతిపదిని ఆడపడు చుల పండగగా చేసుకునే ఆచారం కొన్ని చోట్ల ఉంది. భాద్రపద విదియ తిథిన హరి తాళికా వ్రతం చేస్తారు. చవితి నాడు గణేశుని పూజ. చవితి మర్నాడు వచ్చే పంచమి కూడా ఒక పర్వమే. ఇది రుషి పంచమి. బహిష్ఠులు ఆగిన స్త్రీలు అంతవరకూ ఆ సమయంలో ఏవైనా తెలియక దోషాలు చేసి ఉంటే వాటిని తొలగించుకునేందుకు సప్త రుషుల్ని వారి భార్యలతో సహా ఆ రోజున పూజిస్తారు. తర్వాత రోజు సూర్య షష్టి. ఆ రోజున సూర్యుని స్మరిస్తూ స్నానం చేయాలని చెబుతారు. ఆ తర్వాత రోజు మహాలక్ష్మీ వ్రతారంభం. మహాలక్ష్మి మనింటికి తరలి రావాలని ఇల్లు శుభప్రదంగా, శుచిగా లక్ష్మీప్రదంగా ముగ్గులు వంటి వాటితో అలంకరించి ఉంచుతారు. భాద్రపద అష్టమి నాడు కేదారేశ్వరుణ్ని అర్చిస్తూ కేదార వ్రతం చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో ఈ రోజు వివాహిత మహిళలు జ్యేష్ఠా దేవి పూజ చేస్తారు. ఇక అదే రోజు రాధాష్టమి కూడా. రాధ జన్మించింది భాద్రపద శుక్ల అష్టమి నాడని పురాణ వచనం. ఆషాఢ శుద్ధ ఏకాదశినాడు పరివర్తన ఏకాదశి, వామన జయంతి. యోగ నిద్రలో ఉన్న శ్రీమహా విష్ణువు పరివర్తన ఏకాదశినాడు పక్కకు వత్తిగిల్లాడని చెబుతారు. ఇది చాతుర్మాస్యంలో ఒక మలుపు. అదే రోజున నారా యణుడు వామనునిగా అవతరించిన రోజు. ఇక చతుర్దశి అనంత పద్మనాభ చతుర్దశి. ఈ రోజు అనంతపద్మనాభుని పేరుతో నారాయణుని అర్చన చేస్తారు.

ఇంతవరకూ దేవతా సంబంధమైన పూజలు ఉంటే ఆ తరువాత భాద్రపద బహుళ పాడ్యమి నుంచి అమావాస్య వరకూ పితృదేవతారాధనకు అనువైన మహాలయ పక్షాలు ప్రారంభమవుతాయి. ఈ పక్షం రోజులు పితృదేవతలను తర్పణాలు, శ్రాద్ధాదులు విధిసహితంగా నిర్వహించి వారిని తృప్తి పరచాలి. వారి ఆశీస్సులు అన్ని విధాలా శ్రేయోదాయకం. ఈ మాసంలో విశేషం దీనిలోనే దేవతా, రుషి పితృదేవతారాధన ఉంటుంది. మనకున్న ముఖ్యమైన రుణాలలో దేవ రుణం, రుషి రుణం, పితృ రుణం ముఖ్యమైనవి. కనుక వాటన్నిటిని కొంతైనా తీర్చేందుకు ఈ మాసం మంచి అవకాశాన్నిస్తుంది.

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

యథేచ్ఛ



శ్రీ రమణాశ్రమం

13-8-46

బెంగళూరు నుంచి వచ్చిన కోమటి కుఱ్ఱవాడొకడు తలజడలు కట్టుకొని, మాధుకర వృత్తితో జీవిస్తూ, అరుణాచలేశుని దేవాలయంలో పడుకుంటూ, నేను వచ్చిన కొత్తరోజుల్లోనే రెండు మూడేళ్లున్నాడిక్కడ. అప్పుడు వాని తల్లి ఆశ్రమానికి వచ్చి వానిని ఇంటికి రమ్మని ఒత్తిడి చేయడం ప్రారంభిస్తే పండరీపురానికి పాటిపోయినాడు. ఆమెకితడొకడే మగబిడ్డ. కావలసినంత ఆస్తి. వీడో ఏదీ వద్దనే అదొక విధమైన విరాగి. ఆ తల్లి మొర పెట్టుకుంటే ఒకటి రెండుసార్లు తల్లి మాట వినమని చెప్పి చూచారు భగవాన్. వినలేదు. పారిపోయినాడు.

గత ఆషాఢమాసంలో మళ్లీ వచ్చాడు. వాడెప్పుడూ పలక్కుండా హాలులో ఒక మూల కూర్చుని సాధనో, ఏదో, వాడి తిప్పలు వాడు పడుతూ ఎవరితోనూ సంబంధం లేకుండా వుండేవాడు. ఇప్పుడు జడలు తీసివేశాడేగాని కార్యక్రమం మార్చుకోలేదు. భగవాన్ చూస్తూనే వున్నారు. వాడూ పలకలేదు. వారూ పలకలేదు. పదిహేను రోజులు గడచిన వెనుక, ఒక మధ్యాహ్నం ఉద్యోగం చాలించుకొని వచ్చిన మన రాజగోపాలయ్యరు యథాప్రకారం లైబ్రరీ పనిలో హాల్లో హాజరై ఈ కోమటి బిడ్డను చూచి ''పండరీపురం నుంచి వచ్చాడే ఎప్పుడో. వాళ్ల అమ్మ వీడు వస్తే జాబు వ్రాయమని అడ్రెస్ ఇచ్చింది కదా'' అన్నారు భగవాన్‌తో.

''అవును, వచ్చారు. పదిహేనురోజులైనట్లుంది. చూస్తూనే వున్నాను. మాట్లాడరాయెను. పండరీపురం ఎట్లా వుందనీ, ప్రసాదం ఏదనీ, నేనెక్కడ పోయి అడిగేదీ? వారో మాట్లాడరు! వారి వారి చిత్తవృత్తిననుసరించి గదా మనం పోవలసి వుంది. ఎవరెవరి చిత్తవృత్తి ఎట్లా వుంటే వారి వారి చిత్తానుసారం పోవలసిన విధిమనకున్నది'' అన్నారు భగవాన్. విజ్ఞులంతా తమ తమ చిత్తాలను తరిచి చూచుకున్నారు. తక్కినవారి సంగతి దైవానికెరుక. ఎవరెవరి చిత్తవృత్తి ఎట్లా వుంటే వారి వారి చిత్తానుసారం పోవలసిన విధి వారికున్నదట- చూచావా ఎంత మాటో?

\- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో


Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

అక్కడ గడియారాల సమర్పణే ఆచారం

దేవాలయాల్లో దేవునికి భక్తులు ఏదో ఒకటి సమర్పించుకోవడం అనేది అనాదిగా వస్తున్న ఆచారం. దేవునికి డబ్బు ఇవ్వటం మామూలే. నాణేల నుంచి నోట్ల కట్టల వరకూ ఇచ్చేవారు ఉన్నారు. తిరుమల వేంకటేశ్వరునికి నిత్యం ఎంతో ఆదాయం వస్తుంటుంది. కొందరు కిరీటాలు చేయిస్తుంటారు. కొందరు రాజులు దేవునికి ముత్యాలు పంపేవారు. ఆ ఆచారం ఇప్పటి పాలకులూ పాటిస్తున్నారు. ఇక భగవానుడు పత్రం, పుష్పం, ఫలం తోయం ఇలా ఏది ఇచ్చినా భక్తితో ఇవ్వు అని చెప్పినట్లు చెబుతారు. ఏది ఏమైనా దేవునికి సమర్పణలు ఉన్నాయి. ఇవి దేవునికి భక్తితో ఇవ్వాల్సినవి. ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్ సమీపంలోని ఒక గ్రామంలోని ఆలయంలో వింత ఆచారం ఉంది. ఇక్కడి బ్రహ్మ బాబాను కోరిక కోరుకుని అది తీరితే భక్తులు గడియారాలు సమర్పిస్తుంటారు. బాబా ఆలయం వద్ద ఉన్న చెట్టుకు ఎన్నో రకాల గడియారాలు వేలాడుతుంటాయి. ఇక్కడ కోరికలు కోరుకునే వారిలో ఒక మతం వారే ఉంటారనుకుంటే పొరపాటే. వారిలో వేర్వేరు మతాలవారు ఉన్నారు. అలాగే కోరికలు తీరితే వారందరూ గడియారాలు సమర్పిస్తారు. కొందరు వాచీలు కూడా ఇవ్వడం ఉంది. ఒకప్పుడు ఒక వ్యక్తి తాను డ్రైవర్ అవ్వాలనే ఉద్దేశంతో తనకు అందుకు గాను అవసరమైన నైపుణ్యాలు సమకూరేలా చేయమని బాబాను కోరాడని, అది తీరడంతో అతను ఒక గడియారాన్ని బహూకరించాడని, అప్పటి నుంచి ఈ ఆచారం ప్రారంభమైందని చెబుతారు. ఇక్కడి ఆలయంలో పూజారి వంటి వారు, ట్రస్ట్ వంటివి ఏవీ ఉండవు. అదే విధంగా ఇక్కడి గడియారాలకు రక్షణ ఏర్పాట్లు ఏవీ ఉండవని చెబుతారు.




ధర్మం-మర్మం



పంచభూతాలలో గుణాలు ఎలా ఉంటాయి?


పంచభూతాలలో ప్రతి భూతం తన గుణం సగభాగం, మిగతా భూతాల గుణాలు మిగిలిన సగభాగంలో సమభాగములుగా ఉంటాయి. ఆకాశం గుణం శబ్దం కాగా వాయువుకి 50 శాతం శబ్దం, 50 శాతం స్పర్శ ఉంటాయి. అగ్నికి సగ భాగం రూపం కాగా మిగిలిన సగ భాగంలో శబ్దం, స్పర్శ. జలంలో సగభాగం రసం కాగా మిగిలిన సగభాగం శబ్ద, స్పర్శ, రూపములు సమభాగాలుగా ఉంటాయి. భూమిలో సగభాగం గంధం కాగా మిగిలిన సగభాగంలో శబ్ద స్పర్శ, రూప, రసాలు సమభాగాలుగా ఉంటాయి.



\- డా॥ కందాడై రామానుజాచార్య

భగవద్గీత

యజ్ఞాల యథార్థం తెలుసుకుంటే ముక్తే



అధ్యాయం 4

శ్లోకం 32:

ఏవం బహువిధా యజ్ఞాః
వితతా బ్రహ్మణో ముఖే।
కర్మజాన్ విద్ధి తాన్ సర్వాన్
ఏవం జ్ఞాత్వా విమోక్ష్యసే ॥

తాత్పర్యం

ఈ వివిధ యజ్ఞములన్ని వేదములచే ఆమోదింపబడినవి, వివిధ కర్మల నుండి ఉద్భవించినవి. వానిని యథార్థరూపంలో తెలుసుకొనటం ద్వారా నీవు ముక్తిని పొందగలవు.

భాష్యం

ఇంతవరకు చర్చింపబడినటువంటి వివిధ యజ్ఞాలు వివిధ కర్తలకు అనుగుణంగా వేదాలలో తెలుపబడియున్నవి. మానవులు దేహాత్మభావనలో సంపూర్ణంగా మగ్నులై ఉంటారు. అందువలన మానవుడు దేహంతో గాని, మనస్సుతో గాని, బుద్ధితో గాని కర్మ చేసే రీతిగా ఈ యజ్ఞాలు నిర్ణయింపబడినవి. కాని అంత్యములో దేహం నుంచి ముక్తిని పొందటం కోసమే ఇవన్నీ నిర్దేశింపబడి ఉన్నాయి. ఈ విషయం శ్రీ కృష్ణ భగవానుని చేతనే స్వయంగా ఇచ్చుట నిర్ధారితమైంది.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

ఆంధ్రప్రభ యాప్‌లో శ్రావ్యమైన ఆడియోతో...

android Google play | iOS iTunes

దినఫలాలు

మేష రాశి
విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచి కార్యాలలో పేరు, ప్రఖ్యాతలు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ప్రభుత్వ వ్యవహారాల్లో వ్యతిరేకత ఉంటుంది. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి
ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యావిషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి
సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి
విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. శుభవార్తలు వింటారు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. శత్రుభీతి పోతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి
గృహ కార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేక పోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి
ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు లభిస్తాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింప బడతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి.

తులా రాశి
విదేశీ లావాదేవీలు,సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్యరీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలం.

వృశ్చిక రాశి
స్థిరాస్తి కొనుగోళ్లు అనుకూలం. ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాలు, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపారపరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి
ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాలు ద్వారా లబ్ది చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి
విదేశీ సంభాషణలు ఉపకరిస్తాయి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పని సరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో సాధ్యం.

కుంభ రాశి
నూతన వాహన కొనుగోళ్లు వంటివి ఆనందాన్ని కలిగిస్తాయి. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆకస్మికవ్యయం లేకపోలేదు. ఆరోగ్య విషయంలో అనుకూల పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి. ప్రత్యర్థుల ద్వారా చిరుసమస్యలు ఉంటాయి.

మీన రాశి
రుణప్రయత్నాలు లాభిస్తాయి. వాహన కొను గోళ్లు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాలు, ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనులు విషయంలో ఏకాగ్రత తప్పని సరి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

కులాసా



తల,మెడ క్యాన్సర్‌ను ఆరంభంలోనే గుర్తించాలి

ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియజేసిన వివరాల ప్రకారం తమ జీవితంలో స్మోకింగ్ చేసిన ప్రతీ ఇద్దరిలో ఒకరు పొగాకు సంబంధిత క్యాన్సర్ బారినపడే అవకాశం ఉంది. 35 నుంచి 70 ఏళ్ల మధ్య ఉన్నవారికి పొగాకు సంబంధిత క్యాన్సర్ బారినప డుతున్నారు. మిగతా క్యాన్సర్‌లతో పోలిస్తే పొగాకు సంబంధిత క్యాన్సర్ పురుషుల్లో (45శాతం), స్త్రీలలో (20శాతం) ఉంటుంది. దీన్ని బట్టీ ఆడవారితో పోలిస్తే పురుషుల్లో పొగాకు సంబంధిత క్యాన్సర్ శాతం కాస్త ఎక్కువగానే ఉంటుంది. పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వల్ల క్యాన్సర్ మరణాలు ఎక్కువవు తున్నాయి.

తల, మెడ క్యాన్సర్‌లు వస్తే లక్షణాలు ముందుగానే పసిగట్టవచ్చు. ఆరంభంలో ఈ వ్యాధి లక్షణాలను గుర్తిస్తే నయం చేయడం సులభతరం. అయితే మీరు ముందుగానే వ్యాధికి సంబంధించి హెచ్చరికలను పసిగట్టగలగాలి. అప్పుడే డాక్టరును సంప్రదించడానికి వీలవుతుంది.



లక్షణాలు

మెడ క్రింది భాగంలో గుత్తి ఆకారంలో గడ్డ ఉంటుంది. సర్వసాధారణంగా క్యాన్సర్ వ్యాప్తిచెందడానికి లింప్ గ్రంథులు ముఖ్య భూమిక వహిస్తాయి. ఇవి మెడ క్రింది భాగంలో ఉంటాయి. రెండువారాలకు మించి మెడ క్రింది భాగంలో ఈ గడ్డ ఉన్నట్లయితే ఫిజిషియన్‌కి చూపించాలి. అన్ని గడ్డలు క్యాన్సర్ కాదు. కానీ ఈ గడ్డ మెడక్రింది భాగంలో ఉన్నట్లయితే క్యాన్సర్‌కి మొదటి సూచన అని చెప్పొచ్చు. నోరు, గొంతు, స్వరపేటిక, థైరాయిడ్ గ్రంధి, బ్లడ్ క్యాన్సర్ రావడానికి ఆరంభ సూచన ఇది. ఈ గడ్డలు ఎలాంటి నొప్పిని కలగనివ్వవు. కాని మెల్లిమెల్లిగ పెరిగి పెద్దవవుతాయి.

గొంతులో మార్పు

స్వరపేటికలో క్యాన్సర్ వస్తే మాత్రం స్వరం మారిపోతుంది. ఈఎన్‌టీ స్పెషలిస్ట్ ఈ పరీక్ష చేసి నిర్ధారించే అవకాశం ఉంది. క్యాన్సర్ వల్లే స్వరం మారిపోతుంది అని చెప ్పడానికి వీల్లేదు. ఇతర కారణాల వల్ల కూడా స్వరం మారుతుందని గ్రహించగలగాలి. రెండువారాలకు మించి స్వరం మారితే కచ్చితంగా సంబంధిత డాక్టరును సంప్రదించాలి.

నోటిలో పెరుగుదల

నోటి భాగంలో ఏదైనా వాపు లేదా గాయం వంటిది ఉన్నట్లయితే ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. నొప్పి లేని కారణంగా నోట్లో పెరిగిన గడ్డలు తప్పుదారి పట్టిస్తాయి. అప్పుడప్పుడు రక్తస్రావం అవుతుంది. కానీ ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తే ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. ఒకవేళ అల్సర్ లేదా వాపుతో బాటు మెడక్రింది భాగంలో గడ్డ ఏర్పడితే సంబంధిత డాక్టరును సంప్రదించాలి. నోట్లో ఏదేని గడ్డ ఏర్పడినట్లయితే రెండువారాలకు మించి తాత్సారం చేయకూడదు. అంతేకాదు బయాప్సీ(కణజాల పరీక్ష) చేయించాలి.

వాపు సమస్యలు

గొంతు లేదా అన్నవాహికలో క్యాన్సర్ ఉన్నట్లయితే ఘనపదార్థాలు తినే సమయంలో బాగా నొప్పి ఉంటుంది. కొన్నిసార్లు ద్రవపదార్థాలను తీసుకోవడం కూడా కష్టమైపోతుంది.

చెవిపోటు

నిరంతరం చెవి చుట్టూ నొప్పి ఉంటుంది .వాచినట్లయితే ఇన్ఫెక్షన్ సోకినట్టు గమనించాలి. గొంతు భాగంలో కణితి పెరిగితే ఈ లక్షణం కనబడుతుంది.

తల, మెడ క్యాన్సర్‌ను గుర్తించాలి

90శాతం తల, మెడ క్యాన్సర్‌లు రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. దీర్ఘకాలికంగా పొగాకు ఉత్పత్తులు సేవించడం వల్ల ఈ క్యాన్సర్ వస్తుంది. సిగరెట్, సిగార్స్, గుట్కా, పొగాకు వంటివి నమలడం వల్ల ఇది సంక్రమిస్తుంది. స్వరపేటిక, నాలుక క్యాన్సర్ రావడానికి ఇవే ప్రధాన కారణాలుగా నిలిచాయి.

పొగత్రాగనివారికి, మద్యం తాగని వారికి కూడా క్యాన్సర్ వ్యాధి వస్తుంది. గొంతు క్యాన్సర్ రావడానికి హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పిపి) కారణమవుతుంది. ఎందుకంటే ఈ వైరస్ వల్ల ఇన్ఫెక్షన్ సోకుతుంది. దీనివల్ల క్యాన్సర్‌కి దారితీస్తుంది.

మీరేం చేయాలి?

అన్ని లక్షణాలు, సూచనలు బట్టీ క్యాన్యర్ ఉన్నట్టు నిర్ధారణ అయితే మాత్రం జాగ్రత్తపడాలి. ఇతర కారణాల వల్ల కూడా ఈ లక్షణాలు కనిపించవచ్చు. కానీ ఈ పరీక్షలు చేసిన తర్వాతే క్యాన్సర్ చికిత్స ప్రారంభించాలి. వ్యాధి లక్షణాలు కనిపించగానే డాక్టరును సంప్రదించాలి.

మీరు ఒక విషయాన్ని మర్చిపోవద్దు. ఆరంభంలో తల, మెడ క్యాన్సర్ గుర్తిస్తే నిర్లక్ష్యం చేయకుండా చికిత్స ప్రారంభించాలి. చికిత్స చేసే సమయంలో కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ మాత్రం కనిపిస్తాయి. మంచి ఆరోగ్య అలవాట్లతో వ్యాధిని అరికట్టడం సులభసాధ్యమే.

డాక్టర్ ప్రదీప్ సింగ్
హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ సర్జన్
కాంటినెంటల్ హాస్పిటల్
7799661661




ఎసిడిటీని తరిమికొట్టాలి

వేళకు భోంచేయకపోవడం, హోటళ్లలో మసాలాలు, జంక్‌ఫుడ్ తినడం , శీతలపానీయాలు తాగడం, దీర్ఘకాలిక జబ్బులకు మందుబిళ్లలు వేసుకోవడం, వీటివల్ల కడుపులో గ్యాస్ తలెత్తి నానాతిప్పలు పడుతుంటాం.

మందుబిళ్లలువేసుకోవడం.. వీటివల్ల కడుపులో గ్యాస్ తలెత్తి నానాతిప్పలు పడుతుంటాం. ట్యాబ్లెట్స్ వేసుకున్నప్పటికీ అప్పటికప్పుడు తప్పిస్తే శాశ్వత పరిష్కారం దొరకదు. అందుకే సహజపద్దతుల్లో గ్యాస్‌ను కట్టడి చేయాలంటే కొన్ని చిట్కాలున్నాయి.

రాత్రి భోజనం తర్వాత నిద్రకు ఉపక్రమించే ముందు ఒక గ్లాసు గోరువెచ్చని మంచినీళ్లు తాగండి. మళ్లీ ఉదయాన్నే నిద్రలేస్తూనే పరగడుపున కూడా గ్లాస్ గోరువెచ్చని నీళ్లు తాగండి. ఉపశమనం లభిస్తుంది. ఒక్కోసారి ఉదరంలో పుట్టుకొచ్చే ఎసిడిటీ చాలా ఇబ్బందులకు గురిచేస్తుంది. ఏమి చేసినా ఒక పట్టాన తగ్గదు, అలాంటి పరిస్థితుల్లో బాగా మాగిన అరటిపండును తినండి. అందులోని పొటాషియం ఎసిడిటీని తగ్గిస్తుంది. కడుపులో ఇబ్బందులు తొలగుతాయి. కాచి చల్లార్చిన గ్లాసుడు పాలలోకి ఒక స్పూను తేనె కలుపుకుని తాగండి. పాలలోకి అలవాటు ప్రకారం పంచదార లేదా బెల్లం, హార్లిక్స్ వంటివేవి కలపకూడదు. ఒక కప్పు నీటిని మరగనివ్వండి. అందులో ఒక టేబుల్ స్పూన్ సోంపు వేసి కాసేపు అలాగే ఉంచండి. ఆ పాత్రకు మూతపెట్టి రాత్రంతా అలాగే ఉండనివ్వండి. ఆ నీటిలోకి ఒక టేబుల్ స్పూన్ తేనె కలుపుకుని తాగండి. ఇలా రోజుకు మూడు పూటలా తాగితే ఎసిడిటీకి పరిష్కారం లభించినట్టే. పచ్చటి తులసి ఆకుల్ని వేడి నీటిలో మరగనివ్వండి. కాసేపయ్యాక చల్లార్చిన తర్వాత ఆ నీటిని సేవించండి. రోజూ ఇలా చేస్తే వారం పదిరోజుల్లో గ్యాస్ కొంతవరకైనా తగ్గుతుంది.



మజ్జిగలోని లాక్టిక్ ఆసిడ్ కడుపులోని గ్యాస్ కల్లెం వేస్తుంది. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం గ్యాస్‌కు మజ్జిగ మంచిది. మసాలా దినుసులతో చేసిన ఆహారం తిన్నప్పుడు మజ్జిగ తీసుకోవడం మరవొద్దు.


కడుపుబ్బరం తక్షణ సమస్యకు చక్కటి పరిష్కారం తాజా కొబ్బరి బోండం తాగడం, గ్యాస్‌కు ఉపశమనంతో పాటు శరీరానికి వెంటనే శక్తి వస్తుంది. రీఫ్రెష్ అవుతారు. పూర్వం భోజనం తిన్న తర్వాత ఒక బెల్లం ముక్కను నోట్లో వేసుకునేవారు పెద్దలు. ఇప్పటి తరానికి ఆ అలవాటు పోయింది కానీ.. బెల్లం వల్ల గ్యాస్ ఎంతగానో తగ్గుతుంది. బెల్లంలోని మెగ్నీషియం ఎంతో మేలు చేస్తుంది. కాల్షియం కూడా లభిస్తుంది.

ఇన్‌హేలేషన్ థెరపీ ద్వారా సుఖనిద్ర

ఆస్తమా వ్యాధితో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 30 కోట్ల మంది బాధపడుతున్నారు. వారిలో 47శాతం నుంచి 75శాతం మంది వరకు నిద్ర సంబంధ (నోక్టర్నల్) సమస్యలతోనే బాధపడుతున్నారు. దీనివల్లే వారికి ఆస్తమా వ్యాధి వస్తుంది.

నోక్టర్నల్ ఆస్తమా సుదీర్ఘకాలంగా రాత్రి వేళ నిద్ర సంబంధ వ్యాధులతో వచ్చిన వ్యాధి. నిద్రపోయే వరకు దగ్గుతూనే ఉండటం వల్ల ప్రజలు స్వల్పంగా మాత్రమే శ్వాస తీసుకుంటూ ఉంటారు. సాధారణ ఆస్తమా దాడిని అర్థం చేసుకోవడానికి నోక్టర్నల్ ఆస్తమా లక్షణాలు అంత తేలిగ్గా బయటపడవు. నిద్రపోతున్నప్పుడు రక్తం పరిణామం గణనీయ స్థాయిలో 16శాతం పెరిగినప్పుడు నోక్టర్నల్ ఆస్తమా లక్షణాలు బయటపడతాయి. తరచుగా దగ్గడం వల్ల గానీ, రాత్రివేళలో ఛాతి గట్టిగా బిగుసుకుపోవడం వల్ల తరచుగా ఎమర్జెన్సీ రూమ్‌ను సందర్శించడం వల్ల గానీ, ఆసుపత్రి పాలవ్వడం వల్ల కొన్ని కేసుల్లో మరణం వరకు వెళుతుంది. ఆస్తమా వ్యాధి ఎటువంటి వారసత్వ చరిత్ర లేకుండా పెరుగుతుంది. ప్రపంచంలోకెల్లా 20 అత్యంత కాలుష్య కారక నగరాల్లో భారతదేశంలోనే ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ డేటా బేస్ పేర్కొంటుంది. కాలుష్యం ప్రభావం పీఎం 2.5 దాటితే మాత్రం మన ఊపిరితిత్తులపై ప్రభావం పడుతుంది. తీవ్ర ఛాతి సంబంధ ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది.

తమిళనాడులో ఆరునుంచి 12ఏళ్లలోపు పట్టణ బాలల్లో అత్యధికంగా నోక్టర్నల్ దగ్గు వస్తుంది. చిన్నారులు ఎల్లవేళలా ఎలర్జీ, కాలుష్య కారక వాతావరణంలో అడుగుపెడుతుంటారు. ఇన్‌డోర్, ఔట్‌డోర్ పరిధిలో ప్రమాదకర గ్యాస్‌లతో



పాటు ధూళి, వాతావరణంలో మార్పులు తదితర కారణాలతో ఆస్తమా వ్యాధికి గురవుతారు. దీనివల్లే పిల్లల్లోనూ, పెద్దల్లోను ఆస్తమా వ్యాధి పెరుగుతుంది. సరైన చికిత్స చేపట్టకపోతే నోక్టర్నల్ ఆస్తమాను నియంత్రించడం తేలికేం కాదు. హెర్బల్, ఓరల్ మెడికేషన్ ద్వారా ఆస్తమా వ్యాధిని నియంత్రించొచ్చని వైద్యులు చెప్తుంటారు.


అయితే ఇన్‌హేలేషన్ ద్వారా మెడికేషన్ తీసుకుంటే సత్ఫలితాలు ఇస్తాయి. ఆస్తమా వ్యాధి నుంచి సురక్షితంగా, సమర్థవంతంగా బయటపడేందుకు వెసులుబాటు లభిస్తుంది. కేవలం సిరప్, టాబ్లెట్లు సుదీర్ఘకాలం వాడితే ప్రయోజనం ఉండదు. కానీ ఇన్‌హేలేషన్‌తో 50రెట్లు ప్రయోజనం ఉంటుంది.

ఈ సందర్భంగా సూర్య చెస్ట్ క్లినిక్ చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ ''ఇన్‌హేలేషన్ ఔషధాలు తక్షణ ఉపశమనాన్ని ఇవ్వడంతో పాటు యువతను సమర్థవంతంగా సురక్షితంగా ఆస్తమా నుంచి బయటపడేస్తాయి. ఇన్‌హేలర్ ద్వారా ముక్కు నుంచి ఊపిరితిత్తుల్లోకి స్టెరాయిడ్స్ వాయువు వెళ్లడం వల్ల నేరుగా సరైన రీతిలో పయనిస్తాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా ఆస్తమా వ్యాధుల నిర్ధారణకు వినియోగంలో ఉన్న పద్ధతి. తద్వారా ప్రజలు ఆస్తమా నుంచి బయటపడేందుకు ఇదొకమార్గంగా కనిపిస్తుంది'' అని అన్నారు. ఇన్‌హేలేషన్ థెరపీకి, నోక్టర్నల్ ఆస్తమా నివారణకు అవినాభావ సంబంధం ఉంది. అది పాజిటివ్‌గా కనిపిస్తుంది. ఎటువంటి నష్టం లేకుండా బాలలు, యువతలో ఆస్తమా సమర్థవంతంగా నివారించేందుకు మెరుగైన మార్గం ఇన్‌హేలేషన్ థెరపీ. ఎలర్జీ ట్రిగ్గర్స్, హార్మోన్లు, కడుపులో నొప్పితో అజీర్తి వంటి సమస్యలు ఆస్తమా వ్యాధికి దారి తీస్తాయి.

చిన్న పిల్లల్లో నులిపురుగులు

నులిపురుగులు వ్యాప్తి చెందడానికి ముఖ్య కారణం అపరిశుభ్రమైన నీరు, ఆహారం. సరిగ్గా ఉడికించని మాంసం తినడం, ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు సరిగ్గా శుభ్రపరచకుండా తీసుకోవడం వల్ల చాలా సూక్ష్మ జీవులు కడుపులోకి చేరతాయి. కాళ్లకు ఎటువంటి రక్షణ లేకుండా మట్టిలోఉ అపరిశుభ్రమైన పరిసరాలలో తిరగడం వల్ల నులి పురుగులు వ్యాప్తి చెందుతాయి. కడుపులో పురుగులున్నాయంటే అవి ప్రోటోజోవా, హెల్మింథస్ వర్గానికి చెందిన పరాన్న జీవులు అయ్యి ఉంటాయి. వీటిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గవి ఆస్కారిస్ వార్మ్, పిన్ వార్మ్, హుక్ వార్మ్, ఫ్లాట్ వార్మ్స్. ఈ నులిపురుగులు చిన్నపిల్లల్లో వ్యాప్తి చెందడానికి అనేక కారణాలు ఉన్నాయి. అపరిశుభ్రమైన చేతివేళ్లతో ఆహారం తీసుకోవడం లేదా నోట్లోపెట్టుకోవడం వల్ల నులిపురుగులు కడుపులో వ్యాపి చెందుతాయని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ హైద్రాబాద్ ఫిల్మ్‌నగర్ శాఖ ఇన్‌చార్జి డాక్టర్ సుధా తెలిపారు.

నులిపురుగుల నివారణకు ప్రజల్లో శుచి, శుభ్రత మరింత పెరగాలని ఎవిడెన్స్ యాక్షన్ అనే స్వచ్ఛందసంస్థ నిర్వాహకులు సిద్దార్థ అభిప్రాయపడుతున్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడానికి నులిపురుగుల రకాలను తెలియజేశారు.



కడుపులో చేరే నులిపురుగులు

బద్దె పురుగులు

ఇవి సరగ్గా ఉడికించని పందిమాంసం వంటి ఆహారం వల్ల కడుపులో చేరే పరాన్న జీవులు. ఈ తరహా జీవులు ప్రధానంగా ప్లాటీహెల్మింథిస్, నిమాటీ హెల్మింథిస్ జాతికి చెందినవై ఉంటాయి. ఇందులో నులిపురుగు లేదా ఆస్కారిస్ వార్మ్ ఉంటాయి. అవి ప్రధానంగా చిన్న పేగుల్లో ఉంటాయి. అపరిశుభ్రమైన నీరు, ఆహారం, సరిగ్గా వండని ఆహారంతో ఈ నులిపురుగులు వ్యాపిస్తాయి. బద్దెపురుగులు జీర్ణవ్యవస్థలో చొచ్చుకుపోతాయి.

పిన్‌వార్మ్, థ్రెడ్ వార్మ్, సీట్ వార్మ్

ఇవి నిమటోడా వర్గానికి చెందిన జీవులు. మలద్వారం దగ్గరలో ఉండి దురదను పుట్టిస్తాయి.

హుక్ వార్మ్

ఇవి కూడా నిమటోడో వర్గానికి చెందినవే. ఇది చర్మం ద్వారా పొడుచుకుని వెళ్లి రక్తనాళాల ద్వారా కాలేయం, మూత్రాశయం వంటి భాగాల్లో వృద్ధి చెందుతాయి. ఇవి 1 మి. మీ కంటే తక్కువ పరిమాణంలో ఉండటం వల్ల కంటికి కనిపించవు.

ఎంటమీబా, జియార్డియా

ఇది ఏకకణ సూక్ష్మ జీవి. ఇది అపరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల వ్యాప్తి చెందుతుంది. దీనివల్ల అమీబియాసిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. జియార్డియా వంటి ఏకకణ జీవులు పొట్టలోకి, రక్తప్రవాహంలోకి వెళ్లి శరీరమంతా దురదలు పుట్టిస్తాయి.

వుకరేరియా

పైలేరియాసిస్ (బోదకాలు) చాలా రకాల పరాన్న జీవుల చర్మాన్ని లింప్ గ్రంథుల్లో చొచ్చుకొని పోయి ఆయా భాగాల్లో వాపును కలిగిస్తాయి.

దంతాల సంరక్షణ కోసం చిట్కాలు

ఆహారపుటలవాట్లు, శుభ్రత లేమి వల్ల దంతాలు రంగుమారతాయి. తెల్లగా ఉండాల్సిన పలువరుస పసుపు రంగులోకి మారిపోతుంది. దాంతో ముఖాకర్షణ తగ్గుతుంది. దంతాలను తిరిగి మెరిపించాలంటే ఈ చిట్కాలు పాటించాలి.

టీత్ ఫ్లాసింగ్

బ్రషింగ్ కంటే ఫ్లాసింగ్ ముఖ్యమని వైద్యులు చెప్తున్నా ఫ్లాసింగ్ పట్ల ఎవరూ ఆసక్తి కనబరచరు. దంతాలు ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు రెండుసార్లు ఫ్లాసింగ్ చేయాలి. ఇలా చేయడం వల్ల దంతాల మధ్య ఇరుక్కునే ఆహారపదార్థాలు తొలగి గార ఏర్పడకుండా ఉంటుంది. పళ్లు తెల్లగా ఉంటాయి.

బేకింగ్ సోడా, నిమ్మరసం

బేకింగ్ సోడా, నిమ్మరసం మధ్య జరిగే రసాయనిక చర్య ఫలితంగా దంతాలు తెల్లబడతాయి. ఈ రెండింటిని కలిపి వారానికోసారి బ్రష్‌తో అద్దుకుని దంతాలు రుద్దుకోవాలి. పదేపదే వాడితే దంతాల మీద ఎనామిల్ దెబ్బతినే ప్రమాదం ఉంది కాబట్టి వారానికి ఒక్కసారే ఉపయోగించాలి. బేకింగ్ సోడా, నిమ్మరసాలను కలిపి దంతాలకు పట్టించి ఒక నిమిషం తర్వాత బ్రష్‌తో సున్నితంగా రుద్దుకుని కడిగేసుకోవాలి. నిమిషంకంటే ఎక్కువ సమయం పాటు ఈ మిశ్రమాన్ని దంతాల మీద ఉంచకూడదు.



పళ్లు , కూరగాయలు

యాపిల్స్, క్యారెట్స్, చెరకులను తరచుగా తింటూ ఉండాలి. వీటి వల్ల దంతాల మీద పేరుకున్న గార, మచ్చలు వదిలిపోతాయి. ఈ పళ్లలోని యాసిడ్లు, దంతాలను తెల్లగా మారుస్తాయి. యాపిల్స్‌లోని మాలిక్ యాసిడ్ దంతాలను శుభ్రం చేసి మెరిసేలా చేస్తుంది.

ఆయిల్ పుల్లింగ్

ఆర్గానిక్ ఆయిల్‌ను నోట్లో తీసుకుని 15 నుంచి 20నిమిషాల పాటు పుక్కిలించి ఉమ్మేయాలి. తర్వాత నోటిని శుభ్రంగా కడిగి 3 గ్లాసుల నీరు తాగాలి. నూనెను పుక్కిలించేటప్పుడు దంతాల మధ్య నుంచి నూనె వెళ్లేలా నాలుకను కదిలించాలి. అలా నోరు మొత్తం నూనెను తిప్పుతూ దంతాలన్నిటినీ తగిలేలా పుక్కిలించాలి. ప్రతిరోజూ రాత్రి నిద్రకుముందు బత్తాయి తొక్కతో దంతాలు రుద్దుకున్నా ప్రయోజనం ఉంటుంది. ఇలా కొన్నివారాలపాటు క్రమం తప్పక చేస్తే ఫలితం కనిపిస్తుంది

హైడ్రోజన్ పెరాక్సైడ్

ముందుగా హైడ్రోజన్ పెరాక్సైడ్ ఉన్న మౌత్‌వాష్‌తో నోరు పుక్కిలించాలి. లేదా బేకింగ్ సోడా, హైడ్రోజన్ పెరాక్సైడ్ కలిపి దాంతో బ్రష్ చేసుకోవాలి. తర్వాత టూత్ పేస్ట్‌తో దంతాలు రుద్దుకుని శుభ్రం చేసుకోవాలి.

చర్మ నిగారింపుతెచ్చుకోండి ఇలా...



చర్మానికి సంబంధించిన పలు రకాల సమస్యలను నయం చేసేందుకు పసుపు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఒక టేబుల్ స్పూన్ పసుపులో సరిపడా పాలుపోసి పేస్ట్‌లా చేయాలి. ముఖం, మెడ భాగాలకు ఈ మిశ్రమాన్ని ప్రతిరోజూ రాసుకుంటే అందమైన చర్మం మీ సొంతం అవుతుంది. మచ్చలు కూడా మటుమాయం అవుతాయి.

పొడిబారిన చర్మానికి ఒక టీస్పూన్ పసుపు, రెండు టీస్పూన్ల గంధం పొడి, సరిపడా నీళ్లు(రోజ్ వాటర్ అయినా వాడొచ్చు) కలిపి పేస్ట్‌లా చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి బాగా ఆరనివ్వాలి. వారానికి రెండుసార్లు ఈ మాస్క్ వేసుకుంటే బాగుంటుంది.

టమాటో సహజసిద్ధమైన స్కిన్ టోనర్, మొటిమలు, కురుపులు వంటి వాటిని నయం చేస్తుంది.

తాజా టొమాటోలను బ్లెండర్ లేదా గ్రైండర్ లేదా గ్లైడర్‌లో వేసి గుజ్జులా చేయాలి. ఈ టొమాటో గుజ్జును ముఖానికి రాసుకుని పదినిమిషాల తర్వాత నీళ్లతో కడిగేయాలి. రోజూ ఇలా చేస్తే చర్మంపై పెద్దగా కనిపించే రంధ్రాలు మూసుకుపోతాయి.

మొటిమలు తగ్గించేందుకు టమాటో గుజ్జు చాలా బాగా పనిచేస్తుంది. మొటిమల మీద గుజ్జు ఉంచి గంట తర్వాత కడిగేయాలి. పుదీనాలో ఉండే మెంథాల్ చర్మానికి చల్లదనాన్ని ఇస్తుంది.

మొటిమలు తొలగించుకోవాలంటే తాజా పుదీనా రసాన్ని ప్రతిరోజూ రాత్రి సమయంలో ముఖానికి రాసుకోవాలి.

పుదీనా ఆకుల్లో రెండు టేబుల్ స్పూన్ల పెరుగు వేసి గుజ్జులా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ భాగాలకు రాసుకుని పావుగంట తర్వాత కడిగేయాలి. వారంలో కొన్నిసార్లు ఇలా చేస్తే మృదువైన చర్మం మీ సొంతమవుతుంది.

వివాహబంధం కాదు నటనకు బంధనం

పెళ్లితో నాయికల వెండితెర ప్రయాణం ముగిసినట్లే అన్నది నిన్నటి మాట. గతంలో నటీమణులు మూడు ముళ్లు పడగానే తెరకు దూరమయ్యేవారు. ఇక అవకాశాలు రావడం లేదు అని నిశ్చయించుకున్నాకే నిశ్చితార్థాలు పెట్టుకునేవారు. ఇప్పుడా పరిస్థితిలో మార్పు వచ్చింది. వివాహ బంధంతో ముడిపడినా...నటనకు అడ్డేముంది అంటున్నారు ఈ తరం తారలు. వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలకు మధ్య స్పష్టమైన గీత గీస్తున్నారు. తమకు ఎంతో ఇష్టమైన అభినయాన్ని కొనసాగిస్తామంటున్నారు...

కాలం విలువ తెలుసు...- సమంత..

తీరిక లేని కెరీర్‌నే కొనసాగిస్తోంది శామ్. ఈ నాయిక వ్యక్తిగత జీవితంలోనూ స్పష్టమైన ఆలోచనలతోనే ఉంది. త్వరలో ప్రేమికుడు నాగచైతన్యను వివాహం చేసుకోబోతోంది. దశాబ్దకాల ప్రేమ తర్వాత వైవాహిక బంధంలోకి అడుగుపెడుతున్నారు శామ్, చైతూ. అక్టోబర్ 6న వీళ్లిద్దరి వివాహం గోవాలో జరగబోతోంది. పెళ్లి తర్వాత సమంత చైతన్య దాదాపు 45 రోజుల హనీమూన్‌కు వెళ్తున్నారని వార్తలొచ్చాయి. నెలన్నరపాటు న్యాయార్క్ సిటీకి వెళ్తున్నారని చెప్పుకున్నారు. అయితే సమయాన్ని సద్వినియోగం చేసుకునే సమంత...ఈ సుదీర్ఘ హనీమూన్ విషయాన్ని ఖండించింది. అన్ని రోజులు హనీమూన్ చేసుకునే ఆలోచన తమకు లేదని తెలిపింది. కేవలం మూడు రోజుల విరామం తీసుకుని తర్వాత ఎవరి సినిమా షూటింగ్‌లకు వాళ్లు వెళ్లిపోతామని తెలిపింది. ఇది సమంత కాలం విలువను గుర్తించడమే అంటున్నారు ఆమె స్నేహితులు. ప్రస్తుతం సమంత తెలుగులో రామ్ చరణ్ సరసన 'రంగస్థలం 1985' చిత్రంతో పాటు నాగార్జున నటిస్తున్న 'రాజుగారి గది 2'లో నటిస్తోంది.

ఆలోచన మార్చుకున్నా - తాప్సీ..

ఏదో ఒక సందర్భంలో నటించడం మానేసి వ్యక్తిగత జీవితంలోకి వెళ్లిపోవాలని గతంలో అనుకునేదాన్ని. ఎందుకంటే జీవితంలో నెరవేర్చాల్సిన బాధ్యతలు చాలా ఉంటాయి. చూడాల్సినవి, తెలుసుకోవాల్సినవి, అనుభూతి చెందాల్సినవీ అనేకం ఉన్నాయి. అందుకే కొంత కాలం తర్వాత నటనకు పూర్తిగా దూరమవ్వాలని అనుకున్నాను. కానీ ఇప్పుడు ఆ అభిప్రాయం మార్చుకున్నాను. బాలీవుడ్‌లో ఎంతోమంది నాయికలు పెళ్లి, పిల్లలు పుట్టాక కూడా నటిస్తున్నారు. అవకాశాలు వస్తున్నంత వరకు, నటనను ఆస్వాదిస్తున్నంత వరకు తెరపై కొనసాగుతాను. అయితే ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచన లేదు.

రెండోది ప్రేమ వివాహమే...- అమలా పాల్

పెళ్లయి విడాకులు అయినంత మాత్రాన కాషాయం కట్టుకుని హిమాలయాలకు వెళ్లాలా..? జీవితం చాలా మలుపులు చూపిస్తుంది. ప్రతి దారిలో ధైర్యంగా సాగడమే నేను నమ్మేది. ప్రస్తుతం దాదాపు ఆరు సినిమాలు చేతిలో ఉన్నాయి. మరికొన్నింటికి సంప్రదిస్తున్నారు. ఈ చిత్రాల్లో జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటూ కెరీర్ కొనసాగిస్తాను. నాకు నచ్చిన వ్యక్తి దొరికినప్పుడు మళ్లీ పెళ్లి చేసుకుంటాను. సరైన సమయంలో అతను ఎవరో చెప్తాను. ఇప్పుడు చేసుకునే పెళ్లి ప్రేమ వివాహమే అవుతుంది. పెళ్లయ్యాక నటిగా కొనసాగుతాను.

అప్పుడు ఆలోచిస్తా...- ఇలియానా

పెళ్లయితే ఒక నటి ప్రస్థానం ముగిసిపోయిందనే అంతా భావిస్తారు. పరిశ్రమలో ఇప్పటికీ అదే భావన ఉంది. అయితే పెళ్లి చేసుకున్నామనే ఒకే కారణంతో నటించడం ఆపేయను. వాస్తవానికి నాకు పెళ్లి తంతు మీద నమ్మకం లేదు. నచ్చిన వాడితో ఉండటమే నేను కోరుకునేది. పెళ్లయ్యాక ఇద్దరి జీవితాల్లో చాలా మార్పులు వస్తాయి. ప్రాధాన్యాలు మారిపోతాయి. కలిసి ఉంటే అదే బంధాన్ని స్వేచ్ఛగా కొనసాగించవచ్చు. పెళ్లి కంటే ఈ బంధమే మరింత దగ్గరగా ఉంచుతుంది. నాయిలను ఎంతో మంది ప్రేమిస్తారు. ఇష్టపడతారు. అదే సమయంలో మాపై జరిగే దుష్ప్రచారం కూడా ఎక్కువే ఉంటుంది. నా ప్రేమ గురించి నా ప్రియుడు ఆంద్రూకు చెప్పే సమయం కోసం వేచి చూస్తున్నా. నటిగా నా కెరీర్ గురించి అభద్రత గానీ, పెద్ద పెద్ద ఆశలు గానీ లేవు. స్టార్ డమ్ కంటే నటించడాన్ని ఇష్టపడతాను. వచ్చిన అవకాశాలు చేసుకుంటూ వెళ్తాను. రేపు పెళ్లయ్యాక నన్నెవరూ సినిమాలకు పిలవకుంటే సాధారణ మహిళగా జీవితాన్ని కొనసాగిస్తాను. జీవితాంతం సినిమా ఇండస్ట్రీలో ఎవరూ ఉండరు.

రెండు రోజులు చాలు... - ప్రియమణి

ముస్తఫా రాజ్ నా స్నేహితుడు. మా ఇద్దరి మతాలు వేరు. అందుకే రిజిస్టర్ పెళ్లి చేసుకుంటున్నాం. ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఉండే తేలికైన పని ఇది. రిజిస్టర్ పెళ్లి విషయంలో ఇద్దరం కలిసే నిర్ణయం తీసుకున్నాం. వివాహం తర్వాత ఎలాంటి విరామం తీసుకోవడం లేదు. రెండు రోజులకు షూటింగ్‌లకు వెళ్లిపోతాను. ముందుగా అంగీకరించిన సినిమాలు, టీవీ కార్యక్రమాలు ఉన్నాయి.



సమంత
తాప్సీ



ప్రియమణి
అమలా పాల్
ఇలియానా

బాలకృష్ణ చిత్రంలో నయనతార ఎంట్రీ





బాలకృష్ణ, నయనతార కాంబినేషన్‌కు మంచి పేరుంది. లోగడ వారిద్దరూ నటించిన సింహా, శ్రీరామరాజ్యం చిత్రాలు విజయం సాధించడంతో హిట్ పెయిర్‌గా వారికి మంచి క్రేజ్ లభించింది. పైసా వసూల్ చిత్రం విడుదలకు మునుపే బాలకృష్ణ తన 102వ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకుని వచ్చారు. ముచ్చటగా మూడోసారి బాలకృష్ణ నయనతార ఈ చిత్రంలో నటిస్తోంది. కాగా ఇటీవలే ప్రారంభమైన ఈ చిత్రం మొదటి షెడ్యూల్ చిత్రీకరణ రామోజీ ఫిలింసిటీలో జరుగుతోంది. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. కొన్ని కీలకమైన సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్‌లను కూడా ఫిలింసిటీలో చిత్రీకరిస్తున్నారు. సోమవారం నుంచి ఈ చిత్రం షూటింగ్‌లో నయనతార పాల్గొంటోంది. లోగడ బాలకృష్ణ, నయనతారలు నటించిన సినిమాల స్థాయిలోనే వారి మధ్య కెమెస్ట్రీ ఇందులో ఉండనుందని నిర్మాత సి.కల్యాణ్ తెలిపారు. బాలకృష్ణ కెరీర్‌లోనే ఇదో సంచలన చిత్రమవుతుందని ఆయన చెప్పారు.

ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో బ్రహ్మానందం, ప్రకాష్‌రాజ్, అశుతోష్‌రాణా, మురళీమోహన్, బాహుబలి ప్రభాకర్, శివపార్వతి తదితరులు తారాగణం. ఈ చిత్రానికి కథ, మాటలు: ఎం.రత్నం, కెమెరా: సి.రాంప్రసాద్, సంగీతం: చిరంతన్‌భట్, సహ నిర్మాత: సి.వి.రావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: సి.తేజ, సి.వరుణ్‌కుమార్, నిర్మాత: సి.కల్యాణ్, దర్శకత్వం: కె.ఎస్.రవికుమార్.



భారత 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం న్యూయార్క్‌లో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరేడ్‌లో టాలీవుడ్ హీరో దగ్గుపాటి రానా, అందాల భామ తమన్నా.

లక్కీ మీడియా కొత్త చిత్రం



బెక్కం వేణుగోపాల్



తేజ

పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించిన బెక్కం వేణుగోపాల్ (గోపి) నూతన చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు. లక్కీ మీడియా పతాకంపై ఆయన నిర్మించనున్న ఈ చిత్రం సెప్టెంబర్ ద్వితీయార్థంలో ప్రారంభం కానుంది. చూడాలని ఉంది. ఇంద్ర, యువరాజుతో పాటు దాదాపు యాభై సినిమాల్లో బాల నటుడిగా నటించిన తేజ ఈ చిత్రం ద్వారా హీరోగా పరిచయం కానున్నారు. ఈ విషయాన్ని నిర్మాత వేణుగోపాల్ తెలియజేస్తూ, సెప్టెంబర్ 15 నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని చెప్పారు. ప్రముఖ నిర్మాత శ్యాంప్రసాద్‌రెడ్డి సంస్థలో దర్శకత్వశాఖలో ఎనిమిదేళ్లు పనిచేసిన హరి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారని ఆయన తెలిపారు. గ్రామీణ నేపథ్యంలో సాగే యూత్‌ఫుల్ ప్రేమ కథాంశంతో కుటుంబ సమేతంగా చూసేలా ఈ చిత్రాన్ని మలచబోతున్నామని వివరించారు. ఉయ్యాల..జంపాల, స్వామిరారా చిత్రాలకు స్వరాలను సమకూర్చిన సన్నీ ఎం.ఆర్. ఈ సినిమాకు బాణీలను అందిస్తున్నారని, మిగిలిన వివరాలను త్వరలోనే తెలియజేస్తామని ఆయన వెల్లడించారు.

మాఫియా నేపథ్యంలో
హైటెక్ కిల్లర్



బల్వాన్, మౌనికా

బల్వాన్, మౌనికా హీరో హీరోయిన్లుగా వివివి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం హైటెక్ కిల్లర్. సోహ్రాబ్ ఆర్ట్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. యాక్షన్, థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు. మాఫియా గ్యాంగ్‌లకు హైదరాబాద్ అడ్డాగా మారుతోంది. ఈ పాయింట్ ఆధారంగా హైటెక్ కిల్లర్ ఉంటుందని నిర్మాత చెప్పారు. ప్యాచ్ వర్క్ మినహా షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రంలో మూడు ఫైట్స్, ఆరు పాటలున్నాయి. ఐదు రాత్రుళ్ళు తీసిన వర్షం పాట హైలెట్‌గా నిలుస్తుందని నిర్మాత చెప్పారు. దసరాకు పాటలను, డిసెంబర్‌లో సినిమాను విడుదల చేస్తామన్నారు.

సహ నిర్మాత యమ్. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా, కొన్ని కల్పిత పాత్రలో చిత్రీకరణ జరిపామని చెప్పారు.

ఇతర పాత్రల్లో సత్యప్రకాష్, చందు, అన్నపూర్ణ, ప్రసన్నకుమార్, పావలా శ్యామల, దిల్ రమేష్ తదితరులు నటిస్తున్నారు.

ఈ చిత్రానికి ఛాయాగ్రహణ యాదగిరి, కథ, మాటలు, పాటలు, స్క్రీన్‌ప్లే సంగీతం, ఎగ్జిక్యూటివ్ నిర్మాత ఎస్. కె.మజ్ను.